ఈనాడు

కరీంనగర్ 20-10-2024 ఆదివారం సిటీ సంపుటి 51. సంచిక 70

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00. పేజీలు 18+28 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఈనాడు

కరీంనగర్ 20-10-2024 ఆదివారం సిటీ సంపుటి 51. సంచిక 70

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00. పేజీలు 18+28 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

భద్రమైన కారే కొంటున్నారా?

- ఆధునిక ప్రమాణాలతో వాహనాల తయారీ
- ప్రమాదాల నివారణకు బహుళ వ్యవస్థలు
- ఎన్‌క్యాప్ రేటింగ్, అడాస్‌లను తెలుసుకోండి



ఈనాడు - అమరావతి

కారు కొనడానికి ముందు ధర, మైలేజీ, అలాయ్ వీల్స్, వాటిలోని ఫీచర్లను చూస్తుంటాం. కానీ, ప్రమాదాలు జరిగితే, అందులోని ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ ఎంత అన్నదే అన్నింటికంటే కీలకం. అందుకే కారు కొనేందుకు షోరూంకు వెళ్తే, ఎన్‌క్యాప్ (న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్) రేటింగ్‌పై ఆరా తీయాలని సూచిస్తున్నారు వాహనరంగ నిపుణులు. అత్యాధునిక బ్రేకింగ్, ప్రమాదాల్ని పసిగట్టి స్వయంగా అప్రమత్తమయ్యే అడాస్ వ్యవస్థలున్న కార్ల ధర కాస్త ఎక్కువైనా, వాటినే ఎంచుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ బడ్జెట్‌లోనూ సురక్షిత వ్యవస్థలున్న కార్లు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా బాడీ పటిష్ఠతను దృష్టిలో పెట్టుకోవాలన్నది నిపుణుల మాట.

క్రాష్‌టెస్ట్ రేటింగ్స్ చూడాలి

కొన్నాళ్ల కిందట హైదరాబాద్‌లో ఓ పోలోకార్ బ్రిడ్జిపై నుంచి పల్టీ కొట్టి కింద పడింది. అయినా, అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మరో ప్రమాదంలో కారు వేగంగా ఢీకొట్టడంతో వంతెన బద్దలైంది. అయినా ప్రయాణికులు సురక్షితమే. గట్టిదనం గల కారు బాడీ, సురక్షితమైన భద్రతా వ్యవస్థలే దీనికి కారణం. కారు ప్రమాదానికి గురైతే, డ్రైవర్, ప్రయాణికుల భద్రత ఎంతన్నది క్రాష్ టెస్ట్ ద్వారా అంచనా వేయడానికి గ్లోబల్ ఎన్‌క్యాప్ రూపొందించారు. ఇందులో కారు వేగం, వివిధ కోణాల్లోంచి ఢీకొడితే పడే ప్రభావం, లోపలున్న పిల్లలకు, పెద్దలకు కలిగే నష్టం తదితర పరీక్షల ఆధారంగా పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా 1 నుంచి 5 స్టార్ రేటింగ్ ఇస్తారు. కొన్ని కంపెనీలు తమ కార్లను క్రాష్ టెస్ట్‌కు పంపవు. కొనుగోలు వేళ వాటి గురించి ఆరా తీయాలి.

క్రాష్ టెస్ట్ ఎలా చేస్తారంటే..?

ప్రమాదంలో గాయాల తీవ్రతను అంచనా వేసేందుకు పిల్లలు, పెద్దల డమ్మీ బొమ్మల తల, ఛాతీ, పొత్తికడుపు, కాళ్లు, చేతుల్లో బహుళ యాక్సిలోమీటర్లు, లోడ్ సెన్సర్లు అమర్చుతారు. ముఖ్యమైన అవయవాలకు జరిగే నష్టాన్ని గ్రాఫ్ ద్వారా విశ్లేషిస్తారు. తదనుగుణంగా పాయింట్లు ఇస్తారు. ఏడాదిన్నర నుంచి మూడేళ్ల లోపు వయసున్న పిల్లల నమూనా బొమ్మలను ఐఎస్ఓఎఫ్ఐఎక్స్ సీట్లలో ఉంచి 49 పాయింట్లను ప్రామాణికంగా తీసుకుని పరీక్షిస్తారు. ఇందుకు కెమెరాలు, సెన్సర్లు సహా అధునాతన సాంకేతికతను ఉపయోగిస్తారు. పరీక్షించాల్సిన కారును ఉక్కు, అల్యూమినియంతో చేసిన ట్రాలీలతో ఢీకొట్టిస్తారు. ఈ పరీక్షలు, వాటి ఫలితాలు.. రోడ్లపై జరిగే వాస్తవ ప్రమాదాలకు భిన్నంగా ఉండొచ్చు. అయినా ఈ ఫలితాలనే ప్రామాణికంగా తీసుకుంటారు.

కారు భద్రతా ప్రమాణాలను విశ్లేషించేందుకు దేశంలోని కార్ల తయారీ సంస్థలు ఇప్పటి వరకు గ్లోబల్ ఎన్‌క్యాప్ రేటింగ్‌పై ఆధారపడ్డాయి. గతేడాది నుంచి కేంద్రం భారత్ ఎన్‌క్యాప్‌ను ప్రారంభించింది. గ్లోబల్ ఎన్‌క్యాప్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ, ఆటోమేటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమేటివ్ టెక్నాలజీ సంస్థల నిపుణులు సేఫ్టీ రేటింగ్స్ ఇస్తారు. గ్లోబల్ ఎన్‌క్యాప్‌లో 5 స్టార్ రేటింగ్, కొత్త ప్రొటోకాల్ విధానంలో పిల్లలు, పెద్దల రక్షణకు అధిక పాయింట్లు సాధించిన కార్లను ఎంచుకోవచ్చు.

పూర్తి కథనం 6లో

అనుమానాలు వీడండి.. పరీక్షలు రాయండి..

అపోహల సంఘం మీ జీవితాలతో చెలగాటమాడుతోంది

- ప్రిలిమ్స్ పూర్తయిన ఇన్నాళ్లకు వితండవాదం సరికాదు
- గ్రూప్-I అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- వారిపై లాఠీఛార్జి, కేసులు వద్దని పోలీసులకు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ విషయంలో అభ్యర్థులు ఆందోళన విరమించాలని.. అనుమానాలు వీడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అపోహల సంఘం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడి తమ రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలనుకుంటోందని విమర్శించారు. నిరుద్యోగుల ఆందోళన విషయంలో పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని.. వారిపై లాఠీఛార్జీ, కేసులు వద్దని ఆదేశించారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శుక్రవారం జరిగిన పోలీసు డ్యూటీమీట్ ముగింపు సభలో సీఎం పాల్గొన్నారు. ...మిగతా 2లో



ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు జాగిలం స్కూబీని అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు శిఖాగోయెల్, రవిగుప్తా, స్వాతి లక్రా

గ్రూప్-Iపై ప్రభుత్వం అప్రమత్తం

- పొన్నం ఇంట్లో పలువురు మంత్రుల భేటీ
- హాజరైన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులతో అర్ధరాత్రి దాకా చర్చలు

నేడు కీలక ప్రకటన చేసే అవకాశం

9లో

గ్రూప్-1 అభ్యర్థుల నిరసన ఉద్రిక్తం

పరీక్షలు వాయిదా వేయాలంటూ అశోక్‌నగర్ నుంచి సచివాలయానికి ర్యాలీ

- మద్దతుగా పాల్గొన్న బండి సంజయ్
- సచివాలయం ఎదుట బైఠాయింపు
- నిరుద్యోగులకు సంఘీభావంగా వచ్చిన భారాస నేతలను అడ్డుకున్న ఏబీవీపీ, భాజపా కార్యకర్తలు

ఈనాడు-హైదరాబాద్, నారాయణగూడ, గాంధీనగర్, ముషీరాబాద్-న్యూస్‌టుడే: గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని, జీవో నం.29ను రద్దు చేయాలంటూ అభ్యర్థులు చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తంగా మారింది. శనివారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లోని కోచింగ్ కేంద్రాల నుంచి వందల మంది అభ్యర్థులు ఒకేసారి బయటకు వచ్చారు. సెక్రటేరియట్‌కు ర్యాలీగా బయలుదేరారు. వీరికి మద్దతుగా ఏబీవీపీ, భాజపా కార్యకర్తలు, కేంద్ర మంత్రి బండి సంజయ్ ...మిగతా 6లో



ధర్నా చేస్తున్న గ్రూప్-1 అభ్యర్థులతో మాట్లాడుతున్న బండి సంజయ్

రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కుట్ర: బండి 6లో

జీవో 29తో రిజర్వేషన్లలో కోత: హరీశ్ 9లో

కొత్త టీచర్లలో 47% మహిళలు

- గతంతో పోల్చుకుంటే భారీగా తగ్గుదల
- డీఎస్సీ-2024 విజేతల్లో 54 శాతం మంది 30 ఏళ్ల లోపు వారే

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో డీఎస్సీ-2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల్లో మహిళలు 47 శాతం మంది ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వ టీచర్లలో 50 శాతానికిపైగా మహిళలున్నారు. మహిళలకు ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు అవుతుండటం.. బోధనా వృత్తిపై వారు అధికంగా ఆసక్తి చూపుతుండడం.. మరికొన్ని ఇతర కారణాల వల్ల ఉపాధ్యాయుల్లో వారి శాతం గణనీయంగా పెరుగుతోంది. 2017 డీఎస్సీలో సైతం 55-60 శాతం మంది వరకు మహిళలే ఎంపికయ్యారు. ఈసారి డీఎస్సీలో అది 47 శాతానికి పడిపోవడం గమనార్హం. మొత్తం 10,006 ఉద్యోగుల్లో 4,706 మంది మహిళలు, 5,300 మంది పురుషులు ఉన్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

తగ్గుదల ఎందుకు?

ఇప్పటివరకు మహిళలకు ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్లు అమలు చేస్తూ వచ్చారు. 33 శాతం రిజర్వేషన్‌తోపాటు మెరిట్‌లో ఇంకా ఎక్కువ మంది ఉద్యోగాలకు ఎంపికయ్యేవారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమాంతర రిజర్వేషన్(హారిజాంటల్) విధానాన్ని అమలు చేశారు. అందులో మహిళలకు ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్లు ఉండవు. దాంతో గత డీఎస్సీల కంటే కనీసం 8-15 శాతం మహిళలు తగ్గారని ...మిగతా 2లో

మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చాకే రైతుభరోసా

- వచ్చే యాసంగి నుంచి అమలు
- వచ్చే సీజన్ నుంచి పంటల బీమా
- డిసెంబరులోపు మరో 3 లక్షల మందికి రుణమాఫీ: మంత్రి తుమ్మల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇచ్చిన తర్వాతే తెలంగాణలో వచ్చే యాసంగి సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని, ఎకరాకు రూ.7,500 చొప్పున ఇస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రూ.2 లక్షల వరకు రుణాలుండి నిర్ధారణ కాని రైతు కుటుంబాలను గుర్తించి.. డిసెంబరులోగా వారి ఖాతాల్లో నిధులను జమ చేస్తామన్నారు. రూ.2 లక్షలకుపైగా రుణాలున్న వారి కోసం షెడ్యూలు ప్రకటించి అర్హులకు అమలు చేస్తామని తెలిపారు. వచ్చే సీజన్ నుంచి పంటల బీమా పథకం అమలు చేస్తామన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ కోదండరెడ్డితో కలిసి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేస్తుంది. గత సర్కారు నిధులివ్వకుండా వదిలేసిన చాలా పథకాలకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయటం.. రైతుల సంక్షేమంపై మా చిత్తశుద్ధికి నిదర్శనం. అర్హులైన ప్రతిఒక్కరికీ పెట్టుబడి సాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. దీనికి అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రూపొందిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగులో లేని భూములకు సైతం



దాదాపు రూ.25 వేల కోట్లు ఇచ్చారు. మా ప్రభుత్వ హయాంలో కేవలం సాగులోఉన్న భూములకే రైతుభరోసా నిధులు జమ చేస్తాం. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. విధివిధానాలు ఖరారు కాగానే.. రాబోయే పంట సీజన్ నుంచి రైతుల ఖాతాల్లో పంట సాయం వేస్తాం. పంట వేసినవారికే అందిస్తాం. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా.. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేశాం. 42 బ్యాంకుల నుంచి వచ్చిన వివరాల మేరకు 25 లక్షల కుటుంబాల్లోని 42 లక్షల మంది లబ్ధిదారులకు రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం. ఆగస్టు 15 నాటికి రూ.18 వేల కోట్లు మాఫీ చేశాం. ఇంకా 20 లక్షల మందికి అమలు కావాలి. ...మిగతా 2లో




ఎస్టీపీలలో శుద్ధి చేసిన నీటిని.. మూసీ నీటిని చూపుతున్న కేటీఆర్, చిత్రంలో బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, సుధీర్‌రెడ్డి, తలసాని, సబితారెడ్డి

మూసీ పేరిట లూటీకే మేం వ్యతిరేకం

- మాల్స్ కట్టొచ్చు కానీ పేదల ఇళ్లు ఉండొద్దంటే ఎలా: కేటీఆర్
- పార్టీ నేతలతో కలిసి నాగోలు ఎస్టీపీ పరిశీలన

నాగోలు, న్యూస్‌టుడే: తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, ఆ పేరిట జరిగే లూటీకే వ్యతిరేకమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. 'మూసీ పక్కన మూణ్నెల్లు నివసించాలని సవాల్ చేసిన సీఎంకు చెబుతున్నా.. మూడేళ్లు ఇక్కడే ఉంటా... ...మిగతా 6లో



హైదరాబాద్ కలెక్టరేట్‌లో లబ్ధిదారు భారతికి ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రులు పొన్నం, పొంగులేటి, చిత్రంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాజాసింగ్, వెంకట్

దీపావళి నాటికి 4,000 డబుల్ ఇళ్ల పంపిణీ

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

గన్‌ఫౌండ్రీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి, దూరదృష్టితో ముందుకెళ్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీపావళి నాటికి 3,500-4,000 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు, జెండాలు, ఎవరి సిఫార్సు అవసరం లేకుండా ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామన్నారు. ...మిగతా 2లో

అమోయ్‌కుమార్‌కు ఈడీ పిలుపు

- రంగారెడ్డి కలెక్టర్‌గా ఉన్నప్పుడు జరిగిన భూకేటాయింపులపై విచారణ?



ఈనాడు, హైదరాబాద్: పశుసంవర్ధకశాఖ సంయుక్త కార్యదర్శి అమోయ్‌కుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీచేసింది. ఈ నెల 22న తమ ఎదుట విచారణకు హాజరు కావాలని సూచించింది. ఆరోజు తనకు ఇతరత్రా కార్యక్రమాలున్నాయని అమోయ్‌కుమార్ చెప్పినట్లు సమాచారం. అయితే మరుసటిరోజు రావాలని సూచించినట్లు తెలుస్తోంది. సమన్ల జారీని ధ్రువీకరించిన ఈడీ అధికారులు.. ఏ అంశంలో విచారించనున్నారనే విషయంపై గోప్యత పాటిస్తున్నారు. ...మిగతా 6లో

కుటుంబం విడిపోతోంది... కమతం చిన్నబోతోంది

- ఏడేళ్లలో 31.6% పెరిగిన అర హెక్టారు భూములు
- 2015-16లో ఈ రైతుల సంఖ్య 23.16 లక్షలు
- 2021-22 నాటికి 30 లక్షలకు చేరిక
- అర్థగణాంకశాఖ సర్వేలో వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో భూకమతాలు చిన్నబోతున్నాయి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మార్పులతో పాటు ప్రభుత్వ పథకాలు సైతం దీనిపై ప్రభావం చూపుతున్నాయి. గతంలో పెద్ద కమతాలు కలిగి ఉన్న కుటుంబాల్లో.. తోబుట్టువుల మధ్య పంపకాలు, క్రయవిక్రయాల కారణంగా కమతాల విస్తీర్ణం తగ్గిపోవడంతో పాటు వాటి సంఖ్యలోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఒక వ్యక్తి పేరుతో ఒకచోట ఉన్న వ్యవసాయ భూమిని ఒక కమతంగా గుర్తిస్తారు. 2015-16లో రాష్ట్రంలో కమతాలపై అర్థగణాంక శాఖ సమగ్ర సర్వే నిర్వహించింది. 2021-22 నాటికి ఈ కమతాల్లో జరిగిన మార్పులపై తాజాగా సర్వే పూర్తిచేసింది. ...మిగతా 6లో



కాపుకొచ్చేనంట దానిమ్మ.. చీరచుట్టుకుంది చూడమ్మా..

దానిమ్మ తోటలు కాత దశలో ఉన్నాయి. ఈ కాలంలో ఎండ, వర్షాల కారణంగా కాయలకు మచ్చలు ఏర్పడుతుంటాయి. వీటికి మార్కెట్లో సరైన ధర లభించదు. దీనిని గమనించి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం అల్లంపల్లి శివారులో ఓ రైతు 30 ఎకరాల్లోని తన దానిమ్మ చెట్లన్నింటికీ చీరలు కట్టారు. ఇవి కాయలపై ఎండ, వర్షం పడకుండా రక్షిస్తాయని తెలిపారు. పైన నీలాకాశంలో తెల్లటి మేఘాలు.. కింద చుట్టూ పచ్చని చెట్లు... మధ్యలోని పొలంలో రంగురంగుల చీరలతో ఈ ప్రాంతం చూపరులను ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, తిమ్మాజిపేట



ఎవ్వరి సలహాలనూ గుడ్డిగా అనుసరించొద్దు

విజేతల నుంచి సలహాలు తీసుకోవడంలో తప్పు లేదు కానీ, వాటిని గుడ్డిగా అనుసరిస్తేనే సమస్య. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి ప్రయాణమూ ఒకేలా ఉండదు. ఇతరులు తమకెదురైన సవాళ్లను అధిగమించడానికి అమలుపర్చిన వ్యూహాలు మీకు పనిచేయకపోవచ్చు. విజయానికి ఒకే సూత్రం, ఒక్కటే మార్గమంటూ ఉండవు. కాబట్టి ఇతరుల నుంచి స్ఫూర్తి మాత్రమే పొంది మీదైన పంథాలో సాగండి.

– అనుష్కా సోహం బథ్వాల్, వ్యాపారవేత్త

దీపావళి నాటికి 4,000 డబుల్ ఇళ్ల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల గృహాలను పేదలకు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గానికి చెందిన 144 మంది లబ్ధిదారులకు రాంపల్లిలో కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పొంగులేటి మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్షం సర్కారు కాళ్లలో కట్టెలు పెట్టి అడ్డం పడుతున్నప్పటికీ తమ ప్రభుత్వం పేదల కన్నీళ్లు తుడిచేందుకు ముందుకు సాగుతోందన్నారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా పేద ప్రజలకు మంచి జీవితాలు అందించేందుకు సర్కారు కృషి చేస్తుంటే.. సహకరించాల్సిన ప్రధాన ప్రతిపక్షం పేదలపై ప్రేమ నటిస్తూ విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతోందని విమర్శించారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజలు రాంపల్లికి వెళ్తుంటే బాధగా ఉన్నప్పటికీ వారు సొంతిళ్లకు వెళ్తుంటే సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ గణేశ్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, రహమత్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 144 మంది పేదలకు ఎవరి ప్రమేయం లేకుండా ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పారదర్శకంగా ఇళ్లను కేటాయించామని చెప్పారు. గతంలో లబ్ధిదారుల ఇళ్ల కేటాయింపును లాటరీ పద్ధతిలో నిర్వహించేవారు. దాంతో వారిలో అనేక అనుమానాలు తలెత్తేవి. వాటిని అరికట్టేందుకు హైదరాబాద్ జిల్లా అధికారులు కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

కేటీఆర్.. హరీశ్‌ల ఫామ్‌హౌస్‌లపై నిజనిర్ధారణ

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: "హిమాయత్‌సాగర్.. గండిపేట జలాశయాల పరిధుల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న కేటీఆర్, హరీశ్‌రావుల ఆక్రమణలపై నిజనిర్ధారణ కమిటీ వేస్తాం. జన్వాడ, అజీజ్‌నగర్‌కు అఖిలపక్షాన్ని తీసుకెళ్తాం. జీవో నంబర్ 111ను ఉల్లంఘించి.. బుల్కాపూర్ నాలాను ఆక్రమించి ఫామ్‌హౌస్‌ను కట్టుకోలేదని కేటీఆర్‌ను చెప్పమనండి. అజీజ్‌నగర్ ఫామ్‌హౌస్‌ను ఆక్రమణలో నిర్మించలేదని హరీశ్ చెప్పగలరా? జంట జలాశయాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించి బడాబాబులకు వత్తాసు పలుకుతున్న కేటీఆర్, హరీశ్‌లు వాళ్ల ఫామ్‌హౌస్‌లను కాపాడుకునేందుకు మూసీ పేదల పేరు చెప్పి రక్షణ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. వారి ఆటలు సాగవు. చెరువులు, నాలాలు, కుంటలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి భవంతులు నిర్మించుకున్న వారిని హైడ్రా అంకుశంతో అదుపుచేస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ సద్భావన కమిటీ శనివారం చార్మినార్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజీవ్‌గాంధీ సద్భావన పురస్కారాన్ని మాజీ మంత్రి గీతారెడ్డికి ప్రదానం చేశారు. ఆ స్థాయిలో అడ్డుపడినా.. 'హైడ్రా' అడుగులు ఆగవని, మూసీ పునరుజ్జీవ కార్యక్రమం ముందుకే వెళ్తుందని సీఎం స్పష్టం చేశారు.

రియల్ ఎస్టేట్ అభివృద్ధిని అడ్డుకునేందుకే విష ప్రచారం..

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ అభివృద్ధిని అడ్డుకునేందుకు భారాస నాయకులు ఆర్థిక ఉగ్రవాదులుగా తయారయ్యారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రభుత్వం ఏ కార్యక్రమాలు చేపట్టినా వాటిపై విషం వెదజల్లుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా వేల ఎకరాలను కబ్జా చేసి రూ.కోట్లకు అధిపతులయ్యారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్లు, నాలాలపై ఆక్రమణలను తొలగిస్తుంటే అన్యాయంగా భవనాలను కూల్చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాలు, వాట్సప్ యూనివర్సిటీ ద్వారా చెడు ప్రచారం చేస్తున్నారు. గండిపేట, హిమాయత్‌సాగర్‌లో పేదలెవరైనా గుడిసెలు వేసుకున్నారా? బడాబాబులు ఫామ్‌హౌస్‌లు కట్టి డ్రైనేజీ నీళ్లను జంటజలాశయాల్లోకి వదులుతున్నారు. జన్వాడలో కేటీఆర్ ఫామ్‌హౌస్‌ను, అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌ను కూల్చేందుకు ఒక బుల్డోజర్ పంపుతాం... హనుమంతన్న (వీహెచ్) డ్రైవర్‌గా ఉంటారు. బుల్డోజర్‌కు అడ్డంగా కేటీఆర్, హరీశ్‌లు పడుకోవాలి" అని సీఎం సవాల్ చేశారు.

మూసీ వేరు.. హైడ్రా వేరు..

"మూసీ పునరుజ్జీవం కోసం ఒక ప్రణాళికను రూపొందించాం. చెరువులు, ప్రభుత్వ స్థలాలు, నాలాలను సంరక్షించేందుకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఈ రెండింటికీ సంబంధం లేదు. ప్రతిపక్షాలు ముఖ్యంగా భారాస నాయకులు రెండింటినీ కలిపి ఏదో చేస్తున్నారంటూ విష ప్రచారం చేస్తున్నారు. మూసీ గర్భంలో ఉంటున్న వారు గౌరవంగా జీవించేలా వారికి రెండు పడక గదుల ఇళ్లు ఇస్తున్నాం. వారు వ్యాపారాలు చేసుకునేందుకు రూ.2 లక్షల రుణం ఇచ్చి అందులో రూ.1.40 లక్షల రాయితీ ఇస్తున్నాం. దసరా పండగరోజు కొత్త ఇళ్లలో చేరినవారు మూసీలో నిర్మించుకున్న పాత ఇళ్లను స్వయంగా కూలగొట్టారు. ప్రభుత్వం ఒక ఇటుకపెళ్లను కూడా తీయలేదు. ఇదంతా తెలిసినా... వారికి అన్యాయం జరుగుతోందంటూ కేటీఆర్, హరీశ్, ఈటల రాజేందర్‌లు గుండెలు బాదుకుంటున్నారు" అని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, గీతారెడ్డి కుటుంబ సభ్యులు, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజ్‌ఠాకూర్, పార్టీ నాయకులు వి.హనుమంతరావు, రోహిన్ రెడ్డి, సమీర్ వలీవుల్లా, వీర్లపల్లి శంకర్, రాజీవ్‌గాంధీ సద్భావన కమిటీ సభ్యులు జి.నిరంజన్, అశోక్ పాల్గొన్నారు.



గీతారెడ్డికి పురస్కారాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, చిత్రంలో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, వీహెచ్, రోహిన్‌రెడ్డి

సద్భావన స్ఫూర్తిని కొనసాగిస్తాం

దేశంలో మత విద్వేషాలను తొలగించేందుకు 34 ఏళ్ల కిందట అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ.. చార్మినార్ నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ విగ్రహం వరకూ సద్భావన యాత్ర చేశారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ స్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. ఈ పురస్కారాన్ని మా అక్క గీతారెడ్డికి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి రాదని తెలిసినా.. శాసనసభ ఎన్నికల్లో తనకు టికెట్ వద్దనడం పార్టీపై ఆమె అంకితభావానికి నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు.

యాదాద్రి కమిటీలో 'కంచికామకోటి' ప్రతినిధి

ఈనాడు, హైదరాబాద్: యాదగిరిగుట్ట దేవాలయ విమాన గోపురానికి బంగారుతాపడం పనుల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ప్రభుత్వం మార్పులు చేసింది. కంచికామకోటి పీఠం ప్రతినిధి గోవిందహరిని ఈ కమిటీలో నియమిస్తూ దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు.

దేవుడి మాన్యాలకు 'గెజిట్'

నాలుగు జిల్లాల్లోని ఆలయ భూములకు జారీ

ఈనాడు, హైదరాబాద్: దేవాదాయ భూముల ఆక్రమణలకు అవకాశం లేకుండా భూముల వివరాలతో కూడిన గెజిట్‌ను దేవాదాయశాఖ జారీ చేస్తోంది. తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లాల ఆలయాల పరిధిలోని భూముల వివరాలను రెవెన్యూశాఖ వద్ద ఉన్న సమాచారంతో సరిపోల్చారు. యాజమాన్య హక్కులు పక్కాగా తేల్చిన అనంతరం ఆ విస్తీర్ణాలు కబ్జాలు కాకుండా, రిజిస్ట్రేషన్లకు తావు లేకుండా నిషేధిత జాబితా 22ఎ(1-సి) రిజిస్టర్‌లో పొందుపర్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ల అనుమతితో 4 జిల్లాలకు సంబంధించిన ఆలయ భూముల గెజిట్‌ను జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆలయాలకు చెందిన భూముల సర్వేను దేవాదాయ శాఖ చేపట్టింది.

బొగ్గుగని కార్మికులకు కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలి'

ఈనాడు, హైదరాబాద్: బొగ్గు గనుల్లో పనిచేసి, పదవీ విరమణ పొందిన కార్మికులకు కనీస పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గనుల రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ చాలా తక్కువగా ఉందని, పెంచమని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. పింఛన్ పెంపునకు తనవంతు కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

అనుమానాలు వీడండి.. పరీక్షలు రాయండి..

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 'భారాస పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు మీరు వాళ్ల గేట్ల దగ్గర నిలుచుంటే కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వనివారు ఇప్పుడు అశోక్‌నగర్‌కు వచ్చారంటే అది కొంగ జపం కాదా? ఇప్పటికే 95 శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు తీసుకున్నారు. మిగిలినవారూ తీసుకొని పరీక్షలకు హాజరుకండి. లేదంటే బంగారు అవకాశాన్ని కోల్పోతారు. జీవో 29పై కోర్టులో ఉపశమనం రాలేదంటే.. మీ వాదనలో బలం లేదని తేలిపోయింది. క్వశ్చన్‌బ్యాంకు విషయంలో నిపుణుల కమిటీపై వేసిన పిటిషన్లను కొట్టేసిన న్యాయస్థానం కూడా ప్రభుత్వ పరీక్ష విధానాన్ని సమర్థించింది.

ప్రిలిమ్స్ అయిపోయిన ఇన్నాళ్లకు వితండవాదం

గత పదేళ్లుగా వాయిదాలు పడుతున్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. 563 గ్రూప్-1 పోస్టులకు ఈ నెల 21 నుంచి మెయిన్స్ నిర్వహించబోతున్నాం. ఫిబ్రవరిలోనే జీవో 29 ద్వారా నోటిఫికేషన్ ఇచ్చాం. 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు పిలవాలని ఆనాడే నిర్ణయించాం. దాదాపు 31 వేల మందిని మెయిన్స్‌కు ఎంపిక చేశాం. ప్రిలిమ్స్ అయిపోయిన ఇన్నాళ్లకు 1:100 లెక్కన పిలవాలని కొందరు వితండవాదం చేస్తున్నారు. ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత మార్పులు చేస్తే కోర్టులు ఊరుకుంటాయా? గత ప్రభుత్వం నాటి జీవో 55 ప్రకారం భర్తీ చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు నష్టపోయేవారు. ఇప్పుడు జీవో 29తో జనరల్‌కోటాలోనూ పోటీ పడేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశం దక్కింది.

వచ్చే విద్యాసంవత్సరంలోనే యంగ్ ఇండియా పోలీసు స్కూల్

'దాదాపు 11 ఏళ్లుగా డ్యూటీమీట్ నిర్వహించకపోవడంతో పోలీసుల నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం లేకుండా పోయింది. అందుకే ఉన్నతాధికారులు చెప్పిన వెంటనే నిర్వహించమన్నాను. విధినిర్వహణ కారణంగా మీ పిల్లలతో మీరు పూర్తి సమయం గడపలేకపోతున్నారు. వారు గొప్ప పౌరులుగా రాణించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల్లో అంతర్జాతీయస్థాయి విద్యాప్రమాణాలతో యంగ్ఇండియా పోలీసు స్కూల్‌కు ఈ నెల 21న శ్రీకారం చుడుతున్నాం. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, సైనిక్ స్కూల్, కార్పొరేట్ పాఠశాలల వంటి వాటితో పోటీపడేలా దాన్ని తీర్చిదిద్దుతాం. హెచ్‌పీఎస్, డీపీఎస్‌ల నుంచి వచ్చామని గొప్పగా చెప్పుకొన్నట్లే పోలీసుస్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులమని గర్వపడేలా విద్యాసంస్థను తీర్చిదిద్దుతాం. వచ్చే విద్యాసంవత్సరంలోనే తొలివిడతగా 5 నుంచి 8 తరగతులను ప్రారంభిస్తాం. తర్వాత తరగతులను పెంచుకుంటూ ఇంజినీరింగ్, మెడిసిన్ వరకు చదివేలా తీర్చిదిద్దుతాం. డ్రగ్స్, సైబర్‌నేరాల నియంత్రణలో పోలీసుశాఖకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ఎంతటివారున్నా కఠినంగా వ్యవహరించండి' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఆకట్టుకున్న డ్రోన్‌షో

డ్యూటీమీట్ నిర్వహణ ప్రాధాన్యంపై డీజీపీ డా.జితేందర్ ప్రసంగించారు. త్వరలోనే స్పోర్ట్స్‌మీట్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ముందుగా జోన్లవారీగా పోలీసు సిబ్బంది కవాతు నిర్వహిస్తూ ముఖ్యమంత్రికి గౌరవవందనం సమర్పించారు. సైబర్‌నేరాల దర్యాప్తుపై ప్రామాణిక కార్యాచరణ విధానాలతో రూపొందించిన పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన డ్రోన్‌షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో హోంశాఖ ముఖ్యకార్యదర్శి రవిగుప్తా, డీజీలు శివధర్‌రెడ్డి, శిఖాగోయెల్, అభిలాషబిస్త్, స్వాతిలక్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విజేతలకు ట్రోఫీల బహూకరణ

సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగం ట్రోఫీని వి.శ్రీనివాసరావు (హైదరాబాద్ కమిషనరేట్), యాంటీ సాబటేజ్ చెక్ ట్రోఫీని అనంతరాములు (ఇంటెలిజెన్స్), కంప్యూటర్ అవేర్‌నెస్ ట్రోఫీని రాజు (ఐటీ అండ్ సీ), డాగ్ కాంపిటీషన్ ట్రోఫీని స్కూబీ (సీఐడీ) హ్యాండ్లర్ గురుమూర్తి, పోలీసు ఫొటోగ్రఫీ ట్రోఫీని రాజశేఖర్ (హైదరాబాద్ కమిషనరేట్), వీడియోగ్రఫీ ట్రోఫీని దేవేంద్రప్రసాద్ (సైబరాబాద్ కమిషనరేట్), బెస్ట్‌డాగ్ ట్రోఫీని రాణా (సీఐడీ) హ్యాండ్లర్ వెంకటరమణ గెలుచుకున్నారు. వీరికి ముఖ్యమంత్రి ట్రోఫీలను అందించారు. హైదరాబాద్ కమిషనరేట్ తరఫున స్టార్ ఆఫ్ ది ఇయర్ ట్రోఫీని శ్రీనివాసరావు, ఓవరాల్ టీం ఛాంపియన్‌షిప్ ట్రోఫీని క్రైమ్స్ డీసీపీ ధారా కవిత బృందం అందుకున్నారు.



ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని క్రైమ్స్ డీసీపీ ధారా కవిత బృందానికి అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఒక్కొక్కరికి ఒక్కోలా హెచ్ఎండీఏ నిబంధనలు

● అధికారులు 'ఏవో ఒత్తిళ్ల'తో పని చేస్తున్నట్లుంది

● హాజరై వివరణివ్వాలని కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: నిర్మాణాలకు అనుమతుల మంజూరు వ్యవహారంలో హెచ్ఎండీఏ తీరును హైకోర్టు తప్పుబట్టింది. ఒక్కొక్కరికి ఒక నిబంధన అన్నట్లుగా ఉందని వ్యాఖ్యానించింది. దరఖాస్తును పరిశీలించి అనుమతులు మంజూరు చేయాలంటూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై అక్షయ డెవలపర్స్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.శ్రీధర్ వాదనలు వినిపిస్తూ. "సర్వీసు రోడ్డు లేదన్న కారణంగా అక్షయ డెవలపర్స్‌కు హెచ్ఎండీఏ అనుమతులు తిరస్కరించింది. ఇదే ప్రాంతంలో గణపతి సచ్చిదానంద అవధూత పీఠం ట్రస్టుకు అనుమతులు మంజూరు చేసి పిటిషనర్ విషయంలో నిరాకరించింది. ఈ వ్యవహారాన్ని విచారించిన హైకోర్టు హెచ్ఎండీఏ అప్పీలును కొట్టివేసింది. అయినా అనుమతులు ఇవ్వకుండా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించింది" అని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. "40 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో పిటిషనర్ దరఖాస్తును తిరస్కరించిన హెచ్ఎండీఏ అసలు రోడ్డు సౌకర్యమే లేని ఎన్నో భవనాలకు ఎలా అనుమతులు మంజూరు చేస్తోంది? పలుకుబడి ఉన్నవారి విషయంలో ఒకలా, ఇతరుల విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. ఏవో ఒత్తిళ్ల నేపథ్యంలో అధికారులు పనిచేస్తున్నట్లుంది. హెచ్ఎండీఏ అప్పీలును సెప్టెంబరు 10న డివిజన్ బెంచ్ కొట్టివేసినా అనుమతుల దరఖాస్తును పట్టించుకోలేదు. ఇది ఉద్దేశపూర్వక ఉల్లంఘనేనని స్పష్టమవుతోంది. దీనిపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలి" అని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ప్లానింగ్ విభాగ డైరెక్టర్ ఎ.విద్యాధర్‌లను ఆదేశిస్తూ విచారణను నవంబరు 15కి వాయిదా

కొత్త టీచర్లలో 47% మహిళలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ఎవరి వేతనం ఎంతంటే..

ఈసారి ఉపాధ్యాయ కొలువులకు ఎంపికైన వారిలో ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు వారే. ఆ వయసు వారిలో 5,411మంది(54 శాతం) ఉన్నారు. ఆ తర్వాత 31-40 మధ్య వయసు వారిలో 3,619 మంది ఉన్నారు. ఎస్జీటీలకు మొత్తం వేతనం నెలకు రూ.43,068(మూల వేతనం రూ.31,040), స్కూల్ అసిస్టెంట్లకు రూ.58,691(మూల వేతనం రూ.42,300) అందనుంది. ఎంపికైన 10,006 మందిలో ఎస్జీటీలు 7,388, ఎస్ఏలు 2,618 ఉంది ఉన్నారు.

మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చాకే రైతుభరోసా

(మొదటి పేజీ తరువాయి)

తెల్ల రేషన్‌కార్డు లేని 3 లక్షల మందికి డిసెంబరులో కుటుంబ నిర్ధారణ చేసి రుణమాఫీ చేస్తాం. దీనికి రూ.2,500 కోట్లు ఖర్చవుతుంది. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్నవారు అదనపు డబ్బులు కడితే మాఫీ చేస్తాం. దీనిపై మంత్రిమండలిలో చర్చించి షెడ్యూలు ఖరారు చేస్తాం. రాష్ట్రంలో పంటల బీమాను వచ్చే యాసంగి నుంచి అమలు చేస్తాం. రైతుల తరఫున ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. గత నెలలో వచ్చిన వరద నష్టాలపై ప్రాథమిక నివేదిక అందిన అనంతరం వాస్తవ నష్టాన్ని వ్యవసాయశాఖ అంచనా వేసిన తర్వాతే ఆ మేరకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లించాం.

అన్ని పంటలను మద్దతు ధరలతో కొంటాం

రాష్ట్రంలో పండే అన్ని పంటలను కనీస మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. రాష్ట్రం కొనుగోలు చేసిన పంటల్లో కేంద్రం 25 శాతమే తీసుకుంటోంది. పూర్తిస్థాయిలో కొనాలంటూ లేఖ రాశాం. సన్నధాన్యం విక్రయించిన రైతులందరికీ క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తాం" అని తుమ్మల తెలిపారు. సమావేశంలో విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేశ్‌రెడ్డి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

20-10-2024 ఆదివారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం

తదియ: ఉ. 10-44 తదుపరి చవితి; కృత్తిక: మ. 1-14 తదుపరి రోహిణి; వర్జ్యం: తె. 4-33 నుంచి; అమృత ఘడియలు: ఉ. 10-58 నుంచి 12-29 వరకు; దుర్ముహూర్తం: సా. 4-01 నుంచి 4-47 వరకు; రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ. 5.57; సూర్యాస్తమయం: సా.5.34

సంకటహర చతుర్థి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	37.0	23.0
నిజామాబాద్	36.3	24.4
ఆదిలాబాద్	35.3	27.2
రామగుండం	34.8	24.6
ఖమ్మం	34.5	25.0
నరసాపురం	34.1	26.4
విశాఖపట్నం	34.0	26.5
మెదక్	33.8	21.5
హనుమకొండ	33.5	24.0
విజయవాడ	33.2	25.9
తాడేపల్లిగూడెం	32.7	25.4
కర్నూలు	32.6	24.8
తిరుపతి	32.6	23.8
శ్రీకాకుళం	32.0	26.0
సూర్యాపేట	32.0	26.0
కరీంనగర్	32.0	23.0
హైదరాబాద్	31.6	23.0
అనంతపురం	31.4	24.0
నల్గొండ	31.0	23.0
మహబూబ్‌నగర్	30.0	23.5


బజాజ్ ఎలక్ట్రానిక్స్
భారతదేశపు అతి పెద్ద పండుగ ఆఫర్
1కోటి
నగదు బహుమతి
గెలుచుకోండి 30 ఆల్టో K10 కార్లు
డ్రా తేదీ: 8 జనవరి, 2025
గెలుచుకోండి ₹50 లక్షలు
డ్రా తేదీ: 8 జనవరి, 2025
గెలుచుకోండి ₹30 లక్షలు
డ్రా తేదీ: 6 నవంబర్, 2024
₹21,000* వరకు క్యాష్ బ్యాక్
CASHBACK UPTO ₹10,000/-* BAJAJ FINSERV
CASHBACK UPTO ₹21,000/-* HDB FINANCIAL SERVICES
CASHBACK UPTO ₹2,000/-* YES BANK
7.5% INSTANT DISCOUNT* SBI card
CASHBACK UPTO ₹4,500/-* HDFC BANK On CC / DC EMI FESTIVE TREATS
CASHBACK UPTO ₹3,000/-* RBL BANK
#Min. Trxn.: ₹20,000; Max. Discount: ₹4,500 per card. Valid only on EMI Trxns. Validity: 05 Oct - 03 Nov 2024. T&C Apply.
SONY
BRAVIA 7
XR Mini LED
THIS FESTIVE SEASON
GET BRAVIA 2 (43S25) on purchase of BRAVIA 7
Range starts from Rs.1,82,990/-
SPECIAL OFFERS! 3 YEARS WARRANTY
INSTANT CASHBACK Rs.12,500
BUY NOW AT Rs.2,995/-
1 EMI FREE
SOUNDBAR COMBO OFFER SAVE Rs.52,490/-
LG
LG OLED DAYS
Enjoy exclusive limited period offers on LG OLED TVs.
Life's Good.
FIXED EMI ₹999
30% OFF LG SOUNDBAR
1 EMI FREE
5-YEAR GUARANTEED
SAMSUNG
BIG TV FESTIVAL
Light up your festivities with AI powered Samsung TV
14th Sept. - 10th Nov. 24
Exclusive Festive Offers
3 Year warranty
1 EMI off
Long tenure EMI up to 36 months
Up to 20% cashback
10%
LG Life's Good.
Light up this Diwali with exciting offers on the LG Objet Collection with MoodUP Refrigerator Series and let your mood set the vibe.
CELEBRATION OFFERS
INSTANT CASHBACK UP TO ₹45,000*
FIXED EMI Starting from ₹9999
0 DOWN PAYMENT
FREE 8 PIECE BOROSIL GLASS LOCK KIT Worth ₹5000
SAMSUNG
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
Upgrade to AI - Powered French Door & Side by Side refrigerators and enjoy amazing Offers
20% CASHBACK UPTO ₹20,000*
EMI Starting ₹3990/-
20 Year Warranty**
Haier
OPEN 1 DOOR TO MORE WITH 3-DOOR CONVERTIMAX
SIDE BY SIDE REFRIGERATOR
EXCITING OFFERS
20% INSTANT DISCOUNT
18 MONTHS
0 DOWN PAYMENT
2 Years Complete Warranty on Product
10 Years on Compressor
LG
Light up this Diwali by bringing home the New Form of Laundry with exciting offers on LG WashTower.
CELEBRATION OFFERS
CASHBACK UP TO 20%*
Upto ₹12000/-*
(Applicable on 10 kg and Above Select Models)
SAMSUNG
NEW ARRIVAL
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
No load too big
Bespoke AI™ Laundry now available in 12kg.
WW12DB8B54GBTL
MRP ₹ 74990
Special Offer Price ₹ 59000
20% cashback of up to ₹8,000*
EMI Starting @ ₹ 2490*
20 years warranty* on Digital Inverter Motor
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
WASHING ASSURANCE 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0 DOWN PAYMENT
FIXED EMI STARTING ₹994*
20% CASH BACK
5 YEARS WARRANTY
iPhone
iPhone 16 128GB
MRP ₹79,900/- EFFECTIVE PRICE ₹36,900/-*
iPhone 13 128GB
MRP ₹49,900/- EFFECTIVE PRICE ₹21,900/-*
SAMSUNG
S24 Ultra
12GB + 256GB MRP ₹1,29,999/- EFFECTIVE PRICE ₹1,09,999/-*
S24
8GB + 256GB MRP ₹79,999/- EFFECTIVE PRICE ₹64,999/-*
*Price Including Upgrade / Cashback
vivo
Y300Plus
8GB + 128GB ₹28,999 ₹23,999
ADDITIONAL CASH BACK ₹2,000*
Y28s
4GB + 128GB ₹17,999 ₹13,499
ADDITIONAL CASH BACK ₹1,000*
oppo
F27 5G
8GB + 128GB ₹27,999 ₹20,999
INSTANT CASH BACK 10%*
A3 Pro 5G
8GB + 128GB ₹20,999 ₹17,999
INSTANT CASH BACK 10%, UPTO ₹1500*
mi
Redmi Note 13 5G
6GB + 128GB ₹20,999 ₹14,999*
CASH BACK ₹1,000*
Redmi 13 C 5G
6GB + 128GB ₹15,999 ₹10,499*
CASH BACK ₹1,000*
*Net Effective Price after Cash Back
కరీంనగర్: డాక్టర్ బి.వి.రెడ్డి కాంప్లెక్స్, కమాన్ రోడ్ | H. No. 2-229/A, RTC వర్క్‌షాప్ 2వ గేట్ ఎదురుగా, జగిత్యాల రోడ్
సిద్దిపేట: కొత్త బస్టాండ్ దగ్గర, హైదరాబాద్ రోడ్ | మంచిర్యాల: రిలయన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా, గర్మిళ్ల విలేజ్ | నిర్మల్: D. No. 7-3-238, ఇబ్రహీంబాగ్
ఆదిలాబాద్: 10-1, 10-2 & 10-3, హనుమాన్ నగర్ | పెద్దపల్లి: D. No. 2-1-134, సర్వే నం. 326, రాజీవ్ హైవే, ప్రగతి నగర్
గజ్వేల్: H. No. 11-88/17, రాజారెడ్డిపల్లి | రామగుండం: H. No. 5-6-112/2/1, గ్రౌండ్, 1st & 2nd ఫ్లోర్, మేడిపల్లి విల్లేజ్, NTPC, గోదావరిఖని
గిఫ్ట్ కార్డ్స్, కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్ల కోసం, దయచేసి మాకు ఈమెయిల్ చేయండి corporatesales@bajajelectronics.in

ఈనాడు

తోడుగా నిలుద్దాం!

ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త రాజా రామన్నను అడిగారెవరో- 'మీకు జీవితంలో ఎంతో ఆనందాన్నిచ్చే సన్నివేశాలు ఏమిటి?' అని. దానికాయన 'ఏకాంతంగా కూర్చొని పియానో వాయించుకొనే సందర్భాలన్నీ అత్యంత ఆనందాన్నిస్తాయి' అన్నారు. ఖలీల్ జిబ్రాన్ చెప్పినట్టు మనిషి తనలోకి తాను... తనదైన నిర్మల హృదయ జలాశయంలోకి నిదానంగా జారుకొనే అపురూపమైన సమయాలవి. ఏకాంతం మనిషిని ప్రపంచం బారినుంచి రక్షిస్తుంది. మనిషి తనతోనో, తన ఇష్టదైవంతోనో గడిపే అమూల్య ఘట్టాలకు ఆధారభూమిక, నర్తనవేదిక- ఏకాంతం. అంతేకాదు- అది విషయ, ఇంద్రియ సంయోగంతో ప్రమేయం లేనిది. 'వేయిసి సోయగమ్మునకు లేదు శరీరము, లేదు మేను- నా తీయని ప్రేమకేని!' అని కృష్ణశాస్త్రి చెప్పిందదే! మనిషి తనను తాను పునర్ నిర్వచించుకోవాలన్నా, నిర్మించుకోవాలన్నా ఏకాంత స్థితి ఎంతో అవసరమైనది. ఆధ్యాత్మిక సాధనలకు సరేసరి. కబుర్లే మునులు, జ్ఞానులు ఏకాంత స్థితిని బాగా ఇష్టపడతారు. దానికోసం పరితపిస్తారు.

ఏకాంతం, ఒంటరితనం ఒకటి కావు. ప్రపంచాన్ని దూరం పెట్టి ఆనందిస్తుంది- ఏకాంతం! ప్రపంచం దూరమైనందుకు చింతిస్తుంది- ఒంటరితనం! శ్రీశ్రీ చెప్పిన 'నా గుహలో కూటిలో చీకటిలో ఒక్కడనై ప్రుక్కిన రోజులు' మామూలు మనిషికి దుఃఖపూరితాలు. తన కారకులైనవారి గురించి నిరంతరం ఆలోచించడం, కారణాలు అన్వేషించడం, ప్రతీకారానికి దారులు వెదకడం... ఇలా మొత్తానికి వేరేవారి గురించి చింతిస్తూ గడిపే రోజులన్నీ చాలా భారమైనవి. స్వర్గ నరకాల మధ్య తేడా గురించి చెబుతూ 'మనకు ఇష్టమైన జీవితం గడిపేసింత కాలం- మనం స్వర్గంలో ఉన్నట్టు లెక్క. మనం కానిదానిగా ఉండటం, అయిన దానిగా ఉండకపోవడం రెండూ నరకమే' అన్నారు ప్రసిద్ధ ఫ్రెంచి తత్వవేత్త జీన్ పాల్ సార్త్రే. ఈ మాటను ఏకాంతానికి, ఏకాకితనానికి అన్వయిస్తే- మొదటిది స్వర్గం, రెండోది నరకం. ఒంటరితనాన్ని ఏకాంతంగా మలచుకోవడం ఎలా అనేదే ప్రస్తుతం వృద్ధులను వేధిస్తున్న ప్రధాన సమస్య. వాస్తవానికి ఒంటరిగా బతకడం కన్నా- ఒంటరితనంలో ఉన్నామన్న భావనే కుంగుబాటుకు బలమైన కారణం అవుతోందంటున్నారు శాస్త్రజ్ఞులు. అలాంటివారికి తోడు చాలా అవసరం.

కొబ్బరి విత్తనాలు గుంపుగా ఒక తోపులా ఏపుగా ఎదుగుతాయి. వాటిని తవ్వి తీసి వేరువేరుగా నాటుతారు. అలా విడిగా పెరిగే మొక్కలను 'సూదలు' అని పిలుస్తారు. సూదల్లో కొన్ని ఆ దశలోనే వాడిపోతాయి. అందుకు కారణం 'మనేద' అంటారు రైతులు. మనేద అంటే బెంగ, మనోవ్యథ. ఒంటరిగానే అయినా, బలంగా పెరిగే మొక్కల్లో లేని మనేద- ఒంటరితనమనే భావనలో కూరుకుపోయిన మొక్కలను కుంగదీస్తోందని లెక్క. వృద్ధుల విషయంలో దాన్ని ఏకాకితనంగా నిర్వచిస్తున్నారు హార్వర్డ్‌కు చెందిన ఆరోగ్య పరిశోధకులు. ఆధునిక యుగంలో వృద్ధాప్యమనేది ఒంటరితనానికి పర్యాయపదంగా మారుతోంది. 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు, నీకోసమే కన్నీరు నించుటకు నేనున్నానని' సమాజం తోడుగా నిలిస్తే వృద్ధుల్లో కుంగుబాటును నివారించవచ్చన్నది పరిశోధకుల హితవచనం. దాన్ని ఆలకించి వృద్ధులు ఏకాకులు కాకుండా చూడటం- అటు సంతానానికి, ఇటు సమాజానికి ప్రధాన బాధ్యత. 'ఎవర్నైనా కలిస్తే మనిషిని కలిసినట్టుండాలి... మానవత్వం అర్థమైనట్లుండాలి... పచ్చని చెట్టుకింద సేదదీరినట్టుండాలి...' అని ఆశించారు ఎన్.గోపి. అయినవారు ఆ తరహా భరోసాను, ఆసరాను అందిస్తే- వృద్ధులు ఏనాటికీ ఏకాకులు కారు!



న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సెక్యులరిజం... ఈ నాలుగు ముఖ్యమైన విషయాల గురించి పిల్లలకు ఏడెనిమిదేళ్లలోపే అర్థమయ్యేలా నేర్పించాలి. అప్పుడే ఈ విలువలు జీవితాంతం వారితో పాటు ఉంటాయి.

– జస్టిస్ లీలా సేథ్

కర్బన ఉద్గారాలకు 'సమాధి'!

భూతాపం మూలంగా అన్ని సీజన్లలో ఎండలు మండిపోతున్నాయి. భూమి ఉష్ణోగ్రతను పెంచేస్తున్న కర్బన ఉద్గారాలను కట్టడి చేయనిదే వాతావరణ సమతుల్యతను పునరుద్ధరించలేం. వరదలు, తుపానుల వంటి ప్రకృతి విపత్తులను నిలువరించలేం. గాలి నుంచి నేరుగా కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, దాన్ని భూగర్భంలో నిక్షిప్తం చేయడం ద్వారా ఉద్గారాలను తగ్గించవచ్చు. ఈ సాంకేతికతను కార్బన్ క్యాప్చర్, స్టోరేజీ (సీసీఎస్)గా వ్యవహరిస్తున్నారు.




పలు దేశాలు బొగ్గు, చమురు వంటి శిలాజ ఇంధనాల వాడకాన్ని క్రమంగా తగ్గిస్తూ పునరుత్పాదక సౌర, పవన ఇంధనాల వైపు మళ్లుతున్నాయి. దీనితోపాటు వాతావరణంలో పేరుకుపోయిన కర్బన ఉద్గారాలను వేగంగా తగ్గించడానికి కార్బన్ క్యాప్చర్, స్టోరేజ్ (సీసీఎస్) సాంకేతికతను వినియోగించాలి. తద్వారా పారిస్ వాతావరణ సభ తీర్మానించిన ప్రకారం భూఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ లేదా 2 డిగ్రీల సెల్సియస్ దగ్గర కట్టడి చేయవచ్చు. ఈ లక్ష్య సాధనకు సీసీఎస్ అమోఘంగా తోడ్పడుతుందని స్వీడన్‌లోని చామర్స్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, నార్వేలోని బెర్గెన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా జరిపిన అధ్యయనం తేల్చింది. ప్రపంచ దేశాలన్నీ సీసీఎస్‌ను వేగంగా అమలు చేస్తే కర్బన ఉద్గారాలను అరికట్టగలుగుతామని సూచించింది.

ఎంత వరకు లాభం?

ఉక్కు, సిమెంటు కర్మాగారాలు, థర్మల్ విద్యుత్కేంద్రాలు వాతావరణంలోకి పెద్దయెత్తున సీవో2ను విడుదల చేస్తున్నాయి. ఈ ఉద్గారాల నిరోధానికి సీసీఎస్ తోడ్పడుతుంది. నార్వే తీరంలో స్లీప్నర్ ప్రాజెక్టు కింద వాతావరణం నుంచి ఒడిసి పట్టిన సీవో2ను 1996 నుంచి నార్త్‌సీ సముద్ర గర్భంలో నిక్షిప్తం చేస్తున్నారు. నేడు సీసీఎస్ కన్నా అధునాతనమైన సాంకేతికతలు రంగప్రవేశం చేస్తున్నాయి. శిలాజ ఇంధనాల వల్ల పేరుకుపోతున్న కర్బన ఉద్గారాల పరిహారానికి ఈ సాంకేతికతలను విరివిగా ఉపయోగించాలి. ఉక్కు, సిమెంటు కర్మాగారాలు సౌర, పవన ఇంధన వనరులకు మారడం కష్టం కాబట్టి అవి తప్పనిసరిగా సీసీఎస్‌ను చేపట్టాలని చామర్స్ విశ్వవిద్యాలయ నిపుణులు జెసికా జుయెల్ సూచించారు. ప్రస్తుత శతాబ్దంలో సీసీఎస్ సాయంతో 600 గిగా టన్నుల కర్బనాన్ని మాత్రమే గ్రహించి భూగర్భంలో నిల్వచేయగలుగుతామని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. కానీ, భూతాపాన్ని నిరోధించడానికి ఇది చాలదు. ఈ శతాబ్దాంతానికి 1000-1500 గిగాటన్నుల కర్బన ఉద్గారాలను ఒడిసిపట్టి నిక్షిప్తం చేస్తేనే భూతాపాన్ని నిలువరించగలుగుతాం. ఈ లక్ష్యాన్ని వేగంగా సాధించడానికి సీసీఎస్ సాంకేతికత సరిపోకపోవచ్చని చామర్స్-బెర్గెన్ సంయుక్త అధ్యయన సారథి కాజ్లు చెబుతున్నారు. సీసీఎస్ తరచూ వైఫల్యానికి లోనవుతోంది. గడచిన 15 ఏళ్లలో 90 శాతం సీసీఎస్ ప్రాజెక్టులు ఆశించిన స్థాయిని అందుకోలేకపోయాయి. అందువల్ల భూతాపాన్ని వేగంగా నిరోధించడానికి సీసీఎస్ సాంకేతికత ఎంత వరకు ఉపకరిస్తుందనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. అదీ కాకుండా సీసీఎస్ చాలా ఖరీదైన పరిజ్ఞానం. సీవో2ను ఒడిసిపట్టి భూగర్భంలో నిక్షిప్తం చేయడానికి మౌలిక వసతుల నిర్మాణం ఎంతో వ్యయప్రయాసలతో కూడినది. అందుకే ప్రైవేటు కంపెనీలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి సంకోచిస్తున్నాయి. ప్రభుత్వ సహాయం, ఆర్థిక ప్రోత్సాహకాలు ఉంటే అవి ముందుకువస్తాయి. ఈ వాస్తవాన్ని సంపన్న దేశాలు గుర్తించాయి. ఐరోపా సమాఖ్య (ఈయూ) తీసుకొచ్చిన కర్బన ఉద్గారాల తటస్థ పరిశ్రమల (నెట్ జీరో ఇండస్ట్రీ) చట్టం, అమెరికా ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం కింద సీసీఎస్ సాంకేతికతను అవలంబించే పరిశ్రమలకు ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం లభిస్తోంది. ప్రస్తుతం తలపెట్టిన పథకాలు కార్యరూపం ధరిస్తే 2030కల్లా ప్రపంచ సీసీఎస్ సామర్థ్యం ఎనిమిదిరెట్లు పెరుగుతుందని చామర్స్ విశ్వవిద్యాలయ అధ్యయనం అంచనా వేసింది. అయితే, సీసీఎస్ పరిజ్ఞానాన్ని మరింత ఆధునికీకరించాలి.

మనుగడ కష్టం

వాతావరణ మార్పులకు దారితీస్తున్న కర్బన ఉద్గారాలను అరికట్టకపోతే భూమి మీద జీవజాలం మనుగడ కష్టమైపోతుంది. ఇందుకు సీసీఎస్‌తోపాటు మరిన్ని నవీన, సమర్థ మార్గాలను చేపట్టాలి. అడవుల పెంపకం, చిత్తడి నేలల పునరుద్ధరణ, వాతావరణం నుంచి కర్బనాన్ని సంగ్రహించి నేల మీద



పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, పెరుగుతున్న వాహన వినియోగం తదితరాల వల్ల వాతావరణంలోకి భారీగా కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. మన దేశంలో మొత్తం ఉద్గారాల్లో ఆయా రంగాల వాటా ఎంతంటే.. (శాతాల్లో)

- వ్యవసాయం
- రవాణా
- పరిశ్రమలు
- పవర్
- భవనాలు

(ఆధారం: క్లైమేట్ ట్రాన్స్‌పరెన్సీ రిపోర్ట్)


పంటల సాగుకు ఎరువుగా ఉపయోగించడం వంటి పద్ధతులనూ అన్వేషించాలి. మోటారు వాహనాల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాల పరిహరణకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు, శాస్త్రజ్ఞులు, కంపెనీలు చేయీచేయీ కలిపి భూతాపాన్ని అరికట్టడానికి శ్రమించాలి. సీసీఎస్ వంటి సాంకేతికతలు చవకగా లభించేలా కృషిచేయాలి. ఇప్పటికే సమయం మించిపోయిందని గ్రహించి పట్టుదలతో కార్యాచరణకు దిగాలి.



హరికృష్ణ నిబానుపూడి
పర్యావరణ విధాన నిపుణులు

ఊపిరికీ గాలికీ మధ్య...

ఆ మంచంమీద ఎందరికో వైద్య పరీక్షలు చేసిన డాక్టరు అతడు. సంక్లిష్టమైన సర్జరీలు చేశాడు. నయమైపోతుందని ధైర్యం చెప్పాడు. అలాంటిది ఉన్నట్లుండి ఓ రోజు తనే ఆ మంచంమీద పడుకోవాల్సి వస్తే... ఏ మందులు వాడినా లాభం ఉండదనీ, తనకి నయమైపోతుందని చెప్పగలవారెవరూ లేరని తెలిస్తే... ఆ వ్యక్తి మనఃస్థితి ఎలా ఉంటుంది? కెరీర్‌లో స్థిరపడి ఇక జీవితానుభవాలన్నింటినీ ఆస్వాదించాల్సిన వయసు... ముప్పయ్యారేళ్లకే 'నీకీ భూమ్మీద నూకలు చెల్లాయ'ని మృత్యుదేవత క్యాన్సర్ మహమ్మారి రూపంలో కళ్ల ముందుకు వచ్చి నిలబడింది. మరొకరెవరన్నా అయితే అప్పుడేం చేసేవారో కానీ పాల్ సుధీర్ కళానిధి మాత్రం 'వెన్ బ్రెత్ బికమ్స్ ఎయిర్' అంటూ స్ఫూర్తినిచ్చే పుస్తకం రాశాడు.



'జీవితంలో నెగ్గాలంటే డ్రైవ్ ఉండాలం'టారు బుచ్చిబాబు 'ఆత్మవంచన'లో. ఆ డ్రైవ్ పుష్కలంగా ఉన్న వ్యక్తి డాక్టర్ పాల్ సుధీర్ కళానిధి. తమిళ, తెలుగు మూలాలున్న సుధీర్ పుట్టింది అమెరికాలో. ఆంగ్ల సాహిత్యం, మానవ శరీరశాస్త్రాల్లో పట్టా పుచ్చుకున్నాడు. హిస్టరీ, ఫిలాసఫీల్లో ఎంఫిల్ చేశాడు. ఇలా విభిన్న సబ్జెక్టుల్ని అధ్యయనం చేశాక జీవితానికి అర్థమేమిటీ అన్న ఆలోచన అతణ్ని మెడిసిన్ వైపు మళ్లించింది. తండ్రిలాగా డాక్టరై కొంతకాలం సమాజానికి సేవచేసి ఆ తర్వాత రచనలు చేస్తూ ప్రశాంతజీవితం గడపాలనుకుని మెడిసిన్‌లో చేరాడు. చదువులో అసాధారణ ప్రతిభ చూపిన అతడికి ఎన్నో అవార్డులూ స్కాలర్‌షిప్పులూ వచ్చాయి. సహవిద్యార్థిని లూసీని ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. మనిషి జీవితమంతా మెదడు చెప్పుచేతల్లోనే ఉంటుంది కాబట్టి దాన్ని శోధించాలని న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేశాడు. న్యూరాలజిస్టుగా ఎన్నోరకాల చికిత్సలు చేసి మంచి పేరు తెచ్చుకుంటున్నప్పుడు అనారోగ్యం మొదలైంది. ఎంతకీ అది తగ్గకపోయేసరికి పరీక్షలు చేయించుకుంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ నాలుగో దశ అని తెలిసింది. చికిత్స తీసుకుంటూనే సర్జరీలు కొనసాగించాడు ఆ యువవైద్యుడు. కానీ, రోగం తగ్గినట్లే తగ్గి మళ్లీ విజృంభించడంతో పూర్తిగా పేషెంట్ స్థానానికే పరిమితమవ్వాల్సి వచ్చింది. తన ప్రయాణం ఎక్కడ మొదలై ఎక్కడ ముగియబోతోందీ అన్న ఆలోచన అతణ్ని రచయితను చేసింది. లూసీ సహకారంతో చికిత్స పొందుతూ మరణం దిశగా తన ప్రయాణాన్నీ అనుభవాల్నీ ఆలోచనల్నీ అక్షరబద్ధం చేశాడు. ఇద్దరూ ఇష్టపడి బిడ్డను కన్నారు. ఎనిమిది నెలలు పాపను చూసుకుంటూ పుస్తకం రాస్తూ తన బాధలనుంచి ఉపశమనం పొందేవాడు. 'వెన్ బ్రెత్ బికమ్స్ ఎయిర్' పుస్తకంతోపాటు 'సర్జన్‌గా నా చివరి రోజులు', 'ఇంకా ఎంతకాలం బతుకుతాను' లాంటి వ్యాసాలు రాసి క్యాన్సర్ బయటపడిన రెండేళ్లలోపే తుదిశ్వాస విడిచాడు పాల్.



అతడి మరణానంతరం లూసీ పూర్తిచేసి ప్రచురించిన ఈ పుస్తకం ఎన్నో అవార్డులు అందుకుంది. పులిట్జర్ ప్రైజ్ ఫైనల్ లిస్టులోకి వెళ్లింది. పలుభాషల్లోకి అనువాదమైంది. సాహిత్యమూ వైద్యమూ రెండింటిలోనూ ప్రావీణ్యంగల పాల్ మరణంతో తన ప్రయాణాన్ని వర్ణించిన విధానం పాఠకుల హృదయాల్ని కదిలిస్తుంది. జీవితం పట్ల ప్రేమను పెంచుతుంది.

– మిహిర

అయిదు వేళ్ల వెనకా...

ఆవురావురుమంటూ కంచం ముందు కూర్చుంటాం. అన్నం, కూరలు వడ్డించగానే అయిదువేళ్లతో అన్నం కలుపుతాం, తొలిముద్దనోసారి కళ్లకద్దుకుని తరవాతే నోటికి అందిస్తాం. ఇస్తున్నది చేయి అందుకోబోతున్నది నోరు! మరి కళ్లకద్దుకోవటంలో అర్థం ఏంటీ అంటే- ఆ ముద్ద మన నోటికి చేరటానికి ఎన్ని చేతులో సహాయం చేస్తున్నాయి. ఆ సహాయం అందించే మూలపురుషుడు పరమాత్మ. ఆ పరమాత్మ మన కళ్లలో ఉన్నాడు మరి.

మన నోటికందే షడ్రసోపేతమైన భోజనంలో ఎంత మంచి ఉందో, అంత చెడ్డా ఉంది. ఈ షడ్రుచుల మీదే మనిషి తత్వం ఆధారపడి ఉంది. అవే మన గుణాలను బయట పెడతాయి. అవే సత్వ, రజస్తమో గుణాలు. నాభి వరకూ ఉన్న భాగం తమోగుణ ఆవాసం. నాభి నుంచి ఉదరం వరకూ రజోగుణం. ఉదరం నుంచి కంఠం వరకూ సత్వ గుణం. కంఠ భాగంపైన ముఖ మండలం... మనసు నుంచి బుద్ధి, బుద్ధి నుంచి జ్ఞానం వికసించే కేంద్రం. జ్ఞానం భగవత్ సంకేతం. అదే బ్రహ్మం. అంటే- పరమాత్మను చేరుకోవడానికి దారి. అందుకే మనం నోటికందించే అన్నం పరబ్రహ్మ స్వరూపం. అది మనకు భగవంతుడి ప్రసాదం. దాన్ని ఆయనకు నైవేద్యంగా సమర్పించి మన నోటికందిస్తే మనకి క్షేమం. మనకింత క్షేమాన్ని కలిగించే ఆహారాన్ని భగవంతుడు ఎందరి సాయంతో మన వరకూ చేరుస్తున్నాడో కూడా తెలుసుకోవాలి!



అంతర్యామి

ఆకలితో నకనకలాడుతూ కూర్చోగానే విస్తట్లో ప్రేమగా అన్నం వడ్డించేది తల్లి కావచ్చు, చెల్లి కావచ్చు, భార్య కావచ్చు. మొత్తం మీద ఆవిడో అన్నపూర్ణ. ఆకలితో ఉన్నవారికి సుష్టుగా, కొసరి కొసరి వడ్డించిన వారెవరైనా అన్నపూర్ణలే. ముందుగా ఆమెకు కృతజ్ఞతలు చెప్పాలి. ఆమెకు కావాల్సినవన్నీ తెచ్చిస్తున్నవారు మరొకరు. అతడు తండ్రో, భర్తో, కుమారుడో ఎవరైతేనేం? ఒక దాత, ఒక దేవుడు. మరి ఆ పదార్థాలు ఆయన సృష్టిస్తున్నాడా? మళ్లీ ఎన్నో చేతులు, ఎంతో శ్రమ. ఎండావానా అనక కాయకష్టం చేసి పండించిన పంటంతా తానొక్కడే అనుభవించాలనుకోకుండా సమస్త మానవాళి ఆకలి బాధలు తీరుస్తున్న రైతన్నలో... కనిపించని ఆ పరమాత్మ చేయి కనిపించడం లేదా? అందరి సహకారంతో అందే కమ్మనైన ఆహారాన్ని ముద్దగా చేసి కడుపులోకి పంపిస్తున్నాం. లోపలి యంత్రం అవసరమనుకున్నవి రక్తంగా మార్చి శరీరానికి శక్తినిస్తుంది, జ్ఞానాన్నిస్తుంది, ఆలోచననిస్తుంది, వివేచననిస్తుంది. మలినాల్ని, వ్యర్థాల్ని బయటకు తోసేస్తుంది.

మూడుపూటలా ఆ అయిదువేళ్లు ఐక్యతతో పనిచేసి నోటికింత అందిస్తున్నాయంటే- వాటి వెనకాల మనకి కనిపించని ఆ పరమాత్మ సహస్ర బాహువులతో, సహస్రాక్షులతో, సహస్ర శీర్షాలతో చేస్తున్న నిర్విరామ కృషి ఉంది. అది ఎంత అచంచలమైనదో తెలుసుకోవాలి. తెలుసుకుని మన చుట్టూ ఉన్నవారితో చేయీ చేయీ కలపాలి. అయిదు వేళ్లూ నోట్లోకెళ్తున్న మనిషి జీవించే స్వల్పకాలంలో ఈ రహస్యం తెలుసుకొని, జీవించడమే ఒక నైవేద్యం!

– పి.వి.బి.శ్రీరామమూర్తి



ఆగని అఘాయిత్యాలు


ప్రభుత్వాలు ఎన్ని మాటలు చెబుతున్నా, కఠిన చట్టాలు తెస్తున్నా ఇండియాలో స్త్రీలపై అకృత్యాలు ఆగడం లేదు. ఇంటా బయటా వారిపై దాష్టీకాలు పెరుగుతున్నాయి. 2014-2022 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలకు సంబంధించి నమోదైన కేసులు...

2014	3,39,457
2015	3,29,243
2016	3,38,954
2017	3,59,849
2018	3,78,236
2019	4,05,326
2020	3,71,503
2021	4,28,278
2022	4,45,256

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

సమాచారానికి సంకెళ్లు

రాజ్యాంగం అంటే గౌరవం లేదు... చట్టాలంటే భయం లేదు... జనమంటే లెక్కే లేదు... ఇక రాజకీయ నాయకులు దేనికి దడుస్తారు? పైకి నీతులు చెబుతూ వెనక గోతులు తీయడంలో ఆరితేరిపోయిన ప్రబుద్ధ నేతాగణాలను భయపెట్టగలిగినవి ప్రశ్నలు మాత్రమే! అధికారిక రహస్యాల ముసుగులో తమ అవినీతీ అక్రమాలను కప్పెట్టి ఉంచుతారు కాబట్టి నిజాలు చెప్పడానికి నాయకులు వణికిపోతారు. వాస్తవాలేంటో తెలుసుకోవడానికి ప్రశ్నించేవారిని చూసి కంపరమెత్తిపోతారు. ప్రభుత్వాలను ప్రశ్నించే హక్కును ప్రజల చేతుల్లో పెట్టిన సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాన్ని చూసి చిందులు తొక్కుతుంటారు. సర్కారీ దస్త్రాల్లోని కీలక సమాచారమేదీ బయటికి రాకుండా పన్నాగాలెన్నో పన్నుతుంటారు. 2005లో ఆర్టీఐ చట్టం ప్రాణం పోసుకున్నప్పటి నుంచి దాని జవజీవాలను హరించడానికి పాలకులు, అధికారులు చేయని ప్రయత్నాల్లేవు. ఆర్టీఐ అమలుకు మొండికేసే సర్కారీ సిబ్బందిని దారిలో పెట్టాల్సిన సమాచార కమిషన్లను ఉత్సవ విగ్రహాలుగా మిగల్చడం ద్వారా ప్రభుత్వాలు ఇప్పటికే తామనుకున్నది సాధించాయి!



ప్రభుత్వాలేం చేస్తున్నాయో తెలుసుకోవడం, వాటి విధాన నిర్ణయాల వెనక కారణాలను కనుక్కోవడం, సర్కారీ ఖజానా జమాఖర్చులపై అవగాహన కలిగిఉండటం- ప్రజల హక్కు. దాన్ని పరిరక్షించడం- ప్రజాస్వామ్య వ్యవస్థ మౌలిక లక్షణం. "పాలనాపగ్గాలు చేతులు మారినంత మాత్రాన మనకు స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదు. అధికార దుర్వినియోగాన్ని ఎదిరించగలిగిన శక్తిసామర్థ్యాలను ప్రజలందరూ సంపాదించుకోగలిగిన నాడే మనకు నిజమైన స్వరాజ్యం సిద్ధిస్తుంది" అన్న గాంధీజీ మాటల్లోని అంతరార్థమేంటి? పాలకులను ధైర్యంగా ప్రశ్నించే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి... ప్రశ్నలకు వెన్నుచూపకుండా, ప్రశ్నించేవారిపై కత్తిదూయకుండా నిజానిజాలను ప్రభుత్వాలు ప్రజానీకంతో పంచుకోవాలి. స్వతంత్ర భారతంలో ఇలాంటి ప్రజాస్వామిక వాతావరణం పాదుకొనాలన్నది బాపూజీ ఆకాంక్ష! అందుకు అవకాశం కల్పించేది సమాచార హక్కు. 19(1)(ఏ), 21వ రాజ్యాంగ అధికరణలు హామీఇచ్చిన భావప్రకటనా స్వేచ్ఛ, జీవించే హక్కులలో ఆర్టీఐ అంతర్భాగమన్నది సుప్రీంకోర్టు గత నిర్దేశం. మొన్న ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని కొట్టేస్తూ 'సుప్రీం' ఇదే మాటను పునరుద్ఘాటించింది. పాలనలో ప్రజాభాగస్వామ్యాన్ని పెంచే సమాచారాన్ని పౌరులకు అందించాల్సిందేనని ఆదేశించింది. కానీ, ప్రభుత్వాలేమో సమాచార కమిషనర్లను సకాలంలో నియమించకుండా, ఒకవేళ నియామకాలు జరిపినా సమర్థులకు అవకాశాలివ్వకుండా ఆర్టీఐనే మొత్తంగా చాపచుట్టేస్తున్నాయి!

పుణ్యభూమి

స.హ.చట్టం కింద కోరిన వివరాలను 30 రోజుల్లోగా అందించాలన్నది నిబంధన. పీఐవోలు (ప్రజా సమాచార అధికారులు) కనుక ఆ గడువులోగా స్పందించకపోతే దరఖాస్తుదారులు మొదటి అప్పీలు చేయవచ్చు. అక్కడా ఫలితం లేకపోతే- దరఖాస్తుదారులకు ఇక ఇన్ఫర్మేషన్ కమిషన్లే దిక్కు. తమకు వచ్చే రెండో అప్పీళ్లు, ఫిర్యాదులను విచారించి దరఖాస్తుదారులకు సమాచారం ఇప్పించడం... చట్టాన్ని అతిక్రమించిన అధికారులకు జరిమానాలు విధించడం కమిషన్ల విధి. ఆ బాధ్యతలను అవి ఎంత చక్కగా నిర్వర్తిస్తున్నాయో చెప్పాలంటే- కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది. తెలంగాణ, ఝార్ఖండ్, త్రిపుర, గోవాలలో సమాచార కమిషన్లు అసలు పనిచేయడమే లేదు. కమిషనర్ల పోస్టులు ఖాళీ అయ్యి నెలలూ సంవత్సరాలు గడిచిపోతున్నా అక్కడి ప్రభుత్వాలు నియామకాలు జరపట్లేదు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాఖండ్, ఒడిశాలలో ప్రధాన సమాచార కమిషనర్లు లేరు. పది మంది వరకు కమిషనర్లను నియమించే వీలున్నా సరే, ప్రభుత్వాలు ఆ మేరకు పోస్టులను భర్తీ చేయడం లేదు. కేంద్ర సమాచార కమిషన్‌లో ముగ్గురు పనిచేస్తుంటే- పశ్చిమ్‌బెంగాల్‌లో ఇద్దరంటే ఇద్దరే విధులు నిర్వర్తిస్తున్నారు. తమిళనాడు, బిహార్... ఇంకా అనేక రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి! కమిషనర్లు తగినంత మంది లేకపోవడం, ఉన్నవారు కూడా వేగంగా విచారణలు చేయకపోవడంతో కేసుల పెండింగ్ పెరిగిపోతోంది. సతర్క్ నాగరిక్ సంఘటన్ సంస్థ తాజా అధ్యయనం ప్రకారం- దేశవ్యాప్తంగా 29 సమాచార కమిషన్లలో మొన్న జూన్ 30వ తేదీ నాటికి 4.05 లక్షల రెండో అప్పీళ్లు, ఫిర్యాదులు అపరిష్కృతంగా మూలుగుతున్నాయి. ఒక్క మహారాష్ట్రలోనే అటువంటి వాటి సంఖ్య లక్ష దాటింది. కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా రాష్ట్ర కమిషన్లతో పాటు సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్‌లో 20-50వేల మధ్యలో అప్పీళ్లు, ఫిర్యాదులు మోక్షంకోసం ఎదురుచూస్తున్నాయి. ఏపీలో 10,809 కేసులు పెండింగ్‌లో ఉంటే- తెలంగాణలో అటువంటివి 14,162గా లెక్కతేలుతున్నాయి. వీటిపై విచారణ పూర్తయ్యేలోగా పుణ్యకాలం గడచిపోతోంది. ఈలోపు కొత్తగా దాఖలయ్యే అప్పీళ్లూ ఫిర్యాదుల సంగతేంటో ఏలినవారికే తెలియాలి!

స.హ.చట్టాన్ని ఖాతరుచేయని అధికారులపై కమిషన్లు జరిమానాల కొరడా ఝళిపించట్లేదు. మూడుశాతం కేసుల్లోనే అవి జరిమానాలకు ఆదేశిస్తున్నాయంటే- అధికార యంత్రాంగం పట్ల వాటి అవ్యాజ ప్రేమానురాగాల గాఢతను అర్థం చేసుకోవచ్చు. కంచే చేను మేసినట్లు కమిషన్లే చట్టానెందుకు నాశనం చేస్తున్నాయి అంటే... అక్కడే ఉంది సర్కారీ కుట్ర! విశ్రాంత అధికారులు, సొంత పార్టీ అభిమానులనే ప్రభుత్వాలు ఎక్కువగా కమిషనర్లుగా కొలువుతీరుస్తున్నాయి. అలాంటి వాళ్లందరూ కలిసి స.హ.చట్టానికి సమాధి కడుతున్నారు. సర్కారీ సమాచారం బయటికి రాకూడదన్న నేతల అభిమతాలను అలా నెరవేరుస్తున్నారు. భిన్న రంగాలకు చెందిన సమర్థులు, సచ్ఛీలురు, రాజకీయంగా తటస్థులైన వారిని సమాచార కమిషనర్లుగా నియమిస్తేనే ఆర్టీఐ మనగలుగుతుంది. అందుకు ప్రభుత్వాలు సిద్ధం కాకపోతే- మనది మేడిపండు ప్రజాస్వామ్యమన్న దుష్కీర్తి అలాగే మిగిలిపోతుంది!

– శైలేష్ నిమ్మగడ్డ

మ్యాజిక్‌తో దోస్తీ!

హాయ్ నేస్తాలూ! ఒక్క సెలవు వస్తే.. చాలు అమ్మానాన్నలను బయటికి తీసుకెళ్లమని మారాం చేసేస్తాం. నచ్చిన ఆటలు ఆడుకుంటూ సరదాగా గడిపేస్తాం. కొన్నిసార్లు అబ్బురపరిచే మ్యాజిక్ షోలు చూడటానికి కూడా ఇష్టపడతాం. కానీ అవే కార్యక్రమాలు మన లాంటి పిల్లలు చేస్తే? అందులో రికార్డులు సాధిస్తే ఎలా ఉంటుంది. ఇప్పుడు ఆ విషయాలే తెలుసుకుందాం!

ఐర్లాండ్‌కు చెందిన సిల్లియన్ ఓ కొనోర్‌కు ప్రస్తుతం పదిహేను సంవత్సరాలు. తన వయసు పిల్లలంతా.. ర్యాంకులంటూ పుస్తకాలతో కుస్తీ పడుతుంటే తను మాత్రం.. మ్యాజిక్‌తో దోస్తీ చేస్తూ చదువునూ కొనసాగిస్తున్నాడు. మన సిల్లియన్ తన





మ్యాజిక్‌లతో అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. తనకు ఏడేళ్ల వయసున్నప్పుడు వాళ్ల మావయ్య దగ్గర.. మ్యాజిక్ నేర్చుకోవడం ప్రారంభించాడట. ఒక నిమిషంలో 28 రకాల మ్యాజిక్ ట్రిక్స్ చేసి.. ఔరా అనిపించాడు. 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లోనూ స్థానం సంపాదించాడు. ఈ మధ్య ఇలా చాలామంది రికార్డులు సాధిస్తున్నారు. అందులో పెద్ద విశేషం ఏముంది అనుకుంటే పొరపాటే! సిల్లియన్ ఆటిజంతో బాధపడుతున్నాడు. అయినా కూడా ఎక్కడా తగ్గకుండా అటు చదువు.. ఇటు మ్యాజిక్ రెండింటిలోనూ ఉన్నత ప్రతిభ చూపిస్తున్నాడు. నిజంగానే మనలో కష్టపడాలనే ఆలోచన ఉంటే.. ఏదీ అడ్డుకాదని నిరూపిస్తున్నాడు.

'నేను యూట్యూబ్ స్టార్ ఇస్సీని ఎక్కువగా ఫాలో అవుతాను. తన నుంచి నేను చాలా నేర్చుకున్నాను. భవిష్యత్తులో నేను కూడా మిగతా పిల్లలకు ఆదర్శంగా నిలవాలనేదే నా లక్ష్యం' అంటున్నాడు సిల్లియన్. ★

రాయగలరా?

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. ఖాళీ గడుల్లో సరైన పదాలను నింపగలరా?

1. కుక్కతోక పట్టుకొని ☐☐☐ ఈదినట్లు.
2. మూలిగే ☐☐ మీద తాటికాయ పడినట్లు.
3. నవ్వు ☐☐☐ విధాల చేటు.
4. కూర్చున్న ☐☐ నరుక్కున్నట్లు.
5. అప్పు చేసి.. ☐☐ కూడు.


LARGER
than LIFE
ఒక అద్భుతమైన అనుభవం కోసం తయారవ్వండి. మహారాష్ట్ర తన పర్యాటక రంగం ద్వారా ప్రపంచంలోని కొన్ని అత్యంత సాహసోపేత మరియు ఆకర్షణీయమైన అనుభవాలను కల్పిస్తోంది.
తాడోబా-అంధారి టైగర్ రిజర్వ్
అధిక సమాచారం కోసం +91 9403878864 కి 'Hi' పంపండి
బుకింగ్స్ మరియు రిజర్వేషన్‌ల కొరకు: www.mahabooking.com
మమ్మల్ని అనుసరించండి: MaharashtraTourism @maha_tourism
maharashtratourismofficial diot@maharashtratourism.gov.in
DIRECTORATE
MAHARASHTRA TOURISM
www.maharashtratourism.gov.in

భద్రమైన కారే కొంటున్నారా?



డ్రైవర్‌కు మార్గదర్శి.. అడాస్



డ్రైవర్లు సురక్షితంగా వాహనాన్ని నడపడానికి, మానవ తప్పిదాలతో జరిగే ప్రమాదాల్ని నిరోధించడానికి.. రాడార్లు, కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ, సెన్సర్లు, కెమెరాలతో కూడిన అడాస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్) దోహదపడుతుంది. ఇది ప్రమాదాన్ని ముందే గుర్తించి, స్వయంచాలితంగా బ్రేకులు వేస్తుంది. డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. ఇందులోని కెమెరా, సెన్సర్, రాడార్, లేజర్, జీపీఎస్ వ్యవస్థలు ముందున్న రహదారిలో అడ్డంకుల్ని గుర్తించి, తక్షణమే అప్రమత్తమై వాహన వేగాన్ని తగ్గిస్తాయి. అంటే ప్రమాదాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రమాదాలను గుర్తించడం, హెచ్చరికలు జారీ చేయడం, స్వయంచాలక బ్రేకింగ్ వ్యవస్థల నిర్వహణకు కావాల్సిన సెన్సర్లు, కెమెరాలు ఇందులో ఉంటాయి. పాదచారుల్ని గుర్తించి బ్రేక్ ఉపయోగిస్తుంది. లైన్ నుంచి పక్కకు వెళ్తే హెచ్చరిస్తుంది. కన్పించని వైపు నుంచి వచ్చే ప్రమాదాల్ని (బ్లైండ్ స్పాట్) గుర్తించి అప్రమత్తమవుతుంది. పార్కింగ్‌లోనూ సహాయ పడుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా విక్రయించే వాహనాల్లో 90% వరకు అడాస్ కలిగి ఉంటాయని అంచనా.

అప్రమత్తం చేసే బ్రేకింగ్ వ్యవస్థ




- బ్రేక్ అసిస్ట్ సిస్టమ్ (బీఏఎస్) అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని నిలపడానికి, దూరాన్ని తగ్గించడానికి ఉపకరిస్తుంది. డ్రైవర్ బ్రేక్ వేయగానే పెడల్‌పై పడే ఒత్తిడిని బట్టి ఎమర్జెన్సీని గుర్తిస్తుంది. ఏబీఎస్‌కు ముందే ఇది అప్రమత్తమవుతుంది. ఇందులో మెకానికల్, ఎలక్ట్రానిక్ అనే రెండు రకాలుంటాయి.
- యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్): బ్రేక్ వేసినప్పుడు టైర్ లాక్ కాకుండా నియంత్రించేందుకు, ఆపే దూరాన్ని తగ్గించడానికి దోహదపడుతుంది.
- ఈబీడీ (ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్): ఒత్తిడిని ప్రతి చక్రానికీ వర్తింపజేస్తూ బ్రేకింగ్ ఫోర్స్‌ను నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది. ఏబీఎస్‌తో కలిసి పని చేస్తుంది.
- ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ (ఈఎస్‌సీ): వేగంలో స్థిరత్వం కల్పిస్తుంది. హఠాత్తుగా బ్రేక్ వేసినప్పుడు కారు పల్టీ కొట్టకుండా, పక్కనున్న వాహనాలను ఢీకొట్టకుండా (సైడ్ క్రాష్) దోహదపడుతుంది.

ఎక్కువ ఎయిర్ బ్యాగ్స్.. ఎంతో రక్షణ

ముందు, పక్క, వెనక వైపు నుంచి వాహనాలు ఢీకొన్నప్పుడు మిల్లీ సెకన్లలోనే ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకొని ప్రయాణికుల తల, ఛాతీ, మెడ భాగాలపై ఒత్తిడి పడకుండా, తీవ్ర గాయాల నుంచి రక్షణనిస్తాయి. కొన్ని కార్ల తయారీ సంస్థలు ముందు, వెనక కూర్చున్న వారికి రక్షణ కల్పించేలా సైడ్, కర్టెన్ ఎయిర్‌బ్యాగ్స్‌ను 2, 4, 6 చొప్పున అమర్చుతున్నాయి. ఢీకొట్టే వేగం, దిశను బట్టి అధునాతన సెన్సర్లు, ఇన్‌ఫ్లేషన్ మెకానిజం (గ్యాస్ విడుదల), క్రాష్ సెన్సర్లు, ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ (ఈసీయూ), వైరింగ్, కనెక్టర్లు ప్రభావవంతంగా పనిచేసి ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకునేలా చేస్తాయి. ఎయిర్‌బ్యాగ్ విచ్చుకోవాలంటే, ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించాలి. సరైన పొజిషన్‌లో కూర్చోవాలి. నిర్దిష్ట బరువు కలిగి ఉండాలి. 50 కిలోల బరువున్న వ్యక్తి కూర్చునే సీట్లో 5 కిలోల బరువున్న చిన్నారిని కూర్చోబెడితే తెరుచుకోకపోవచ్చు. ఎయిర్‌బ్యాగ్ ఒకసారి తెరుచుకుంటే, మళ్లీ కొత్తవి అమర్చుకోవాల్సిందే. మోడళ్లకు అనుగుణంగా ఇవి రూ.లక్షల్లో ఉంటాయి. కొన్ని బీమా సంస్థలు రీప్లేస్‌మెంట్ ఛార్జీలు భరిస్తుంటాయి. ఐఎస్ఓఎఫ్ఐఎక్స్ ఛైల్డ్ సీట్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని గమనించాలి.



టైర్లలో గాలి ఒత్తిడి ఎంతుంది?



కారు టైర్లలో గాలి పీడనంతో పాటు ప్రయాణించే ప్రదేశాల్లోని పరిస్థితులను నిరంతరం గమనిస్తూ ఉండాలి. భద్రతా కారణాల దృష్ట్యా టైర్ ట్రెడ్ లోతు కనీసం 3 మి.మీ ఉండాలి. కొత్త టైర్లు సాధారణంగా 8-9 మి.మీ. లోతు ఉంటాయి. నాణేన్ని ట్రెడ్‌లో ఉంచి లోతు తెలుసుకోవచ్చు. ట్రెడ్ గేజ్ తెలుసుకునే పరికరాలూ అందుబాటులో ఉన్నాయి.

టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (టీపీఎంఎస్): ఎప్పటికప్పుడు టైర్లపై ఒత్తిడిని గమనిస్తూ డ్రైవర్‌ను అప్రమత్తం చేసే విధానమిది. కొన్ని కార్లలో డ్యాష్ బోర్డులోనే టైర్లలోని పీడన స్థితి కన్పిస్తుంది.

ట్రాక్షన్ కంట్రోల్: తడి, మంచుతో నిండిన రహదారులు టైర్ల పట్టును తగ్గిస్తాయి. ప్రతి చక్రం వేగాన్ని పర్యవేక్షించడానికి, చక్రాలు జారకుండా నిరోధించడానికి ఇది సహాయపడుతుంది.

హిల్ హోల్డ్ అసిస్ట్: ఏటవాలు ప్రాంతాల్లో వాహనం వెనక్కి జారకుండా, నియంత్రణకు ఉపయోగపడుతుంది.

ఫాటిగ్యు మానిటరింగ్: డ్రైవర్ అలసటకు గురైనా, పరధ్యానంలో నడుపుతున్నా అప్రమత్తం చేస్తుంది.

క్రూయిజ్ కంట్రోల్ సిస్టమ్: యాక్సిలరేటర్ నొక్కకుండా స్థిరమైన వేగాన్ని నిర్వహించే విధానం.



'సాగర్'పై నిర్లక్ష్యానికి.. ఇది 'పచ్చని' సాక్ష్యం!

ఈ చిత్రాన్ని చూసి హైదరాబాద్ నగరం నడిబొడ్డున పచ్చని తోట బాగానే పెరిగిందని ఆశ్చర్యపోయేరు..! హుస్సేన్‌సాగర్‌లో పెరిగిన గడ్డి. సంజీవయ్య పార్క్, లేక్‌వ్యూ పార్క్ మధ్య పేరుకుపోయిన చెత్తను ఏళ్ల తరబడిగా తొలగించలేదు. దీంతో ఆ చెత్తపై గడ్డి మొలచి పచ్చనితోటలా కనిపిస్తోంది. ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్డు మార్గంలో పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగిస్తూ దుర్వాసన రాకుండా రసాయనాలు చల్లుతుండగా.. ఈ ప్రాంతంపై మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సందర్శకులు వాపోతున్నారు.

– ఈనాడు, హైదరాబాద్



రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర

- అందుకే జీవో నం.29 తీసుకువచ్చింది
- గ్రూప్-I ప్రధాన పరీక్షలు రీషెడ్యూలు చేయాలి: బండి సంజయ్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దుచేసే కుట్ర చేస్తోందని, దానిలో భాగంగానే జీవో నం.29 తీసుకొచ్చిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గ్రూప్-1 అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్-భారాస ఒక్కటేనని విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా వెళ్తే.. ఆ ర్యాలీలో భారాస నాయకులు చొరబడి విధ్వంసం సృష్టించేందుకు యత్నించారని దుయ్యబట్టారు. ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. శనివారమిక్కడ భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రంలో రిజర్వేషన్లు ఉంటాయా? రద్దుచేస్తారా? సీఎం స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచన మేరకు అశోక్‌నగర్‌లో నిరుద్యోగులకు సంఘీభావం తెలియజేసి, వారికి భరోసా కల్పించేందుకు వెళ్లాను. నిరుద్యోగులు పరీక్షల రద్దు కోరుకోవడం లేదు. మెయిన్స్‌ని రీషెడ్యూలు చేయాలంటున్నారు. వారం పదిరోజుల నుంచి ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయలేని పరిస్థితులున్నాయి.

రాహుల్‌గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు..

గతంలో అశోక్‌నగర్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ నిరుద్యోగులకు అండగా ఉంటానని చెప్పారు. ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం పరిపాలన చూపిస్తోంది. వసతిగృహాల్లోకి పోలీసులు వెళ్లి విద్యార్థినులను, గర్భిణులను కొట్టారు. నిరుద్యోగుల ఆందోళనలో భారాస భారీ విధ్వంస కుట్ర, భాజపా కార్యకర్తలను కేసుల్లో ఇరికించేందుకు ప్రణాళిక రచించింది. ప్రభుత్వం వెంటనే జీవో నం.29 రద్దుచేసి... నిరుద్యోగులపై దాడులకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. అరెస్టయిన కార్యకర్తలు, నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలి. సికింద్రాబాద్‌లో హిందూసంస్థలు ర్యాలీ చేస్తే పోలీసులు దాడులు చేస్తున్నారు. దీన్ని ఖండిస్తున్నాం. రేవంత్‌రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటే. కేటీఆర్ ఫామ్‌హౌస్ ఎందుకు కూల్చలేదు. డ్రగ్స్‌కేసు ఏమైంది? ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్ పేరు వచ్చింది. కాళేశ్వరం కేసు ఏమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినీ అవినీతి కేసుల్లో జైలుకు పంపించలేదు. అశోక్‌నగర్ వెళ్తే నిరుద్యోగులు రాళ్లతో కొడతారన్న భయంతో కేటీఆర్ వెళ్లలేదు. భారాస మైలేజ్ కోసం తిప్పలు పడుతోంది. జేసీబీ పెట్టినా ఇక ఆ పార్టీ లేచి నిలబడదు. 2028లో తెలంగాణలో మా ప్రభుత్వం వస్తుంది" అని సంజయ్ తెలిపారు.

పోలీసుల నిఘా నీడలో 'మెయిన్స్'

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 563 గ్రూప్-1 సర్వీసుల పోస్టుల భర్తీకి ఈ నెల 21 నుంచి 27 వరకు జరగనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు హైదరాబాద్ నగర పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేస్తున్న తరుణంలో.. పరీక్షల నిర్వహణ, ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాల తరలింపులో ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చూడాలని నిర్ణయించారు. ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద ఎస్సైల నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఉంచనున్నారు. అదనంగా పోలీస్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తరచూ సందర్శిస్తుంది. పర్యవేక్షణకు 3 కమిషనరేట్లలో ఒక్కో డీసీపీని నోడల్ అధికారిగా నియమించారు. నగర పరిధిలో 46 కేంద్రాల్లో 31,383 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు తరలించే వాహనాలకు టీజీపీఎస్సీ తొలిసారిగా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఉపయోగిస్తోంది. వీటిని టీజీపీఎస్సీ ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి అభ్యర్థుల్ని కేంద్రంలోకి అనుమతిస్తారు. 1.30 తర్వాత గేట్లు మూసేస్తారు. పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి.

ప్రజాజీవనానికి భంగం కలిగించినందుకే లాఠీఛార్జి: డీజీపీ

హైదరాబాద్‌లో ప్రజాజీవనానికి భంగం కలిగించినందుకే నిరసనకారులపై లాఠీఛార్జి చేయాల్సి వచ్చిందని డీజీపీ డా.జితేందర్ పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వులున్నా ఈ తరహా ఆందోళనలు చేయడం సరికాదన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌ను రీషెడ్యూల్ చేయాలంటూ అశోక్‌నగర్‌లో పలువురు అభ్యర్థులు ఆందోళన నిర్వహించిన క్రమంలో పోలీసులు లాఠీఛార్జి జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై డీజీపీ తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశాం. ఎవరైనా సమస్యలు సృష్టించాలని చూస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఈ నెల 21 నుంచి పోలీస్ అమరుల సంస్మరణ కార్యక్రమాలు జరుపుతాం' అని తెలిపారు.

గ్రూప్-I అభ్యర్థుల నిరసన ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

అక్కడికి చేరుకున్నారు. అశోక్‌నగర్‌లో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం సచివాలయానికి వెళ్లాల్సిందేనని సంజయ్ పిలుపునివ్వడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇటు పోలీసులు, అటు అభ్యర్థులు, కార్యకర్తలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను దారిమళ్లించారు. పలు కూడళ్లను మూసివేశారు. పోలీసులతో వాడీవేడి వాదోపవాదాల అనంతరం అభ్యర్థులు, ఏబీవీపీ, భాజపా కార్యకర్తలు సంజయ్‌తో కలిసి పాదయాత్రగా సచివాలయ ముట్టడికి బయలుదేరారు. వారిని పోలీసులు అదుపులో తీసుకుని బలవంతంగా వ్యాన్‌లలో ఎక్కించారు. సంజయ్‌ను అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఇందిరాపార్కు చౌరస్తా, రామకృష్ణ మఠం నుంచి సంజయ్, అభ్యర్థులు, కార్యకర్తలు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, భాజపా నేతలు కాసం వెంకటేశ్వర్లు, రాణిరుద్రమదేవి, బండారు విజయలక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తదితరులు సచివాలయం వైపు దూసుకెళ్లారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయనకు నివాళులు అర్పించిన కేంద్ర మంత్రి.. అక్కడ రోడ్డుపై బైఠాయించారు. ఆయనకు మద్దతుగా గ్రూప్-1 అభ్యర్థులు, ఏబీవీపీ కార్యకర్తలు సచివాలయం ఎదుట కూర్చోవడంతో ట్రాఫిక్ మొత్తం స్తంభించింది. అభ్యర్థులు, భాజపా నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని భాజపా రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. అదే సమయంలో వందల మంది సచివాలయం వద్దకు దూసుకెళ్లగా.. వారిని అదుపులోకి తీసుకుని నగరంలోని వేర్వేరు ఠాణాలకు తరలించారు. పరుగులు పెడుతున్నవారినీ పట్టుకొని.. వ్యాన్‌లలో ఎక్కించారు. ఈ సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది.



సచివాలయం వద్ద బైఠాయించిన గ్రూప్–1 అభ్యర్థులు

భారాస, భాజపా శ్రేణుల బాహాబాహీ..

భారాస నేతలు వి.శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, దాసోజు శ్రవణ్ తదితరులు, కార్యకర్తలు విద్యార్థులకు మద్దతు ప్రకటించడానికి రాగా.. వారిని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఏబీవీపీ, భాజపా కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరు పార్టీల శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. ఓ దశలో బాహాబాహీకి దిగారు. దాసోజు శ్రవణ్ తదితర నేతలను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేస్తున్న సమయంలో.. ఒకరిద్దరు భారాస కార్యకర్తలు భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. భారాస నాయకులను అరెస్టు చేసి తరలిస్తున్న వాహనాన్ని భాజపా కార్యకర్తలు అడ్డుకున్నారు. తమ పార్టీ, నాయకుల గురించి అనుచితంగా మాట్లాడినవారిని అప్పగించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్‌లు అంబేడ్కర్ విగ్రహం నుంచి పాదయాత్రగా బీఆర్‌కే భవన్ వద్దకు రాగానే పోలీసులు అరెస్టు చేసి బండ్లగూడ ఠాణాకు తరలించారు.

కుటుంబం విడిపోతోంది... కమతం చిన్నబోతోంది

(మొదటి పేజీ తరువాయి)

ఈ వివరాలతో నివేదికను సిద్ధం చేస్తోంది. దీని ప్రకారం ఏడేళ్ల వ్యవధి (2015-22)లో సన్న, చిన్నకారు కమతాల సంఖ్య 52.49 లక్షల నుంచి 64.46 లక్షలకు పెరిగినట్లు వెల్లడైంది. అర హెక్టారుకన్నా తక్కువ కమతం కలిగిన వారి సంఖ్య 31.6 శాతం పెరిగింది. ఇందులో ముఖ్యాంశాలను 'ఈనాడు' సేకరించింది. ఆ వివరాలివీ..

70.59 లక్షల కమతాలు.. 62.12 లక్షల హెక్టార్లు

- 2015-16లో రాష్ట్రంలో మొత్తం 59.47 లక్షల భూ కమతాలు ఉండగా.. 2021-22 నాటికి వాటిసంఖ్య 70.59 లక్షలకు పెరిగింది. 29 శాతం పెరుగుదల నమోదైంది. ఈ మధ్య కాలంలో మొత్తం కమతాల భూమి సైతం 59.71 లక్షల హెక్టార్ల నుంచి 62.12 లక్షల హెక్టార్లకు పెరిగింది.
- ఒక హెక్టారు (2.47 ఎకరాలు) లోపు భూమి కలిగిన రైతులను సన్నకారు రైతులని, 1 నుంచి 2 హెక్టార్ల భూమి కలిగిన వారిని చిన్న రైతులని అంటారు.
- రాష్ట్రంలో ఒక హెక్టారు కన్నా తక్కువ భూమి కలిగిన కమతాల యజమానులు 48.46 లక్షలకు పైగా ఉన్నారు. వీరి మొత్తం భూమి 20.66 లక్షల హెక్టార్లు మాత్రమే ఉంది. 2015-16లో వీరి సంఖ్య 38.40 లక్షలు మాత్రమే.
- వీరిలో అర హెక్టారుకన్నా తక్కువ కమతం కలిగిన వారు 2015లో 23.16 లక్షల మంది కాగా.. 2022 నాటికి 30 లక్షల మందికి పైగా పెరిగారు. అంటే 31.6 శాతం పెరుగుదల నమోదైంది.
- 4 నుంచి 5 హెక్టార్ల కమతం కలిగిన రైతులు 2015లో 62,177 మంది ఉంటే 2021-22 నాటికి వీరి సంఖ్య 47,767కి (23.2 శాతం) తగ్గింది. ఈ 23.2 శాతం మంది చిన్న కమతాల్లోకి చేరిపోయారు. వీరి చేతిలో ఉన్న కమతాల మొత్తం భూమి 2.74 లక్షల హెక్టార్ల నుంచి 2.10 లక్షల హెక్టార్లకు పడిపోయింది. అలాగే 5 నుంచి 7 హెక్టార్ల కమతాల సంఖ్య 49,664 నుంచి 39,535కు పడిపోయింది.

తగ్గని భూస్వాములు..

- 10 హెక్టార్లకు పైగా అంటే కనీసం 25 ఎకరాలకు పైగా కమతం కలిగిన భూస్వాముల సంఖ్య పెద్దగా తగ్గలేదు. వీరి కమతాలు ఏడేళ్ల క్రితం 9,465 ఉంటే ఇప్పుడు స్వల్పంగా 9,398కి మాత్రమే తగ్గింది. అయితే వీరి చేతిలో ఉన్న భూమి మొత్తం పరిమాణం 1.34 లక్షల హెక్టార్ల నుంచి 1.64 లక్షల హెక్టార్లకు పెరగడం గమనార్హం. అంటే ఏడేళ్ల క్రితం పాతిక ఎకరాలకు పైగా భూ కమతం కలిగిన వారు ఈ మధ్యకాలంలో 21.9 శాతం భూమిని అదనంగా కొనుగోలు చేశారు.
- 20 హెక్టార్లకు పైగా ఉన్న కమతాలు 2015-16లో 818 మాత్రమే కాగా.. ఆయా యజమానుల చేతుల్లో 24,359 హెక్టార్లు ఉంది. 2021-22 నాటికి ఈ కమతాల సంఖ్య 1351కి (65.2%), భూమి 59,599 హెక్టార్లకు పెరిగింది. 144% పెరుగుదల నమోదైంది. ధనవంతులైన భూస్వాములు వారికి ఉన్నదానికి తోడు అదనంగా భూమిని కొనడం వల్ల పెద్ద కమతాల మొత్తం పరిమాణం 21.9 శాతం పెరిగినట్లు అంచనా. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తనకు నగరంలో ఉన్న భూమిని అమ్మితే రూ.10 కోట్లకు పైగా నగదు చేతికొచ్చింది. దానితో నల్గొండ జిల్లాకు వెళ్లి మారుమూల ప్రాంతంలో పదుల ఎకరాల భూమిని కుటుంబ సభ్యుల పేర్లతో కొన్నారు. వీరికి అప్పటికే ఉన్న పాత వ్యవసాయ భూములతో కలిపితే వీరి పెద్ద కమతాలు మరింత పెద్దవి అయినట్లు తేలింది. పెద్ద కమతాల మొత్తం పరిమాణం గణనీయంగా పెరుగుతోంది.
- భూమి పంపకాలు పేద, దిగువ మధ్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఎక్కువగా ఉండగా.. ఎగువ మధ్య, ధనవంతుల కుటుంబాల్లో పెద్దగా లేదని గణాంకాలు వివరిస్తున్నాయి.

రాష్ట్రంలో భూ కమతాల ముఖచిత్రం

విస్తీర్ణం	కమతాలు	మొత్తం భూమి (హెక్టార్లు)
హెక్టారులోపు	17,97,758	13,08,587
1 నుంచి 2	16,00,003	22,36,901
2 నుంచి 3	3,94,283	9,20,580
3 నుంచి 4	1,10,221	3,76,796
4 నుంచి 5	47,767	2,10,287
5 నుంచి 10	51,345	3,36,616
10 నుంచి 20	8,047	1,04,428
20కి పైగా	1,351	59,599

ప్రభుత్వ పథకాల ప్రభావం ఇలా..

- గత ప్రభుత్వంలో అమలైన రైతుబీమా (రూ.5 లక్షలు) వర్తించాలనే లక్ష్యంతో కుటుంబంలో ప్రతి ఒక్కరి పేరుతో ఎంతో కొంత భూమిని రిజిస్ట్రేషన్ చేశారని, దీంతో కమతాలు పెరిగాయని సర్వేలో గుర్తించారు.
- రైతుబంధు పథకం కింద గత ప్రభుత్వం ఎకరానికి ఏడాదికి రూ.10 వేలు ఇచ్చింది. పట్టా పుస్తకం ఉన్న వారి ఖాతాలోనే ఈ సొమ్ము పడుతుండడంతో.. తోబుట్టువులు తప్పనిసరిగా తమ భాగాలను తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీంతో కమతాల సంఖ్య పెరిగిందని అధికారవర్గాలు తెలిపాయి.

మూసీ పేరిట లూటీకే మేం వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క పేదవాడి ఇల్లు కూలినా అడ్డుకుంటా. నా చిన్నతనంలో మూసీ సమీపంలోని నింబోలిఅడ్డ, ముజాంజాహీ మార్కెట్ సమీపంలోనే నివసించా' అని అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో నాగోలు వద్ద నిర్మించిన భారీ మురుగు శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీని) శనివారం ఆయన పార్టీ నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "మూసీ పక్కన 11,000 ఇళ్లు కూల్చి లక్ష మందిని రోడ్డు పాల్జేయకుండా, ఇరువైపులా గోడ కట్టి అభివృద్ధి చేయొచ్చు. ఇమ్లీబన్, మెట్రో స్టేషన్లు సైతం మూసీలోనే ఉన్నాయి. అభివృద్ధి పేరిట మూసీలో మాల్స్ కట్టొచ్చు కానీ, పేదల ఇళ్లు ఉండకూడదనే పద్ధతి సరికాదు. వారసత్వ సంపదను కాపాడుకుంటూనే మూసీ నదిని అభివృద్ధి చేయాలి. నది పరీవాహక ప్రదేశంలో నివసిస్తున్న బాధితులకు మేమే న్యాయ సహాయం అందిస్తాం.

రూ.లక్షన్నర కోట్లు అవసరమనడం మూర్ఖత్వమే

గత కాంగ్రెస్, తెదేపా ప్రభుత్వ పాలనలోనే మూసీ మురుగు కూపంగా మారింది. భారాస పదేళ్ల పాలనలో కేసీఆర్ నది పునరుజ్జీవానికి ఎంతో కృషి చేశారు. నగర వ్యాప్తంగా 54 నాలాల ద్వారా నదిలోకి చేరుతున్న 2000 ఎంఎల్‌డీల మురుగును శుద్ధి చేసేందుకు రూ.3,866 కోట్లతో నాగోలు, అంబర్‌పేట, ఉప్పల్, మల్కాజిగిరి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కోకాపేట, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలో మురుగు శుద్ధి కేంద్రాలు నిర్మాణమయ్యాయి. దేశంలోనే అతి పెద్దదైన నాగోలులోని ఎస్టీపీ ద్వారా రోజుకు 328 ఎంఎల్‌డీల నీరు శుద్ధవుతుంది. ఈ కేంద్రాలన్నీ ట్రయల్ రన్ పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మూసీకి ఇరువైపులా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించి ట్రాఫిక్ సమస్యలకు చెక్‌పెట్టాలని భావించాం. దాంతో పాటు కాళేశ్వరం ద్వారా గోదావరి నీటిని కొండ పోచమ్మసాగర్ నుంచి నదిలోకి పారించి స్వచ్ఛమైన నీటిని నగర ప్రజలతో పాటు నల్గొండ జిల్లా రైతులకూ అందించేందుకు రూ.1,100 కోట్ల ప్రాజెక్టుకు ఆమోదం తెలిపాం. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పునరుజ్జీవానికి కొత్తగా చేయాల్సిందేమీ లేదు. మేము నిర్మించిన ఎస్టీపీలను ప్రారంభించి చక్కగా నిర్వహిస్తే సరిపోతుంది. పునరుజ్జీవానికి రూ.పాతిక వేల కోట్లు సరిపోతాయి. కానీ రూ.లక్షన్నర కోట్లు పెడతాననడం ప్రజాధనాన్ని లూటీ చేయడమే. నమామి గంగే ప్రాజెక్టులో 2,400 కిలోమీటర్ల పొడవున గంగా నది ప్రక్షాళనకు రూ.40 వేల కోట్లు సరిపోతుండగా, కేవలం 57 కిలోమీటర్ల మూసీ ప్రక్షాళనకు రూ.లక్షన్నర కోట్లు అవసరమనడం మూర్ఖత్వమే.

బడుల్లో చాక్‌పీసుల్లేవ్.. బస్తీ దవాఖానాల్లో మందుల్లేవ్..

అన్నదాతలకు రుణమాఫీ లేదు.. ఆడపడుచులకు తులం బంగారానికి దిక్కు లేదు.. బడుల్లో చాక్‌పీసుల్లేవ్.. బస్తీ దవాఖానాల్లో మందుల్లేవ్.. పేదలకు పింఛన్లు లేవ్.. ఆరు గ్యారంటీలు అమలు చేయలేని ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్లు పెట్టి మూసీ నదిని అభివృద్ధి చేస్తానంటే నమ్మేందుకు జనాలు సిద్ధంగా లేరు. కర్ణాటక సీఎం కుంభకోణంలో ఇరుక్కోవడంతో.. దిల్లీలో ఉన్న కాంగ్రెస్ పెద్దలకు డబ్బు మూటలు పంపేందుకు ఇప్పుడు తెలంగాణ ఒకటే ఆధారంగా కనిపిస్తోంది. భారాస మూసీ సుందరీకరణ చేపట్టినా.. పేదల ఇళ్లు కూల్చలేదు" అని కేటీఆర్ అన్నారు. ఆయన వెంట మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబితారెడ్డి, తలసాని, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, కృష్ణారావు, వివేకానంద్ తదితరులు ఉన్నారు.

డ్రామాలు ఆపి.. గ్రూప్-I పరీక్షలు వాయిదా వేయండి: కేటీఆర్

నాచారం, న్యూస్‌టుడే: బండి సంజయ్‌కు ప్రశ్నపత్రాలు లీక్ చేయడమే తప్ప.. పోటీ పరీక్షలు, నిరుద్యోగుల కష్టాల గురించి ఏం తెలుసని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. శనివారం తార్నాకలోని ఐఐసీటీలో కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ డ్రామాలు ఆపి తక్షణమే గ్రూప్-1 అభ్యర్థులతో చర్చలు జరిపాలని, పరీక్షలను కొంతకాలం వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కనీసం సుప్రీంకోర్టు తీర్పు వచ్చే వరకైనా వేచిచూడాలన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న గ్రూప్-1 అభ్యర్థులపై పోలీసులు లాఠీఛార్జి చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం దుర్మార్గమన్నారు.

సీఎంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, న్యూస్‌టుడే: రాజీవ్ సద్భావన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేటీఆర్, హరీశ్‌రావులపై సంస్కారహీనంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సీఎంపై తక్షణం క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీజీపీని కోరారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ నేతలతో బుల్‌డోజర్లు నడిపించి కేటీఆర్, హరీశ్‌రావులను చంపుతానని రేవంత్‌రెడ్డి అంటున్నారు. ఇది సీఎం పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడే భాషేనా? సీఎం పదవిలో ఉండి నిజనిర్ధారణ కమిటీ వేస్తా అంటున్నారు? అది పౌర సమాజం వేస్తుంది.. సీఎం కాదు. పాలించడం చేతగాకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పి పదవి నుంచి దిగిపోవాలి. మూసీ పేరుతో జరిగే దోపిడీపై ప్రజలు కచ్చితంగా తిరగబడతారు. రేవంత్ పదవి పోతుందని బండి సంజయ్ ఎందుకు బాధపడుతున్నారు?' అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

జీవో 29పై చర్చలు ప్రారంభించాలి: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జీవో 29పై ముఖ్యమంత్రి, సీఎస్ వెంటనే చర్చలు ప్రారంభించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో రాజకీయమేంటని ప్రశ్నించారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జీవో 29 తెచ్చారు. ఉద్యమిస్తున్న నిరుద్యోగులకు భారాస అండగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

అమోయ్‌కుమార్‌కు ఈడీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)


గత ప్రభుత్వ హయాంలో ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో జరిగిన భూకేటాయింపుల అంశంలో విచారించే అవకాశమున్నట్లు సమాచారం. అప్పట్లో రూ.వందల కోట్ల విలువైన భూముల కేటాయింపులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ, భూదాన్ భూములను అక్రమంగా బదలాయించారనే అభియోగాలున్నాయి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో 40 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని ఇతరులకు బదలాయించిన విషయంలోనూ పెద్దఎత్తున చేతులు మారినట్లు అప్పట్లో ఆరోపణలు వినిపించాయి.

ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు ఈ ప్రశ్నలు వేసుకోండి



ఆన్‌లైన్‌లో మీరు ఏ కంటెంట్‌ను చూస్తున్నా లేదా చదువుతున్నా ముందుగా రెండు ప్రశ్నలు వేసుకోండి. ప్రస్తుతం నేనెదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు ఇది ఉపయోగపడుతుందా? లేదా నా ఉద్యోగ, వ్యక్తిగత జీవితాలను మెరుగుపర్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను దీన్నుంచి నేర్చుకోవచ్చా అని ప్రశ్నించుకోండి. దీనివల్ల మీరు అనాలోచితంగా స్క్రోలింగ్ చేసే సమయం తగ్గుతుంది.

– డీకే ఖుష్, డిజిటల్ కంటెంట్ రైటర్



'సీతారాం ఏచూరి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్థసారథి, విద్యాసాగర్, ప్రబీర్ పుర్కయాస్థ, తెలకపల్లి రవి

ఒకే దేశం-ఒకే ఎన్నిక రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

న్యూస్ క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కయాస్థ

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర సర్కారు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని న్యూస్ క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కయాస్థ అన్నారు. శనివారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో.. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. "ఎన్నికల నిర్వహణ వ్యయం తగ్గిస్తామంటూ ప్రజల్లో భ్రమలు కలిగిస్తున్నారు. కొత్త విధానాన్ని అమలుచేశాక ఏదైనా ఒక రాష్ట్రంలో ప్రభుత్వం కూలిపోతే పరిస్థితి ఏంటి? భాజపా నానాటికీ బలహీనపడుతున్న నేపథ్యంలోనే కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది" అని పిలుపునిచ్చారు. అనంతరం 'సిద్ధాంతకర్త-నిబద్ధ నేత సీతారాం ఏచూరి' పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సదస్సులో రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, కార్యదర్శి సి.రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.



వర్షమొక్కటే చాలు.. ఎండ వద్దంటే ఎలా?

ఒక పుష్పం వికసించడానికి వర్షం ఎంత అవసరమో ఎండ కూడా అంతే ముఖ్యం. ఎండ వేడిమిని భరించలేనని పువ్వు అనుకుంటే దానికి మనుగడ ఉంటుందా? అదే విధంగా మనుషులు ఎదగాలనుకుంటే ప్రశంసలతో పాటు విమర్శలకూ సిద్ధంగా ఉండాలి. నిర్మాణాత్మక విమర్శలను స్వీకరిస్తేనే మిమ్మల్ని తీర్చిదిద్దుకోగలరు.

– హ్యారీ వెన్‌హామ్, పర్సనల్ లైఫ్ కోచ్



రాహుల్‌గాంధీకి కండువా కప్పి స్వాగతం పలుకుతున్న భట్టి విక్రమార్క


రాంచీలో రాహుల్‌గాంధీకి భట్టి స్వాగతం

ఈనాడు, హైదరాబాద్: ఝార్ఖండ్ పర్యటనలో ఉన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. శనివారం రాంచీకి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి ఘన స్వాగతం పలికారు. ఆ రాష్ట్ర ఎన్నికల కోసం ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడిగా భట్టి పనిచేస్తున్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములైన కాంగ్రెస్, ఝార్ఖండ్ ముక్తి మోర్చా, ఆర్జేడీ పార్టీల నేతలతో ఆయన శనివారం సమన్వయ సమావేశం నిర్వహించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆశిస్తున్న స్థానాలపై ఆ పార్టీల నేతలతో రాహుల్ చర్చించారు. ఏఐసీసీ సీనియర్ పరిశీలకులు అధీర్‌రంజన్ చౌధరి, తారిఖ్ అన్వర్‌తో పాటు ఝార్ఖండ్ పీసీసీ నేతలు పాల్గొన్నారు.

అమరావతి పునర్నిర్మాణానికి శ్రీకారం

- మూడేళ్లలోగా పూర్తి చేయాలని
- ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఐదు కోట్ల ప్రజల ఆశల్ని, ఆకాంక్షల్ని మోస్తున్న అమరావతిని అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుతామని ఆయన రాజధాని రైతుల హర్షాతిరేకాల మధ్య ప్రకటించారు. సీడ్‌యాక్సెస్ రోడ్డు పక్కనే జీ+7 విధానంలో నిర్మిస్తున్న సీఆర్‌డీఏ కార్యాలయ భవనం పనుల్ని ప్రారంభించడం ద్వారా రాజధాని పునర్నిర్మాణానికి చంద్రబాబు శనివారం శ్రీకారం చుట్టారు. రాజధాని రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ.. 'విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణం దాదాపు కొలిక్కి వచ్చేసింది, తూర్పు బైపాస్ నిర్మాణం కూడా త్వరగా పూర్తిచేస్తే చిన్న రింగ్‌రోడ్డు ఏర్పాటవుతుంది. అమరావతికి అవుటర్ రింగ్‌రోడ్డు కూడా వస్తుంది. రాజధానిలో ప్రధాన రహదారుల్ని దానితో అనుసంధానం చేస్తేనే ఈ ప్రాంతంఅభివృద్ధి చెందుతుంది. దాని నిర్మాణం వల్ల కేంద్ర ప్రభుత్వానికీ ఆదాయం పెరుగుతుందని ఆ శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి చెప్పి ఒప్పించాను' అని చంద్రబాబు తెలిపారు.



అమరావతికి దేశంలోని 10 అగ్రశ్రేణి యూనివర్సిటీలు, పది టాప్ ఆస్పత్రులు, 10 అత్యుత్తమ పాఠశాలలు, 10 టాప్ హోటల్స్‌ను తీసుకొస్తామని ప్రకటించారు. రాజధానిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ఇతర ఉద్యోగుల నివాసం కోసం చేపట్టిన అపార్ట్‌మెంట్ టవర్లు, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ముఖ్య కార్యదర్శుల స్థాయి అధికారుల కోసం భవంతుల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలకు దీటుగా అమరావతి చుట్టుపక్కల ప్రాంతాల్ని కలుపుకొని మహానగరంగా అభివృద్ధి చెందాలని, ఇక్కడి కోటి జనాభా ఉండాలని ఆకాంక్షించారు.

అమరావతి పేరు సూచించింది రామోజీరావే

రాజధానికి అమరావతి అన్న పేరును రామోజీ గ్రూప్ సంస్థల అధినేత దివంగత రామోజీరావు సూచించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 'ఒకరోజు రామోజీరావు నాకు ఫోన్ చేశారు. ఈ ప్రాంత చారిత్రక నేపథ్యంపై చాలా పరిశోధన చేయించానని, రాజధానికి అమరావతి పేరు సముచితంగా ఉంటుందని ఆయన సూచించారు. ఆ పేరు నాకు బాగా నచ్చింది. నా పక్కన ఉన్నవారికి చెబితే వారూ బాగుందన్నారు. ప్రజల ముందు పెడితే నూటికి నూరు శాతం ఆమోదం లభించింది. ఇది దేవతల రాజధాని' అని పేర్కొన్నారు. '2019కి ముందు రాజధాని పనుల్ని రూ.42,519 కోట్ల వ్యయంతో చేపట్టాం. గత ప్రభుత్వం ఐదేళ్లూ పనులు నిలిపివేయడంతో అంచనా వ్యయం పెరిగింది. ఇప్పుడు మరో రూ.7 వేల కోట్ల అదనపు భారం పడుతోంది. రాజధానికి జీవం పోయడానికి, ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని చంద్రబాబు తెలిపారు.

సుద్దాల హనుమంతు పాటలతో ప్రేరణ పొందా

- జస్టిస్ నగేశ్ భీమపాక
- అరుణోదయ నాగన్నకు సుద్దాల జాతీయ పురస్కారం ప్రదానం



అరుణోదయ నాగన్న, లక్ష్మి దంపతులతో జస్టిస్ నగేశ్. చిత్రంలో భారతి, అశోక్‌తేజ, విమల, సూర్య ధనుంజయ్

రాంనగర్, న్యూస్‌టుడే: ప్రజా గాయకుడు సుద్దాల హనుమంతు రాసిన పాటలతో తాను ప్రేరణ పొందానని.. ఆయన తనకు ఆత్మబంధువుతో సమానమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక అన్నారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో.. సుద్దాల హనుమంతు- జానకమ్మ జాతీయ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ప్రజా గాయకుడు అరుణోదయ నాగన్నకు జస్టిస్ నగేశ్ ఈ అవార్డును ప్రదానం చేశారు. అనంతరం నాగన్న, లక్ష్మి దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ మాట్లాడుతూ.. తాను 7వ తరగతి చదువుతున్న సమయంలో సుద్దాల హనుమంతు రాసిన 'పల్లెటూరి పిల్లగాడా.. పశువులు కాసే మొనగాడా' పాటను పాడి బహుమతి సాధించినట్లు గుర్తు చేసుకున్నారు. చీమలు శ్రమజీవులు అని.. వాటిని స్ఫూర్తిగా తీసుకొని ఎంత కష్టమొచ్చినా మనమంతా జీవన ప్రయాణంలో ముందుకు సాగాలని సూచించారు. అరుణోదయ నాగన్న కూడా తన జీవితంలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా ప్రజా సమస్యలే ఇతివృత్తంగా చేసుకుని నాగన్న పాటలు పాడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ పిల్లలమర్రి రాములు, ఓయూ ఆచార్యురాలు సూర్య ధనుంజయ్, రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, రచయిత డా. పోరెడ్డి రంగన్న, అశోక్‌తేజ సతీమణి విమల, సోదరి భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు సభ్యులతో విద్యా కమిషన్ సలహా కమిటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ విద్యా కమిషన్‌కు విధానపరమైన నిర్ణయాలు, ఇతర అంశాల్లో సహకరించేందుకు ఆరుగురు సభ్యులతో సలహా కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా ఆచార్య జి.హరగోపాల్, ఆచార్య కె.మురళి మనోహర్(కేయూ, విశ్రాంత), ఆచార్య కె.వెంకటనారాయణ(కేయూ, విశ్రాంత), ఆచార్య సూరేపల్లి సుజాత(శాతవాహన వర్సిటీ), ఆర్.వెంకట్‌రెడ్డి(ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్), కె.ఎం.శేషగిరి(యూనిసెఫ్, విద్యానిపుణుడు) నియమితులయ్యారు.

మేడ్చల్ జిల్లాకు డిప్యుటేషన్‌పై మరో ఐదుగురు టీచర్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు డిప్యుటేషన్లపై ఉపాధ్యాయులు రాక కొనసాగుతోంది. ఇటీవల ఏడుగురు ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఐదుగురికి అనుమతి ఇస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మరో వైపు దొడ్డిదారిన ఇచ్చిన ఉత్తర్వులు బహిర్గతం అవుతుండటంతో విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తూ జిల్లా విద్యాశాఖ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయిన పీజీఏ, స్టోన్ క్రాఫ్ట్ ప్రతినిధులు

హైదరాబాద్ దక్షిణాన 200 ఎకరాల్లో గోల్ఫ్ సిటీ

- స్టోన్ క్రాఫ్ట్ సంస్థతో కలిసి ముందుకొచ్చిన పీజీఏ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ నగరానికి దక్షిణాన విస్తారమైన గోల్ఫ్ సిటీ నిర్మించేందుకు ప్రొఫెషనల్ గోల్ఫర్స్ అసోసియేషన్ ఆఫ్ అమెరికా(పీజీఏ) స్థానిక భాగస్వామి స్టోన్ క్రాఫ్ట్ సంస్థతో కలిసి ముందుకు వచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఫ్రిస్కో ప్రధాన కేంద్రంగా నడుస్తున్న పీజీఏ ప్రతినిధి బృందం, స్టోన్ క్రాఫ్ట్ సభ్యులు శనివారం సచివాలయంలో ఆయన్ను కలిసి భేటీ అయ్యారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తే గోల్ఫ్ కోర్సులు, నివాస సముదాయాలు, హోటళ్లు, వినోద పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి పీజీఏ సంసిద్ధత తెలిపింది. ఈ సంస్థ ప్రస్తుతం ముంబయిలో షాపూర్జీ పల్లోంజి సంస్థతో కలిసి గోల్ఫ్ సిటీ నిర్మిస్తోంది. ఇక్కడ స్టోన్ క్రాఫ్ట్ భాగస్వామ్యంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించింది. దాదాపు 200 ఎకరాల్లో 18 హోల్ ప్రామాణిక గోల్ఫ్ కోర్సును ఏర్పాటు చేస్తుంది. ఇది వినియోగంలోకి వస్తే ఈ తరహా కోర్సు దక్షిణ భారత్‌లోనే మొట్టమొదటిది అవుతుంది. దీని ద్వారా వచ్చే పదేళ్లలో 10 వేల మందికి ఉపాధి కల్పించవచ్చు. ఈ సంస్థలు సీఎం రేవంత్‌రెడ్డి మానస పుత్రిక ఫోర్త్ సిటీలో ఎటువంటి కాలుష్యం వెలువడని 'నెట్-జీరో సిటీ'ని నిర్మిస్తాయి' అని తెలిపారు. సమావేశంలో స్టోన్ క్రాఫ్ట్ సీఈవో కీర్తి చిలుకూరి, అలోక్ తివారీ, పీజీఏ ప్రతినిధులు టిమ్‌లాట్, అలెక్స్ హే, డేవిడ్ బ్లమ్, కెన్ సాగర్, రాధాకిశోర్ పాల్గొన్నారు.

కర్ణాటకలో నరబలి?

మైసూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం నంజనగూడుకు సమీపంలోని హుల్లహళ్లిలో సదాశివ(54) అనే భవన నిర్మాణ కార్మికుడు హత్యకు గురయ్యాడు. అతణ్ని అపహరించుకుని వెళ్లిన దుండగులు ఒక పొలం గట్టున గొంతు కోసి- నరబలి ఇచ్చినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహం వద్ద క్షుద్రపూజల్లో ఉపయోగించే వస్తువులతో పూజలు చేశారు.

మీరు కాళ్లు మొక్కితే.. నేనూ మొక్కుతా!



"తల్లిదండ్రులు, గురువుల కాళ్లకు మాత్రమే నమస్కారం చేయాలి. నా కాళ్లకు ఎవరైనా మొక్కితే.. తిరిగి నేనూ అదేవిధంగా చేస్తా'.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పదేపదే చెబుతున్న మాట ఇది. ఆయన చెప్పినట్లే శనివారం ఏకంగా చేసి చూపించారు. రాజధానిలో సీఆర్‌డీఏ కార్యాలయ నిర్మాణ పనుల్ని ప్రారంభించేందుకు వచ్చిన చంద్రబాబు కాళ్లకు ఓ వ్యక్తి మొక్కారు. వెంటనే చంద్రబాబు 'నన్ను కూడా మీ కాళ్లకు నమస్కారం చేయమంటారా' అంటూ... కొంచెం ఒంగి ఆ వ్యక్తి కాళ్లు పట్టుకోబోయారు. దాంతో ఆ వ్యక్తి కంగుతిన్నారు.

– ఈనాడు, అమరావతి

చంద్రబాబును కలిసిన ఏపీ బార్ కౌన్సిల్ బృందం

వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షలు అందజేత

ఈనాడు, అమరావతి: ఏపీ బార్ కౌన్సిల్ బృందం శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన నివాసంలో కలిసింది. వరద బాధితులను ఆదుకునే నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల డీడీని అందజేసింది. ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, వైస్ ఛైర్మన్ ఎస్.కృష్ణమోహన్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఎ.రామిరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు, బార్ కౌన్సిల్ పూర్వ ఛైర్మన్ గంటా రామారావు తదితరులు.. న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. మృతి చెందిన 905 మంది న్యాయవాదుల కుటుంబసభ్యులకు ప్రభుత్వ వాటాగా మ్యాచింగ్ గ్రాంట్ కింద ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చెల్లించాలని, ఏపీ న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఇవ్వాలని, ఏపీ బార్ కౌన్సిల్ కోసం అమరావతిలోని జస్టిస్ సిటీలో 5 ఎకరాలు ఇవ్వాలని, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం హైకోర్టులో ప్రస్తుతం ఉన్న 37 మంది న్యాయమూర్తుల సంఖ్యను 62కి పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతిలో జూనియర్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చేందుకు అడ్వకేట్స్ అకాడమీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నందుకు, జూనియర్ న్యాయవాదులకు రూ.10వేల స్టైఫండ్‌ను ప్రకటించినందుకు సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

శారదా పీఠానికి భూ కేటాయింపులు రద్దు

- వచ్చే కేబినెట్‌లో ఆమోదం
- అప్పట్లో అప్పనంగా 15 ఎకరాలు కట్టబెట్టిన వైకాపా ప్రభుత్వం
- రూ.225 కోట్ల విలువైన భూమి రూ.15 లక్షలకే సంతర్పణ
- గురువుపై భక్తితో అడ్డగోలుగా మినహాయింపులు ఇచ్చిన జగన్

ఈనాడు, అమరావతి: విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. భూకేటాయింపు రద్దు ప్రతిపాదనకు వచ్చే మంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేయనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్లు విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూకేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది.

అడ్డగోలు కేటాయింపు.. ఆపై అనేక వెసులుబాట్లు!

వైకాపా హయాంలో జగన్‌కు రాజగురువుగా ఒక వెలుగు వెలిగిన స్వరూపానందేంద్ర ఎంతో విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేశారు. సంస్కృత పాఠశాల నెలకొల్పి, వేద విద్యను వ్యాప్తి చేసేందుకు, పీఠానికి సంబంధించిన ఇతర కార్యకలాపాల నిర్వహణకు భూములు కేటాయించాలంటూ.. ఆ ముసుగులో ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి పడేశారు. అంతటి రాజగురువే అడిగితే కాదనేదేముంది..! చకచకా దస్త్రం కదిలింది. భీమిలిని ఆనుకుని ఉన్న కొండపై 102/2 సర్వే నంబరులో 7.70 ఎకరాలు, 103లో 7.30 ఎకరాల్ని జగన్ ప్రభుత్వం ఆయనకు కేటాయించింది. రూ.225 కోట్లు విలువ చేసే ఆ భూముల్ని శారదా పీఠానికి ఎకరం రూ.లక్ష చొప్పున రూ.15 లక్షలకు కట్టబెడుతూ 2021 నవంబరులో జీఓ ఇచ్చేసింది. ఆ తర్వాతే స్వామీజీ అసలు స్వరూపం బయటపెట్టారు. పీఠానికి ఆదాయం సమకూర్చుకోవడానికి ఆ భూముల్ని వాడుకోవాలన్నది తమ ఉద్దేశమని, దానికి వీలు కల్పిస్తూ జీఓను సవరించాలని తన వారసుడు, పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్రతో 2023 నవంబరు 20న సీఎంకి లేఖ రాయించారు. 'పీఠం కార్యకలాపాలకు అవసరమైన ఆదాయ సముపార్జన కోసమే.. విశాఖపట్నంలోని సాగర తీరంలో, అది కూడా వాణిజ్య, నివాస ప్రాంతాలకు అత్యంత సమీపంలోని భూములు కేటాయించాల్సిందిగా కోరాం. కానీ జీఓలో మాత్రం వేద విద్య వ్యాప్తికి, పీఠం కార్యకలాపాల విస్తరణకు అని రాశారు. ఆ కార్యకలాపాల్ని పీఠం ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు వారణాసి, రుషికేశ్‌లలోని 60 కేంద్రాల్లో చేస్తోంది. ఆ భూముల్ని జీఓలో ప్రస్తావించిన అవసరాల కోసం వాడుకోవాల్సిన పనిలేదు. వేదపాఠశాల, సంస్కృత విద్య వ్యాప్తికి ఆ స్థలం కోరినట్టు జీఓలో పొరపాటున రాసినట్టున్నారు. జీఓలో మార్పులు చేయాల్సిందిగా కోరుతున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నారు. స్వామీజీ కోరిక మేరకు అడ్డగోలుగా అనేక వెసులుబాట్లు కల్పిస్తూ, ఎన్నికలకు కొన్ని రోజుల ముందు 2024 ఫిబ్రవరిలో జగన్ ప్రభుత్వం సవరించిన జీఓ విడుదల చేసింది.


కేబినెట్‌పైకి తోసేస్తే పోలా!

శారదాపీఠానికి భూకేటాయింపులో కీలకంగా వ్యవహరించిన అధికారులు.. ఇప్పుడు ఆ వ్యవహారం తమకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న ఉద్దేశంతో, మొత్తం నెపాన్ని అప్పటి కేబినెట్‌పైకి నెట్టేయాలని చూస్తున్నట్టు సమాచారం. తమ ప్రమేయమేమీ లేదని, అంతా అప్పటి కేబినెట్ నిర్ణయమేనన్నట్టు చెప్పాలని చూస్తున్నట్టు తెలిసింది. శారదాపీఠానికి భూకేటాయింపులు ఏ విధంగా నిబంధనలకు విరుద్ధమో వివరిస్తూ రెవెన్యూశాఖ నోట్ తయారు చేసింది. అప్పట్లో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారుల దృష్టికి ఆ విషయం వెళ్లడంతో..'అబ్బబ్బే అవన్నీ ఇప్పుడెందుకు? కేటాయింపుల్ని రద్దు చేయాలని సింపుల్‌గా రాస్తే సరిపోతుంది కదా' అని ఒత్తిడి తెస్తున్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

జనవరి 5న 'హైందవ శంఖారావం' సభ

- వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ వెల్లడి

ఈనాడు, అమరావతి; న్యూస్‌టుడే, కృష్ణలంక: రాష్ట్ర ప్రభుత్వాలు హిందువుల మనోభావాలు, సమస్యలు అర్థం చేసుకోవాలని వచ్చే జనవరి 5న విజయవాడలో 'హైందవ శంఖారావం' పేరుతో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్తు (వీహెచ్‌పీ) కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేంద్ర జైన్ తెలిపారు. విజయవాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి' వ్యవహారం హిందువుల మనోభావాలు దెబ్బతీసింది. భక్తుల విశ్వాసాలు, మనోభావాలే కాకుండా.. దేవాలయాల వ్యవస్థ పెను ప్రమాదంలో పడింది. అందుకే హైందవ శంఖారావం నిర్వహిస్తున్నాం. ఆలయాల్లో భక్తులు సమర్పించే ముడుపులు అధికారులు, పాలక మండళ్ల ద్వారా దుర్వినియోగం అవుతున్నాయన్న వార్తలు కలవరానికి గురిచేస్తున్నాయి. తితిదేతో సహా ఇతర దేవాలయాలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించాలి. ఇందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభించబోతున్నాం. తితిదే ప్రసాద వ్యవహారంపై ప్రత్యేక సిట్ ద్వారా విచారణ జరిపించేందుకు సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలు స్వాగతిస్తున్నాం. దేవాలయ ట్రస్టు బోర్డుల్లో హైందవేతరులను, రాజకీయ వ్యక్తులను నియమించకూడదు. దేవాలయాల సమీపంలో హైందవేతరులకు వ్యాపారాల నిర్వహణకు అవకాశం ఇవ్వకూడదు. హిందూ సమాజం, ఆలయాలపై దాడులు చేస్తున్న విద్రోహులను కఠినంగా శిక్షించాలి' అని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో వీహెచ్‌పీ కేంద్రీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సత్య రవికుమార్ పాల్గొన్నారు.



పాడేరు కొండల్లో పాలసముద్రం!

పాల సముద్రంలా కనువిందు చేస్తున్న ఈ ప్రాంతం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని వంజంగి మేఘాలకొండ. శనివారం ఉదయం కొండపై దట్టంగా కమ్మిన పొగమంచు పర్యాటకుల మదిని దోచుకుంది. సూర్యుడి రాకను స్వాగతిస్తూ దూదిపింజల్లాంటి మేఘాలు పక్కకు తొలగుతూ ఉంటే.. ఆ తొలి వెలుగుకు పచ్చని కొండలు కనువిందు చేశాయి. పాడేరు పట్టణంలో ఉదయం 9 గంటల వరకు పొగమంచు తెరలు వీడటం లేదు. మినుములూరు కాఫీ బోర్డులో శనివారం ఉదయం 15 డిగ్రీలు, పాడేరులో 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు.

– పాడేరు, న్యూస్‌టుడే

మాజీ ఎంపీ ఎంవీవీ ఇంట్లో ఈడీ సోదాలు

- ఆడిటర్ జీవీ నివాసంలోనూ తనిఖీలు
- 'హయగ్రీవ' ఆర్థిక లావాదేవీలపై ఆరా!

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే-మధురవాడ, ఎంవీపీకాలనీ: విశాఖ వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆయన స్నేహితుడు, ఆడిటర్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జీవీ)ల ఇళ్లు, కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు శనివారం సోదాలు జరిపారు. ఏకకాలంలో ఐదు బృందాలుగా ఆకస్మిక దాడులు నిర్వహించారు. రుషికొండలోని ఎంవీవీ నివాసం, లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయం, ఇల్లు, జీవీ స్క్వేర్‌లోని జీవీ కార్యాలయం, ఆయన ఇంట్లో సోదాలు జరిగాయి. ఫోర్జరీ సంతకాలతో హయగ్రీవ ప్రాజెక్టును లాక్కొన్నారంటూ చిలుకూరి జగదీశ్వరుడు, ఆయన భార్య రాధారాణి ఈ ఏడాది జూన్ 22న విశాఖలోని ఆరిలోవ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఆర్థిక లావాదేవీలపై ఈడీ ఆరా తీసింది. ఎంవీవీ, జీవీ నుంచి జగదీశ్వరుడికి సుమారు రూ.9-12 కోట్లు లావాదేవీలు జరిగినట్లు సమాచారం ఉన్న నేపథ్యంలోనే ఈడీ దాడులు చేసినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. తనిఖీల సమయంలో మాజీ ఎంపీ ఎంవీవీ, జీవీలు వారి నివాసాల్లోనే ఉన్నారు. తనిఖీల అనంతరం వారి నుంచి ఈడీ అధికారులు స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు. తనిఖీల సమయంలో ఎవరినీ లోనికి రానివ్వకుండా, ఇంటి నుంచి బయటకు వెళ్లనీయకుండా అధికారులు సోదాలు చేశారు.



ఈడీ సోదాలు జరిపిన లాసన్స్‌బే కాలనీలోని ఎంవీవీ కార్యాలయం

హయగ్రీవ కేసు ఇదే..

2008లో చిలుకూరి జగదీశ్వరుడికి చెందిన హయగ్రీవ సంస్థకు ఎండాడలో 12.51 ఎకరాలను ప్రభుత్వం తక్కువ ధరకు కేటాయించింది. ఆడిటర్‌గా రంగ ప్రవేశం చేసిన జీవీ.. ప్రాజెక్టు అభివృద్ధి కోసం గద్దె బ్రహ్మాజీని పరిచయం చేశారు. తదనుగుణంగా ఒక ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఆ తర్వాత జీవీ చేతుల్లోకి ప్రాజెక్టు వెళ్లిపోయింది. ఆయన ఆ భూమికి జీపీఏ హోల్డర్. '2020లో మా సంతకాలు ఫోర్జరీ చేశారు. అమ్మకపు పత్రాలు తయారు చేసి బలవంతంగా విలువైన ఆస్తిని లాక్కోవడానికి నేరపూరితంగా వ్యవహరించారు. సేల్‌డీడ్‌లను దుర్వినియోగం చేశారు' అంటూ ఈ ఏడాది జూన్‌లో జగదీశ్వరుడు ఆరిలోవ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంవీవీ, జీవీ, గద్దె బ్రహ్మాజీలపై కేసు నమోదైంది. ఇదే కేసులో ఈ నెల 17వ తేదీన ఆ ముగ్గురికీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

రాష్ట్ర వృద్ధి పథంలో డ్రోన్ సమ్మిట్ కొత్త అధ్యాయం

- కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: ఏపీ వృద్ధి పథంలో డ్రోన్ సమ్మిట్ కొత్త అధ్యాయంగా మారనుందని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈనెల 22, 23వ తేదీల్లో జరగనున్న డ్రోన్ సమ్మిట్‌లో పాలుపంచుకోవడానికి తాను ఉత్సుకతతో ఎదురుచూస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. 'సీఎం చంద్రబాబునాయుడు దార్శనిక నాయకత్వంలో అభివృద్ధి పథంలో రాష్ట్రం కొత్త అధ్యాయం లిఖిస్తోంది. ఈ సదస్సు డ్రోన్ సాంకేతికతను వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, రక్షణ రంగాల్లోకి విస్తరించడంతోపాటు రాష్ట్రానికి అపారమైన విలువను తీసుకొస్తోంది. నవకల్పనల రంగంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండాలని, భవిష్యత్తుకు కొత్త కొలమానాలను నిర్దేశించాలని ఆశిస్తున్నా' అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

జనసేనలో చేరిన ముద్రగడ కుమార్తె క్రాంతి

వివిధ ప్రాంతాలకు చెందిన వైకాపా కార్పొరేటర్లు, కౌన్సిలర్లూ చేరిక



జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన ముద్రగడ కుమార్తె క్రాంతి దంపతులు

ఈనాడు డిజిటల్, అమరావతి: వైకాపా నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, గుంటూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు, జగ్గయ్యపేట పురపాలక కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశలో బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా వారికి పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు.

21, 22 తేదీల్లో వ్యవసాయ సమస్యలపై జాతీయ సదస్సు

ఈనాడు, అమరావతి: వ్యవసాయ రంగ సమస్యలపై విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేరళ రాష్ట్ర మంత్రి ఎంబీ రాజేష్ హాజరవుతారని వెల్లడించారు. శనివారం వారు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం చెప్పిందని, ఇంతవరకు దాన్ని అమలు చేయలేదని విమర్శించారు. గతేడాది ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారం ఇవ్వలేదని తెలిపారు. బుడమేరు, కృష్ణా వరద బాధిత రైతులకు పరిహారం పెంచాలన్నారు. కౌలు రైతులకు రక్షణ కల్పించాలని.. పత్తి, మిర్చి ధరల పతనాన్ని ప్రభుత్వం అరికట్టాలని కోరారు.

డాక్టర్ రఘురాంకు ప్రధాని పరామర్శ

ఈనాడు, హైదరాబాద్: కిమ్స్ ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రఘురాంకు ప్రధాని మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. రఘురాం మాతృమూర్తి, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ఉషాలక్ష్మి మృతి నేపథ్యంలో సంతాపం తెలుపుతూ.. శనివారం ఆయనకు ప్రధాని లేఖ రాశారు. "మీ తల్లి, డాక్టర్ ఉషాలక్ష్మి మరణించారనే వార్త నన్ను కలచివేసింది. తల్లిని కోల్పోవడం కోలుకోలేనిది. ఓ గైనకాలజిస్టుగా అంకితభావం, మహిళల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం నిబద్ధతతో పనిచేశారు. ప్రతి ఒక్కరి హృదయంలో ఆమె నిలిచి ఉంటారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా' అని ప్రధాని పేర్కొన్నారు. డాక్టర్ ఉషాలక్ష్మి మరణం బాధాకరమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం ఎక్స్ వేదికగా ఆమె మృతికి సంతాపం ప్రకటించారు.



64

64: టెస్టుల్లో పంత్ సిక్సర్లు. అతడికిది 36వ టెస్టే. ఈ ఫార్మాట్లో భారత్ తరఫున అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్లలో కపిల్ దేవ్ (131 మ్యాచ్‌ల్లో 61)ను దాటి ఆరో స్థానానికి చేరుకున్నాడు. సెహ్వాగ్ (103 మ్యాచ్‌ల్లో 90), రోహిత్ (62 మ్యాచ్‌ల్లో 88), ధోని (90 మ్యాచ్‌ల్లో 78) సచిన్ (220 మ్యాచ్‌ల్లో 69), రవీంద్ర జడేజా (75 మ్యాచ్‌ల్లో 66) టాప్-5లో ఉన్నారు.

చాంపియన్

కొత్త బంతి కొంపముంచింది

భారత్ 408/3 నుంచి 462 ఆలౌట్

- చేజారిన సువర్ణావకాశం
- సర్ఫరాజ్, పంత్ అద్భుత పోరాటం
- కివీస్ లక్ష్యం 107 పరుగులే



107

కివీస్ లక్ష్యం. 2004-05 సీజన్లో ఆస్ట్రేలియాకు ముంబయిలో ఇంతే లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్.. ప్రత్యర్థిని 93 పరుగులకే ఆలౌట్ చేసి గెలిచింది.



ఒరోర్క్ 3/92

231/3.. మూడో రోజు చివరికి భారత్ స్కోరిది. నాలుగో రోజు తొలి సెషన్లో 22 ఓవర్లు పడ్డాయి. వికెట్ ఇవ్వలేదు. పైగా 113 పరుగులు చేశారు. రెండో సెషన్లో సగం గడిచింది. వికెట్ పడలేదు. స్కోరు 400 దాటిపోయింది. ఆధిక్యం 50 దాటింది.

ఉదయం నుంచి ఆడుతున్న బ్యాటర్లే క్రీజులో ఉన్నారు. ఒక బ్యాటర్ సెంచరీ పూర్తయింది. ఇంకో ఆటగాడు సెంచరీ దిశగా సాగుతున్నాడు. పరుగులు ధారాళంగా వస్తున్నాయి. చేతిలో 7 వికెట్లున్నాయి. ఇంకేం.. టీమ్ఇండియా సునాయాసంగా ప్రత్యర్థికి 200 పైచిలుకు లక్ష్యాన్ని నిర్దేశిస్తుందని, ఆపై బౌలర్లు విజృంభించి జట్టును గెలిపిస్తారని ఊహల్లోకి వెళ్లిపోయారు అభిమానులు.

కానీ అప్పుడొచ్చింది ప్రత్యర్థి బౌలర్ల చేతికి కొత్త బంతి. అంతే.. వికెట్లు టపటపా పడిపోయాయి. ఆశలు, అంచనాలు కిందికి వచ్చేశాయి. ప్రత్యర్థి ముందు కేవలం 107 పరుగుల లక్ష్యం నిలిచింది.

ఇక చివరి రోజు బౌలర్లు అద్భుతమైనా చేయాలి. లేదా వరుణుడైనా ఆదుకోవాలి. లేదంటే చిన్నస్వామిలో టీమ్ఇండియాకు ఓటమి తప్పదు!

బెంగళూరు

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో టీమ్ఇండియా పుంజుకున్నట్లే పుంజుకుని.. మళ్లీ వెనుకబడింది. తొలి ఇన్నింగ్స్ ఘోర వైఫల్యాన్ని పూర్తిగా మరిపిస్తూ రెండో ఇన్నింగ్స్‌లో 408/3తో తిరుగులేని స్థితిలో నిలిచిన భారత్.. కివీస్ పేసర్లు విలియమ్ ఒరోర్క్ (3/92), మ్యాట్ హెన్రీ (3/102)ల ధాటికి 54 పరుగుల తేడాలో 7 వికెట్లు కోల్పోయి 462 పరుగులకే ఆలౌటైంది. శనివారం రెండో సెషన్లో కొత్త బంతిని అందుకున్నాక ఒరోర్క్, హెన్రీ ఒక్కసారిగా విజృంభించారు. వీరి ప్రతాపానికి ముందు సర్ఫరాజ్ ఖాన్ (150; 195 బంతుల్లో 18×4, 3×6), రిషబ్ పంత్ (99; 105 బంతుల్లో 9×4, 5×6) వీరోచిత ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 177 పరుగులు జోడించింది. భారత్ 107 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని నిర్దేశించగా.. కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 4 బంతులే పడ్డాయి. పరుగులేమీ రాలేదు. లేథమ్ (0), కాన్వే (0) క్రీజులో ఉన్నారు. వెలుతురు లేమి వల్ల అంపైర్లు ఆటను ముందే ఆపేశారు. చివరి రోజు కూడా వర్షం పడొచ్చని సమాచారం.

కుర్రాళ్ల కేక..: 231/3.. మూడో రోజు ఆట చివరికి భారత్ స్కోరిది. అప్పటికింకా జట్టు 125 పరుగులు వెనుకబడి ఉంది. పంత్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉండగా.. గురువారం మోకాలికి గాయమై ఒకటిన్నర రోజు ఆటకు దూరంగా ఉన్న అతను ఏమాత్రం నిలబడతాడో.. 70 పరుగులతో నాటౌట్‌గా ఉన్న సర్ఫరాజ్ ఉదయం కివీస్ పేసర్లను ఏమాత్రం తట్టుకుంటాడో అన్న అనుమానాలు! కానీ ఈ జోడీ ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. మోకాలికి పట్టీ కట్టుకుని మైదానంలోకి వచ్చిన పంత్ వికెట్ల మధ్య పరుగు తీయడంలో కొంచెం ఇబ్బందిపడ్డాడు తప్ప షాట్లు ఆడడంలో ఏ తడబాటూ లేదు. కివీస్ బౌలర్లపై అతను ఎదురుదాడి చేసిన తీరు అమోఘం. అతను మోకాళ్లపై కూర్చుని ఆడిన లాఫ్టెడ్ షాట్లు చూసి తీరాల్సిందే. మరోవైపు సర్ఫరాజ్ ముందు రోజు దూకుడు కొనసాగిస్తూ కనువిందు చేశాడు. సర్ఫరాజ్ లేట్ కట్ షాట్లలో అందమే వేరు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 46 పరుగులకు ఆలౌట్ అయిన పిచ్ ఇదేనా.. మన బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టిన బౌలర్లు వీళ్లేనా అనిపించేలా.. ఈ ఇద్దరూ చిన్నస్వామిలో అద్భుత బ్యాటింగ్ విన్యాసాలతో అభిమానులను ఆశ్చర్యపరిచారు. సర్ఫరాజ్ తొలి గంటలోనే సెంచరీ పూర్తి చేశాడు. వర్షం అంతరాయంతో లంచ్ విరామం కాస్త ముందే వచ్చింది. అప్పటికే పంత్ అర్ధ శతకం పూర్తి చేసేశాడు. 22 ఓవర్ల తొలి సెషన్లోనే ఈ జోడీ 113 పరుగులు రాబట్టింది. రెండో సెషన్లోనూ ఈ జోడీ దూకుడు కొనసాగించింది. వికెట్ కోసం కివీస్ కెప్టెన్ లేథమ్ బౌలర్లందరినీ ప్రయోగించినా ఫలితం లేకపోయింది. స్పిన్నర్ అజాజ్‌ను పంత్, సర్ఫరాజ్ అస్సలు లెక్కచేయలేదు. పేసర్లనూ సమర్థంగా ఎదుర్కొన్నారు. సర్ఫరాజ్ 150 పరుగుల మైలురాయిని చేరుకోగా.. పంత్ సెంచరీ వైపు అడుగులు వేశాడు.



- 36వ టెస్టు ఆడుతున్న పంత్ 90ల్లో ఔట్ కావడమిది ఏడోసారి. అతను ఆరు శతకాలు సాధించాడు.

అనూహ్య పతనం: 150 మార్కును అందుకోగానే సర్ఫరాజ్.. సౌథీ బౌలింగ్‌లో షాట్ ఆడబోయి వెనుదిరిగాడు. ఆ తర్వాత పంత్ దూకుడు కొనసాగించగా.. రాహుల్ అతడికి సహకరించాడు. 90లోకి అడుగు పెట్టిన పంత్.. సౌథీ బౌలింగ్‌లో కళ్లు చెదిరే సిక్సర్‌తో సెంచరీకి చేరువయ్యాడు. అతడి బాదుడుకు 107 మీటర్లు దూసుకెళ్లిన బంతి స్టేడియం పైకప్పుపై పడింది. పంత్ 99పై నిలవడంతో సెంచరీ లాంఛనమే అనిపించింది. కానీ అతణ్ని అదే స్కోరు వద్ద ఒరోర్క్ బౌల్డ్ చేయడంతో స్టేడియాన్ని నిశ్శబ్దం ఆవహించింది. కొత్త బంతి అందుకున్నాక ఒరోర్క్ 3 ఓవర్లలో 3 మెయిడెన్లతో 3 వికెట్లు తీయడం విశేషం. అతడితో పాటు హెన్రీ కూడా విజృంభించాడు. బంతిపై మెరుపును సద్వినియోగం చేసుకుంటూ బౌన్స్, స్వింగ్ రాబట్టిన ఈ జోడీ భారత ఇన్నింగ్స్ స్వరూపాన్ని మార్చేసింది. పంత్ ఔటైన కాసేపటికే రాహుల్ (12) పెవిలియన్ చేరాడు. జడేజా (5) సైతం ఒరోర్క్‌కే వికెట్ సమర్పించుకున్నాడు. చివరి మూడు వికెట్లను హెన్రీ ఊడ్చేశాడు. అశ్విన్ (15) కాస్త పోరాడి వెనుదిరగ్గా.. బుమ్రా (0), సిరాజ్ (0) ఒకే ఓవర్లో ఔటవడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 46; **న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్:** 402; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (స్టంప్డ్) బ్లండెల్ (బి) అజాజ్ 35; రోహిత్ (బి) అజాజ్ 52; కోహ్లి (సి) బ్లండెల్ (బి) ఫిలిప్స్ 70; సర్ఫరాజ్ (సి) అజాజ్ (బి) సౌథీ 150; పంత్ (బి) ఒరోర్క్ 99; రాహుల్ (సి) బ్లండెల్ (బి) ఒరోర్క్ 12; జడేజా (సి) యంగ్ (బి) ఒరోర్క్ 5; అశ్విన్ ఎల్బీ (బి) హెన్రీ 15; కుల్దీప్ నాటౌట్ 6; బుమ్రా (సి) బ్లండెల్ (బి) హెన్రీ 0; సిరాజ్ (సి) సౌథీ (బి) హెన్రీ 0; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (99.3 ఓవర్లలో ఆలౌట్) **462; వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-231, 4-408, 5-433, 6-438, 7-441, 8-458, 9-462; **బౌలింగ్:** సౌథీ 15-2-53-1; హెన్రీ 24.3-3-102-3; ఒరోర్క్ 21-4-92-3; అజాజ్ పటేల్ 18-3-100-2; ఫిలిప్స్ 15-2-69-1; రచిన్ 6-0-30-0

ఇదీ సర్ఫరాజ్ సత్తా!

ఈనాడు క్రీడావిభాగం

న్యూజిలాండ్‌తో తొలి టెస్టులో భారత్‌కు ఇన్నింగ్స్ పరాభవం తప్పిందంటే.. జట్టు ఇంకా ఆశలతో ఉందంటే.. అందుకు ప్రధాన కారణం సర్ఫరాజ్ ఖాన్. దేశవాళీల్లో టన్నుల కొద్దీ పరుగులతో సత్తాచాటిన 26 ఏళ్ల ఈ ముంబయి కుర్రాడు.. ఇప్పుడు అంతర్జాతీయ క్రికెట్లో తొలి శతకాన్ని అందుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 150 పరుగులతో జట్టును ఆదుకున్నాడు. అతను ఈ పరుగులు చేసిన విధానం ప్రత్యేకం. శుభ్‌మన్ గిల్ మెడ నొప్పితో దూరమవడంతో ఆడే అవకాశం దక్కించుకున్న సర్ఫరాజ్.. ఈ ఇన్నింగ్స్‌తో తన నైపుణ్యాలను ప్రపంచానికి చాటాడు. మ్యాచ్ పరిస్థితుల్లో సర్ఫరాజ్ సెంచరీ ఎంతో విలువైంది. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగో స్థానంలో వచ్చి డకౌటవడంతో అతని సామర్థ్యంపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇక రెండో ఇన్నింగ్స్‌లో అతను బ్యాటింగ్‌కు వచ్చే సమయానికి జట్టు 261 పరుగులు వెనుకబడే ఉంది. ఇన్నింగ్స్ ఓటమి ముప్పు పొంచే ఉంది. ఆ దశలో వికెట్ పడి ఉంటే పరిస్థితి దారుణంగా మారేది. కానీ ఈ సారి సర్ఫరాజ్ గొప్ప పట్టుదల ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో దూకుడుతో షాట్‌కు ప్రయత్నించి వికెట్ పారేసుకోవడంతో విమర్శలు వచ్చినా.. రెండో ఇన్నింగ్స్‌లో ఎదురు దాడికే దిగాడు. కానీ ఈ సారి పరిస్థితులను చక్కగా అర్థం చేసుకుని బౌండరీలతో బౌలర్ల లయ దెబ్బతీశాడు. మొదట కోహ్లీతో, ఆ తర్వాత పంత్‌తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. భారత్‌కు 64 పరుగుల ఆధిక్యం అందించిన తర్వాత ఔటయ్యాడు. గాయాలతో ప్రధాన ఆటగాళ్లు దూరమైతే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో మూడో టెస్టులో సర్ఫరాజ్ అరంగేట్రం చేశాడు. ఆ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలతో నిరూపించుకున్నాడు. కానీ కీలక ఆటగాళ్లు తిరిగి రావడంతో ఆ సిరీస్ తర్వాత తుది జట్టులో చోటు దక్కలేదు. ఇప్పుడు అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని 295 నిమిషాల పాటు క్రీజులో నిలిచాడు. టెస్టులో ఒక ఇన్నింగ్స్‌లో డకౌటై, మరో ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేసిన భారత మూడో బ్యాటర్ అతను.

ఆటతీరుకు ఫిదా

టెస్టుల్లో సంప్రదాయ శైలికి భిన్నంగా సర్ఫరాజ్ ఆటతీరు క్రికెట్ పండితులనే ఆశ్చర్యపరుస్తోంది. వేగంగా దూసుకొచ్చినా.. గింగిరాలు తిరిగేదైనా.. బంతిని చూడటానికి, ఆడటానికి మిగతా బ్యాటర్ల కంటే అతనికి ఎక్కువ సమయం ఉండేమో అనిపిస్తోంది. బంతి స్టంప్స్‌ను ఎగరగొడుతుందేమో.. ప్యాడ్లను తాకుతుందేమో అనేలోపే సర్ఫరాజ్ బ్యాట్ అడ్డుగా వచ్చి ఆ బంతిని ఆడేస్తోంది. ఆలస్యంగా ఆడుతూ కట్, ర్యాంప్, స్వీప్ షాట్లతో బౌలర్ల ప్రణాళికలను దెబ్బతీస్తున్నాడు. బౌలర్ల వ్యూహాలకు చిక్కకుండా ఆడాడు. తన ఇన్నింగ్స్‌లో 114వ పరుగు వరకూ అతను లాంగాఫ్, లాంగాన్‌లో ఒక్క పరుగూ రాబట్టలేదు. అతను శతకం పూర్తయ్యే సరికి వచ్చిన పరుగుల్లో 30 శాతం థర్డ్‌మన్, 20 శాతం స్క్వేర్‌లెగ్, 19 శాతం పాయింట్, 15 శాతం మిడ్ వికెట్, 13 శాతం కవర్స్ నుంచి వచ్చాయి. స్లిప్‌లో, గల్లీలో ఫీల్డర్లున్నా బంతిని ఆలస్యంగా కట్ చేసి, ఖాళీల్లో నుంచి ఫోర్లు రాబట్టాడు. బ్యాట్‌పై నియంత్రణతో, కచ్చితత్వంతో బ్యాక్‌ఫుట్‌పై బలంగా నిలబడి, మణికట్టును తిప్పుతూ పరుగులు సాధించాడు. శరీరాన్ని ఎలా కావాలంటే అలా వంచుతున్నాడు. 6.4 అడుగుల ఎత్తున్న విలియమ్ బౌలింగ్‌లో ఇలాగే అప్పర్‌కట్‌తో కొట్టిన సిక్సర్, ఫోర్ చూడాల్సిందే. ఇలాంటి చిరస్మరణీయ ఇన్నింగ్స్ తర్వాత సర్ఫరాజ్‌ను జట్టు నుంచి పక్కనపెట్టడమంటే సాహసమే. అతను జట్టులో కొనసాగించక తప్పని పరిస్థితి కల్పించాడు. మరి గిల్ కోలుకుని వస్తే తర్వాతి టెస్టుకు ఎలాంటి మార్పులు చేస్తారో చూడాలి.

నాన్న ఎప్పుడూ నాలో ప్రేరణ కలిగిస్తూనే ఉంటాడు. భారత్‌కు ఆడుతూ తొలి సెంచరీ చేయడం సంతోషంగా ఉంది. చిన్నప్పటి నుంచి ఇది నా కల. భవిష్యత్‌లో ఏం అవుతుందో చెప్పలేం. రేపటి గురించి ఆలోచించి గతంలో వర్తమానాన్ని వృథా చేసుకున్నా. అందుకే వర్తమానంలో ఉండేందుకే ప్రయత్నిస్తా. బౌన్స్ అయ్యే బంతులను ఆడటాన్ని ఇష్టపడతా. ఇంటి దగ్గర ఉన్న బౌన్సీ వికెట్‌పై నిరంతరం ఇదే సాధన చేస్తా. అందుకే సులువుగా బౌన్సర్లను కట్ చేయగలిగా. ఈ పిచ్‌పై బ్యాటింగ్ అంత సులువు కాదు. మ్యాచ్ మా చేజారిందని అనుకోవడం లేదు. బంతి తిరుగుతోంది. చివరి రోజు మూడు వికెట్లను త్వరగా పడగొడితే కివీస్ కూడా కుప్పకూలే అవకాశముంది.

– సర్ఫరాజ్

రాహుల్.. ఎన్నాళ్లిలా?



రాహుల్

కేఎల్ రాహుల్.. ఎంతో ప్రతిభ ఉన్న బ్యాటర్. కోహ్లి, రోహిత్‌ల స్థాయికి ఎదగగల సామర్థ్యం ఉన్నా సరే.. నిలకడ లేక విమర్శలు కొని తెచ్చుకుంటూ ఉంటాడు. జట్టు యాజమాన్యం ఎన్నో సందర్భాల్లో అతడికి మద్దతుగా నిలిచింది. అవకాశాలు ఇస్తూనే ఉంది. ఎప్పుడో ఒకసారి ఓ మంచి ఇన్నింగ్స్ ఆడతాడు. కానీ తర్వాత నిరాశపరుస్తాడు. జట్టు తనపై ఆశలు పెట్టుకున్నపుడు నిరాశపరిచిన సందర్భాలే ఎక్కువ. శనివారం కూడా అదే చేశాడు. సర్ఫరాజ్, పంత్ జట్టు విజయానికి బలమైన పునాది వేసినా.. రాహుల్ సహా తర్వాతి బ్యాటర్లు చేతులెత్తేయడంతో భారత్ ఇప్పుడు ఓటమి ఉచ్చులో చిక్కుకుంది. కొత్త బంతి వచ్చాక కివీస్ బౌలర్లు ఒక్కసారిగా విజృంభించారు. భారీ భాగస్వామ్యం తర్వాత సర్ఫరాజ్, పంత్ ఒకరి తర్వాత ఒకరు వెనుదిరిగారు. ఈ స్థితిలో మిగిలిన స్పెషలిస్టు బ్యాటర్ రాహుల్ ఒక్కడే. ఓపికతో ఆడి భాగస్వామ్యం నెలకొల్పాల్సిన బాధ్యత అతడిపై పడింది. కానీ రాహుల్ 16 బంతులే ఆడి 12 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఒరోర్క్ బంతిని ఆడాలా వద్దా అన్న సంశయంలోనే ఆడిన రాహుల్.. వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో భారత్ ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు. మరోసారి అభిమానుల ఆశలను నీరుగార్చడంతో సామాజిక మాధ్యమాల్లో రాహుల్‌పై తీవ్ర విమర్శలు తప్పట్లేదు.

పొట్టి కప్పు పట్టేదెవరో?

రాత్రి 7.30 నుంచి

- నేడు మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్
- న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా ఢీ



వోల్వార్ట్, సోఫీ డివైన్

దుబాయ్: హోరాహోరీ మ్యాచ్‌లు.. నాటకీయ మలుపులతో అలరించిన మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఆఖరి అంకానికి సమయం ఆసన్నమైంది. ఆదివారం ఫైనల్లో న్యూజిలాండ్‌తో దక్షిణాఫ్రికా తలపడుతోంది. ఈ రెండు జట్లలో ఏది గెలిచినా తొలిసారి టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా నిలుస్తుంది. కివీస్ దిగ్గజ క్రికెటర్లు సోఫీ డివైన్, సుజీ బేట్స్, లియా తహుహు ప్రపంచకప్ కలను నిజం చేసుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్లో 7 వేలకు పైగా పరుగులు చేసిన 35 ఏళ్ల డివైన్, 10 వేల మైలురాయిని దాటిన 37 ఏళ్ల బేట్స్, 205 వికెట్లు పడగొట్టిన 34 ఏళ్ల తహుహుకు ఇదే చివరి ప్రపంచకప్ కావచ్చు. సెమీస్‌లో విండీస్‌పై కష్టపడి గెలిచిన న్యూజిలాండ్‌కు బౌలింగే బలం. అమేలియా కెర్ (12 వికెట్లు) టోర్నీలో అత్యధిక వికెట్ల బౌలర్‌గా కొనసాగుతోంది. కార్సన్, రోజ్‌మేరీ కూడా రాణిస్తున్నారు. మరోవైపు వరుసగా రెండో ఫైనల్ ఆడుతున్న దక్షిణాఫ్రికా ఈ సారి మాత్రం కప్పును వదలొద్దనే లక్ష్యంతో ఉంది. ఆ జట్టు సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను కంగుతినిపించింది. లారా వోల్వార్ట్ (190 పరుగులు), తజ్మిన్ బ్రిట్స్ (170) బ్యాటింగ్‌లో.. ఎంలాబా (10 వికెట్లు) బౌలింగ్‌లో కీలకం.

పాక్‌ను కొట్టేశారు

భారత్-ఎ శుభారంభం



తిలక్ వర్మ

అల్ అమెరత్: అది ఏ టోర్నమెంట్ అయితేనేం పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే భారత్‌దే పైచేయి. ఏసీసీ పురుషుల టీ20 వర్ధమాన జట్ల ఆసియాకప్‌లోనూ అదే జరిగింది. శనివారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో తిలక్ వర్మ నేతృత్వంలోని భారత్-ఎ 7 పరుగుల తేడాతో పాకిస్థాన్ షహీన్స్‌పై విజయం సాధించింది. తిలక్ వర్మ (44; 35 బంతుల్లో 2×4, 2×6), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (36; 19 బంతుల్లో 3×4, 3×6), అభిషేక్ శర్మ (35; 22 బంతుల్లో 5×4, 2×6) మెరవడంతో మొదట భారత్ 8 వికెట్లకు 183 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 7 వికెట్లకు 176 పరుగులే చేయగలిగింది. అన్షుల్ కాంబోజ్ (3/33), నిశాంత్ సంధు (2/15), రసిఖ్ సలామ్ (2/30) ఆ జట్టును కట్టడి చేశారు. అరాఫత్ మిన్హాస్ (41) టాప్ స్కోరర్. యాసిర్ ఖాన్ (33), అక్రమ్ (27), అబ్దుల్ సమద్ (25) రాణించారు. 23 బంతుల్లో 36 పరుగులు చేయాల్సిన స్థితిలో చేతిలో అయిదు వికెట్లున్న పాకిస్థాన్ గెలుపుపై కన్నేసింది. ఊపు మీదున్న మిన్హాస్, సమద్ క్రీజులో ఉన్నారు. కానీ రసిఖ్, వైభవ్ అరోరా, అన్షుల్ కాంబోజ్ ఆఖర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి భారత్‌ను గెలిపించారు. ఆఖరి ఓవర్లో పాక్‌కు 17 పరుగులు అవసరం కాగా.. తొలి బంతికే సమద్‌ను ఔట్ చేసిన అన్షుల్ 9 పరుగులే ఇచ్చాడు. అతడికే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

భారత్-ఎ: 183/8 (తిలక్ వర్మ 44, ప్రభ్‌సిమ్రన్ 36, అభిషేక్ 35, నేహాల్ 25, రమణ్‌దీప్ 17; సుఫియాన్ 2/28)

పాకిస్థాన్ షహీన్స్: 176/7 (మిన్హాస్ 41, యాసిర్ ఖాన్ 33, అక్రమ్ 27, సమద్ 25; అన్షుల్ కాంబోజ్ 3/33, రసిఖ్ సలామ్ 2/30, నిశాంత్ 2/15)

టైటాన్స్, తలైవాస్ మ్యాచ్‌లో



పీకేఎల్-11

టైటాన్స్ ఓటమి

ఈనాడు, హైదరాబాద్: ఘన విజయంతో కొత్త సీజన్‌కు ఆరంభం. ఇంకేముంది ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ చెలరేగిపోతుందనుకున్న అభిమానులకు రెండో మ్యాచ్‌లోనే నిరాశ ఎదురైంది. శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 29-44 తేడాతో తమిళ్ తలైవాస్ చేతిలో చిత్తయింది. రైడింగ్‌లో నరేందర్ ఖండోలా (10), సచిన్ (10).. ట్యాక్లింగ్‌లో సాహిల్ (5) రాణించి తలైవాస్‌కు విజయాన్ని అందించారు. టైటాన్స్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్ (10), విజయ్ మలిక్ (9) పోరాటం సరిపోలేదు. ట్యాక్లింగ్‌లో జట్టు విఫలమైంది. పవన్ జోరుతో మ్యాచ్‌ను దూకుడుగా ఆరంభించిన టైటాన్స్ 5-1తో దూసుకెళ్లింది. కానీ ఆ తర్వాత అనూహ్యంగా తడబడింది. ఆరో నిమిషంలోనే ఆలౌటై 7-11తో వెనుకబడింది. 17-20తో తొలి అర్ధభాగాన్ని ముగించిన టైటాన్స్ విరామం తర్వాత మరింత ఢీలాపడి ఓటమిని మూటగట్టుకుంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ 35-25తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది.

పీకేఎల్‌లో ఈనాడు

బెంగాల్ వారియర్స్ × జైపుర్ పింక్‌పాంథర్స్ (రాత్రి 8 నుంచి)

గుజరాత్ జెయింట్స్ × బెంగళూరు బుల్స్ (రాత్రి 9 నుంచి)

రాణించిన రాహుల్, హిమతేజ

హైదరాబాద్ 244/5

డెహ్రాడూన్: రాహుల్ రాదేశ్ (82 బ్యాటింగ్; 174 బంతుల్లో 9×4), హిమతేజ (78; 147 బంతుల్లో 8×4, 1×6) రాణించడంతో ఉత్తరాఖండ్‌తో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో హైదరాబాద్ మెరుగైన స్థితిలో నిలిచింది. రెండో రోజు ఆట చివరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 244 పరుగులు సాధించింది. రాహుల్‌తో పాటు తనయ్ త్యాగరాజన్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. హైదరాబాద్ ఒక దశలో 64/4తో కష్టాల్లో చిక్కుకోగా.. హిమతేజతో కలిసి రాహుల్ జట్టును ఆదుకున్నాడు. ఈ జోడీ అయిదో వికెట్‌కు 142 పరుగులు జత చేసింది. తన్మయ్ అగర్వాల్ (30), కెప్టెన్ రాహుల్ సింగ్ (21) కూడా కాసేపు నిలిచారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 313/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఉత్తరాఖండ్ 325 పరుగులకు ఆలౌటైంది. అభయ్ నేగి (37 నాటౌట్) అజేయంగా నిలిచాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (4/85), మిలింద్ (2/64), రోహిత్ రాయుడు (2/16) రాణించారు.

ఆదుకున్న భరత్; ఆంధ్ర 137/5: శ్రీకర్ భరత్ (78 బ్యాటింగ్) ఆదుకోవడంతో గుజరాత్‌తో రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి మ్యాచ్‌లో ఆంధ్ర కుప్పకూలే ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఒక దశలో గుజరాత్ బౌలర్ల ధాటికి 29 పరుగులకే ఆంధ్ర 5 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో నితీశ్‌కుమార్ రెడ్డి (34 బ్యాటింగ్)తో కలిసి భరత్ ప్రత్యర్థి బౌలర్లను అడ్డుకున్నాడు. ఈ జోడీ అబేధ్యమైన ఆరో వికెట్‌కు 108 పరుగులు జత చేసింది. ఆంధ్ర ఇంకా 230 పరుగులు వెనుకబడి ఉంది. చింతన్ గజా (3/40) ఆంధ్రను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 289/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ 367 పరుగులకు ఆలౌటైంది. చింతన్ గజా (92), అర్జాన్ (82 నాటౌట్) సత్తా చాటారు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్ (3/107), సత్యనారాయణ (3/53), విజయ్ (2/98) రాణించారు.

భారత్ శుభారంభం

జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్‌లో భారత జూనియర్ హాకీ జట్టు శుభారంభం చేసింది. శనివారం 4-2తో జపాన్‌ను ఓడించింది. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన భారత్... 12వ నిమిషంలో అమీర్ అలీ చేసిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే సుబసా (26వ) సఫలం కావడంతో జపాన్ స్కోరు సమం చేసింది. అక్కడ నుంచి భారత్ జోరు పెంచింది. గుర్‌జ్యోత్ సింగ్ (36వ), ఆనంద్ సౌరభ్ (44వ), అంకిత్ పాల్ (47వ) స్వల్ప వ్యవధిలో మూడు గోల్స్ సాధించడంతో 4-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. ఆఖర్లో జపాన్ ఆటగాడు యమనకా (57వ) గోల్ చేసినా అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. ఈ జట్టుకు దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ కాంస్యం గెలిచిన తర్వాత శ్రీజేశ్ ఆటకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

మెరిసిన హైదరాబాద్ రేసర్లు



అకీల్ అలీభాయ్

కోయంబత్తూర్: ఇండియన్ రేసింగ్ లీగ్ నాలుగో రౌండ్ పోటీల్లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసర్లు మెరిశారు. శనివారం జరిగిన ఫార్ములా-4 ఇండియన్ ఓపెన్ తొలి రేసులో అకీల్ అలీభాయ్ (దక్షిణాఫ్రికా) విజేతగా నిలిచాడు. ఈ హైదరాబాద్ రేసర్ 26 నిమిషాల 34.669 సెకన్లలో రేసు ముగించాడు. రుహాన్ అల్వా (శ్రాచి రార్ రాయల్ బెంగాల్ టైగర్స్- 26ని 35.335సె), జేడెన్ (బెంగళూరు స్పీడ్‌స్టర్స్- 26ని 35.887సె) వరుసగా రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. మరోవైపు ఇండియన్ రేసింగ్ లీగ్ తొలి రేసులో బ్లాక్‌బర్డ్స్ తరఫున బరిలో దిగిన నీల్ జాని (26ని 54.587సె) రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. జాన్ లాకాస్టర్ (చెన్నై టర్బో రైడర్స్- 26ని 54.251సె) ఛాంపియన్‌గా నిలిచాడు. సోహిల్ (గోవా ఏసెస్ జేఏ రేసింగ్- 26ని 54.965సె) మూడో స్థానం కైవసం చేసుకున్నాడు.



సెకన్లలోనే వ్యాధుల గుర్తింపు!

● సరికొత్త స్కానర్ అభివృద్ధి



క్యాన్సర్, గుండె జబ్బులు, ఆర్థరైటిస్ వంటి రుగ్మతలను అత్యంత ప్రాథమిక దశలోనే గుర్తించడానికి వీలు కల్పించే ఒక చిన్నపాటి స్కానర్‌ను బ్రిటన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కొన్ని సెకన్లలోనే విస్పష్టమైన త్రీడీ ఫొటో అకౌస్టిక్ టొమోగ్రఫీ (పీఏటీ) చిత్రాలను ఇది అందిస్తుంది. ఫలితంగా వైద్యులే స్వయంగా ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించొచ్చు. దీనిసాయంతో రక్తనాళాలను సుస్పష్టంగా వీక్షించొచ్చు. రోగి సంరక్షణను ఈ పరిజ్ఞానం మెరుగుపరుస్తుంది. అన్ని పరీక్షలూ పూర్తయితే 3-5 ఏళ్లలో ఇది అందుబాటులోకి రావొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఏమిటీ పరిజ్ఞానం?

● పీఏటీ పరిజ్ఞానాన్ని 2000 సంవత్సరంలో అభివృద్ధి చేశారు. పదార్థాలు.. కాంతిని శోషించుకొని ప్రతిగా ధ్వని తరంగాలను వెలువరించడాన్ని ఫొటోఅకౌస్టిక్ ప్రభావం అంటారు. పీఏటీ స్కానర్లు ఇదే సూత్రం ఆధారంగా పని చేస్తాయి. ఇవి స్వల్పస్థాయి లేజర్ తరంగాలను కణజాలంలోకి పంపుతాయి. లక్షిత ప్రాంత రంగు ఆధారంగా.. ఆ తరంగాల్లోని కొంత శక్తిని కణజాలం శోషించుకుంటుంది. దీనివల్ల అక్కడ వేడి, పీడనం స్వల్పంగా పెరుగుతాయి. అంతిమంగా దీని నుంచి బలహీన అల్ట్రాసౌండ్ తరంగం వెలువడుతుంది. అందులో కణజాలానికి సంబంధించిన సమస్త సమాచారం ఉంటుంది.

● పీఏటీ ఇమేజింగ్ విధానంలో మానవ కణజాలంలో 15 మిల్లీమీటర్ల లోతులోకి చొచ్చుకెళ్లి మరీ రక్తనాళాలను పరిశీలించొచ్చు.

ప్రస్తుత పీఏటీతో ఇబ్బందులు..

● ప్రస్తుత పీఏటీ పరిజ్ఞానంతో ఇమేజింగ్ నెమ్మదిగా ఉంటోంది. అందువల్ల నాణ్యమైన త్రీడీ చిత్రాలను అది వేగంగా అందించలేకపోతోంది. ఈ స్కానింగ్ సమయంలో రోగి నిశ్చలంగా ఉండాలి. చిన్నపాటి కదలిక చోటుచేసుకున్నా.. చిత్రాలు మసకబారుతాయి. అలాంటివాటితో వ్యాధి నిర్ధారణ కష్టం.

● పాత పీఏటీ స్కానర్లు.. ఒక చిత్రాన్ని సేకరించడానికి ఐదు నిమిషాల కన్నా ఎక్కువ సమయాన్ని తీసుకుంటాయి. వృద్ధులు, బలహీనులు అంతసేపు నిశ్చలంగా ఉండటం కష్టం.

● ఈ ఇబ్బందుల కారణంగా వైద్యులు అప్పటికప్పుడు రోగులను పరిశీలించడం కోసం పీఏటీలను వాడలేకపోతున్నారు.

పరిష్కారం ఇలా..

పీఏటీ ఇమేజింగ్‌లో వేగాన్ని పెంచడానికి యూనివర్సిటీ కాలేజీ లండన్ (యూసీఎల్) శాస్త్రవేత్తలు నడుం బిగించారు. స్కానర్ డిజైన్‌లో నవ్యతను జోడించారు. చిత్రాలను వెలువరించే గణితశాస్త్ర అంశాలను మెరుగుపరిచారు.

● మునుపటి పీఏటీ స్కానర్లు.. కణజాల ఉపరితలంలోని 10వేలకుపైగా ప్రదేశాల్లో అల్ట్రాసౌండ్ తరంగాలను కొలిచేవి. అయితే ఒకసారి ఒక బిందువుకు సంబంధించి మాత్రమే అవి కొలతలు సేకరించగలవు. కొత్త స్కానర్ మాత్రం ఒకేసారి బహుళ బిందువుల వద్ద ఈ కసరత్తును చేపట్టగలదు. దీంతో చిత్రీకరణ సమయం బాగా తగ్గిపోనుంది.

● డిజిటల్ ఇమేజ్ కంప్రెషన్‌కు వాడే గణిత సూత్రాలనూ శాస్త్రవేత్తలు కొత్త స్కానర్‌లో ఉపయోగించారు. ఫలితంగా.. అల్ట్రాసౌండ్ తరంగానికి సంబంధించిన కొన్ని వేల కొలతలతో (లక్షల సంఖ్యలో అవసరం లేకుండానే) అత్యంత నాణ్యమైన చిత్రాలను సేకరించడానికి వీలైంది.

ఈ విధానాల వల్ల.. పాత స్కానర్లతో పోలిస్తే 100 నుంచి వెయ్యి రెట్లు వేగంగా కొత్త స్కానర్లు పనిచేస్తాయి.

శరవేగంగా వ్యాధి నిర్ధారణ

పీఏటీ ఇమేజింగ్‌లో వేగాన్ని పెంచడం వల్ల వృద్ధులకు ప్రయోజనం కలుగుతుంది. శరీర కదలికలతో చిత్రాలు మసకబారే సమస్య ఉండదు.

● అప్పటికప్పుడు చిత్రాలను పొందొచ్చు. దీనివల్ల వైద్యులు నేరుగా ఈ పరిజ్ఞానాన్ని ఉపయోగించేందుకు తొలిసారిగా వీలు కలగనుంది.

● ఈ కొత్త స్కానర్‌తో క్యాన్సర్, గుండె జబ్బులను సులువుగా గుర్తించొచ్చు. శరీర అంతర్భాగాలు, వ్యాధుల వ్యాప్తి తీరు గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు.

● ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్‌ను పరిశీలనకు రెండు చేతుల వేళ్లలోని 20 జాయింట్లను స్కాన్ చేయాల్సి ఉంటుంది. కొత్త స్కానర్‌తో ఈ ప్రక్రియను కొద్ది నిమిషాల్లో పూర్తి చేయవచ్చు. పాత పీఏటీ స్కానర్లు ఇందుకు గంట వరకూ సమయాన్ని తీసుకుంటాయి.

● టైప్-2 మధుమేహం ఉన్నవారి కాళ్ల దిగువ భాగం, పాదాలకు రక్తప్రవాహం తక్కువగా ఉంటుంది. దీన్ని పెరిఫెరల్ వాస్క్యులర్ డిసీజ్ (పీవీడీ)గా పేర్కొంటారు. ఈ ప్రక్రియను విస్పష్టంగా వీక్షించే వెసులుబాటు ఇప్పటి వరకూ శాస్త్రవేత్తలకు లేదు. తాజా స్కానర్‌తో కాళ్లలోని సూక్ష్మ రక్తనాళ వ్యవస్థకు సంబంధించిన సవివర త్రీడీ చిత్రాలను పొందొచ్చు. ఆ నాళాల్లోని మార్పుల ఆధారంగా పీవీడీ ఆరంభ సంకేతాలను పట్టుకోవచ్చు.

● క్యాన్సర్లు, కణితుల్లో రక్తనాళాలు దట్టంగా ఉంటాయి. ఇతర ఇమేజింగ్ విధానాలతో వీటిని వీక్షించడం కష్టం. కణితిలోని రక్తనాళాలను పరిశీలించడం ద్వారా కణితి కణజాలాన్ని శస్త్రచికిత్స నిపుణులు సులువుగా గుర్తించేందుకు పీఏటీ పరిజ్ఞానం వీలు కల్పిస్తుంది. తద్వారా శస్త్రచికిత్స సమయంలో కణితిని సమూలంగా తొలగించి, అది మళ్లీ ఉత్పన్నం కాకుండా చూడొచ్చు.

● రొమ్ము క్యాన్సర్‌తో ముడిపడిన చర్మ ఇన్‌ఫ్లమేషన్‌ను కొత్త స్కానర్ సాయంతో గుర్తించొచ్చు.

- ఈనాడు ప్రత్యేక విభాగము

జీవో 29తో రిజర్వేషన్లలో కోతా?

● రాజ్యాంగ స్ఫూర్తికి కాంగ్రెస్ తూట్లు
● మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, న్యూస్‌టుడే: 'రాజ్యాంగ స్ఫూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచింది. జీవో నం.55 రద్దు చేసిన ముఖ్యమంత్రి, కొత్తగా జీవో నం.29 తేవడంతో ఆయా వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఓపెన్ కాంపిటీషన్‌లో మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు సాధిస్తే రిజర్వేషన్లలో ఆ సంఖ్యను తగ్గించడం ఆక్షేపణీయం. రిజర్వేషన్లలో కోత విధించడం సమంజసం కాదు' అని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగ యువతపై కాంగ్రెస్ ప్రభుత్వ కర్కశ దాడి, అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామని చెప్పారు. సిద్దిపేటలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "నిరుద్యోగ యువత రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తే లాఠీఛార్జి చేస్తూ కఠినంగా వ్యవహరిస్తున్నారు. అక్రమ కేసులతో ఇబ్బంది పెడుతున్నా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల్లో చలనం లేదు. విద్యార్థులు, యువత హంతకులా. . టెర్రరిస్టులా? వారితో వ్యవహరిస్తున్న తీరు సబబు కాదు. సీఎం రేవంత్‌రెడ్డి లాఠీలు, ఇనుప కంచెలను నమ్ముకున్నారు. ఎలాంటి భద్రత లేకుండా అశోక్‌నగర్‌కు వెళ్లి సెంట్రల్ లైబ్రరీలో కూర్చొని నిరుద్యోగ యువతతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలి.

వారికే ఉద్యోగాలు వచ్చాయి.. నిరుద్యోగులకు కాదు

కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో భాగంగా ప్రకటించిన యూత్ డిక్లరేషన్ అమలు చేయలేదు. యువతను అణచివేస్తే ఉద్యమం ఉద్ధృతంగా మారుతుంది. నిరుద్యోగుల గొంతుకగా ఉంటానన్న కోదండరాం ఎమ్మెల్సీ అయిన తరవాత మౌనంగా ఉంటున్నారు. కోదండరాం, ఆకునూరి మురళి, తీన్మార్ మల్లన్నకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు రాలేదు. వానాకాలం రైతుబంధు ఇవ్వబోమంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చావుకబురు చల్లగా చెప్పారు. ఈ విషయంలో సీఎం క్షమాపణ చెప్పాలి" అని హరీశ్‌రావు అన్నారు.

హరీశ్ సవాల్‌ను స్వీకరిస్తున్నా..

● ఎల్బీ స్టేడియంలో చర్చకు సిద్ధం
● మంత్రి జూపల్లి సవాల్



హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ వచ్చినప్పుడు రాష్ట్ర ఆదాయం, పదేళ్ల భారాస పాలనలో చేసిన అప్పు, అవినీతి, ఎవరెంత దోచుకున్నారో ఆ పార్టీ నేతలతో చర్చించడానికి తాను సిద్ధమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తనతో చర్చకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు.. ఎవరొస్తారో రావాలని సవాల్ చేశారు. ఎల్బీ స్టేడియంలో ప్రజలు, మీడియా ముందు బహిరంగ చర్చ పెడదామని, అన్ని అంశాలపై చర్చిద్దామని అన్నారు. భారాస నేతల అవినీతిని ఆధారాలతో సహా బయటపెడతానని చెప్పారు. ఆయన శనివారం గాంధీభవన్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "మల్లన్నసాగర్‌పై చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్ చేశారు. ఆయన సవాల్‌కు రేవంత్ రావాల్సిన అవసరం లేదు, ఆ సవాల్‌ను నేను స్వీకరిస్తున్నా. పదేళ్లలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సహా భారాస నేతల ఆదాయం పెరిగింది. దేశంలోనే సంపన్న ప్రాంతీయ పార్టీగా భారాస ఎలా ఎదిగింది? మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాల్లో విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లారు. ఆ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు తామే నీతిమంతులం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారు. మూసీ నిర్వాసితులపై కపట ప్రేమ చూపిస్తున్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తే వారికి రాజకీయంగా మాట్లాడడానికి ఏం ఉండదని కేటీఆర్, హరీశ్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వారి మాటల్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. భారాస సర్కారే 2016లో మూసీ ఒడ్డు నుంచి 50 మీటర్లు బఫర్ జోన్ అని జీవో తెచ్చింది. అందులో నా ఇల్లు కూడా పోతుంది" అని జూపల్లి తెలిపారు.

చెదిరిన జీవితాలకు చేయూతనిస్తున్నారు..



జాస్తి సరోజినీదేవి (కీ.శే.జాస్తి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం), హైదరాబాద్

విరాళం: రూ.1,00,000

దర్జాగా జీవించిన కుటుంబాలను భారీ వరద భయపెట్టింది. నిలువ నీడ లేకుండా చేసింది. అడుగు తీసి అడుగు వేయలేని దిక్కుతోచని స్థితిలో బాధితులు చిక్కుకుపోయారు. వారు చెమటోడ్చి కూడబెట్టిన ఆహార గింజలు, నిత్యావసరాలు కొట్టుకుపోయాయి. పొట్టచేత పట్టుకుని బయటపడ్డ నిర్వాసితులను ఆదుకునేందుకు మానవతామూర్తులు ముందుకొస్తున్నారు. విరివిగా విరాళాలు అందజేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయ నిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
లంకిపల్లి భాస్కరనాయుడు, శాఖంవారిపల్లె, అన్నమయ్య జిల్లా	10,116
చలసాని రామబ్రహ్మం, శ్రీదేవి, హైదరాబాద్	10,000
డి.సరస్వతి, డి.గంగాధర్, సికింద్రాబాద్	6,000
అక్కినేని కృష్ణప్రసాద్, అక్కినేని అన్నపూర్ణాదేవి, సికింద్రాబాద్	5,225
కొడాలి పద్మజ, హైదరాబాద్	5,021
యానాపు రవికుమార్ (కీ.శే.యానాపు పాండురంగాచారి, కీ.శే.అనసూయమ్మ గార్ల జ్ఞాపకార్థం), హైదరాబాద్	5,001
మంగెన రాధాకృష్ణమూర్తి, లక్కవరం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా	5,000
బచ్చిన రాజేశ్వరి, హిందూపురం	5,000

ఆపద సమయం.. అండగా నిలుద్దాం

గమనిక: వరద విపత్తులో చిక్కుకుని.. సర్వం కోల్పోయి విలవిల్లాడుతున్న అభాగ్యులను ఆదుకునేందుకు ఈనాడు వరద సహాయ నిధి ఇచ్చిన పిలుపునకు ఎంతోమంది మానవత్వంతో ఉదారంగా స్పందించారు, స్పందిస్తున్నారు. విరాళాలు అందించిన వారి పేర్లను నిత్యం పత్రికలో ప్రచురిస్తున్నాం. అయితే కొందరు విరాళాలను బ్యాంకు ఖాతాకు జమ చేసి కూడా తమ పాన్ నంబరు, చిరునామా వివరాలను మాకు పంపలేదు. ఇటువంటి వారందరూ సత్వరమే తమ 1. పేరు, 2. పాన్ నంబరు. 3. చిరునామా వివరాలను మా 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపిస్తే వారి పేర్లను ప్రచురించగలము.

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి.
1. దాత పేరు 2. పూర్తి చిరునామా
3. పాన్‌కార్డు నంబరు.
● ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063



మీ ఇల్లు కూడా ఓ పాఠశాలే

మీ పిల్లలకు ఇల్లు కూడా ఓ పాఠశాల లాంటిదే. వారికి అనుబంధాల విలువ తెలియజెప్పాల్సింది, ఇతరుల పట్ల దయతో మెలుగుతూ ప్రేమను వ్యక్తపరచడమెలాగో నేర్పాల్సింది, శాంతియుత సామాజిక జీవితాన్ని అలవర్చుకొనేలా చేయాల్సిందీ తల్లిదండ్రులే. అయితే వీటన్నింటినీ మీరు స్వయంగా పాటించడం ద్వారానే మీ పిల్లలకు నేర్పగలరు. మీ పిల్లలను మీరు గౌరవిస్తూ, ప్రేమను పంచినప్పుడే వారు సమాజాన్ని ప్రేమించగలరు.
– బ్రాండన్ మూర్, పేరెంటింగ్ కోచ్



ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద బైఠాయించిన భాజపా ఎంపీ ఈటల రాజేందర్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ✦ ఆందోళనకారులపై లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు

సికింద్రాబాద్ బంద్ ఉద్రిక్తం

● ఆందోళనకారులపై లాఠీఛార్జి
● ఆరుగురికి గాయాలు.. 15 మంది పోలీసులకూ..

ఈనాడు, హైదరాబాద్, రెజిమెంటల్‌బజార్, కంటోన్మెంట్, సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ బంద్ ఉద్రిక్తంగా మారింది. కుమ్మరిగూడలోని ఆలయంలో విగ్రహం విధ్వంసంపై హిందూ సంఘాలు శనివారం చేపట్టిన బంద్‌లో ఆందోళనకారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన లాఠీఛార్జిలో ఆరుగురు గాయపడ్డారు. నిందితుడు బసచేసిన హోటల్‌పైకి ఆందోళనకారులు పరుగులు తీయగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లకు తరలించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈనెల 14న కుమ్మరిగూడలోని ఆలయంలోకి అక్రమంగా చొరబడిన ముంబయికి చెందిన వ్యక్తి(30) విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ హిందూ సంఘాలు శనివారం సికింద్రాబాద్ బంద్‌కు పిలుపునిచ్చాయి. అక్కడి వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, హిందూ వాహిని సంఘాలతో కలిసి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం వద్ద బైఠాయించి హనుమాన్ చాలీసా పఠించారు. అనంతరం అక్కడి నుంచి హిందూసంఘాల కార్యకర్తలు ర్యాలీగా కుమ్మరిగూడ ఆలయం వద్దకు చేరారు. నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో వాటర్ బాటిళ్లు, రాళ్లు విసిరారు. పోలీసులు లాఠీఛార్జి చేయడంతో ఆరుగురు యువకుల తలలకు గాయాలయ్యాయి. రాళ్ల దాడిలో 15 మంది పోలీసులకు స్వల్పగాయాలయ్యాయి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మరింత మంది యువకులు అక్కడికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వారు ఆలయం సమీపంలోనే బైఠాయించి అక్కడే భోజనాలు చేసి నిరసన తెలిపారు. నగర అదనపు సీపీ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీపీలు విజయ్‌కుమార్, సాధన రష్మి పెరుమాళ్, సుధీంద్ర, చైతన్య శాంతిభద్రతలను పర్యవేక్షించారు. విగ్రహం విధ్వంసం కేసులో అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఉత్తరమండలం డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ స్పష్టం చేశారు. నిందితుడు బస చేసిన హోటల్‌ను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

యంత్రాంగం ఉదాసీనం: ఈటల

విగ్రహం ధ్వంసం వెనక ఉన్న శక్తులు ఏవో ఇప్పటి వరకు ప్రకటించని ప్రభుత్వం నిరసనకారుల తలలు పగిలేలా లాఠీఛార్జి చేయించిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఒక ప్రకటనలో ఖండించారు. మెట్రో పోలిస్ హోటల్‌లో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా తరగతులు జరుగుతున్నా యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై పోలీసుల లాఠీఛార్జి దుర్మార్గం, అప్రజాస్వామికమని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) మండిపడింది. లాఠీఛార్జి చేసిన పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ ప్రచార ప్రముఖ్ పి.బాలస్వామి డిమాండ్ చేశారు.

గ్రూప్-1పై ప్రభుత్వం అప్రమత్తం

నేడు కీలక ప్రకటన చేసే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలని అభ్యర్థులు ఆందోళనకు దిగడం.. వారికి ప్రతిపక్షాలు సైతం మద్దతు పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. దీనిపై ఆదివారం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ నెల 21వ తేదీ నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను కొద్దిరోజులు వాయిదా వేయాలని, జీవో 29ను రద్దు చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి మద్దతుగా నిరుద్యోగులు హైదరాబాద్‌లో గత కొన్ని రోజులుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంత్రుల నివాస ప్రాంగణంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ శనివారం రాత్రి ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు. అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ప్రతి అభ్యంతరంపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం సేకరించారు. గ్రూప్-1 పరీక్షను అసలు వాయిదా వేయడం సాధ్యమా అనే కోణంలో అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా మూడు గంటలపాటు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు ఉన్నతాధికారులతో చర్చించారు. జీవో 29పై వస్తున్న విమర్శలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారమే పరీక్షలు ఉన్నందువల్ల ఆదివారం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తే కష్టపడి చదువుకున్న అభ్యర్థుల నుంచి ప్రతికూలత వస్తుందని కూడా చర్చించినట్లు తెలుస్తోంది. పరీక్షను వాయిదా వేయకుండా, ఏ ఒక్క అభ్యర్థీ నష్టపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు చర్చించారు. ఆదివారం మరోమారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి ప్రభుత్వం తుది నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వంపై బురదజల్లడమే ప్రతిపక్షాల లక్ష్యం: ఎంపీ చామల

హైదరాబాద్, న్యూస్‌టుడే: గ్రూప్-1 మెయిన్స్ ఆపి, ప్రభుత్వంపై బురద జల్లడమే ప్రతిపక్షాల లక్ష్యమని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం విమర్శించారు. 'కేంద్రమంత్రి బండి సంజయ్‌కు కోర్టుల మీద గౌరవం లేదా? రోడ్ల మీద రచ్చ చేయడం దుర్మార్గం. విద్యార్థులు కానివారితో కేటీఆర్ సుప్రీంకోర్టులో కేసు వేయించారు. ప్రవళిక అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న రోజు కేటీఆర్ ఎక్కడికి పోయారు' అని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతను భాజపా, భారాస నేతలు రెచ్చగొడుతున్నారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మందుల సామేల్‌లు విమర్శించారు.

రైతు భరోసా ఎగ్గొట్టిన సర్కారును ఎండగడదాం

● నేడు మండల కేంద్రాల్లో నిరసనలు: కేటీఆర్

హైదరాబాద్, న్యూస్‌టుడే: రైతన్నలకు రైతు భరోసా డబ్బులు ఇచ్చే దాకా వదిలేది లేదని కేటీఆర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వర్షాకాల రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈనెల 20న అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని విధాలుగా రైతులను ఏడిపిస్తున్న కాంగ్రెస్‌కు అన్నదాతల ఉసురు తప్పదన్నారు. రైతు భరోసాకు డబ్బులు లేకపోవడంతోనే సబ్ కమిటీ అంటూ డ్రామాలు మొదలు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ గెలిస్తే రైతుబంధుకు రాం రాం చెబుతారన్న కేసీఆర్ మాటలను రేవంత్‌రెడ్డి సర్కార్ నిజం చేసిందన్నారు. 'కేసీఆర్ రూ.10 వేలు ముష్టి వేస్తున్నారు.. మేము రూ.15 వేలు ఇస్తాం అన్న సిపాయి ఎక్కడకు పోయారు' అని కేటీఆర్ ప్రశ్నించారు.

భాజపా, కాంగ్రెస్‌లది దిల్లీలో కుస్తీ.. తెలంగాణలో దోస్తీ: నిరంజన్‌రెడ్డి

భాజపా, కాంగ్రెస్ పార్టీలది దిల్లీలో కుస్తీ, తెలంగాణలో దోస్తీ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డిని సీఎం కుర్చీ నుంచి దింపేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై శనివారం ఆయనొక ప్రకటనలో స్పందించారు. రేవంత్ కుర్చీ గురించి సంజయ్‌కి ఎందుకు బాధ అని ప్రశ్నించారు. రేవంత్‌కు ప్రజల్లో వ్యతిరేకత పెంచుతున్న, ఆయనను ముఖ్యమంత్రి పదవిని దించబోయే కాంగ్రెస్ నేతలు ఎవరో కూడా సంజయ్ వెల్లడిస్తే బాగుండేదన్నారు. మూసీ బాధితులు నెత్తీనోరు బాదుకుంటుంటే భాజపా నేతలు స్పందించడం లేదని, రేవంత్ సర్కారుకు అనధికారిక మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు.

బస్తీ దవాఖానా సహాయక సిబ్బంది వేతన బకాయిలు చెల్లించాలి

● ఎన్‌హెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్న సహాయక(సపోర్టింగ్) సిబ్బందికి రావాల్సిన 5 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ బస్తీ దవాఖానా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది.. కోఠిలోని జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) సంచాలకుల కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, అమ్జద్ అలీఖాన్, తెజస కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. బస్తీ దవాఖానాల్లో ఒప్పంద, పొరుగు సేవల్లో 500 మంది సపోర్టింగ్ సిబ్బందికి సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



చేరని నీరు.. తేలిన పచ్చికబయళ్లు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లాలో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్‌కు పైనుంచి నీరు తక్కువగా వదలడంతో ప్రస్తుతం 21 టీఎంసీల నిల్వే ఉంది. సగానికి పైగా లోటు ఉండటంతో కుకునూరుపల్లి మండలం మంగోల్ శివారులోని జలాశయం కట్ట సమీపంలో నీరు తగ్గి పచ్చిక బయళ్లు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతం మూడు వైపులా నీరు, మరో వైపు పచ్చికబయళ్లతో చూడటానికి చిన్నపాటి ద్వీపంలా కనిపిస్తోంది. – న్యూస్‌టుడే, కొండపాక గ్రామీణం

బీసీ మేధావులతో కమిషన్ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల ఖరారు కుల సర్వే ప్రాతిపదికన జరగాలని బీసీ మేధావులు, నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ ఆధ్వర్యంలో బీసీ మేధావులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, మాజీ ఎంపీ వీహెచ్, జస్టిస్ చంద్రకుమార్, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు, డాక్టర్ వినయ్‌కుమార్, ప్రొఫెసర్ మురళీ మనోహర్, ఐ.తిరుమలి, ఎం.బాగయ్య, సింహాద్రి, శ్యామ్‌మోహన్, డాక్టర్ షేక్ అబ్దుల్ ఘని తదితరులు హాజరయ్యారు. సర్వే సమయంలో అందించాల్సిన సమాచారంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు.


సుజాత అరెస్టు ప్రచారం బూటకం

మావోయిస్టు పార్టీ

చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత అలియాస్ మైనాబాయి అరెస్టయ్యారంటూ కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ ఖండించింది. ఇదంతా పాలకవర్గాల బూటకపు ప్రచారమని ఆ పార్టీ దక్షిణ సబ్ జోనల్ బ్యూరో అధికార ప్రతినిధి 'సమత' శనివారం విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. సామ్రాజ్యవాదుల దోపిడీ ప్రయోజనాలకు అడ్డంకిగా మారిన మావోయిస్టు పార్టీని నిర్మూలించడానికి కేంద్రం, ఛత్తీస్‌గఢ్‌లోని భాజపా, తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు ఒక్కటయ్యాయని విమర్శించారు. ఉద్యమంపై సామ దాన భేద దండోపాయాలను అమలుచేస్తున్నాయని, అందులో భాగంగానే సుజాత అరెస్టయినట్లు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంతో కుమ్మక్కై కార్పొరేట్ల ప్రయోజనాలకు కొమ్ముకాస్తోందని, ఇందులో భాగంగానే దామగుండంలో రాడార్ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతించిందని విమర్శించారు.


నేటి శారీరక శ్రమ.. భావి మానసిక చురుకుదనానికి బాట!

లండన్: నిద్ర, వ్యాయామం, గుండె కొట్టుకునే రేటు, భావోద్వేగాల ప్రభావాలు మన మెదడుపై రెండు వారాలకుపైగా కొనసాగుతాయని తాజా అధ్యయనం తేల్చింది. కొందరు పరీక్షార్థుల మెదడు, వ్యవహారశైలిని స్కాన్‌లు, వేరబుల్ సాధనాలు, స్మార్ట్‌ఫోన్ల సాయంతో ఐదు నెలల పాటు పర్యవేక్షించిన ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ మేరకు నిర్ధారించారు. మన వ్యవహారశైలి, మానసిక స్థితిని పరిసరాలు, అనుభవాలు నిరంతరం తీర్చిదిద్దుతుంటాయి. అయితే, ఇవి మెదడుపై ఎంతకాలంపాటు ప్రభావం చూపుతాయన్నదానిపై శాస్త్రవేత్తలకు ఇప్పటివరకూ పెద్దగా అవగాహన లేదని పరిశోధనకు నాయకత్వం వహించిన అన్నా ట్రియానా పేర్కొన్నారు. రోజువారీ జీవితానికి సంబంధించిన అంశాలపై మెదడు అప్పటికప్పుడు, ప్రత్యేకించి స్పందించదని తమ పరిశోధనలో తేలినట్లు తెలిపారు. గత కొన్నిరోజులుగా నిద్ర పోకడ, శారీరక శ్రమ, భావోద్వేగాలు, శ్వాసరేటు సాగుతున్న తీరుకు స్పందనగా మెదడు చర్యలు రూపాంతరం చెందుతాయని గుర్తించామన్నారు. అంటే.. గత వారం చేసిన శారీరక వ్యాయామాలు లేదా అనుభవించిన నిద్రలేమి వంటివి వచ్చేవారం కూడా మన మెదడుపై ప్రభావం చూపుతాయని వెల్లడైందన్నారు. ఈ క్రమంలో మన శ్రద్ధ, విషయగ్రహణ సామర్థ్యం, జ్ఞాపకశక్తి ప్రభావితమవుతాయని తెలిపారు. గుండె కొట్టుకునే రేటులో మార్పులు.. మెదడు పనితీరుపై ప్రభావం చూపుతాయని కూడా తాజా పరిశోధనలో తేలింది. శారీరక శ్రమ.. మెదడులోని భిన్న ప్రాంతాల మధ్య పరస్పరం చర్యలు జరిగే తీరుపైనా సానుకూల ప్రభావం చూపగలదని వెల్లడైంది. భావోద్వేగాలు, గుండె స్పందన రేటులో స్వల్ప మార్పులు వచ్చినా.. దాని ప్రభావం తదుపరి 15 రోజుల వరకూ మెదడుపై కొనసాగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.



జ్ఞాన నేత్రం

తాజా సాంకేతిక పరిణామాలను సివిల్ సర్వెంట్లు గుర్తెరగాలి: ప్రధాని



దిల్లీ: పెరుగుతున్న జీవన ప్రమాణాల నేపథ్యంలో పౌరుల అవసరాలకు తగినట్లుగా పనిచేయాలంటే సివిల్ సర్వెంట్లు తాజా సాంకేతిక పరిణామాలను గుర్తెరగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో శనివారం 'కర్మయోగి శపథ్' పేరిట జాతీయ అభ్యసన వారం ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మాట్లాడారు. కొత్త ఆలోచనల కోసం స్టార్టప్ కంపెనీలు, పరిశోధన సంస్థలు, యువత సాయం తీసుకోవాలన్నారు. కృత్రిమమేధతో సమాచార ప్రక్రియ చాలా సులువుగా మారిందని, పౌరులకు సమాచారం అందించడంతోపాటు ప్రభుత్వ కార్యకలాపాలు అన్నింటిపై నిఘా పెట్టడానికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. ఇందులో మిషన్ కర్మయోగి ఉపయోగపడుతుందన్నారు. "కృత్రిమ మేధను యావత్ ప్రపంచం ఓ అవకాశంగా చూస్తోంది. భారత్‌కు మాత్రం ఇది ఓ సవాలు.. అవకాశం కూడా. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), యాస్పిరేషనల్ ఇండియా (ఏఐ /ఆకాంక్షలతో కూడిన భారత్)ల నడుమ మనం సమతుల్యత పాటించాలి. ఇందులో విజయం సాధించి కృత్రిమమేధను చక్కగా వాడుకోగలిగితే సానుకూల మార్పులను చూడవచ్చు. 2047 నాటికి మన లక్ష్యమైన వికసిత్ భారత్‌ను సాధించవచ్చు" అని ప్రధాని అన్నారు.

నెతన్యాహు నివాసమే లక్ష్యంగా..

- డ్రోన్లను ప్రయోగించిన హెజ్‌బొల్లా
- ప్రధాని సురక్షితమన్న ఇజ్రాయెల్
- కొనసాగుతున్న ఐడీఎఫ్ దాడులు
- గాజాలో 50 మంది మృతి

జెరూసలెం, బీరుట్: హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ హత్యకు ప్రతీకారంగా హెజ్‌బొల్లా శనివారం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసంపై డ్రోన్ల దాడి చేసింది. మొత్తం మూడు డ్రోన్లను ప్రయోగించింది. ఇందులో ఒకటి ఉత్తర ఇజ్రాయెల్‌లోని సెసెరియా నగరంలో ప్రధాని నివాసం ఉన్న భవనాన్ని తాకింది. ఆ సమయంలో ఇంటిలో నెతన్యాహు, ఆయన భార్య లేరని ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలిపాయి. లెబనాన్ నుంచి దూసుకొచ్చిన మూడు డ్రోన్లల్లో రెండింటిని మధ్యలోనే కూల్చివేశామని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) పేర్కొంది. ఒక డ్రోన్ మాత్రం ఓ భవనాన్ని తాకిందని తెలిపింది. ఏ మేరకు నష్టం వాటిల్లిందన్న వివరాలను వెల్లడించలేదు. ఇజ్రాయెల్ మాత్రం ఈ దాడులు ఇరాన్ పనేనని ఆరోపిస్తోంది. ఈ ఘటనపై నెతన్యాహు స్పందిస్తూ.. ఏ దాడులూ తమను అడ్డుకోలేవని అన్నారు. విజయాన్ని సాధించేవరకు యుద్ధాన్ని ఆపేదే లేదని తెలిపారు. మరోవైపు గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఉత్తర గాజాలో 50 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని బెకా లోయలో ఐదుగురు చనిపోయినట్లు ఆ దేశ ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. లెబనాన్ రాజధాని బీరుట్‌పైనా శనివారం ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది.

హమాస్ ఉనికికి ఢోకా లేదు: ఖమేనీ

హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను ఇజ్రాయెల్ దళాలు హతమార్చడంపై ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. సిన్వర్ మృతి బాధ కలిగిస్తోందని, అయినప్పటికీ అతడు అమరుడు కావడంతో అంతా అయిపోయినట్లు కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ దాడిలో అతడు చనిపోయినా హమాస్ ఇంకా ఉనికిలోనే ఉందని.. ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు.

హమాస్ నూతన అధిపతిగా ఖాలెద్ మషాల్



హమాస్ నూతన అధిపతిగా ఖాలెద్ మషాల్ ఎంపికయ్యారు. విదేశాల్లో హమాస్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న మషాల్.. సిన్వర్ స్థానాన్ని భర్తీ చేయనున్నట్లు లెబనాన్‌కు చెందిన ఎల్‌బీసీఐ న్యూస్ వెబ్‌సైట్ తెలిపింది. యూఏఈ, ఈజిప్టు, అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న గాజా కాల్పుల విరమణ చర్చల్లో ఇక నుంచి మషాల్ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని ఆ దేశాలకు హమాస్ నాయకత్వం తెలిపినట్లు వెబ్‌సైట్ పేర్కొంది.

70 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ పోటీ

ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ వెల్లడి



రాంచీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష ఇండియా కూటమి పక్షాలు ఉమ్మడిగానే పోటీ చేస్తాయని జేఎంఎం నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. మొత్తం 81 స్థానాలకుగాను 70 సీట్లలో జేఎంఎం, కాంగ్రెస్ బరిలో ఉంటాయన్నారు. మిగిలిన 11 స్థానాల్లో సీట్ల సర్దుబాటుపై ఆర్జేడీ, లెఫ్ట్ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని శనివారం వెల్లడించారు. మిత్ర పక్షాలతో సంప్రదింపులు కొలిక్కి వచ్చిన తర్వాత అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

ఆర్జేడీ అసంతృప్తి

సీట్ల సర్దుబాటుపై హేమంత్ సోరెన్ చేసిన ప్రకటన పట్ల మిత్రపక్షమైన ఆర్జేడీ అసంతృప్తి వ్యక్తం చేసింది. జేఎంఎం, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీ చేస్తాయనడం ఏకపక్ష నిర్ణయంగా ఉందని ఆర్జేడీ అధికార ప్రతినిధి మనోజ్ కుమార్ తెలిపారు.

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు 66 మంది అభ్యర్థులతో భాజపా తొలి జాబితా

దిల్లీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు తమ అభ్యర్థుల తొలి జాబితాను భాజపా శనివారం విడుదల చేసింది. ఒకే విడతలో 66 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ధన్వార్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ, సరాయ్‌కెలా నుంచి మాజీ సీఎం చంపయీ సోరెన్ పోటీ చేయనున్నారు. ఇదే జాబితాలో రాష్ట్ర సీఎం, జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్, కేంద్ర మాజీ మంత్రి సుదర్శన్ భగత్, గీతా కోడా పేర్లున్నాయి. మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకుగాను భాజపా 68 సీట్లలో పోటీ చేస్తుండగా మిగిలినవాటిని మిత్రపక్షాలకు కేటాయించింది.

ఒకేరోజు 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

- వాటిలో హైదరాబాద్-చండీగఢ్ విమానం కూడా..

దిల్లీ: దేశంలో విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. శనివారం ఒక్కరోజే విస్తారా, ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్, స్టార్‌ఎయిర్, అలయన్స్ ఎయిర్ సహా వివిధ భారతీయ విమానయాన సంస్థలకు చెందిన 30కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు రావడం గమనార్హం. వీటిలో హైదరాబాద్-చండీగఢ్ ఇండిగో విమానం కూడా ఉంది. అది గమ్యస్థానానికి చేరిన తర్వాత ప్రయాణికుల్ని సురక్షితంగా దింపి, తనిఖీలు నిర్వహించారు. వారం రోజుల వ్యవధిలో దాదాపు 70 విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయనీ, ఇవన్నీ ఉత్తుత్తివేనని అధికారులు తేల్చారు. తాజాగా.. బెంగళూరు నుంచి ముంబయికి వెళ్లేందుకు టేకాఫ్‌కు సిద్ధమైన ఆకాశ ఎయిర్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దిల్లీ నుంచి లండన్ బయల్దేరిన విస్తారా విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు దారిమళ్లించారు. దిల్లీ-పారిస్ విస్తారా విమానాన్ని కూడా అత్యవసరంగా దించేశారు. ఇవన్నీ నకిలీ బెదిరింపులేనని అధికారులు తేల్చారు. బెదిరింపుల కలకలం నేపథ్యంలో 'పౌర విమానయాన భద్రత మండలి' (బీసీఏఎస్) అప్రమత్తమైంది. వివిధ విమానయాన సంస్థల సీఈఓలతో దిల్లీలో సమావేశం నిర్వహించింది. ప్రయాణికులకు అసౌకర్యం, సంస్థలకు నష్టం కలగకుండా ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రామాణిక నిర్వహణ విధానాన్ని అనుసరించాలని కోరింది.

మిగిలిన దౌత్యవేత్తలపైనా నిఘా: కెనడా



మెలానీ జోలీ

ఇంటర్నెట్‌డెస్క్: భారత్‌తో దౌత్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరి మారడం లేదు. ప్రధాని జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని ప్రభుత్వం మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ట్రూడో మాటల్నే తాజాగా కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. అక్కడున్న మిగిలిన దౌత్యవేత్తలపై నిఘా ఉంచామంటూ భారత్‌పై బురదజల్లే ప్రక్రియను కొనసాగించారు. రష్యా, భారత్ మధ్య పోలిక తెచ్చారు. "అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై అణచివేతకు పాల్పడటాన్ని సహించబోం. ఐరోపాలో ఇలాంటివి మేం చూశాం. జర్మనీ, బ్రిటన్‌లలో రష్యా ఆ పని చేసింది" అని జోలీ చెప్పారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలను కూడా బహిష్కరిస్తారా? అని అడగ్గా- వారిపై నిఘా ఉంచామని, వారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారని చెప్పారు.

డిసెంబరులోనే అరెస్టైన వికాస్ యాదవ్

దిల్లీ: సిక్కు వేర్పాటువాది పన్నూను అమెరికాలో హత్య చేసేందుకు కుట్రపన్నారనే అభియోగాలు ఎదుర్కొంటున్న భారతీయుడు వికాస్ యాదవ్‌ను దిల్లీ పోలీసులు గత డిసెంబరులో వేరే కేసులో అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరుతో ఓ వ్యాపారి నుంచి డబ్బు డిమాండ్ చేసిన కేసులో అరెస్టయిన యాదవ్‌కు ఈ ఏడాది ఏప్రిల్‌లో బెయిల్ లభించింది. యాదవ్ ఎంతమాత్రం భారత ప్రభుత్వ ఉద్యోగి కాదని విదేశీ వ్యవహారాల శాఖ ఇప్పటికే అమెరికాకు స్పష్టంచేసింది.



కష్టాలు.. మన పాలిట ఆశీర్వాదాలు

మీరు విజయాలు సాధించినప్పుడు, ఆనందంగా ఉన్నప్పుడు మాత్రమే దేవుడికి కృతజ్ఞతలు చెప్పడం కాదు.. పరాజయాలు పలకరించినప్పుడూ, బాధల్లో ఉన్నప్పుడు కూడా ధన్యవాదాలు తెలపండి. ప్రతికూలతలు ఎదురైనప్పుడే జీవితాన్ని మార్చుకోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతారు. అంటే కష్టాలన్నవి మన మంచి కోరి దేవుడిచ్చిన ఆశీర్వాదాలన్నమాట.

– టైలర్ టాడ్, ఫిట్‌నెస్ కోచ్

ఎన్‌సీడబ్ల్యూ కొత్త ఛైర్‌పర్సన్‌గా విజయా కిశోర్ రహాట్కర్



ఈనాడు, దిల్లీ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) 9వ ఛైర్‌పర్సన్‌గా విజయా కిశోర్ రహాట్కర్ నియమితులయ్యారు. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ శనివారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. మూడేళ్లపాటు లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు (ఏదీ ముందు అయితే అది) ఆమె ఈ పదవిలో ఉంటారు. ఆమె నియామకం వెంటనే అమలులోకి వస్తుందని ప్రభుత్వం పేర్కొంది. విజయ 2016-21 మధ్య మహారాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేశారు. 2007-10 మధ్యకాలంలో ఛత్రపతి శంభాజీనగర్ మేయర్‌గానూ సేవలందించారు. ఈమె మహిళల న్యాయపరమైన సమస్యలపై 'విధిలిఖిత్' అనే పుస్తకం రాశారు. మహిళల సాధికారతకు చేసిన కృషికి గానూ జాతీయ న్యాయ పురస్కారంతో పాటు, జాతీయ సాహిత్య మండలి నుంచి సావిత్రిబాయి పులే పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. మహారాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నప్పుడు యాసిడ్‌దాడి బాధితులను ఆదుకొనేందుకు 'సక్షమ', మహిళా స్వయం సహాయక సంఘాలను కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానించేందుకు 'ప్రజ్వల', మహిళలకు 24 గంటలు సహాయం అందించేందుకు వీలుగా 'సుహిత' హెల్ప్‌లైన్ అనే పథకాలను అమలుచేశారు. కమిషన్ సభ్యురాలిగా డాక్టర్ అర్చనా మజుందార్ నియమితులయ్యారు.

ఆదివాసీలపై మోదీ ప్రభుత్వ వివక్ష

- రాంచీ సదస్సులో రాహుల్‌గాంధీ విమర్శలు



రాంచీ: మన దేశ రాజ్యాంగంపై భాజపా దాడి చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను విభాగం తదితర కేంద్ర సంస్థలు అన్నింటినీ ఆ పార్టీ నియంత్రిస్తోందని ధ్వజమెత్తారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం రాంచీలో నిర్వహించిన 'సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్' కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. భారత రాజ్యాంగంపై అన్ని వైపుల నుంచి దాడి జరుగుతోందని, దానిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ నేతృత్వంలోని సర్కార్ ఆదివాసీలపై వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. 'అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించిన మోదీ ప్రభుత్వం... రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మాత్రం ఆహ్వానించలేదు. ఎందుకంటే ఆమె ఆదివాసీ కావడమే'నని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎంతో ఘనత కలిగిన గిరిజనుల వారసత్వం, చరిత్ర, సంప్రదాయాలు, వైద్య విధానాలను ధ్వంసం చేసేందుకు భాజపా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గిరిజనుల మూలాల గురించి బోధించడంలో మన విద్యావిధానం విఫలమైందని వ్యాఖ్యానించారు.

ఫార్మా కంపెనీ ఉద్యోగులకు దీపావళి కానుకగా కార్లు!



ఈటీవీ భారత్: హరియాణాకు చెందిన ఓ ఫార్మా కంపెనీ దీపావళి కానుకగా తమ ఉద్యోగులకు కార్లను పంపిణీ చేసింది. పంచకులలో ఉన్న ఈ కంపెనీ యజమాని ఎన్. కె. భాటియా ఉద్యోగులకు టాటా పంచ్, మారుతి గ్రాండ్ విటారా కార్లను పండుగ బహుమతిగా ఇచ్చారు. 'స్టార్ పెర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్'గా ఎంపికైన 15 మంది కంపెనీ ఉద్యోగులకు అక్టోబరు 14న ఈ కానుకలను అందించారు. ఈ కంపెనీ గతేడాది కూడా అత్యుత్తమ పనితీరు కనబర్చిన 12 మంది ఉద్యోగులకు ఇలాగే కార్లను ఇచ్చింది. ఈ వాహనాలను కంపెనీ పనికి వాడితే కారు ఇంధనం ఖర్చును సంస్థే భరిస్తుంది.

రష్యా తరఫున ఉత్తర కొరియా సైనికులు

- వీడియో ఆధారాన్ని విడుదల చేసిన ఉక్రెయిన్

కీవ్: రష్యాకు మద్దతుగా ఉత్తర కొరియా తన సైనికులను పంపిస్తోందన్న ఆరోపణలకు సాక్ష్యాలుగా ఉక్రెయిన్ ఓ వీడియోను విడుదల చేసింది. రష్యాలోని ఓ గుర్తు తెలియని ప్రాంతంలోని శిబిరం వద్ద వరుసలో నిలుచున్న ఉత్తర కొరియా సైనికులు రష్యా మిలటరీ దుస్తులను, ఆయుధాలను అందుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. శిక్షణ అనంతరం నవంబరు నెలలో వీరు కదన రంగంలోకి దిగే అవకాశం ఉందని ఉక్రెయిన్ అధికారి తెలిపారు. యుద్ధంలో ఉత్తరకొరియా కూడా పాల్గొంటోందన్న విషయాన్ని అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్లడానికి, పశ్చిమ దేశాల నుంచి మరింత ఆయుధ సహాయాన్ని పొందటానికి ఉక్రెయిన్ ఈ వీడియోను వినియోగించుకునే అవకాశం ఉంది. దాదాపు 11వేల మంది ఉత్తర కొరియా సైనికులు తూర్పు రష్యాలో శిక్షణ పొందుతున్నారని ఉక్రెయిన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉక్రెయిన్ ప్రతిపాదనకు ఫ్రాన్స్ మద్దతు

తమపై దండయాత్రకు ముగింపు పలికేట్లు రష్యాను సంప్రదింపుల ద్వారా ఒప్పించాలన్న ఉక్రెయిన్ ప్రతిపాదనకు ఫ్రాన్స్ మద్దతు ప్రకటించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనను విజయ ప్రణాళికగా వర్ణిస్తున్నారు. దీనిని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జాన్ నోయెల్ బారో శనివారం సమర్థించారు. ఇతర దేశాల మద్దతునూ కూడగట్టడానికి ఉక్రెయిన్‌కు తోడ్పడతానని తెలిపారు. మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఇ) మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్‌లు శుక్రవారం రాత్రి 190 మంది యుద్ధ ఖైదీలను ఇచ్చిపుచ్చుకున్నాయి.

సుప్రీంకోర్టుది.. విపక్షపాత్ర కాదు

- అనుకూలంగా తీర్పు వస్తే పొగడటం.. వ్యతిరేకంగా వస్తే విమర్శించడం మానుకోవాలి
- ఇది ప్రమాదకర ధోరణి
- ఎస్‌సీఏఓఆర్ఏ సదస్సులో సీజేఐ డి.వై.చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు



పణజీ: సుప్రీంకోర్టు ప్రజా న్యాయస్థానమని.. దాన్ని అలానే పరిరక్షించి భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పేర్కొన్నారు. ప్రజా కోర్టు అయినంత మాత్రాన పార్లమెంటులో విపక్షాల పాత్రను తాము పోషించనక్కర్లేదని తెలిపారు. దక్షిణ గోవాలో శనివారం జరిగిన సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ ఆన్ రికార్డు అసోసియేషన్ (ఎస్‌సీఏఓఆర్ఏ) సదస్సు తొలి సమావేశంలో సీజేఐ ప్రసంగించారు. ఈ సందర్భంగా సమాజంలో విభజన భారీస్థాయిలో ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. తీర్పు అనుకూలంగా వస్తే సుప్రీంకోర్టు గొప్ప వ్యవస్థ అని పొగడటం, వ్యతిరేకంగా వస్తే విమర్శలు గుప్పించడం ఓ అలవాటుగా మారిపోయిందని అన్నారు. ఇది ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు. న్యాయపరంగా తప్పులు చేస్తే విమర్శలు స్వీకరించడానికి న్యాయమూర్తులు సిద్ధంగా ఉన్నారని, అలా కాకుండా వ్యతిరేకంగా తీర్పులు వచ్చినప్పుడు మాత్రమే తప్పుబడితే కష్టంగా ఉంటుందని అన్నారు. న్యాయస్థానాల్లో జరుగుతున్న విచారణలు ప్రత్యక్ష ప్రసారం కావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. "లైవ్ స్ట్రీమింగ్‌తో భారతీయుల గృహాల్లోకి, హృదయాల్లోకి సుప్రీంకోర్టు వెళ్లింది. కేవలం గొప్పోళ్ల కేసులను మాత్రమే సుప్రీంకోర్టు విచారిస్తుందన్న ఓ ముద్ర ఉంది. ప్రత్యక్ష ప్రసారాలతో అది పోయింది. పౌరుల చిన్న సమస్యలనూ ఆలకిస్తామని అందరికీ తెలిసింది" అని సీజేఐ తెలిపారు. ఉత్తర గోవాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో అసభ్యపదజాలానికి చోటు లేదని అన్నారు. ముఖ్యంగా మహిళలపై, దుర్బల వర్గాలపై ప్రయోగించే అనుచిత పదాలు వారిపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని పేర్కొన్నారు. న్యాయదేవత ప్రతిమకు తాజాగా తాను చేసిన మార్పులపై సీజేఐ మాట్లాడుతూ... చట్టం గుడ్డిది కాదని, అందరినీ సమానంగా చూస్తుందని చెప్పారు.

వాతావరణ మార్పులపై ఆందోళన

సమాజంలో దుర్బల వర్గాలనే వాతావరణ మార్పులు ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆందోళన వ్యక్తంచేశారు. గోవా గవర్నర్ పి.ఎస్. శ్రీధరన్ పిళ్లై రాసిన "ట్రెడిషనల్ ట్రీస్ ఆఫ్ భారత్" పుస్తకావిష్కరణలో ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని మెరుగుపరిచేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. "నిన్న కూడా గోవాలో వర్షం కురిసిందని చెప్పారు. ఈ సమయంలో మత్స్యకారులు సముద్రానికి నైవేద్యంగా కొబ్బరి కాయలు కొడతారు. కానీ ఇప్పుడు అక్టోబరులోనే కాదు.. డిసెంబరులోనూ వర్షాలు కురుస్తున్నాయి" అని చెప్పారు. రైతులు, మత్స్యకారులు లాంటి వర్గాలే వాతావరణ మార్పులతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

తలకు గాయమైతే.. పొత్తికడుపుపై సర్జరీ గుర్తులు!

కటక్: తలకు గాయమై ఆసుపత్రిలో చేరితే పొత్తికడుపుపై శస్త్రచికిత్స చేసిన గుర్తులు ఉన్నాయని ఓ కేసులో మృతుడి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు పూడ్చిపెట్టిన మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వెలికితీశారు. ఒడిశాలోని కటక్‌లో ఈ ఘటన జరిగింది. అక్టోబరు 13న బాబులాదిగల్ అనే వ్యాపారి తన భార్య, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై రాంపూర్‌కు వెళ్తుండగా.. మినీ ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాబులాదిగల్ తలకు గాయమైంది. కుటుంబ సభ్యులు కటక్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అతణ్ని తీసుకువెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ మూడు రోజుల తర్వాత బాబులాదిగల్ మృతిచెందాడు. అంత్యక్రియల సమయంలో అతడి పొత్తికడుపుపై కత్తిగాట్లను గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసు అధికారి సుశాంత్ సాహు తెలిపారు. బాబులాదిగల్ కుటుంబసభ్యుల ఆరోపణను ఆసుపత్రి మేనేజరు ఖండించారు. ఒడిశా ఆరోగ్య శాఖ మంత్రి ముకేశ్ మహలింగ్ ఈ వివాదంపై విచారణకు ఆదేశించారు.

యూపీలో ఐదేళ్ల చిన్నారిపై ముగ్గురు మైనర్ల అత్యాచారం

బలియా, బదాయూ: ఐదేళ్ల చిన్నారిపై ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో వెలుగుచూసింది. బలియా జిల్లాలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ముగ్గురు మైనర్లు యజమాని కుమార్తెపై ఇంటి మేడమీద అత్యాచారానికి పాల్పడ్డారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనా ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు శనివారం పోలీసులు వెల్లడించారు. నిందితులంతా 16 ఏళ్ల లోపువారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

అత్యాచారాన్ని ప్రతిఘటించడంతో ఏడేళ్ల బాలికను కొట్టి చంపాడు

యూపీలోనే మరో దారుణం చోటుచేసుకుంది. బదాయూ జిల్లాలో ఏడేళ్ల బాలికను అపహరించిన 22 ఏళ్ల వ్యక్తి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించి, ఇటుకతో కొట్టి చంపాడు. శుక్రవారం సాయంత్రం బాలిక మార్కెట్‌కు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాలిక తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా గాలించారని, ఓ పాడుబడిన ఇంట్లో అర్ధనగ్నంగా ఉన్న అమ్మాయి మృతదేహాన్ని గుర్తించారని పోలీసులు వెల్లడించారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని జానే ఆలాం (22)గా గుర్తించారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తనను గుర్తించిన పోలీసులపైకి నిందితుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. అత్యాచారం చేసేందుకు ప్రయత్నించినప్పుడు బాలిక కేకలు వేసిందని.. దీంతో ఆమెను పలుమార్లు గోడకు బాది, ఇటుకతో కొట్టి చంపానని విచారణలో నిందితుడు అంగీకరించాడు.

ఝార్ఖండ్ డీజీపీపై ఈసీ వేటు

రాంచీ: అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఝార్ఖండ్ రాష్ట్ర తాత్కాలిక డీజీపీ అనురాగ్ గుప్తాపై ఎన్నికల సంఘం (ఈసీ) వేటు వేసింది. గత ఎన్నికల సమయంలో ఆరోపణలు వచ్చిన నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఆ పదవి నుంచి అనురాగ్‌ను తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఈసీ ఆదేశించింది. రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల జాబితాను ఈ నెల 21లోగా అందజేయాలని సూచించింది. వీరిలో ఒకరిని తదుపరి డీజీపీగా నియమించే అవకాశం ఉంది.

8 లక్షల ఏళ్ల కిందటే మానవుల్లో 'కార్బోహైడ్రేట్ జన్యువులు'!

దిల్లీ: మానవుల్లో కార్బోహైడ్రేట్ల జీర్ణానికి సాయపడే జన్యువుల పరిణామక్రమం సుమారు 8లక్షల ఏళ్ల కిందటే మొదలైందని తాజా అధ్యయనం తేల్చింది. మనుషులు వ్యవసాయం మొదలుపెట్టడానికి చాలా కాలం ముందే ఈ పరిణామం జరిగినట్లు తెలిపింది. 68 పురాతన మానవ జన్యుక్రమాలను విశ్లేషించడం ద్వారా శాస్త్రవేత్తలు ఈ నిర్ధారణకు వచ్చారు. ఇందులో.. సైబీరియా నుంచి సేకరించిన 45వేల ఏళ్ల నాటి నమూనా కూడా ఉంది. ఒక జన్యువు తన ప్రతిని తయారుచేసుకొని, స్వీయ సంఖ్యను పెంచుకోవడాన్ని జీన్ డూప్లికేషన్‌గా పిలుస్తారు. పరిణామక్రమానికి ఇది పెద్ద ఊతమిస్తుంది. అమైలేజ్ (ఏఎంవై1) అనే జన్యువు కార్బోహైడ్రేట్లను జీర్ణం చేయడంలో సాయపడుతుంది. వ్యవసాయం పురుడు పోసుకోవడానికి ముందు వేట ద్వారా జీవనం సాగించిన మానవ జాతుల్లో ఈ జన్యువుకు సంబంధించిన 8 ప్రతులు కనిపించినట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది. దీన్నిబట్టి ఇది చాలా ఆరంభంలోనే డూప్లికేషన్‌కు లోనైనట్లు తేలింది. దీనివల్ల.. వ్యవసాయం ద్వారా వచ్చిన కార్బోహైడ్రేట్ ఆహారానికి అనుగుణంగా మానవులు సర్దుబాటు చేసుకోవడానికి వీలు కలిగింది. ఆ తర్వాత అనేక జన్యు వేరియంట్లు పుట్టుకురావడానికి ఇది పునాదిగా నిలిచింది. మానవులు కార్బోహైడ్రేట్లు సమర్థంగా జీర్ణం చేసుకునే తీరును ఇది ప్రభావితం చేస్తోంది. అమైలేజ్ జన్యువులు ఎంత ఎక్కువ సంఖ్యలో ఉంటే.. శరీరంలో అంత ఎక్కువగా అమైలేజ్ ఉత్పత్తవుతుందని పరిశోధనలో పాల్గొన్న ఒమెర్ గాక్యుమెన్ పేర్కొన్నారు. దీనివల్ల కార్బోహైడ్రేట్లను మెరుగ్గా జీర్ణం చేసుకోవడానికి వీలవుతుందన్నారు. అమైలేజ్ జన్యువుల పరిణామక్రమాన్ని వ్యవసాయం ప్రభావితం చేసిన తీరును కూడా ఈ పరిశోధన వెలుగులోకి తెచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

నిఘా సంస్థలపై పార్లమెంటు పర్యవేక్షణ ఉండాలి: తివారీ

దిల్లీ: నిఘా సంస్థలపై పార్లమెంటరీ పర్యవేక్షణ ఉంచేందుకు సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ నేత, చండీగఢ్ ఎంపీ మనీశ్ తివారీ అభిప్రాయపడ్డారు. అమెరికా, కెనడాల నుంచి ఇటీవలి కాలంలో వస్తున్న ఆరోపణల నేపథ్యంలో దీనిపై చట్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. '..ఇప్పటికే ఈ అంశంపై పలుమార్లు ప్రైవేటు బిల్లు సమర్పించాను. నిఘా సంస్థలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి జాతీయ నిఘా ట్రైబ్యునల్ ఉండాలి' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

అందుబాటులోకి రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్

- మొదటి రోజు 30కి పైగా కేసుల విచారణ
- అప్పీళ్లను 60 రోజుల్లో పరిష్కరిస్తాం: ఛైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



కేసుల విచారణ చేపట్టిన రెరా అప్పిలేట్ ట్రైబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, జ్యుడిషియల్ సభ్యుడు పల్లె ప్రదీప్‌రెడ్డి, సాంకేతిక సభ్యురాలు చిత్రా రామచంద్రన్

ఈనాడు, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ వివాదాల పరిష్కారానికి రాష్ట్రంలో మొదటిసారి ఏర్పాటైన రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) అప్పిలేట్ ట్రైబ్యునల్ శనివారం కేసుల విచారణ ప్రారంభించింది. రెరా నిర్ణయాలను సవాలు చేసేందుకు గత జూన్‌లో దీనిని ఏర్పాటు చేసినప్పటికీ వసతి సౌకర్యాలు, సిబ్బంది లేకపోవడంతో కార్యకలాపాలు మొదలుపెట్టలేదు. ఇటీవల ప్రభుత్వ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో కోర్టు నిర్వహణ నిమిత్తం గదులు కేటాయించడంతో ట్రైబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ ఎ. రాజశేఖర్‌రెడ్డి, జ్యుడిషియల్ సభ్యుడు పల్లె ప్రదీప్ రెడ్డి, సాంకేతిక సభ్యురాలు చిత్రా రామచంద్రన్‌లు కేసుల విచారణ ప్రారంభించారు. రెరా నిర్ణయాలను సవాలు చేస్తూ ఇన్‌ఛార్జి అధికారం ఉన్న వ్యాట్ ట్రైబ్యునల్ నుంచి 33 కేసులను ఇక్కడికి బదలాయించారు. వీటితోపాటు ట్రైబ్యునల్ ఏర్పాటయ్యాక 12కు పైగా కేసులు దాఖలయ్యాయి. ధర్మాసనం శుక్రవారం 30కి పైగా కేసులపై విచారణ చేపట్టింది. పలువురికి నోటీసులు జారీ చేయడంతోపాటు కక్షిదారులకు ఫిర్యాదులపై విచారణ తేదీలను కేటాయించి ఆ సమాచారాన్ని పంపే ఏర్పాట్లు చేసింది. అనుమతులకుండా చేపట్టిన నిర్మాణాలపై రెరా విధించే జరిమానాలు, చేపట్టే చర్యలపై అభ్యంతరాలను తెలుపుతూ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. జరిమానా మొత్తంలో 30% డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా ఫ్లాట్ కొనుగోలుదారులు కేవలం రూ.5 వేలు కోర్టు ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. పరిహారంపై సంతృప్తి చెందకుంటే బాధితులు ట్రైబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని జస్టిస్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కేసులను 60 రోజుల్లోనే పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని వెల్లడించారు.

4 మార్కెట్ యార్డులకు పాలకవర్గాలు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం రాష్ట్రంలోని మరో నాలుగు మార్కెట్ యార్డులకు పాలకవర్గాలను నియమించింది. యాదాద్రి జిల్లా భువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, జోగిపేట మార్కెట్ యార్డుల ఛైర్మన్, వైస్‌ఛైర్మన్, సభ్యులను నియమించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

'నారాయణపేట-కొడంగల్' టెండర్లకు ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో చేపట్టదలచిన నారాయణపేట-కొడంగల్ సాగునీటి ఎత్తిపోతల పథకం పనుల టెండర్లు ఖరారయ్యాయి. గుత్తేదార్లు దాఖలు చేసిన ధరల బిడ్లను నీటిపారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ అధ్యక్షతన సమావేశమైన కమిషనర్ ఆఫ్ టెండర్స్(సీఓటీ) కమిటీ ఆమోదం తెలిపింది. రూ.1134.62 కోట్ల పనులకు సంబంధించిన మొదటి ప్యాకేజీని 3.9 శాతం అధికంగా కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎల్-1గా టెండర్ పొందింది. రూ.1126.85 కోట్ల పనులకు సంబంధించిన రెండో ప్యాకేజీ పనులను 3.95 శాతం అధికంగా కోట్ చేసిన మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థ ఎల్-1గా నిలిచి టెండర్ దక్కించుకుంది. ఈ పథకం డీపీఆర్ రూపకల్పన, సీడబ్ల్యూసీ, పర్యావరణ అనుమతులు సాధించే బాధ్యతలను ప్రభుత్వం ఆర్వీ అసోసియేట్స్ సంస్థకు అప్పగించింది. నిర్మల్ జిల్లాలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ పనులకు రూ.12 కోట్లతో ఎల్జిబుల్ పనులు, సూర్యాపేట జిల్లాలో నాగార్జునసాగర్ కాలువపై రూ.300 కోట్లతో నిర్మించనున్న రాజీవ్ ఎత్తిపోతల పథకం పనుల గుత్తేదారులను కూడా సీఓటీ ఖరారు చేసింది.



ప్రేరణ కన్నా క్రమశిక్షణే ముఖ్యం

ఇతరుల నుంచి గానీ లేదా దేని ప్రభావం నుంచి గానీ ప్రేరణ పొంది ఓ పని చేస్తున్నారంటే దాన్ని ఎప్పటికీ పూర్తి చేయలేరు. ఎందుకంటే ప్రేరణ తాత్కాలికంగానే ప్రభావం చూపుతుంది. ఓ పనిని క్రమశిక్షణతో చేసినప్పుడు మాత్రమే దాన్ని పూర్తి చేయగలరు. ఎన్ని ఆవాంతరాలెదురైనా, పని చేయాలన్న ఉత్సాహం లేకపోయినా, గడువులోపు పూర్తి చేయాలన్న మొండి పట్టుదల ఉంటేనే మనం లక్ష్యానికి చేరుకోగలం.

- జ్యూన్ లీ, బ్రాండ్ స్ట్రాటజిస్ట్

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

వధువు కావలెను

6 Niyogi Brahmin Haritasa Chitta 4P, 44 Years, SWE, 30LPA Hyd. Cont: Prasad: 9440544790 (A)

Reddy Boy 33Y, 5'10", M.Com/ CA (Inter) Doing IT Job (Fin) in Hyd. Have own House, Seeks Beautiful Girl, B.Tech/ Any Degree Working in Software, Govt or Pvt © 9951959941 (A)

Kapur, MNC, VP, USA, VF, 46Y, 5'11", Divorce seeks Bride below 40Y, 5'3" above Late/ Divorce Abroad/ India. Ph: 8374456323 (A)

కాపు "ఓన్లీ సన్" 29, 5'9", B.Tech, MS, SWE, USA, 150K P/A ఇండియాకి వచ్చియున్న వరునికి తగిన వధువు కావలెను. అర్జెంట్ © 9393891760 (A)

కాపు నాయుడు/ 44/5'8"/ Slim/ డిగ్రీ/ బిజినెస్/ 5 కోట్ల ఆస్తి గల మొదటి వివాహం వరుడికి తగిన వధువు కావలెను. కుల కట్న ప్రసక్తిలేదు. డైరెక్ట్ © 9912525919 (A)

SC మాల కట్నప్రసక్తి లేదు 29/5'10" B.Tech (సివిల్) అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ACTO) 1.50L P/M వెల్ సెటిల్ వరుడికి వధువు కావలెను. అర్జెంట్. © 9014591903 (A)

మాదిగ/ B.Tech/ Govt AE/ ఇరిగేషన్ Dept/ 92,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. © 8985557129 (A)

Caste No Bar. Gavara, M/38/ Fair/ 5'8"/ Central Govt/ 45 Lacs PA/ Divorced, 9 Yrs Boy with Mom. Ph: 8712133567 (A)

'పెళ్లిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

Hindu, Rajput/ 38 Yrs/ 5'7"/ MBA/ Pvt. Job/ 15 Lakhs PA seeks well Educated Bride. Caste Hindu. Contact: 09094012245 (A)

క్షత్రియరాజులు, యూనియన్‌బ్యాంక్ ఉద్యోగం, సొంత ఇల్లు, రెండోపెళ్లి వరుడికి మంచి సాంప్రదాయం కలిగిన వధువు కావలెను. డైరెక్ట్, నో బ్రోకర్స్. © 96520 16569 (B).

రజక/ B.Tech/ C.Govt. JTO/ BSNL/ 92,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. © 9515942275 (A)

★ ★

రెడ్డి/ గుడ్ లుకింగ్/ కులపట్టింపులేదు/ 2వ పెళ్లి/ 44/ 5'9"/ PG/ 3 Lakhs PM/ కోట్ల ఆస్తి గల వరుడికి వధువు కావలెను. © 8367619529 (A)

Reddy 1996/6'2", B.Tech/ MS/ UK/ 60K PA/ 80L PA ★ 1994/5'9" MBBS/ MS (Opthal)/ (4.5L PM Rents). Naveen Reddy Marriage Bureau © 9505551788, 9848221166 (A)

Reddy 1996/5'9" B.Tech/ MS/ Own Business/ Hyd. ★ 1993/5'8" B.Tech/ MS/ Program Manager/ 15L PA. Naveen Reddy MB © 8885559579, 9848221166 (A)

Reddy 1997/5'9" B.Tech/ MS/ Business/ 5L PM/ Rich ★ 1993/5'8" B.Tech/ MBA/ 18L PA. Naveen Reddy Marriage Bureau © 7893333726, 9848221166 (A)

మున్నూరుకాపు/ B.Tech (సివిల్)/ Govt. AEE/ ఇరిగేషన్ Dept/ 14 Lakhs PA/ 5'8" ఎత్తు/ 33 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. © 9912280929 (A)

Alliance invited for a well settled SC Mala Boy aged 39 Yrs, 160 CM, MD, Gen Med. Govt. Doctor from a good looking Doctor Girl with PG Degree. Contact Mob. 9177192732 (A)

కోమట్ల అమ్మాయి కావలెను. 1,2 కోమట్ల అబ్బాయి, 36, M.Sc, ప్రైవేట్ లెక్చరర్, 40=20+20 వేలు, ఆస్తి 1 కోటి. M9HB, ము.రోడ్, నల్గొండ, వీరయ్య © 91213 25068.

SC హిందూ 27/5'9" B.Tech (ECE) FSTC ఇంజనీర్ (ఇండియన్ ఎయిర్‌పోర్ట్స్) 10 Lakhs P/A వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. © 9949919285 (A)

గెజిటెడ్ నోటరీ లాయర్, హైదరాబాద్ (55) గారికి (భార్య చనిపోయిన & పిల్లలు లేరు) ఉన్నత కుటుంబం నుంచి (వితంతువు, పిల్లలులేని వారు, డైవర్సీ వద్దు) భార్యగా కావలెను. © 9951117034 (A)

వరుడు కావలెను

బ్రాహ్మణ: 33 Yrs/ 5'2"/ ఇంటర్ ★ 29 Yrs/ 5'4"/ డిగ్రీ ★ 25 Yrs/ 5'2"/ MBA. వధువులకు వరులు కావలెను. రిక్వైర్‌మెంట్ Pvt/ Govt. జాబ్ & పురోహితం అయినా OK © 9392179635 (A)

బ్రాహ్మణ 47/5'4" ఫెయిర్/ 2nd మ్యారేజ్ కులపట్టింపులేదు/ MA/ BEd/ Govt. జాబ్/ 70K (PM) సొంత ఇల్లు/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) © 8341101996 (A)

బ్రాహ్మణ 27/5'4" 1st మ్యారేజ్, Q: 7th క్లాస్/ Own టైలరింగ్/ తండ్రి లేట్, పౌరోహితం also OK, 2nd మ్యారేజ్ also OK. వరుడు కావలెను. © 8978808244 (A)

కమ్మ 24, 5'4" B.Tech SWE, MNC 18 Lacs P/A సాంప్రదాయక కుటుంబానికి చెందిన అందమైన వధువుకు వరుడు కావలెను. © 9290022700 (A)

రెడ్డి/ కులపట్టింపులేదు/ 47/5'4"/ విడో/ Govt. HM/ సొంత ఇల్లు/ 20 ఎకరాల పొలం, వెల్ సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. © 8121372653 (A)

ఆస్తి, కుల పట్టింపులేదు/ రెడ్డి/ 24Y/ 5'3"/ B.Tech మంచి స్థిరాస్తి, పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటో, బయోడేటా వాట్సాప్‌లో పంపించండి. © 8142060040 (A)

కాపు/ B.Tech/ C.Govt స్టెనోగ్రాఫర్/ రైల్వే/ 42,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. © 8121406576 (A)

SC మాల హిందూ/ B.Tech/ 25Y/ 5'4"/ సాఫ్ట్‌వేర్/ కాగ్నిజెంట్ (Hyd) 60K per Month. చాలా అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. © 9705960270 (A)

మాల 26/5'4" B.Tech IIT PSU సెంట్రల్ Govt ఆఫీసర్ 20 Lacs P/A వధువుకి తగిన వరుడు కావలెను. No Brokers © 9493285326 (A)

SC మాల హిందూ: 24/5'4"/ B.Tech/ SWE విప్రో, Hyd నెలకు 60,000/- జీతం గల ఏకైక వధువు (ఫెయిర్)కు తగిన వరుడు కావలెను. © 8978799956 (A)

కమ్మ 45సం॥/ 5'4"/ SBI Chief Manager/ Legally Diverced/ ఓన్ హౌస్/ నో చిల్డ్రన్, 15 ఎకరాల పొలము గల వధువుకి వరుడు కావలెను. © 90592 42861 (B).

రెడ్డి 51సం॥/ 5'3" రైల్వే Accounts Officer/ Wedo/ నో చిల్డ్రన్/ ఓన్ హౌస్, 19 ఎకరాల పొలము గల వధువుకి వరుడు కావలెను. © 95504 12920 (B).

కులపట్టింపులేదు/ 54 Yrs/ 2వ పెళ్లి/ ఫ్యామిలీ పెన్షన్ 50,000/- PM & Own బిజినెస్ గల చాలా అందమైన వధువుకి కుల, ఆస్తి ప్రసక్తిలేని వరుడు కావలెను. © 7702580013 (A)

కమ్మ 27Y, 5'5", B.Tech, 12.7L Job in Hyd ★ 25Y, 5'4", B.Tech 7.5L Banglore © 80196 58575, 73863 38574 (B).

Yadava 27/5'3" B.Tech/ MS/ USA/ 110K ★ 31/5'7" B.Tech/ MS/ 140K/ USA/ Vizag. 9440831748 ★ 25/5'5" B.Tech/ MS/ USA/ 100K ★ 25/5'3" B.Tech/ MS/USA/ Vij © 9440759945 (A)

యాదవ/ ఎర్రశాఖ/ అప్పర్ మిడిల్ క్లాస్/ 37Y/ 5'4" ఎత్తు/ M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥ PM అపై ఆదాయం గల యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్. 9989597799 (A)

కులప్రసక్తి లేదు/ డివోర్స్/ 43/ APIIC కార్పొరేషన్/ 1L PM/ ఓన్ హౌస్, రెంట్స్/ 14 ఎ॥ ల్యాండ్స్/ కోట్ల ప్రాపర్టీ గల వెల్ సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను. © 9989306538 (A)

★ ★

రెడ్డి/ చాలా అందమైన/ 26/5'4"/ B.Tech/ సాఫ్ట్‌వేర్/ గుడ్ ఫ్యామిలీ/ కోట్ల ఆస్తి గల వధువుకి వరుడు కావలెను. US అయినా OK © 8367619529 (A)

Reddy 1994/5'3" Project Manager/ US Citizen ★ 1993/5'6" BE/ M.Tech (IIT) MS (IT)/ USA. Naveen Reddy Marriage Bureau © 9505551788, 9848221166 (A)

Reddy 1995/5'2" MBBS/ MD Radiologist/ 2L PM ★ 1996/5'8" BE/ MBA (IIM)/ Microsoft. Naveen Reddy Marriage Bureau © 7893333726, 9848221166 (A)

Reddy (Elite) 2000/5'6" Architecture/ MS/ US/ Fair ★ 1995/5'8" MSc/ Fair. Naveen Reddy Marriage Bureau © 8885559579, 9848221166 (A)

విశ్వబ్రాహ్మణ/ కులపట్టింపులేదు/ గుడ్ లుకింగ్/ 2వ పెళ్లి/ పిల్లలులేరు/ 40/5'4"/ డిగ్రీ/ వెల్ సెటిల్డ్/ గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. © 8367619529 (A)

వివాహ వేదిక

కేవలం కమ్మ వారికి మాత్రమే. దేశ, విదేశ, డాక్టర్, సాఫ్ట్‌వేర్ & హై రిచ్, 1వ, 2వ, లేటు వధువు, వరుల కోసం సంప్ర: గడ్డిపాటి ప్రభాకరరావు, BE. వాట్సప్: 7893841849 (A)

ఓన్లీ కమ్మాస్ (10 వేల ప్రొఫైల్స్) డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, బిజినెస్ & హైరిచెస్ 1వ, 2వ లేట్ దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. © 9959305599. (A)

రెడ్డీస్ రెడ్డీస్ (శ్రీ శ్రీరస్తు శుభమస్తు) డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ బిజినెస్/ హై రిచెస్. & All ఇండియా & అబ్రాడ్ 1వ, 2వ సంబంధాలు కొరకు సంప్ర: 9059189869 (A)

కాపు పెళ్లిసంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ ★ Srinivas © 7032712544/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

పద్మశాలి పెళ్లిసంబంధాలకై సంప్ర॥ Verified ప్రొఫైల్స్ & నమ్మకమైన సంస్థ ★ Shyam © 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd., (A)

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712. (A)

ఫ్రీ రిజిస్ట్రేషన్ కేవలం NRI, PG, Doctors, Software Govt/ గెజిటెడ్/ VIP/ బిజినెస్ ఇండస్ట్రీ 1వ, 2వ లేట్, రిటైర్డ్, క్యాస్ట్ నో బార్. అన్ని కులాల వారికి. © 8712384555 (A)

కేవలం యాదవ/ కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్, www.gokulmarriage.com Hyd: 9440831748, GNT/ VIZ: 9440759945, BGL: 8332926034. (A)

అన్ని కులాలు (15 వేల ప్రొఫైల్స్) డాక్టర్స్, డాక్టర్స్ సాఫ్ట్‌వేర్, బిజినెస్ & హైరిచెస్, 1వ, 2వ, లేట్, దేశ, విదేశీ సంబంధాలు అన్ని కులాల వారికి ఫాస్ట్‌గా కుదుర్చబడును. © 9121010959 (A)

★ ★

రెడ్డి, కాపు & గౌడ్, ఇతర అన్ని కులాల 1వ, 2వ, డాక్టర్స్, ఇంజినీర్స్, Govt, NRI, సాఫ్ట్‌వేర్, బిజినెస్ & మీరు కోరిన సంబంధాలు చూపబడును. © 8125831394, 9502732389 (A)

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో/ డాక్టర్స్/ ఇంజినీర్స్/ NRI/ గవర్నమెంట్/ బిజినెస్/ మీరు కోరిన పెళ్లి సంబంధాలకు సంప్రదించండి. హైదరాబాద్. 9515987410. (A)

నిఖిల్ గౌడ్స్ మ్యారేజ్‌బ్యూరో, ఓన్లీ గౌడ్స్/ దేశ/ విదేశ/ 1వ/ 2వ/ Dr./ Engg./ VIP/ MS/ PG/ Govt & Pvt. వధూవరులకై సం: బోడుప్పల్ Nr. NTR స్టాచ్యూ. © 9848041335, 9848371924 (A)

గౌడ్ మ్యారేజ్‌బ్యూరో (only for Gouds) 20 సం॥ అనుభవం. డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ ఎంప్లాయిస్, దేశ/విదేశీ పెళ్లిళ్లకై © 9440454842, 7036801052. (A)

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో TM Estd 1995 గౌడ, ఈడిగ, శెట్టిబలిజ 1st/ 2nd దేశ/ విదేశీ సంబంధాలకై సంప్ర॥ లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. Late. S. శారదాగౌడ్: వ్యవస్థాపకురాలు. S.రాములుగౌడ్- 8790690309 (A)

Since 1989, ఫ్రీ రిజిస్ట్రేషన్. వధువులకు మాత్రమే. కేవలం ఆది, సోమ, మంగళ వారాల్లో. అన్ని సంబంధాలకై సంప్రదించండి. వేల్పుల భిక్షపతి © 9849027778, 9347009998 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాలు లేదా రిజిస్ట్రేషన్ కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆరిపోయే దీపాలకు ఆయువు పోస్తూ..

- బతకరనుకున్న బిడ్డలకు ఊపిరి పోస్తున్న శిశువిహార్
- తల్లిదండ్రులు వదిలేసిన వారికి పూర్తి సంరక్షణ
- అవసరమైతే రూ.లక్షలు ఖర్చు చేసి చికిత్సలు



మాతృత్వం మహిళకు వరం.. నవమాసాలూ మోసి కన్న బిడ్డ నట్టింట నడయాడాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. శిశువు నోట 'అమ్మా' అనే పిలుపు ఎప్పుడు వినిపిస్తుందా అని ఆత్రుతగా ఎదురుచూస్తుంది. కానీ కొందరు పిల్లలు తీవ్ర వైకల్యాలు, అనారోగ్యాలతో పుడతారు. పుట్టుకతోనే ప్రాణాపాయ స్థితిలో ఉంటారు. అలాంటి వారికి నెలల తరబడి చికిత్స అవసరమవుతుంది. ఆర్థిక స్తోమత లేనివారు.. వైద్యం చేయించలేక, చేయించినా బతుకుతారో లేదో తెలియక ఆశలతోపాటు కన్నబిడ్డలనూ వదిలేసుకుంటున్న సందర్భాలు ఉంటున్నాయి. అలాంటి పసివారిని చేరదీసి ప్రాణం పోస్తోంది మహిళా శిశు సంక్షేమశాఖ. పూర్తి ఆరోగ్యాన్ని సంతరించుకున్నాక వారిని దత్తత ఇస్తోంది.

పుట్టిన మూడు రోజులకే..

ఆ దంపతులు పిల్లల కోసం ఎన్నాళ్లో వేచి చూశారు. రూ.లక్షలు వెచ్చించి చికిత్స చేయించుకున్నారు. ఎట్టకేలకు కవలలు జన్మించారు. కానీ బిడ్డలిద్దరికీ అవయవలోపాలున్నాయి. ఒక పాపకు బ్లాడర్ బయటకు వచ్చింది. మరోపాపకు ఒకే కిడ్నీ ఉంది, చేతివేళ్లు అతుక్కుపోయాయి. ఖరీదైన వైద్యం చేయిస్తే తప్ప, ఎక్కువ రోజులు బతకరని వైద్యులు చెప్పారు. అప్పటికే చికిత్సకు కొంత సొమ్ము వెచ్చించిన తల్లిదండ్రులు ఇక తమవల్ల కాదని నిరాశ చెందారు. పిల్లలు కళ్లముందే చనిపోతే తట్టుకోలేమంటూ.. వారిని మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశువిహార్‌కు అప్పగించారు. ఉన్నతాధికారులు ఆ చిన్నారులిద్దరినీ నిలోఫర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఏకంగా ఏడాది పాటు ఐసీయూలో చికిత్స చేయించారు. వైద్యులు ఒక చిన్నారికి శస్త్రచికిత్సతో బ్లాడర్ సరిచేశారు. ఐదేళ్లు దాటాక ఆ పాపకు మరో శస్త్రచికిత్స చేస్తే సరిపోతుందని చెబుతున్నారు. ఇంకో చిన్నారికి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. కొంచెం పెద్దయ్యాక చేతివేళ్లను వేరుచేయించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం 15 నెలల వయసున్న ఈ పిల్లలను దత్తత జాబితాలో చేర్చారు.

ఏబీసీ సంస్థ సాయంతో..

ఏడో నెలలోనే పుట్టిన ఒక ఆడశిశువు బరువు తక్కువగా ఉంది. ఊపిరితిత్తులు అభివృద్ధి చెందలేదు. బతుకుతుందన్న భరోసా లేక.. ఆ బిడ్డను కన్నతల్లి వదిలేసి వెళ్లిపోతే, శిశువిహార్ అధికారులు సంరక్షించారు. శస్త్రచికిత్స కోసం పాపను నిలోఫర్‌కు తరలించారు. అడ్వొకేట్స్ ఫర్ బేబీస్ ఇన్ క్రైసిస్ సొసైటీ (ఏబీసీ) సంస్థ ఆదుకుంది. బిడ్డను ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి.. రూ.25 లక్షలతో వైద్యం చేయించింది. సుమారు నాలుగు నెలల పాటు ఆక్సిజన్ సాయంతో బతికిన ఆ పాప నెమ్మదిగా కోలుకుని ఆరోగ్యవంతురాలైంది. ఏడాది వయసులోపే ఆ చిన్నారిని ఓ జంట దత్తత తీసుకుంది.

ఆసుపత్రిలోనే వదిలేసి వెళ్లారు..

పుట్టుకతోనే ఒక చిన్నారికి వెన్నుపూస బయటకు వస్తే.. వెంటనే తల్లిదండ్రులు ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. చికిత్స కొనసాగుతుండగానే ఎవరికీ చెప్పకుండా పాపను వదిలేసి వెళ్లిపోయారు. మూడు రోజుల వయసున్న ఆ బిడ్డను పోలీసులు శిశువిహార్‌కు అప్పగించారు. వైద్యులు శస్త్రచికిత్సతో పాపను కాపాడారు. ఇప్పుడా పసిబిడ్డ ఫిజియోథెరపీతో నెమ్మదిగా కదులుతోంది.

24 గంటలూ సంరక్షణ

వివిధ కారణాలతో తల్లిదండ్రులు వదిలేసిన పసివారిని శిశు సంక్షేమశాఖ సంరక్షిస్తోంది. ఆ శాఖ కార్యదర్శి, కమిషనర్ నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఇద్దరు సీడీపీవోలు, వీరికి సహాయంగా ఆరుగురు ఎక్స్‌టెన్షన్ అధికారులు, నర్సులు, వైద్యుడు, చిన్నారుల గదుల్లో ఒక్కోగదికి మేనేజరు ఉంటారు. 24 గంటలూ మూడు షిఫ్టుల్లో 120 మంది ఆయాలు పిల్లల బాగోగులు చూస్తారు. సమయానికి పాలు పట్టడం, స్నానం చేయించడం, లాలించడం వంటి సేవలతో నిరంతరం సంరక్షిస్తున్నారు.

- ఈనాడు, హైదరాబాద్



సింధు దుర్గ్ ఫోర్ట్

సాహసయాత్రకు రండి..!

- మహారాష్ట్ర పర్యాటక శాఖ ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: చరిత్ర గురించి తెలుసుకోవాలన్న కుతూహలం ఉండి, సాహసోపేత యాత్ర చేయాలని ఉవ్విళ్లూరే వారికి మహారాష్ట్ర పర్యాటక శాఖ ఆహ్వానం పలుకుతోంది. ఛత్రపతి శివాజీ మహారాజ్, మరాఠా రాజ్యంలోని నిర్మాణాలు సహా 350కి పైగా కోటలను సందర్శించాలనుకునే వారికి ఆ రాష్ట్ర పర్యాటక శాఖ ఏర్పాట్లు చేసింది. ఇందులో చరిత్రను తెలుసుకునేందుకు సింధు దుర్గ్ ఫోర్ట్, మురుద్‌జంజీరా, ప్రతాప్‌గఢ్ ఫోర్టులు, ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు శివ్‌నేరి, సింహగఢ్, ప్రతాప్‌గఢ్‌లను సందర్శించొచ్చని తెలిపింది. సాహసాలను ఇష్టపడేవారు లోహగఢ్ ఫోర్ట్‌కు వెళ్లొచ్చు. ప్యాకేజీలకు సంబంధించిన పూర్తి వివరాలకు మహారాష్ట్ర టూరిజం వెబ్‌సైట్ www.maharashtra-tourism.gov.in ను సంప్రదించాలని సూచించింది.

26న మంత్రిమండలి సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 26న సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. తొలుత ఈ నెల 23న మంత్రిమండలి సమావేశం నిర్వహించాలని భావించారు. ఆ రోజున కొందరు మంత్రులు అందుబాటులో ఉండటం లేదన్న ఉద్దేశంతో 26వ తేదీకి మార్చినట్లు తెలుస్తోంది.

మా ఉత్తర్వులు అమలు చేస్తారా? కోర్టు ధిక్కరణను ఎదుర్కొంటారా?

- ఇంజినీరింగ్ అదనపు సీట్లపై అధికారులకు హైకోర్టు సూటిప్రశ్న

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ ఆమోదించిన సీట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతించాలని, ఆ సీట్ల భర్తీకి మాప్-అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ గత నెల 9న తాము ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసి తీరాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. వాటిని అమలు చేయడం ద్వారా కోర్టు ధిక్కరణ నుంచి తప్పించుకోవడానికి అవకాశమిస్తున్నామని, తప్పించుకోవడమన్నది మీ చేతుల్లోనే ఉందని అధికారులకు స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేసినట్లు నివేదిక సమర్పించాలని, లేకపోతే చర్యలు తప్పవని తేల్చి చెబుతూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జేఎన్‌టీయూలు ఆమోదించిన ప్రకారం కంప్యూటర్ సైన్స్ తదితర కోర్సుల్లో సీట్ల పెంపునకు అనుమతించాలని, వాటి భర్తీకి మాప్-అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ సెప్టెంబరు 9న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై కేఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎంజీఆర్, సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, చంద్రమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర విద్యాసంస్థలు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు డి.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. హైకోర్టు ఉత్తర్వులపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా సెప్టెంబరు 20న సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసిందన్నారు. అనంతరం సాంకేతిక కోర్సుల్లో అడ్మిషన్ల గడువు పొడిగించాలని కోరుతూ.. ఏఐసీటీఈ సుప్రీంకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు అక్టోబరు 23వ తేదీ వరకు గడువు మంజూరు చేసిందన్నారు. ఈలోగా మాప్- అప్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లకు అవకాశం కల్పించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కాలేజీలు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ల నోటీసులు అందాయని, కౌంటర్లు దాఖలు చేయడానికి రెండు వారాల గడువు కావాలని కోరారు. దీనిపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. రెండు వారాల సమయం ఎందుకని ప్రశ్నించింది. అంటే ఈ ఉత్తర్వులను అమలు చేయకూడదనే నిర్ణయించుకుని, కోర్టు ధిక్కరణ నుంచి ఎలా తప్పించుకోవాలా అని చూస్తున్నట్లుందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేసిన తరువాత.. హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని, అయినా కౌంటర్ల పేరుతో గడువు కోరడం సరికాదంది.

మార్పులకు అనుగుణంగా ముందుకెళ్లాలి

- హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



అల్లాదుర్గంలో జూనియర్ సివిల్ జడ్జి ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి. చిత్రంలో మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద

అల్లాదుర్గం, మెదక్ అర్బన్, పాపన్నపేట, న్యూస్‌టుడే: సమాజంలో వచ్చే మార్పులకనుగుణంగా న్యాయ వ్యవస్థ ముందుకెళ్లాలని హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. సివిల్ కేసుల పరిష్కారంలో లాయర్లు నిర్భయంగా వ్యవహరించాలన్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టును ఆయన ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు ఏడుపాయల వనదుర్గామాతను, మెదక్ సీఎస్ఐ చర్చిని సందర్శించారు. మెదక్ జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మెడికల్ డిస్పెన్సరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో మెదక్, సిద్దిపేట జిల్లా జడ్జీలు లక్ష్మీశారద, సాయిరమాదేవి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి రీటా లాల్‌చంద్, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను బలవంతంగా రుద్దుతున్నారని ఏఈవోల నిరసన

ఈనాడు, హైదరాబాద్: పంటల డిజిటల్ సర్వేను తమపై బలవంతంగా రుద్దుతున్నారంటూ వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈవో) ఐక్యకార్యాచరణ సమితి (ఐకాస) నేతలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి రైతువేదికలు, వాటి ఆవరణలను ఊడ్చి నిరసన తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ప్రైవేటు ఏజెన్సీల ద్వారా డిజిటల్ సర్వేను నిర్వహిస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఏఈవోలే చేయాలంటూ ఒత్తిడి తెస్తోందని ఐకాస నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సౌకర్యాల కల్పన, సహాయకుల నియామకానికి వెచ్చించకుండా దుర్వినియోగం చేసేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వే బాధ్యతలను ఏఈవోలకు మినహాయించేంత వరకు ఆందోళనను విరమించబోమన్నారు.

రామన్నపేటలో సబ్ కోర్టు ప్రారంభం

రామన్నపేట, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నూతనంగా మంజూరైన సబ్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జువ్వాడి శ్రీదేవి(జిల్లా పోర్టుఫోలియో జడ్జి), జస్టిస్ కూనూరు లక్ష్మణ్‌లు శనివారం ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత కేసులను పరిశీలించారు. కోర్టు నూతన భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తులు పనులు త్వరలో ప్రారంభించటానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన బార్ అసోసియేషన్ సభ్యులు వారిని సన్మానించారు. జిల్లా ఇన్‌ఛార్జి జడ్జి జి.సంపూర్ణ ఆనంద్, జూనియర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు ఎ.ప్రదీప్, ఎస్.చందన, జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, భువనగిరి డీసీపీ రాజేశ్‌చంద్ర, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎ.మజీద్ తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రి జిల్లా రామన్నపేటలో సబ్‌కోర్టులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ జువ్వాడి శ్రీదేవి, జస్టిస్ కూనూరు లక్ష్మణ్

నిజామాబాద్ ఆసుపత్రి నుంచి ఏడాది బాలుడి అపహరణ



బాలుడితో మహిళలు.. ఆసుపత్రి సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) ఆవరణ నుంచి శుక్రవారం అర్ధరాత్రి ఏడాది వయసున్న మణికంఠ అనే బాలుడు అపహరణకు గురయ్యాడు. కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రానికి చెందిన రాజు తన భార్య లక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో తమ ఏడాది బాబును తీసుకొని శుక్రవారం సాయంత్రం నిజామాబాద్ జీజీహెచ్‌కు వచ్చారు. అప్పటికే ఓపీ సేవలు నిలిచిపోవడంతో డ్యూటీ డాక్టర్ వద్ద చికిత్స పొందారు. అనంతరం రాత్రి ఆసుపత్రి ఆవరణలో పడుకున్నారు. అర్ధరాత్రి దాటాక 12.21 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వీరి పక్కలో పడుకున్న బాలుడిని అపహరించారు. శనివారం ఉదయం లేచే సరికి బాబు కనిపించకపోవడంతో రాజు దంపతులు ఆసుపత్రి అంతా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఒకటో ఠాణా ఎస్‌హెచ్‌వో రఘుపతిని ఆశ్రయించారు. ఆయన నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో గాలింపు నిమిత్తం రెండు బృందాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ఆవరణలో ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా సంచరించడంతోపాటు వారిలో ఒకరి చేతిలో బాలుడు ఉన్న దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. నిజామాబాద్ ఆసుపత్రి నుంచి బాలుడి అపహరణకు గురికావడం.. మూడు నెలల్లో రెండో ఘటన. ఈ ఏడాది జులై 20న నిజామాబాద్ నగరానికి చెందిన అరుణ్(3)ను తండ్రి పక్కలో నుంచి ఆర్మూర్‌కు చెందిన కొందరు యువకులు ఎత్తుకెళ్లగా.. 16 గంటల్లోనే ఛేదించారు.

ఐఈడీ పేలి ఇద్దరు జవాన్ల మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ ప్రాంతంలోని కొడ్లియార్ గ్రామ సమీపంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబులు పేలి శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు జవాన్లు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు ఓర్చా, మొహండీ, ఇరాక్‌భట్టీ అటవీ ప్రాంతాల్లో శుక్రవారం కూంబింగ్ నిర్వహించాయి. అర్ధరాత్రి సమయంలో బలగాలు బేస్ క్యాంపునకు వస్తుండగా ఐఈడీ బాంబులపై ప్రమాదవశాత్తు జవాన్లు కాలు వేయడంతో ఒక్కసారిగా పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ జిల్లాకు చెందిన కె.రాజేశ్(37), మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన ఐటీబీపీ 53వ బెటాలియన్ జవాన్ అమర్ పన్వర్(36) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు.

ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నేత హత్య

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఊసూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఉపసర్పంచి తిరుపతి బండారిని(54) మావోయిస్టులు శనివారం అతి దారుణంగా హత్య చేశారు. మధ్యాహ్నం ఊసూరు సెంటర్‌లో నిర్వహిస్తున్న రేషన్ దుకాణానికి తిరుపతి వెళ్లారు. ఆ సమయంలో ముందుగానే రెక్కీ నిర్వహించిన కొందరు మావోయిస్టులు ఒక్కసారిగా పదునైన ఆయుధాలతో తిరుపతిపై దాడి చేసి నరికి హత్య చేశారు.

ట్రాన్స్‌జెండర్ల కోసం 22 నుంచి 24 వరకు ఆధార్ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్ల ఆధార్ నమోదు, వివరాల్లో మార్పుల కోసం ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఈ కేంద్రం కొనసాగుతుందని పేర్కొంది. పూర్తి వివరాలకు 040-24559048 నంబరులో సంప్రదించాలని తెలిపింది.



ఆలయంపై హరివిల్లు!

యాదగిరిగుట్టలో శనివారం వర్షం కురిసింది. తర్వాత కొద్దిసేపటికి ఆకాశంలో ఆలయం మీదుగా విరిసిన హరివిల్లు కనువిందు చేసింది. భక్తులు, స్థానికులు దాన్ని సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధించడానికి పోటీపడ్డారు.

– న్యూస్‌టుడే, యాదగిరిగుట్ట

12 మక్కల కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో మద్దతు ధరలతో మక్కల(మొక్కజొన్న)ను కొనుగోలు చేసేందుకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా 12 కేంద్రాలను మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం 5,46,865 ఎకరాలు కాగా.. పంట దిగుబడి అంచనా 9,63,102 టన్నుల దిగుబడి మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,225 ప్రకటించగా.. మార్కెట్లో మాత్రం రూ.2 వేలు అంతకంటే తక్కువ ధర పలుకుతోంది. దీంతో మార్క్‌ఫెడ్ ద్వారా లక్ష టన్నుల మక్కలను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా 100 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రణాళిక సిద్ధం చేసింది. మొదట 12 కేంద్రాలను పలు జిల్లాల్లో శనివారం మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. దీంతో పాటు అదనంగా వచ్చిన దిగుబడిని మద్దతు ధరకు కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ గంగారెడ్డి, ఎండీ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు.

వృద్ధ దంపతుల దారుణహత్య

- తలలపై కొట్టి దారుణానికి ఒడిగట్టిన ఆగంతకులు
- రెండు రోజుల కిందటే ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..



దంపతులు లింగారెడ్డి, ఊర్మిళాదేవి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: బాధ్యతలన్నీ నెరవేర్చి.. ఎనిమిది పదుల వయసులో విశ్రాంత జీవనం సాగిస్తున్న ఆ దంపతులు హత్యకు గురయ్యారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న బాగ్‌అంబర్‌పేట పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా బయటపడింది. మృతదేహాలు కుళ్లిన స్థితిలో ఉండటంతో.. రెండు రోజుల క్రితమే హత్యలు జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. తూర్పు మండలం డీసీపీ బాలస్వామి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. విశ్రాంత బ్యాంకు అధికారి లింగారెడ్డి (80), ఊర్మిళాదేవి (75) దంపతులు 1985 నుంచి బాగ్‌అంబర్‌పేట డీడీకాలనీలోని సాయిబాబానగర్‌లో నివసిస్తున్నారు. వారికి ముగ్గురు కుమార్తెలుండగా.. అందరికీ వివాహాలయ్యాయి. పెద్ద కుమార్తె నగరంలోని సుచిత్ర ప్రాంతంలో నివసిస్తుండగా మిగిలిన ఇద్దరు అమెరికాలో స్థిరపడ్డారు. ఇటీవలే పెద్ద కుమార్తె కూడా అమెరికా వెళ్లారు. ఎన్ఎండీసీలో పనిచేసే ఆమె భర్త.. అత్తమామలకు ఈ నెల 17న (గురువారం) తనతో పాటు పనిచేసే వ్యక్తి ద్వారా టిఫిన్ పంపించారు. మరుసటిరోజు అత్తమామలకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో.. టిఫిన్ తీసుకెళ్లిన వ్యక్తినే శనివారం ఉదయం మరోసారి వృద్ధుల నివాసానికి పంపారు. అతడు వెళ్లి పిలిచినా స్పందన లేకపోవడంతో.. అదే ఇంట్లో అద్దెకుంటున్న వారితో కలిసి లోపలకి ప్రవేశించి చూశాడు. లింగారెడ్డి ఒక పడకగదిలో రక్తం మడుగులో పడి చనిపోయి ఉన్నారు. ఊర్మిళాదేవి మరో పడకగదిలోని బాత్రూమ్‌లో మృతి చెంది కనిపించారు. ఇద్దరి తలలపై కొట్టినట్లు బలమైన గాయాలున్నాయి. డీసీపీ బాలస్వామి, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ రఘు, డీఐ మల్లేశ్వరి తదితరులు.. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాలు, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఊర్మిళాదేవి మెడలో నగలు లేకపోవడం, బీరువా తెరచి ఉండటాన్ని బట్టి.. ఆగంతకులు దోపిడీకి వచ్చారని, వారే హత్యలు చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డీసీపీ తెలిపారు.

మూసీ శుద్ధీకరణను అడ్డుకుంటే ఉద్యమం

- లక్షల మందితో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్ల ముట్టడి
- మంత్రి కోమటిరెడ్డి



ఈనాడు, హైదరాబాద్: నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దాదాపు కోటిమంది ప్రజల జీవితాలతో ముడిపడ్డ మూసీ శుద్ధీకరణను అడ్డుకుంటే భారీఎత్తున ఉద్యమిస్తామని.. లక్షల మందితో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్లను శాంతియుతంగా ముట్టడిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. మూసీ ప్రాంత ప్రజలను కేటీఆర్, హరీశ్‌రావులు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకుంటే రజాకార్ల మాదిరిగా వారిని ప్రజలు తరిమికొడతారని తెలిపారు. మూసీకి అడ్డుపడే రాజకీయ పార్టీలను నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్‌లో నామరూపాలు లేకుండా చేస్తారన్నారు. ఎస్టీపీలతో మురుగు సమస్య పరిష్కారం కాదని.. శుద్ధీకరణ ద్వారానే స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "ఎస్టీపీల పేరుచెప్పి నల్గొండను ముంచాలని కేటీఆర్ చూస్తున్నారు. వాటితో 100 శాతం హెవీ మెటల్స్ శుద్ధి కాలేవు. రూ.7 లక్షల కోట్లు దోచుకొని నల్గొండలోని ఏ ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. మూసీ కాలుష్యంతో అవస్థలు పడుతున్నారు. ఫ్లోరైడ్ తగ్గిందని భారాస దుష్ప్రచారం చేస్తోంది.

సీఎంకు ధన్యవాదాలు: మూసీ శుద్ధీకరణకు పూనుకున్న సీఎంకు ధన్యవాదాలు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మంత్రులందరం కలిసి మూసీ సమస్యకు పరిష్కారం చూపెట్టాలని కోరగా ఆయన స్పందించారు. ఎవరు అడ్డువచ్చినా వెనకడుగు వేసే పరిస్థితే లేదు. కాళేశ్వరం డీపీఆర్‌కు 2015లోనే రూ.33 కోట్లు చెల్లించారు. ఇప్పుడు రూ.141 కోట్లు చెల్లిస్తోంటే గగ్గోలు పెడుతున్నారు. రూ.2 వేల కోట్లతో 9 కిలోమీటర్ల ఎస్ఎల్‌బీసీ సొరంగం పని పూర్తిచేస్తే ఇప్పుడు నాలుగు లక్షల ఎకరాల నల్గొండ భూములు బంగారు మాగాణంగా మారేవి" అని పేర్కొన్నారు.

పిడుగుపాటుతో ఇద్దరు యువతుల మృతి

- వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఘటనలు



మౌనిక

కేసముద్రం, అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: పొలంలో పని చేస్తుండగా పిడుగుపాటుకు గురై ఇద్దరు యువతులు మృతిచెందిన వేర్వేరు ఘటనలు శనివారం వరంగల్, నల్గొండ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లికి లకావతు మౌనిక(25) వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట శివారులోని చేలో పత్తి తీసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని, నేరుగా ఆమెపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. మౌనికకు భర్త, రెండేళ్ల బాబు ఉన్నారు. నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాలాజీతండాకు చెందిన జటావత్ నాగమణి(25) బాల్నేపల్లి శివారులో మిరపతోటలో కలుపు తీసేందుకు వెళ్లారు. సాయంత్రం వర్షం కురవడంతో చేనులో నుంచి బయటికి వెళ్తున్న ఆమెపై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతిచెందారు. నాగమణి భర్త గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

EENADU Vol: 51, Iss: 70 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Door No. 5-13/2, Alugunoor Village, Thimmapur Mandal, Karimnagar District - 505 527, Telangana State. Editor: D N Prasad. Mobiles: 9959021802, 9959021803, RNI No. 52793/1992. Regd. No. L/RN/KAR/48/2024-2026 Eenadu, Karimnagar. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి విస్తరణకు రూ.77.20 కోట్లు

కరీంనగర్‌పట్టణం, చిగురుమామిడి, న్యూస్‌టుడే: మానకొండూర్ నియోజకవర్గంలోని తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు 21 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రెండో దశ పనుల కింద రూ.77.20 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారి నిర్మాణ పనులను రెండు విడతలుగా చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖ నిర్ణయించింది. హుస్నాబాద్, సుందరగిరిల వద్ద బైపాస్ రహదారులు ఉంటాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ నాలుగు వరుసల రహదారితో కరీంనగర్‌కు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. నిధులు మంజూరు చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.



కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి

అధ్యయనంతో.. ఉత్తమ గ్రేడ్‌లు



పది విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు


న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పాఠశాల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు అత్యంత కీలకం. ఇప్పటి నుంచే ఉత్తమ గ్రేడ్‌లు సాధించేందుకు ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఆశించిన ఫలితాల కోసం సాధన చేస్తున్నా.. వారిలో ఎక్కడో ఒకింత పాఠ్యాంశాలు, సన్నద్ధతపై ఆందోళన, సందేహాలు ఉన్నాయి. గణితం, సామాన్యశాస్త్రంతోపాటు భాషా అంశాలు, సాంఘిక శాస్త్రం ప్రణాళికతో చదివితే విద్యార్థులు ఉత్తమ గ్రేడ్‌లు సాధించవచ్చు. పదో తరగతిలో భాషా అంశాల్లో ఉత్తమ గ్రేడ్‌ల సాధనకు సన్నద్ధత, ప్రణాళికపై విషయ నిపుణుల సూచనలతో 'న్యూస్‌టుడే' కథనం.



పెద్దపల్లి జిల్లా పోతారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

నిత్యాభ్యసనంతో తెలుగు సులువు



గాజుల రవీందర్, పాఠ్యపుస్తక రచయిత, కరీంనగర్

నిత్య అభ్యసనం ద్వారా తెలుగులో ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. 12 పాఠాలు, ఉపవాచకంలోని ఆరు ఖండాలు విభజించుకుని ఏ రోజు ఏం చదవాలో నిర్ణయించుకోవాలి. కష్టమైన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి.
- అన్ని పాఠాల కవి పరిచయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని చదవాలి. తరచూ వాటిని చూడకుండా రాస్తూ తప్పు ఒప్పులను గుర్తించాలి.
- పరిచిత పద్యం కోసం ముఖ్యమైన 17 పద్యాలను జ్ఞాపకం ఉంచుకోవాలి.
- స్వీయరచన ప్రశ్నలకు అనుగుణంగా జవాబు రాసేలా సాధన చేస్తూ ఉండాలి. దానశీలం, వీర తెలంగాణ, కొత్త బాట, భాగ్యోదయం, శతక మధురిమ, గోల్కొండ పట్టణం, భిక్ష, భూమిక పాఠాలపై ప్రత్యేక దృష్టి నిలపాలి.
- అవగాహన, ప్రతిస్పందనకు సంబంధించిన పరిచిత అపరిచిత గద్యాంశాలకు సంబంధించిన పేరాలను ఒకటికి రెండు సార్లు చదివి వాటిల్లో చెప్పిన అంశం ఏమిటి? దేనికి సంబంధించింది? ఎందుకోసం ఉద్దేశించింది అనే ప్రశ్నలు విద్యార్థులు వేసుకుని పూర్తిస్థాయిలో వాటిపై అవగాహన పెంచుకోవాలి.
- పాఠ్యాంశాల్లోని బాక్స్ ప్రశ్నలు, అభ్యాసాలలోని ప్రశ్నలు, వాటి స్వభావంపై పూర్తి స్థాయి అవగాహన ఉండాలి.
- పరీక్షలో జవాబులను క్రమపద్ధతిలో వాక్య నిర్మాణ క్రమాన్ని పాటిస్తూ అక్షర దోషాలు లేకుండా రాసేలా తరచూ సాధన చేయాలి.
- సృజనాత్మకత ప్రశ్నల్లో లేఖ, సంభాషణ, కరపత్రం, కవిత, గేయం, ఆహ్వాన పత్రిక, ఆత్మకథ, నినాదాలు, సూక్తులు, అభినందన వ్యాసం, అభినందన పత్రం, ఇంటర్వ్యూ ప్రశ్నలు, వ్యాసం వంటి ప్రక్రియలపై అవగాహన ఉండాలి.
- పాఠాల చివరన వ్యాకరణాంశాలతోపాటు పుస్తకం చివరలోని పద పట్టిక నిఘంటువును తరచూ చదవాలి.
- అక్షర, అన్వయ దోషాలు లేకుండా.. వాక్య నిర్మాణం సరిగ్గా ఉండేలా పరీక్షల్లో జవాబులు రాయాలి.

హిందీ నమూనా ప్రశ్నపత్రాల సాధన ముఖ్యం



షరీఫ్ అహ్మద్, హిందీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్, కరీంనగర్

- పాఠాల్లోని భావాలు పూర్తిగా అర్థం చేసుకొని సమాధానాలు రాయడం అలవాటు చేసుకోవాలి. నమూనా ప్రశ్నపత్రాలను తరచూ సాధన చేయాలి.
- అపఠిత్ గద్యాంశ్‌కు సంబంధించి పాఠ్య పుస్తకం లోనివి కాకుండా హిందీ కథలు, వ్యాసాలు చదవాలి.
- పద్య భాగంలో వాడిన పదాలు, శైలి, అభివ్యక్తి గుర్తింపుపై సాధన చేయాలి. కవి గురించి తెలుసుకోవాలి.
- అర్థ్ గ్రాహ్యత- ప్రతిక్రియలో అక్షర దోషాలు లేకుండా క్రమం తప్పకుండా శాస్త్రీయ సమాధానాలు రాయాలి. ఒకటి రెండు వాక్యాల్లో సమాధానం రాయాలి.
- వర్తనీ దోషాలు లేకుండా నిత్యం కొన్ని పదాలను రాయడం అలవాటు చేసుకోవాలి. అల్పప్రాణ్, మహాప్రాణ్ ధ్వనులు, ఎక్కువగా ఉచ్చరించే అక్షరాల మధ్య తేడాలు తెలుసుకోవాలి.



బి.సురేంద్ర మోహన్, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, జడ్పీ ఉన్నత పాఠశాల, నాగులమల్యాల

విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్లం పాఠ్యాంశాలని ప్రణాళికతో చదివితే ఉత్తమ జీపీఏ సాధించడం సులభం. పరీక్షలో ఎక్కువగా డిస్కోర్సెస్, క్లోజ్ టెస్ట్, గ్రామర్, అన్‌సీన్ పోయమ్స్ అడుగుతారు. వీటిని విద్యార్థులు ఒకేసారి చదవకుండా ఒక్కో భాగాన్ని ఒక్కోసారి చదివేలా ప్రణాళిక వేసుకోవాలి.
- ప్రశ్నపత్రంలోని 1-8 వరకు ఉన్న ప్రశ్నల్లో 1-4 రీడింగ్ ఏ నుంచి, 5-8 రీడింగ్ బీ, సీ నుంచి అడుగుతారు. ఇందుకోసం పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. ప్రశ్నలకు సమాధానాలు సూటిగా, అర్థవంతంగా రాయాలి. ఇందుకు మాదిరి ప్రశ్నలపై అవగాహన పెంచుకోవాలి. ఒక పేరాలో కొన్ని ప్రశ్నలను తరగతి ఉపాధ్యాయుడి ద్వారా తయారు చేయించుకుని ఒక్కో ప్రశ్నకు రెండు మూడు జవాబులు రాసి ఉపాధ్యాయులతో సరిచేయించుకునే పద్ధతిని ప్రాక్టీస్ చేయాలి.

ప్రణాళికతో ఆంగ్లంలో మంచి ఫలితాలు

- 9-12 వరకు గల ప్రశ్నల్లో బార్ గ్రాఫిక్స్, పై చార్ట్స్, గ్రాఫిక్స్, టేబుల్స్ వంటి వాటి నుంచి అడుగుతారు. కొన్నిసార్లు ఇచ్చిన టేబుల్ లేదా గ్రాఫ్ గురించి అడుగుతారు కాబట్టి జవాబులు ఆ ప్రశ్నల్లోనే ఉంటాయని గుర్తుంచుకోవాలి. ప్రశ్నలు హేతుబద్ధంగా ఉంటాయి కాబట్టి ఆలోచించి జవాబు రాసేలా సన్నద్ధం కావాలి.
- పేరాగ్రాఫ్ ఆధారంగా జవాబులు రాయడంలో వ్యాకరణ అంశాలు ఉంటాయి. గత ప్రశ్నపత్రాలు చూస్తే వాయిస్, స్పీచ్, క్వశ్చన్ ట్యాగ్స్‌పై ప్రతి సారి ప్రశ్నలు వస్తున్నాయి. వాటిల్లో చాలా రకాలు ఉంటాయి కాబట్టి ఒక్కో రకాన్ని ఒక్కో రోజు ప్రాక్టీస్ చేస్తూ ఉండాలి.
- డిస్కోర్సెస్ ప్రశ్నలను విద్యార్థులు ఎంత బాగా రాయగలిగితే అన్ని మార్కులు వస్తాయి. ఇందుకోసం వాటిపై ఇప్పటి నుంచే రాయడం అలవాటు చేసుకోవాలి. రాత నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి.
- పార్ట్-బీలో అన్‌సీన్ పద్యాలు, గద్యభాగం (ప్రోజ్), క్లోజ్ టెస్ట్, ఎడిటింగ్ వంటి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. అన్‌సీన్ పద్యం, ప్రోజ్‌లను క్షుణ్ణంగా అర్థం చేసుకుంటే జవాబులు రాయవచ్చు. ఇందుకోసం కొన్ని అన్‌సీన్ పద్యాలు, ప్రోజ్‌లను అంతర్జాలంలో సేకరించి చదువుకోవాలి.
- ఎడిటింగ్‌కు సంబంధించిన ప్రశ్నలు పాఠ్యపుస్తకం నుంచే ఇస్తారు. కాబట్టి పుస్తకంలోని అన్ని పాఠాలను క్షుణ్ణంగా చదివి అవగాహన పెంచుకోవాలి. ఆర్టికల్స్, ప్రిపోజిషన్స్, టెన్సెస్, లింకర్స్, పర్యాయపదాలు, వ్యతిరేక పదాలు, అర్థాలపై ధ్యాస నిలపాలి.
- విద్యార్థులు ఇప్పటి నుంచే ఆంగ్ల భాషలో రాయడం, చదివి అర్థం చేసుకునే నైపుణ్యాలను పెంచుకోవాలి. ప్రశ్నలను చదివి అర్థం చేసుకునే సామర్థ్యం కలిగి ఉండాలి.

సాంఘికశాస్త్రంలో సమకాలీన అంశాలపై ప్రశ్నలు



ఎ.కుమారస్వామి, రిసోర్స్ పర్సన్, కరీంనగర్

సాంఘిక శాస్త్రంలోని 21 అధ్యాయాలను విద్యార్థులు ఇప్పటి నుంచే అవగాహన, ప్రణాళికతో చదివితే ఉత్తమ గ్రేడ్‌లు సాధించవచ్చు. చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలి.
- పాఠ్యాంశంలో చర్చించిన విషయాల ఆధారంగా ప్రస్తుత సమకాలీన అంశాలపై ప్రశ్నలు వస్తాయి. అందుకని లింగ వివక్ష, బాలికల విద్య, పర్యావరణం, భూగర్భ జలాలు, వలసలు, పట్టణీకరణ, సేంద్రియ ఎరువులు, భూగోళం వేడెక్కడం, ప్రపంచ శాంతి, ఓటు ప్రాధాన్యం, ప్రజాస్వామ్యం, ఎన్నికల ప్రక్రియ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- భారతదేశ చిత్రపటంలో రాష్ట్రాలు- రాజధానులు, భూ స్వరూపాలు, నదులు.. ప్రపంచ పటంలో ప్రముఖ ప్రదేశాలు, ఆయా దేశాలు, వాటి రాజధానులను గుర్తించేలా సాధన చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర చిత్రపటం గీయడం సాధన చేయాలి.
- సమాచార నైపుణ్యం కింద ప్రశ్నలను పుస్తకంలోని 2, 3, 6, 8, 10, 12, 15, 19, 21 అధ్యాయాల్లో గ్రాఫులు, పట్టికల విశ్లేషణతో అధ్యయనం చేయాలి. దత్తాంశ విశ్లేషణ, సూచనలు ఆధారంగా సమాధానాలు రాయడం నేర్చుకోవాలి.
- ప్రణాళికతో విద్యా ప్రమాణాల ఆధారంగా వివిధ ప్రశ్నలకు సమాధానాలు రాసేప్పుడు సూచనలు పాటిస్తూ రాయడాన్ని అలవాటు చేసుకోవాలి. ఎస్‌సీఈఆర్టీ సాంఘికశాస్త్ర అభ్యాసన దీపికలను అధ్యయనం చేయడం ద్వారా ఎక్కువ మార్కులు సాధించవచ్చు.

అథ్లెటిక్స్‌లో ఆణిముత్యాలు

14లో

పోరాటాల గడ్డపై సరస్వతీ పుత్రులు

బాలికల ఉన్నతికి చదువు దోహదం

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రతి బాలికా మరొకరికి స్ఫూర్తిదాయకం కావాలని, ఆ దిశగా నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించాల్సిన అంతర్జాతీయ బాలికా దినోత్సవం దసరా సెలవుల కారణంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు అంతరిక్షంలోకి వెళ్తున్నారని గర్వంగా చెప్పుకొనే ఈ రోజుల్లో భ్రూణ హత్యలు బాధాకరమన్నారు. యుక్తవయసు రాగానే బాలికకు సమాజంపై భయాన్ని నూరిపోస్తున్నామని తెలిపారు. జీవితంలో బాలికా ధైర్యంగా ముందుకు సాగాలని, చదవటం ఒక్కటే ఎదగడానికి మార్గమని తెలిపారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.. బాలికలపై వివక్ష కుటుంబం నుంచి మొదలవుతుందని, ఆ దురాచారాన్ని వీడాలని సూచించారు. ఏసీపీ మాధవి బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, జిమ్నాస్టిక్స్ ఆకట్టుకున్నాయి. జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, వైద్యాధికారి సుజాత, షీటీం ఇన్‌స్పెక్టర్ శ్రీలత, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధ, బాలికలు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

వీసీ బాధ్యతల స్వీకరణ



సురేంద్రమోహన్ నుంచి బాధ్యతలు తీసుకుంటున్న ఉమేశ్‌కుమార్

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతిగా ఆచార్య ఉమేశ్‌కుమార్ శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లో ఇన్‌ఛార్జి వీసీ సురేంద్రమోహన్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన వీసీ సోమవారం కరీంనగర్‌కు రానున్నారు.

భవిష్యత్తులో విద్యుత్తు అంతరాయాలకు చెల్లు

సరఫరా ఉండగానే ఉపకేంద్రంలో మరమ్మతు

న్యూస్‌టుడే, భగత్‌నగర్

ప్రతి నెల విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతు అనగానే.. దాని పరిధిలోని ప్రాంతాలకు సిబ్బంది గంటల తరబడి కరెంటు సరఫరాను నిలిపివేసేవారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతరాయం ఉండేది. ఎక్కువ సమయం కరెంటు సరఫరాలేక వినియోగదారులు ఇబ్బందిపడేవారు. వ్యాపారులతోపాటు ఇళ్లల్లో ఉండేవారి పనులు ఎక్కడివి అక్కడే ఆగిపోయేవి. ఈ సమస్యకు ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిష్కారం చూపారు.
- సీఎండీ ఇప్పటికే విద్యుత్తు సరఫరా సేవల్లో కొన్ని మార్పులు తీసుకొచ్చారు. ఉప కేంద్రాల్లో సరఫరాను నిలిపివేయకుండానే మరమ్మతు చేసే పద్ధతిని ప్రయోగాత్మకంగా చేశారు. దీంతో వినియోగదారులకు మేలు చేకూరుతుందన్నారు.

ప్రయోగం.. విజయవంతం

- కరీంనగర్‌లోని వాటర్ వర్క్స్ (హౌసింగ్ బోర్డు)లో శనివారం ఈ విధానాన్ని జిల్లా అధికారులు అమలు చేశారు. విద్యుత్తు కేంద్రంలో సరఫరా ఉండగానే సిబ్బంది ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విజయవంతంగా మరమ్మతు చేశారు. ఆ సమయంలో ఉప కేంద్రం పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్తు నిలిపివేయలేదు.
- ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ జంపాల రాజం మాట్లాడుతూ.. ఈ పద్ధతిని అన్ని విద్యుత్తు ఉపకేంద్రాల్లో అమలు చేస్తామన్నారు. నగరంలో కరెంటు అంతరాయాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో నగర ఒకటో ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏఈ షసి అహ్మద్, ఏఈ టెక్నికల్ డీటీ శ్రీనివాస్, టీఆర్ఈ ప్రొటెక్షన్ వింగ్, సిబ్బంది సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ రావు, ఎల్ఐ కె.ఇంద్రసేనా రెడ్డి, లైన్‌మెన్ ఎ.ప్రకాశ్, ఎం.రవీందర్ తదితరులు ఉన్నారు.



విద్యుత్తు లైన్‌పై పని చేస్తున్న కార్మికులు

బ్రహ్మోత్సవాలకు సిద్ధం

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: సాక్షాత్తు వేద స్వరూపుడైన యజ్ఞవరాహ స్వామి బ్రహ్మోత్సవాలకు కరీంనగర్ బొమ్మకల్‌రోడ్డులోని క్షేత్రం సిద్ధమైంది. 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 25 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. యాదాద్రి, భద్రాద్రి, అన్నవరం, వేములవాడ తదితర క్షేత్రాల నుంచి వేదపండితులు వచ్చి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని సర్వ వైదిక సంస్థానం ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాద్ తెలిపారు. ప్రతి రోజు రాత్రి సంగీత, నృత్య నీరాజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

అకాల వర్షాలు.. ముందే వరి కోతలు

అకాల వర్షాలు కురుస్తుండటంతో జిల్లాలో చాలామంది ముందే యంత్రంతో వరికోతలు ప్రారంభించారు. చేతికందే దశలో వర్షానికి చెడిపోతాయని భయపడి ఇలా చేస్తున్నారు. గతేడాది ఆలస్యంగా కోతలు చేస్తే దిగుబడి నష్టపోయామని, ఈసారి వరి పైరు పూర్తిగా ఎండకముందే కోపిస్తున్నామని రైతులు తెలిపారు. చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో యంత్రంతో వరిని కోస్తున్న చిత్రమిది.

\- న్యూస్‌టుడే, చొప్పదండి



అథ్లెటిక్స్‌లో ఆణిముత్యాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ క్రీడా విభాగం

పరుగు పందెం.. నడక పోటీలు.. మారథాన్‌లు.. ట్రయాథ్లాన్.. స్టీపుల్ ఛేజ్.. పోటీలు ఏవైనా జిల్లా క్రీడాకారులు ప్రత్యర్థులను దాటి విజేతలుగా నిలిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వన్నె తెస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తున్నారు. గత సెప్టెంబరు 19, 20లలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో.. అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి ఛాంపియన్లుగా నిలిచారు. వారిపై 'న్యూస్‌టుడే' కథనం.

క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యం



కరీంనగర్ కోతిరాంపూర్‌కు చెందిన రాజయ్య-లక్ష్మిల కుమారుడు వినయ్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. లక్ష్మి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మికురాలు. క్రీడా కోటాలో ఉద్యోగమే లక్ష్యంగా 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్, 1500, 5000 మీటర్ల పరుగు సాధన చేస్తున్నాడు.

■ 2023లో ఖమ్మంలో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్టీపుల్ ఛేజ్‌లో బంగారు పతకం, 5000 మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించాడు. అదే ఏడాది సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి పరుగు పోటీల్లో 4వ స్థానంలో నిలిచాడు.

■ డిసెంబరులో కామారెడ్డిలో జరిగిన క్రాస్ కంట్రీ రాష్ట్ర ఛాంపియన్‌షిప్ 8 కి.మీ విభాగంలో బంగారు పతకం కైవసం చేసుకున్నాడు.

■ 1500 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం గెలుచుకున్నాడు. ఆగస్టులో కరీంనగర్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ జూనియర్ స్టేట్ ఛాంపియన్‌షిప్‌లో స్టీపుల్ ఛేజ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. 5000 మీటర్ల పోటీలో వెండి పతకం నెగ్గాడు.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలని..



ఎడ్ల విష్ణువర్ధన్

కరీంనగర్ జిల్లాకు చెందిన ఎడ్ల శేఖర్-లావణ్య దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ ఎస్సారార్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దేశం తరఫున ఆడాలనే లక్ష్యంతో 10,000 మీటర్ల రేస్ వాక్ సాధన చేస్తున్నాడు.

■ ఈనెల 8 నుంచి 10 వరకు అండర్-20 ఏషియన్ సెలక్షన్స్ ట్రయల్స్, జాతీయ జూనియర్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు.

■ 2023 సెప్టెంబరులో వరంగల్‌లో జరిగిన సౌత్ జోన్ జాతీయ స్థాయి పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచాడు. నవంబరులో కోయంబత్తూరులో జరిగిన జూనియర్ నేషనల్స్ ఛాంపియన్‌షిప్‌లో అయిదో స్థానంలో నిలిచాడు.

■ 2024 జనవరిలో చెన్నైలో జరిగిన ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో.. చండీగఢ్‌లో ఓపెన్ నేషనల్ రేస్ వాకింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. 2024 మార్చి లఖ్‌నవూలో జరిగిన జూనియర్ జాతీయ అండర్-20 అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటాడు.

ఒలింపిక్స్‌లో ఆడటం ధ్యేయం



జి. నక్షత్ర

సిద్దిపేట జిల్లా శనిగరానికి చెందిన రామకృష్ణ-శ్రీనిధి దంపతులు కరీంనగర్ భగత్‌నగర్‌లో ఉంటున్నారు. వీరి కూతురు జి. నక్షత్ర రెండేళ్ల నుంచి 'ఈనాడు-లక్ష్య' అకాడమీలో పరుగు పందెంలో శిక్షణ పొందుతోంది. కోచ్ తిరుపతి శిక్షణలో ఎన్నో పతకాలు సాధించింది.

■ ఈనెల 17 నుంచి 19 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన దక్షిణ భారత జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం సాధించింది.

■ 2024 అక్టోబరు 7, 8లలో హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ట్రయాథ్లాన్ పోటీల్లో జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలిచింది. 2024 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది.

■ 2023 అక్టోబరు 16న హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ట్రయాథ్లాన్ పోటీల్లో కాంస్య పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం సాధించింది. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 10 బంగారు పతకాలు, 8 రజత పతకాలు.. జిల్లా స్థాయిలో సుమారు 300 వరకు బంగారు, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టింది.

■ ఒలింపిక్స్‌లో దేశం తరఫున ఆడటం తన లక్ష్యమని పేర్కొంది.

పోరాటాల గడ్డపై సరస్వతీ పుత్రులు

ఉపకులపతులుగా సిరిసిల్ల విద్యావేత్తలు

ఈనాడు, సిరిసిల్ల

సిరిసిల్ల ప్రాంతం పోరాట యోధులనే కాదు.. సాహితీ దిగ్గజాలను.. విద్యావేత్తలను అందించింది.. ఈ ప్రాంతానికి చెందిన పలువురు విశ్వవిద్యాలయాలకు కులపతులుగా, ఉప కులపతులుగా పని చేసి విద్యారంగంలో మార్పులకు శ్రీకారం చుట్టారు.. గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన జీఎన్. శ్రీనివాస్ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన నేపథ్యంలో ఈ ప్రాంతానికి చెందిన విద్యావేత్తలపై కథనం.

■ జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా.సి.నారాయణరెడ్డి వేములవాడ మండలం హన్మాజిపేటలో జులై 29, 1931లో జన్మించారు. తన ప్రాథమిక విద్యను వీధి బడిలో ప్రారంభించారు. తెలుగులో పీజీ చేసిన ఆయన పీహెచ్‌డీ పూర్తి చేశారు. కళాశాల అధ్యాపకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన ఓయూ, తెలుగు విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుడిగా పని చేశారు. కవి, గేయ రచయిత, సాహితీ వేత్తగా తనదైన ముద్ర వేసిన ఆయన విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీగా 1985-87 వరకు సేవలందించారు. 1989లో తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులై రెండేళ్లపాటు ఆ హోదాలో ఉన్నారు. 2017లో ఆయన కన్నుమూశారు.




సి.నారాయణరెడ్డి, సీహెచ్.హన్మంతరావు, జి.రాంరెడ్డి, సంకశాల మల్లేశం, జీఎన్.శ్రీనివాస్

■ దూరవిద్య పితామహుడు జి.రాంరెడ్డి 1929లో వేములవాడ మండలం మల్లారంలో జన్మించారు. రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేసిన ఆచార్యులుగా పని చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు దూరవిద్యను తీసుకురావాలని అనేక దేశాల్లోని విద్యా వ్యవస్థలపై పరిశోధనలు చేశారు. ఆయన కృషి ఫలితంగానే 1982లో మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటైంది. 1985లో ప్రారంభించిన ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి తొలి వీసీగా అయిదేళ్లపాటు పని చేశారు. దూరవిద్య కోసం ఈయన చేసిన కృషికిగాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దూరవిద్య విభాగానికి రాంరెడ్డి పేరు పెట్టారు. 1991లో యూజీసీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 1995లో లండన్‌లో మృతి చెందారు.

■ ఆర్థికవేత్త చెన్నమనేని హనుమంతరావు కోనరావుపేట మండలం నాగారంలో 1929లో జన్మించారు. దిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి 1961లో ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. కేంద్ర ప్రణాళిక విభాగంలో పని చేసిన ఈయన 20 సూత్రాల సలహా కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. వ్యవసాయ అర్థశాస్త్రం, పేదరికం, ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి అంశాలపై వందకుపైగా పరిశోధన పత్రాలు, పుస్తకాలు రచించారు. 2012 నుంచి 2014 వరకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కులపతిగా పని చేశారు.

■ జిల్లాలో హన్మాజీపేట గ్రామం పేరు వినగానే డా.సి.నారాయణరెడ్డి గుర్తుకు వస్తారు. విద్యావేత్త సంకశాల మల్లేశందీ అదే గ్రామం. ఒక సాధారణ వ్యవసాయకూలీ కుటుంబం నుంచి విశ్వవిద్యాలయం వీసీ స్థాయికి ఆయన ఎదిగారు. గ్రామంలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన సిరిసిల్ల ఎస్సీ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశారు. 1990లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ తత్వశాస్త్రం పూర్తి చేసిన ఆయన అక్కడే ఎంఫిల్ కూడా చేశారు. జర్మనీలో పీహెచ్‌డీ చేసి పలు కళాశాలల్లో తత్వశాస్త్ర ఆచార్యుడిగా పని చేశారు. మే 24, 2021 నుంచి మే 21, 2024 వరకు కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం వీసీగా వ్యవహరించారు.

■ తాజాగా పాలమూరు విశ్వవిద్యాలయం వీసీగా నియమితులైన జీఎన్.శ్రీనివాస్ గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందినవారు. ఈయన పదో తరగతి వరకు గంభీరావుపేటలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. కామారెడ్డి జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి 1995లో జేఎన్‌టీయూ నుంచి ఈఈఈలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. తాత్కాలిక అధ్యాపకుడిగా పని చేస్తూనే 1997లో ఎంటెక్ పూర్తిచేశారు. 2003లో జేఎన్‌టీయూలో అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2022లో కొంత కాలం సిరిసిల్ల జేఎన్‌టీయూ ప్రధానాచార్యులుగా పనిచేశారు. ఆచార్యులుగా, ప్రధానాచార్యులుగా, జేఎన్‌టీయూ పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదుగుతూ వీసీ స్థాయికి చేరుకున్నారు. - న్యూస్‌టుడే, గంభీరావుపేట



నిటారుగా బండ.. ఆధారం లేకుండా!

సుల్తానాబాద్ మండలం కదంబాపూర్, తొగర్రాయి గ్రామాల మధ్య ఎత్తయిన గుట్టలున్నాయి. అందులో ఒకటైన పాండవుల గుట్టపై ఓ బండరాయి ఎలాంటి ఆధారం లేకుండా ఇలా నిలబడి ఉండటం చూపరులను ఆకట్టుకుంటోంది. - ఈనాడు, కరీంనగర్, న్యూస్‌టుడే, సుల్తానాబాద్

అపోహ వీడండి... చలామణి పెంచండి

రూ.10 నాణెం చెల్లుబాటుపై ప్రచారం

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

కొంతకాలంగా రూ.10 నాణెం చెల్లుబాటులో లేదనే అపోహలు తీవ్రమయ్యాయి. బడా వ్యాపారులతో పాటు యాచకులు సైతం నాణెం తీసుకునేందుకు నిరాకరించే పరిస్థితులు నెలకొన్నాయి. చిరిగిన నోటు తీసుకుంటున్నారు కాని నాణెం మాత్రం వద్దంటున్నారు. కొందరికి చెల్లుబాటులో ఉందని తెలిసినా.. నిరాకరిస్తున్న సంఘటనలున్నాయి. దీంతో మార్కెట్‌లో చిల్లర కొరత తీవ్రమవుతుంది. ఈ క్రమంలో ఈ నాణెం చెల్లుబాటులో ఉందని.. దీనిపై అపోహలు, దుష్ప్రచారాలు వీడి చలామణిని పెంచాలంటూ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా విస్తృత ప్రచారానికి పూనుకుంది.

బ్యాంకులో పంపిణీ..: ఇప్పటికే ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లను నగరంలోని పలు వ్యాపార సంస్థల ముందు అంటించడంతో నాణెం వినియోగంపై అవగాహన పెంచేలా చర్యలు తీసుకున్నారు. తాజాగా యూనియన్ బ్యాంకులోని వివిధ శాఖల్లో ఈ నాణేల పంపిణీ తప్పనిసరి చేశారు. గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని యూనియన్ బ్యాంకు శాఖలో ఇటీవల ఒక్కరోజే 50వేల రూ. 10 నాణేలను వివిధ వ్యాపార, వాణిజ్య వర్గాలకు పంపిణీ చేశారు. ఈ నాణాన్ని 2005లో ప్రవేశపెట్టగా. అప్పటినుంచి 2019 వరకు 14 సార్లు ఆర్‌బీఐ ముద్రించి మార్కెట్‌లోకి విడుదల చేసింది.



ఖాతాదారునికి రూ.10 నాణేలను పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

నాణేలకు చట్టబద్ధత: రూ.10 నాణానికి చట్టబద్ధత ఉంది. నాణెం చలామణిలో లేదనేది కేవలం అపోహ మాత్రమే. దీనిపై ఇప్పటికే ఆర్‌బీఐ పలుమార్లు స్పష్టం చేసింది. ఇప్పటికైనా వివిధ వర్గాల వారు అపోహలు వీడి.. చిల్లర కొరత తీర్చుకోవాలి.
- హిమాన్షు బారిక్, మేనేజర్, యూనియన్ బ్యాంకు, గోదావరిఖని (లక్ష్మీనగర్)

నేడు ఎల్ఎండీ గేట్ల ఎత్తివేత

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: మధ్యమానేరు జలాశయం నుంచి ఎల్ఎండీకి అధికంగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆదివారం ఉదయం 7 గంటలకు ఎల్ఎండీ గేట్లు ఎత్తనున్నట్లు నీటి పారుదల శాఖ ఈఈ పి.నాగభూషణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యమానేరు జలాశయం నుంచి సుమారు 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. గేట్లను ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని మానేరు నదిలోకి వదలనున్నారు. నదీ పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు వెళ్లవద్దని కోరారు.

బోయినపల్లి : రాజరాజేశ్వర జలాశయం (మధ్యమానేరు) నుంచి ఎల్ఎండీకి శుక్రవారం నీటిని విడుదల చేశారు. జలాశయం రెండు గేట్ల నుంచి 4,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 26.86 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు



భగత్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాలకు ఉప కేంద్రాలల్లో మరమ్మతు వల్ల ఆదివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని నగర ఒకటో, రెండో ఏడీలు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం.లావణ్యలు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు టవర్ సర్కిల్‌లోని ఉప కేంద్రంలో మరమ్మతులు చేపడుతున్నామని, దీని పరిధిలోని డాక్టర్ స్ట్రీట్, శ్రీనగర్, ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగం, గాంధీ రోడ్డు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, అహ్మద్‌పుర, రూరల్ పోలీస్ ఠాణా, బోయివాడ, ప్రకాశంగంజ్, టవర్‌సర్కిల్, సీపీ కార్యాలయం, సిక్‌వాడీ, కమాన్ ప్రాంతం, లక్ష్మీనగర్, కమాన్ నుంచి హౌసింగ్‌బోర్డు రహదారి ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈఎన్ గార్డెన్, ఆంధ్రాబ్యాంక్ ప్రాంతం, హెచ్‌పీ గోదాం, రెడ్డి ఫంక్షన్ హాలు వెనుక భాగం, మెహర్‌నగర్ ప్రాంతాలు సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భగత్‌నగర్, ముకరంపుర, విఘ్నేశ్వర కాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఎన్జీవోస్‌కాలనీ, ఎర్రగుట్టపల్లి, కట్టరాంపూర్ ప్రాంతం, అంబేడ్కర్ స్టేడియం, కలెక్టర్ కాంప్లెక్స్ ప్రాంతం, బస్టాండ్ ప్రాంతం, ఒకటో పోలీస్ ఠాణా ప్రాంతం, ఎల్ఐసీ కార్యాలయం ప్రాంతం, తిరుమలనగర్, గణేశ్‌నగర్, హన్మాన్‌నగర్, ధోబీవాడ, కమాన్ ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

విద్యార్థిని దండించిన ఉపాధ్యాయులు

విచారించి షోకాజ్ నోటీసులు జారీ చేసిన డీఈవో



చికిత్స పొందుతున్న విద్యార్థి

మానకొండూర్, న్యూస్‌టుడే: విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తయారు చేసే ఉపాధ్యాయులు క్రమశిక్షణ పేరుతో విద్యార్థిని చితకబాదిన ఘటన మానకొండూర్ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన విద్యార్థి ఆదిత్య పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం పాఠశాలలో ఆదిత్యను ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్ క్రమశిక్షణ పేరిట చితకబాదడంతో కిందపడి స్పృహ కోల్పోయాడు. హుటాహుటిన కారులో సమీపంలోని లక్ష్మీపూర్ పీహెచ్‌సీకి.. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థి కోలుకుంటున్నాడు. ఈ ఘటనపై డీఈవో జనార్దన్‌రావు విచారణ చేపట్టారు. శనివారం సాయంత్రం పాఠశాలకు చేరుకొని వివరాలు తెలుసుకొన్నారు. క్రమశిక్షణ పేరిట విద్యార్థులను దండించవద్దని తల్లిదండ్రులను పిలిపించి మందలించాలని ఆయన సూచించారు. అనంతరం ఇద్దరు ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్‌లకు షోకాజ్ నోటీసులు అందజేశారు. ఈ ఘటనపై ప్రిన్సిపల్ పద్మశ్రీ మాట్లాడుతూ.. విద్యార్థిని క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చెంపపై కొట్టడంతో కింద పడిపోయాడన్నారు.





వాణినికేతన్ పాఠశాలలో..

సృజనకు పదును

కరీంనగర్ రాంనగర్‌లోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలు సి.హెచ్.సాయి ఐశ్వర్య, ఎ.హంసిని, డి.దివాన్ సాయిలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.గిరిధర్ బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కరీంనగర్‌లోని వాణినికేతన్ ఉన్నత పాఠశాలలోనూ ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యారులు ఎం.వర్షిణి, డి.ప్రణీత్‌కుమార్, షేక్ ఆఫిన్‌లకు ప్రధానోపాధ్యాయుడు కోట లక్ష్మారెడ్డి బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

- న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం





విశ్వశాంతి పాఠశాలలో...

48 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ



దుద్దెనపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

శంకరపట్నం(సైదాపూర్), న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో రైతులు వడ్లు విక్రయించిన 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తప్పకుండా తూర్పార పట్టాలన్నారు. ధాన్యం తేమ శాతం విషయంలో వ్యవసాయ విస్తరణాధికారి ధ్రువీకరణ అనంతరమే తూకాలు చేయాలన్నారు. కేంద్రాల్లో రైతులు సన్న, దొడ్డు రకం ధాన్యం వేర్వేరుగా నిల్వ చేసేలా చూడాలన్నారు. తహసీల్దార్ మంజుల, సింగిల్ విండో అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. ముల్కనూర్, చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె శనివారం పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు నేలను చదును చేయించి.. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో ఖాజామోయినోద్దీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర

గంగాధర, న్యూస్‌టుడే: ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. గంగాధర మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆయన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సింగిల్‌విండో అధ్యక్షులు వెలిచాల తిర్మలరావు, దూలం బాలగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, తహసీల్దారు అనుపమ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గట్టుబూత్కూర్‌కు చెందిన చంద్రశేఖర్ అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరగా ఆయన వైద్యానికి ఎమ్మెల్యే రూ.2.50 లక్షల సీఎం సహాయనిధి అందజేశారు. మాజీ వైస్ ఎంపీపీ కంకనాల రాజగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి రోమాల రమేష్ పాల్గొన్నారు.

మురుగుకాలువ శిథిలం



నగర శివారులోని కొత్తయాస్వాడ ప్రాంతంలో మురుగుకాలువలు శిథిలమయ్యాయి. మురుగు సక్రమంగా ప్రవహించకపోవడంతో దుర్గంధంగా మారుతోంది. చెత్తా చెదారం పూడిక తొలగించడంలేదు. రోడ్డు వేసే సమయంలో మురుగు కాలువ నిర్మించకపోవడంతోనే సమస్యలు వస్తున్నాయని ఆ ప్రాంతవాసులు ఆగ్రహిస్తున్నారు. వెంటనే భూగర్భ మురుగుకాలువ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సుభాష్‌నగర్**

గుంతలమయంగా రోడ్డు



నగర నడిబొడ్డున ముకరంపుర జ్యోతిబా పులే మైదానం వెనుకాల రహదారి నిర్మాణానికి ఏడాది కిందట తవ్వారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనులు చేయకపోగా పక్కనున్న వీధుల్లోకి వెళ్లేందుకు నానావస్థలు పడుతున్నారు. వర్షానికి గుంతలు తయారయ్యాయి. రోడ్డు నిర్మించాలని స్థానికులు ఒత్తిడి చేయడంతో కార్పొరేటర్ వినూత్నరీతిలో నిరసన తెలిపారు. అయినా ఒక అడుగు ముందుకు పడలేదు. **- న్యూస్‌టుడే, కార్పొరేషన్**

ఇళ్ల మధ్య పిచ్చి మొక్కలు



నగరంలోని లక్ష్మీనగర్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. స్థల యజమానులు ఆ వైపు రాకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. అపరిశుభ్రంగా ఉండటంతో పందులు సంచరిస్తున్నాయి. సాయంత్రం కాగానే కీటకాలు, దోమలు వస్తుండటంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వెంటనే ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకొని ప్రహరీ నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, సుభాష్‌నగర్**

చికిత్స పొందుతూ బావ బామ్మర్దుల మృతి

క్రైం కార్నర్

తిమ్మాపూర్, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారిపై ఆగి ఉన్న లారీని బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో శుక్రవారం రాత్రి ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కూటిగల్ తండాకు చెందిన లావుడ్యా వాగ్యా(30), అతని బావ భూక్య రాజు(46) ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్లుగా బీఎస్ఎన్ఎల్‌లో పని చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఆదిలాబాద్‌లో పనులు ముగించుకుని వాహనంలో ఇద్దరూ ఇంటికి బయల్దేరారు. అల్గునూర్ శివారులోని చేపలకాలనీ వద్ద పార్కింగ్ ఇండికేటర్స్ వేయకుండా, నిర్లక్ష్యంగా రోడ్డు మీద ఆపిన లారీని గమనించక వెనక నుంచి ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వాహనదారులు, పోలీసులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

టేలా ధ్వంసం చేసిన నలుగురిపై కేసు

జమ్మికుంట : జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో టేలాను అకారణంగా ధ్వంసం చేసినందుకు శనివారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వి.రవి తెలిపారు. బాధితుడు కె.వెంకటయ్య ఫిర్యాదు మేరకు జమ్మికుంటకు చెందిన ఎ.వెంకట రాజమల్లు, కె.రాజేందర్, పి.రవి, పి.గోపిలపై కేసు నమోదు చేశామన్నారు.

ఇంటి యజమానులపై..

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంటలో బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న షాపును ఇంటి యజమానులు కె.రాణి, వెంకటేశ్వర్లు అకారణంగా దాడి చేసి ఖాళీ చేయించారని రామన్నపల్లికి చెందిన ఎ.రాజేందర్ ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ రవి తెలిపారు. షాపును అద్దెకు తీసుకొని ఉల్లిగడ్డల వ్యాపారం నిర్వహిస్తుండగా.. లాభంగా సాగుతుందని ఇంటి యజమానులు షాపును ఖాళీ చేయించి వారు ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తున్నారని రాజేందర్ ఫిర్యాదు చేసినట్లు సీఐ చెప్పారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుజూరాబాద్‌లో ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైనట్లు సీఐ తిరుమల్‌గౌడ్ శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు చెప్పారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.

అమెరికాలో బతుకమ్మ వేడుకలు

చొప్పదండి, న్యూస్‌టుడే: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో బేకర్స్‌ఫీల్డ్ నగరంలో హిందూ టెంపుల్ సెక్రటరీ, చొప్పదండికి చెందిన ఇప్పనపెల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలుగువారు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. పండుగ తేదీలు అయిపోయినా.. సంస్కృతిని తెలియజేసేందుకు బతుకమ్మ ఆడామని తెలిపారు.



పనులు పూర్తి చేయించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఇతర నాయకులు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సహాయ నిధులతో కరీంనగర్‌లో ప్రారంభించిన పనులను పూర్తి చేయించాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కలెక్టర్‌ను కోరారు. శనివారం ఆయన జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో ఆధునిక కళాభవన్ నిర్మించడానికి, ఎస్సారార్ కళాశాల ప్రాంగణంలో అమృత వర్షిణి సాంస్కృతిక కళాభవనానికి పట్టణ ప్రగతి నుంచి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు. పనులు పూర్తి కావస్తున్న దశలో నిధులు లేని కారణంగా అధికారులు నిలిపివేశారన్నారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఇంటి పట్టాలు ఇచ్చామని, ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు జమీలొద్దీన్, కార్పొరేటర్లు జంగిలిసాగర్, దిండిగాల మహేశ్, నక్క కృష్ణ, కోల సంపత్, దావ కమలమనోహర్, కర్ర సూర్యశేఖర్‌లు ఉన్నారు.

సంక్షిప్తం

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

కరీంనగర్ నేరవార్తలు : పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తు వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు కుటుంబాలకు కరీంనగర్ అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ చెక్కు రూపంలో ఆర్థిక సాయం అందజేశారు. సీసీఆర్‌బీ విభాగంలో పని చేస్తున్న కె.లింగారెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. భద్రత విభాగం నుంచి మంజూరైన రూ.16 లక్షల చెక్కును ఆయన భార్యకు అందించారు. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస్, కరీంనగర్ ట్రాఫిక్ ఠాణాలో కానిస్టేబుల్ కుమారస్వామి కుటుంబాలకు రూ.8 లక్షల చొప్పున అందించారు.

ఉచిత బస్సు పాసులు పంపిణీ

హుజూరాబాద్ గ్రామీణం : కనుకులగిద్ద గ్రామ పంచాయతీ కార్యాలయంలో హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ 40 మంది దివ్యాంగులకు శనివారం ఉచిత బస్సు పాసులను పంపిణీ చేశారు. సిబ్బంది అయిలయ్య, జి.ఎస్.రెడ్డి, కారోబార్ సురేందర్ పాల్గొన్నారు.

వెలిచాల జగపతిరావుకు నివాళి

కరీంనగర్ పట్టణం : పేదల పెన్నిధిగా సీనియర్ కాంగ్రెస్ నేత దివంగత వెలిచాల జగపతిరావు చిరస్థాయిలో నిలిచిపోయారని కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్పొరేటర్లు పేర్కొన్నారు. జగపతిరావు రెండో వర్ధంతిని శనివారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టండి

తెలంగాణచౌక్(కరీంనగర్) : రాష్ట్రంలో హిందూ ఆలయాలపై దాడులు పెరిగి పోతున్నాయని.. అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శనివారం జిల్లా సచివాలయం ముందు నిరసన తెలిపారు. బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ కన్నం శంకర్, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వరూప, రాష్ట్ర సేవా ప్రముఖ కోమల రాజేందర్‌రెడ్డి, బజరంగ్‌దళ్ జోనల్ కన్వీనర్ ప్రదీప్, వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు రమేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సలహాదారు నియామకంపై హర్షం

కరీంనగర్ కలెక్టరేట్ : తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారుగా శాతవాహన విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేస్తున్న సూరెపల్లి సుజాత నియామకమయ్యారు. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు వెలువరించారు. అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సాహస శిబిరానికి ఎంపిక

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన పది మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జాతీయ స్థాయిలో నిర్వహించే సాహస శిబిరానికి ఎంపిక కావడంపై రిజిస్ట్రార్ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మనోహర్‌లు క్యాంపు కాంటింజెంట్ లీడర్ పడాల తిరుపతిని, వాలంటీర్లను అభినందించారు. అక్టోబర్ 22 నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు.

'కాంగ్రెస్ నాయకులు అవినీతిపై మాట్లాడటం విడ్డూరం'

రాంపూర్(కరీంనగర్) : కరీంనగర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై కాంగ్రెస్ కార్పొరేటర్లు, సుడా ఛైర్మన్‌లు ఆరోపణలు మానుకోవాలని పలువురు భారాస కార్పొరేటర్లు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే కమలాకర్‌పై సుడా ఛైర్మన్ నరేందర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు రమణారావు, శ్రీనివాస్, మాధవి, మహేశ్, నాయకులు పాల్గొన్నారు.



ధాన్యం కుప్పలపై నిలిచిన నీరు

శంకరపట్నం మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కల్లాలు, గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన వరి ధాన్యం కుప్పలపై నీరు చేరింది. తడిసిన వరి ధాన్యం ఆరబెట్టడానికి రైతులకు ఇక్కట్లు తప్పలేదు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిసిపోవటంతో వారు ఆందోళన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, శంకరపట్నం**

విద్యార్థులకు నమూనా ఎన్నికలు



మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు నమూనా ఎన్నికలను శనివారం నిర్వహించారు. బ్యాలెట్ బాక్స్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు సదానందం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసికోల్లాసం



పుస్తకావిష్కరణలో డాక్టర్ విజయేందర్‌రెడ్డి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: యోగాతో మానసికోల్లాసం లభిస్తుందని సినారే పురస్కార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎడవల్లి విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లో సమైక్య సాహితీ ఆధ్వర్యంలో యోగా సంపత్‌కుమార్ రచించిన విశ్వ మంగళ యోగా-ఒంటికి యోగా మంచిదే అనే పుస్తకావిష్కరణకు ఆయన హాజరయ్యారు. యోగా భారతీయ సంపదగా ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ పేర్కొన్నారు. అనంతరం సంపత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. సమైక్య సాహితీ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.అనంతాచార్యా, అవధాని లక్ష్మణ్‌రావు, నరేష్, డాక్టర్ దీపక్‌బాబు, డాక్టర్ ప్రమోద్, వెంకటేశ్వర్లు, అనిత పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల విద్యార్థుల పాదయాత్ర



పాదయాత్రగా బయలుదేరిన విశ్వవిద్యాలయాల విద్యార్థులు, ఐకాస నాయకులు

రాంపూర్(కరీంనగర్), గంగాధర, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీగా మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ గెలుపు కోసం శాతవాహన స్టూడెంట్ ఐకాస వ్యవస్థాపక ఛైర్మన్ సి.హెచ్.చైతన్య ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి కొండగట్టు వరకు చేపడుతున్న విద్యార్థుల పాదయాత్ర శనివారం ప్రారంభమైంది. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భారాస నాయకుడు హరిప్రసాద్, తెలంగాణ ఉద్యమకారుడు తిరుపతి, సోహన్‌సింగ్‌లు పాదయాత్రను ప్రారంభించారు. కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు చైతన్య తెలిపారు. భారాస నాయకులు మురళి, మహేశ్, అనిల్‌కుమార్‌గౌడ్, శ్రావణ్, రాము పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, హాకీ పోటీలకు ఎంపిక



పోటీల్లో పాల్గొన్న అథ్లెటిక్స్ క్రీడాకారులు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 జూనియర్ కళాశాలల బాలబాలికల అథ్లెటిక్స్, హాకీ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్, హాకీ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ జూనియర్ కళాశాలల కార్యదర్శి మధు జాన్సన్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయ రఘునందన్‌లు పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పతాకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, కోచ్‌లు సుష్మ, సరిత, దస్తగిరి, వికాస్, గౌతమ్, విష్ణు, రాజశేఖర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో జట్టుకు..

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల ఖోఖో పోటీలు నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, టీజీపేట అధ్యక్షుడు సొల్లు సారయ్య క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని 16 మండలాల నుంచి సుమారు 300 మంది ఖోఖో క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా అండర్-14 ఖోఖో జట్టుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. బాలుర విభాగంలో మానకొండూర్, కరీంనగర్ గ్రామీణం, బాలికల విభాగంలో గంగాధర, కరీంనగర్ అర్బన్ జోన్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, శ్రీనివాస్, వీరన్న, సూర్యప్రకాశ్, సంతోష్, శ్రీలత, రమేష్, శోభ పాల్గొన్నారు.



మొదటి స్థానంలో నిలిచిన గంగాధర మండలం బాలికల జట్టు

సాఫ్ట్‌బాల్‌కు..

ఆట

కరీంనగర్ కొత్తపల్లి : రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో జరగనున్న సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల ఛాంపియన్ షిప్ పోటీలకు పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థి సాన్వి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. సాన్విని విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఈ.ప్రసాదరావు అభినందించారు.

సైనిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ

చొప్పదండి, న్యూస్‌టుడే: మండలంలోని రుక్మాపూర్ గురుకుల సైనిక పాఠశాలకు చెందిన విలువిద్య పోటీల్లో దినేష్, రోషన్ బంగారు, కాంస్య పతకాలు సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు పాఠశాల డైరెక్టర్ కె.సి.రావు తెలిపారు. కరీంనగర్‌లో పాఠశాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 ఆర్చరీ విభాగంలో పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన అండర్-14 విభాగంలో ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు రోల్ ప్లే పోటీలు

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫిల్మ్‌భవన్‌లో పాఠశాలల విద్యార్థులకు రోల్ ప్లే పోటీలను శనివారం నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ కె.అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సి.హెచ్.జయపాల్‌రెడ్డి, న్యాయనిర్ణేతలు సరిత, ఎం.స్వదేశ్‌కుమార్, కె.ఎస్.అనంతాచార్య పాల్గొన్నారు. కేజీబీవీ తిమ్మాపూర్ ప్రథమ, ఆదర్శ పాఠశాల ముల్కనూర్ ద్వితీయ, కేజీబీవీ రామడుగు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకం



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: గుంటూరులో ఈనెల 17 నుంచి 19 వరకు జరిగిన దక్షిణ భారత దేశ జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో 'ఈనాడు' లక్ష్య క్రీడాకారిణి రజత పతకం సాధించినట్లు కోచ్ తిరుపతి తెలిపారు. ట్రయాథ్లాన్ గ్రూప్-బి విభాగంలో తలపడి వెండి పతకం సాధించింది. నక్షత్రను జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్, రవి, కరీంనగర్ యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

గంగాధర, న్యూస్‌టుడే: గంగాధరలో 15 రోజులుగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెరుక శ్రవణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు శనివారం ముగిసాయి. 10 జట్లు పాల్గొనగా తుది పోరులో ఆర్ ఆర్ కింగ్స్ జట్టుపై ఠాగూర్ కింగ్స్ జట్టు విజయం సాధించింది. విజేతలకు నగదుతోపాటు బహుమతులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందజేశారు. ఏటా తన సొంత డబ్బులతో క్రీడా పోటీలు నిర్వహిస్తానని తెలిపారు. జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, వెలిచాల తిర్మలరావు, వేముల భాస్కర్, సత్తు కనకయ్య, ఒడ్నాల యగ్నేష్, రోమాల రమేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్లాక్ బెల్ట్ క్రీడాకారిణికి ఏసీపీ అభినందన

కరీంనగర్ క్రీడావిభాగం : స్థానిక ఇంగ్లిష్ యూనియన్ పాఠశాలలో నిర్వహించిన కరాటే పోటీ పరీక్షల్లో బ్లాక్ బెల్ట్ 1వ డిగ్రీ సాధించిన చిల్ల శ్రేష్ఠను కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ శనివారం ఆయన కార్యాలయంలో అభినందించారు.

షెఫ్ స్పెషల్

చికెన్ చింతామణి ఇలా చేయండి!

చికెన్ చాలా రకాలుగా వండుకోవచ్చు. అందులో ఒకటి చికెన్ చింతామణి. ఇది తమిళనాడు స్టైల్ రెసిపీ. ఇందులో మసాలాలు వేయరు. ఎప్పుడూ చికెన్ ఒకేలాగా తినే బదులు ఈసారి ఇలా కొత్తగా ప్రయత్నించండి. ఇంటిల్లిపాదీ ఆనందించండి.

కావలసినవి: చికెన్ - కిలో, ఉల్లితరుగు - 200 గ్రా, నూనె - 4 టేబుల్ స్పూన్లు, ఎండు మిరపకాయలు - 10, అల్లం వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, ఉప్పు - రుచికి సరిపడా, మిరియాల పొడి, సోంపు పొడి - చెంచా చొప్పున, పసుపు - అర చెంచా, ఇంగువ - పావు చెంచా, కరివేపాకు - 2 రెబ్బలు, కొత్తిమీర తరుగు - చారెడు



తయారీ: ముందుగా చికెన్‌ను శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. కడాయిలో నూనె వేడయ్యాక ఇంగువ, కరివేపాకు, ఎండు మిర్చి.. అవి వేగాక.. ఉల్లితరుగు వేయాలి. అది బంగారు రంగులోకి మారాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చి వాసన పోయే వరకూ వేయించాలి. అందులో చికెన్ ముక్కలు, ఉప్పు, పసుపు, సోంపు పొడి వేసి కలియబెట్టి, సెగ పెంచి ఐదు నిమిషాలు ఉడికించాలి. సెగ తగ్గించి, నీళ్లు ఆవిరయ్యే వరకు 15 నుంచి 20 నిమిషాలు ఉడికించాలి. మధ్యలో మూత తెరిచి అడుగంటకుండా కలియ తిప్పుతుండాలి. ముక్కలు బాగా ఉడికిన తర్వాత మిరియాల పొడి, కొత్తిమీర తరుగు జతచేసి ఒక నిమిషం ఉంచి దించేయాలి. వేడివేడిగా చికెన్ చింతామణి తినండి. ఇది మీకు తప్పకుండా నచ్చుతుంది.



– పవన్ సిరిగిరి, షెఫ్, హైదరాబాద్

స్ట్రీట్ ఫుడ్.. ఇంట్లోనే!

మిరపకాయ బజ్జీ, ఉల్లిపాయ పకోడీ, పానీపూరీ, భేల్‌పూరి, సమోసా, ఆలూబోండా, వడాపావ్, పావ్‌భాజీ.. ఎన్నెన్ని స్ట్రీట్ ఫుడ్స్! అలా వీధుల్లో నడుస్తుంటే ఆ పరిమళాలకు నోరూరినా.. వాటి మీద దుమ్మూధూళీ పడుతుందని కొనుక్కోడానికి వెనకాడతాం. అసలవన్నీ ఇంట్లోనే చేసుకుంటే ఎంచక్కా తినొచ్చు కదా! మీ కోసం కొన్ని..



మటర్ కుల్చా

కావలసినవి: మైదాపిండి, బఠాణీలు - కప్పు చొప్పున, పసుపు - ముప్పావు చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, చింతపండు గుజ్జు, ధనియాలు, నిమ్మరసం, కొత్తిమీర తరుగు - - టేబుల్ స్పూన్ చొప్పున, జీలకర్ర పొడి, పంచదార, నల్ల జీలకర్ర - చెంచా చొప్పున, పెరుగు - 2 టేబుల్ స్పూన్లు, మిరియాలు, వాము, ఈస్ట్ - అర చెంచా చొప్పున, కొత్తిమీర తరుగు - చారెడు, పుదీనా - పావు కప్పు, అల్లం - అరంగుళం ముక్క, వెల్లుల్లి రెబ్బలు - 4, పచ్చిమిర్చి తరుగు - చెంచా, ఎండుమిర్చి, పిప్పలిపండ్లు, పచ్చిమిర్చి - రెండేసి, జీలకర్ర, ఆమ్‌చూర్ పౌడర్ - అర టేబుల్‌స్పూన్ చొప్పున, వెన్న - పావు కప్పు, నూనె - తగినంత, ఉల్లి, టొమాటో తరుగు - అర కప్పు చొప్పున, స్పెషల్ స్పైస్ మిక్స్ - 2 చెంచాలు, గ్రీన్‌చెట్నీ - అర కప్పు

తయారీ: బఠాణీలను ముందు రాత్రి నానబెట్టాలి. మర్నాడు రెండు కప్పుల నీళ్లు, పసుపు, ఉప్పు వేసి ఉడికించాలి. అరగ్లాసు గోరువెచ్చటి నీళ్లలో పంచదార, ఈస్ట్ వేసి కరిగించాలి. ఈ నీళ్లు, పెరుగులను మైదాపిండిలో వేసి కలపాలి. కొత్తిమీర తరుగు, పుదీనా, కొద్దిగా ఉప్పు, అల్లం, వెల్లుల్లి, జీలకర్ర పొడి, చింతపండు గుజ్జు, పచ్చిమిర్చి తరుగు మిక్సీజార్‌లో వేసి గ్రైండ్ చేయాలి. ఎండుమిర్చి, మిరియాలు, పిప్పలిపండ్లు, వాము, ధనియాలు, జీలకర్రలను ఒక్కొక్కటిగా వేస్తూ నూనె లేకుండా వేయించాలి. అవి చల్లారాక.. ఆమ్‌చూర్ పౌడర్, కాస్త ఉప్పు జతచేసి గ్రైండ్ చేయాలి. నానబెట్టిన మైదాపిండిని పది భాగాలు చేయాలి. ఒక్కో దాంతో చిన్న రొట్టెలా చేసి.. దాని మీద నల్ల జీలకర్ర, కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి.. చపాతీకర్రతో ఇంకొంచెం సాగదీయాలి. దాన్ని పెనం మీద వేసి ఓ పక్కన కొన్ని నీళ్లు చిలకరించి.. మూత పెట్టాలి. నిమిషం తర్వాత మూత తీసి.. అట్లకాడతో అదుముతూ కొంతవరకూ కాలనిచ్చి తీయాలి. తక్కిన పిండితోనూ ఇలాగే రొట్టెలు చేసుకోవాలి. వీటిని వెన్నతో మరోసారి వేగనివ్వాలి. ఉడికించిన బఠాణీల్లో ఉల్లి, టొమాటో తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, స్పెషల్ స్పైస్ మిక్స్, నిమ్మరసం, కొత్తిమీర తరుగు, గ్రీన్‌చెట్నీ వేసి కలపాలి. అంతే.. కుల్చాలను దీంతో తింటుంటే.. వారెవా అనాల్సిందే!



అక్కీ రోటీ

కావలసినవి: బియ్యప్పిండి - 2 కప్పులు, ఉల్లి, కొత్తిమీర, సోయకూర తరుగు - పావు కప్పు చొప్పున, అల్లం - అంగుళం ముక్క, పచ్చిమిర్చి - 3, జీలకర్ర - చెంచా, ఉప్పు - రుచికి సరిపడా, కరివేపాకు - నాలుగు రెబ్బలు, నూనె - తగినంత

తయారీ: అల్లం, పచ్చిమిర్చిలను కచ్చా పచ్చాగా నూరాలి. వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, తగినన్ని నీళ్లు, ఉల్లి, కొత్తిమీర, సోయకూర తరుగు, కరివేపాకు, అల్లం, మిర్చి ముద్ద, ఉప్పు, జీలకర్ర వేసి బాగా కలపాలి. పిండిలో అన్నీ కలిసిపోయి, ఉండలు కట్టకుండా మెత్తగా అయ్యాక.. పన్నెండు భాగాలు చేసుకోవాలి. అరిటాకు లేదా పాలిథిన్ కాగితం మీద నూనె రాసి.. ఒక్కో బాల్‌ను చేత్తో తడుతూ రొట్టె చేసి కాలుతున్న పెనం మీద రెండు వైపులా బంగారు రంగు వచ్చేదాకా కాల్చుకుంటే సరి.. రుచికరమైన అక్కీ రోటీ రెడీ.



కచోరీ

కావలసినవి: మైదాపిండి - 2 కప్పులు, ఉప్పు, నూనె - తగినంత, నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు, స్టఫింగ్ కోసం: పెసరపప్పు - అర కప్పు, కారం - రెండు చెంచాలు, ఛాట్ మసాలా, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పౌడర్ - చెంచా చొప్పున, నెయ్యి - 2 చెంచాలు.

తయారీ: మైదాపిండిలో కొన్ని నీళ్లు, కాస్త ఉప్పు, నెయ్యి, నూనె వేసి బాగా కలిపి అరగంట పక్కనుంచాలి. పెసరపప్పును రెండు గంటలు నానబెట్టాలి. నీళ్లు వడకట్టేసి కొంచెం బరకగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక పెసరపప్పు ముద్దను వేయించాలి. అందులో నెయ్యి, కారం, ఉప్పు, ఛాట్ మసాలా, ధనియాల పొడి, ఆమ్‌చూర్ పౌడర్ జతచేసి ఇంకాస్త వేగనిచ్చి దించేయాలి. మైదాపిండిని చిన్న భాగాలుగా విడగొట్టి పూరీల్లా వత్తుకోవాలి. ఒక్కో పూరీ మీద రెండు చెంచాల స్టఫింగ్‌ను ఉంచి అంచులను దగ్గరగా చేసి.. చేత్తో తట్టి కచోరీ చేయాలి. అన్నీ అయ్యాక కాగుతున్న నూనెలో వేయిస్తే సరి..



షాహీ టుకడా

కావలసినవి: బ్రెడ్ స్లైసులు - 8, పంచదార - ముప్పావు కప్పు, పాలు - 5 కప్పులు, నెయ్యి - పావు కప్పు, యాలకుల పొడి - అర చెంచా, కుంకుమ పువ్వు - కాస్త, పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు - అన్నీ కలిపి ముప్పావు కప్పు

తయారీ: పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులను నేతిలో వేయించాలి. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో పాలు పోసి మధ్యలో కలియ తిప్పుతూ మరిగించాలి. పాలు చిక్కగా అయ్యాక.. యాలకుల పొడి, డ్రైఫ్రూట్స్ పలుకులు, కుంకుమ పువ్వు వేసి, ఇంకో రెండు నిమిషాలుంచి దించేస్తే రబ్రీ తయారైపోతుంది. పంచదార పాకం తయారుచేయాలి. బ్రెడ్‌స్లైసుల అంచులను తీసేసి, ఒక్కో బ్రెడ్‌ను రెండు ముక్కలుగా కట్ చేయాలి. వీటిని పెనం మీద నేతితో బంగారు రంగు వచ్చే వరకూ వేయించి, పంచదార పాకంలో ముంచి తీయాలి. తినేటప్పుడు ఈ స్లైసుల మీద తగినంత రబ్రీ వేసుకుంటే సరి.. షాహీ టుకడాలను ఆనందంగా ఆస్వాదించవచ్చు.

కారీ రోల్

కావలసినవి: గోధుమపిండి - కప్పు, పనీర్ - 200 గ్రాములు, యోగర్ట్, ఉల్లి, క్యాబేజీ, క్యాప్సికమ్, క్యారెట్ తరుగు - ముప్పావు కప్పు చొప్పున, అల్లం వెల్లుల్లి పేస్టు - అర టేబుల్ స్పూన్, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పౌడర్, వాము, పసుపు - అర చెంచా చొప్పున, ఛాట్ మసాలా, కశ్మీరీ కారం, నిమ్మరసం - ఒకటిన్నర చెంచా చొప్పున, ఉప్పు - రుచికి సరిపడా, నూనె - తగినంత, పుదీనా - అర కప్పు, అల్లం - అంగుళం ముక్క, కొత్తిమీర తరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి - 2, వెల్లుల్లి రెబ్బలు - 3

తయారీ: పుదీనా, కొత్తిమీర, అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి రెబ్బల్లో కొన్ని నీళ్లు, కొద్దిగా ఉప్పు జోడించి మెత్తగా నూరి గ్రీన్ చెట్నీ చేయాలి. ఒక పాత్రలో యోగర్ట్, అల్లం, వెల్లుల్లి పేస్టు, వాము, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పౌడర్, ఛాట్ మసాలా, కశ్మీరీ కారం, నిమ్మరసం వేసి కలపాలి. అన్నీ బాగా కలిశాక పనీర్ ముక్కలు జోడించి కొంతసేపు నాననివ్వాలి. మరో బౌల్‌లో ఉల్లి, క్యాబేజీ, క్యాప్సికమ్, క్యారెట్ తరుగు, చెంచా ఛాట్ మసాలా, చెంచా నిమ్మరసం, కొద్దిగా ఉప్పు వేసి వెజ్ సలాడ్ చేయాలి. గోధుమ పిండిలో కాస్త ఉప్పు, అర టేబుల్‌స్పూన్ నూనె, కొన్ని నీళ్లతో పిండి కలపాలి. అర గంట తర్వాత పల్చగా రోటీలు చేసి పెనం మీద కాల్చుకోవాలి. ప్యాన్‌లో రెండు టేబుల్‌స్పూన్ల నూనె కాగనిచ్చి.. మ్యారినేట్ చేసిన పనీర్ ముక్కలను నాలుగు నిమిషాలు ఉడికించి దించేయాలి. ఒక్కో రోటీ మీద గ్రీన్ చెట్నీ పరిచినట్లు రాసి.. మధ్యలో పనీర్ టిక్కా క్యూబ్స్, వాటి మీద వెజ్ సలాడ్ వేసి చుట్టి, అంచులను కలిపేసి.. బటర్ పేపర్‌తో సగం వరకూ చుట్టాలి. అంతే.. తిని ఆనందించడమే తరువాయి.



కడై మసాలాతో రంగూ రుచీ వాసన!

కడై పనీర్, కడై చికెన్.. వారెవా ఏం రుచి.. ఎంత ఘుమాయింపు! ఈ వంటలకి ఆ స్పెషల్ టేస్ట్ తెప్పించేది కడై మసాలా. ఆ పౌడర్ కొనుక్కోకుండా ఇంట్లోనే చేస్తే మరింత బాగుంటుంది కదా! అందుకోసం దాల్చినచెక్క అంగుళం ముక్క, బిర్యానీ ఆకులు రెండు, నల్ల యాలక్కాయ ఒకటి, ఆకుపచ్చ యాలకులు పది, ధనియాలు నాలుగు టేబుల్ స్పూన్లు, లవంగాలు ఏడు, జీలకర్ర, మిరియాలు టేబుల్ స్పూన్ చొప్పున, ఆరు కశ్మీరీ ఎండు మిరపకాయలు తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. వీటిని పైన రాసిన వరుస ప్రకారం ఒక్కొక్కటి వేస్తూ.. కమ్మని వాసన వచ్చేదాకా వేయించి, పళ్లెంలోకి తీయాలి. చల్లారాక కొంచెం బరకగా గ్రైండ్ చేస్తే సరిపోతుంది. ఈ పౌడర్‌ను తడి లేని పొడి సీసాలో భద్రం చేసుకున్నామంటే.. ఇక శాకాహారం, మాంసాహారం.. ఏ కడై మసాలా కూర చేసినా.. అందులో ఈ పొడి తగినంత జతచేయొచ్చు. అప్పుడిక రంగూ, రుచీ, వాసనా అదిరిపోతాయి. సులువే కనుక మీరూ చేసి చూడండి.



పాఠక వంట

అరటిపువ్వు పచ్చడి తిన్నారా...



అరటికాయ వేపుడూ, కూరా, పులుసుల గురించి అందరికీ తెలిసిందే. ఇంకా అరటిదూటను ఆవపెట్టి కూడా వండుతుంటారు. ఒకసారి అరటిపువ్వుతో పచ్చడి ప్రయత్నించాను. ఇది ఇంటిల్లిపాదికీ నచ్చడంతో అప్పుడప్పుడూ చేస్తున్నాను. ఒకసారి రుచి చూస్తే మీకూ బాగా నచ్చేస్తుంది. ఇంతకీ దీన్నెలా చేయాలంటే...

కావలసినవి: అరటిపువ్వు - ఒకటి, ధనియాలు, మినప్పప్పు, జీలకర్ర, మెంతులు, నువ్వులు - టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి - పది, చింతపండు - చిన్న నిమ్మకాయంత, నూనె - తగినంత, ఉప్పు - సరిపడా, ఇంగువ - కొద్దిగా

పోపు కోసం: ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు - టీస్పూన్ చొప్పున, ఎండుమిర్చి - రెండు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు, కరివేపాకు - గుప్పెడు, ఇంగువ - చిటికెడు


తయారీ: అరటిపువ్వును శుభ్రంగా కడిగి ముక్కలు కోసుకోవాలి. పైన చెప్పిన పదార్థాలన్నింటినీ నూనె లేకుండా వేయించి పక్కన పెట్టుకోవాలి. కడాయిలో కొద్దిగా నూనె పోసి ఎండుమిర్చి.. తర్వాత అరటిపువ్వును వేయించాలి. చల్లారిన తర్వాత మెత్తగా మిక్సీ పట్టాలి. కడాయిలో నూనె పోసి.. పోపు కోసం సిద్ధం చేసుకున్న దినుసులను వేసి వేయించి పచ్చడిలో కలపాలి. వేడి వేడి అన్నంలో ఈ పచ్చడి.. ఆపైన కాస్త నెయ్యి వేసుకుని తింటే అద్భుతః అనకుండా ఉండలేరు.



– బండ్రెడ్డి. పద్మావతి, కొవ్వూరు

ఆహారం ఆరోగ్యం

పదిరోజుల్లోనే మార్పు



ఆవాలూ, రాగులూ ఒకే దగ్గర ఉంటే.. ఏది ఏదో గబుక్కున పోల్చుకోలేం. కొంచెం ఒకేలా ఉంటాయి మరి. ఆవాలను పోపులో, ఆవపొడిని ఊరగాయ పచ్చళ్లలో వేస్తాం. కానీ రాగులను విస్తారంగా తినమంటున్నారు ఆహార నిపుణులు. ఎందుకంటే.. వీటిలో బి1, బి2, బి6, కె విటమిన్లు, ఫొలేట్, భాస్వరం, మాంగనీస్, పొటాషియం, జింక్, క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియంలు ఉన్నాయి. రాగులు చెడు కొలెస్ట్రాల్‌ని అడ్డుకుంటాయి కనుక గుండె సంబంధ అనారోగ్యాలు వచ్చే అవకాశం తక్కువ. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. చర్మం ముడతలు పడదు. ముఖానికి కాంతి వస్తుంది. రక్తహీనతతో బాధపడేవారికి ఇది సరైన ఆహారం. వీటితో వారం పదిరోజుల్లోనే మంచి మార్పు వస్తుంది. రాగులు క్రమం తప్పకుండా తింటే క్యాల్షియం కావలసినంత అందుతుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి.

కొన్ని ప్రాంతాల్లో రాగిసంకటి చేసి.. కూర, చారుతో తింటారు. బియ్యంతో వండిన అన్నం కంటే ఇదెంతో శ్రేష్ఠం. రాగిపిండితో జావ కాయొచ్చు, రొట్టెలు చేయొచ్చు. అటు జావ, ఇటు రొట్టెల్లో తీపి ఇష్టపడితే బెల్లం, లేదంటే కాస్త కారం, ఉప్పు వేసుకోవచ్చు. దోశలపిండిలో రాగిపిండి కలిపితే.. అవి ప్రత్యేకంగానూ ఉంటాయి, పుష్టినీ ఇస్తాయి. రాగిపిండితో హెయిర్‌మాస్క్ వేస్తే చుండ్రు పోతుంది, కురులు బాగా పెరుగుతాయి. ఇన్ని లాభాలున్న రాగులను తరచూ ఏదో రూపంలో తిందామా మరి!

కొబ్బరి తీయడం సులువే!

కొబ్బరిపచ్చడి.. దానికదే సాటి కదూ! అయితే.. టెంకాయ పగలగొట్టడం, పెంకు తీయడం కాస్త జటిలమైన సంగతి. కానీ కోకోనట్ స్లైసర్ టూల్ గనుక కొనుక్కున్నామంటే ఆ పని తేలిగ్గా పూర్తయిపోతుంది. మందమైన స్పూన్‌లా కనిపించే ఈ సాధనం ఇనుముతో తయారైనందున మన్నిక ఎక్కువే. దీంతో కొబ్బరికాయను సులువుగా పగలగొట్టి, కొబ్బరి తీయొచ్చు. వేళ్లకి గాయమౌతుందో, గచ్చు పగులుతుందో అన్న బెంగ ఉండదిక.

సౌకర్యం



రంగురంగుల్లో రాటటూయి

మనం తినే ఆహారం రుచిగా ఉండటం ఎంత ముఖ్యమో ఆకర్షణీయంగా కనిపించడమూ అంతే ముఖ్యం. ఫ్రెంచివాళ్ల రాటటూయి రంగురంగుల్లో ముచ్చటగా ఉంటుంది. చూస్తేనే నోరూరిపోతుంది. అందుకోసం ఎరుపు, ఆకుపచ్చ, పసుపు రంగుల క్యాప్సికం ఒక్కొకటి, వంకాయలు, క్యారెట్ రెండు చొప్పున, కీరదోసకాయ ఒకటి, ఉల్లి తరుగు, టొమాటో ప్యూరీ కప్పు చొప్పున, మిరియాల పొడి ముప్పావు చెంచా, ఉప్పు రుచికి తగినంత, నెయ్యి టేబుల్‌స్పూన్, ఆలివ్ నూనె రెండు చెంచాలు, వెల్లుల్లి ముద్ద చెంచా, కొన్ని పుదీనా ఆకులు, ఒక బిర్యానీ ఆకు తీసుకోవాలి. ఎలా చేస్తారంటే.. ఎరుపు, ఆకుపచ్చ క్యాప్సికంలను చిన్న ముక్కలుగా కోసుకోవాలి. కడాయిలో నూనె వేడయ్యాక.. బిర్యానీ ఆకు, వెల్లుల్లి, ఉల్లి తరుగు వేయాలి. అవి కాస్త వేగాక.. నెయ్యి, క్యాప్సికం ముక్కలు, పుదీనా ఆకులు, టొమాటో ప్యూరీ వేసి ఉడికించాలి. చల్లారాక గ్రైండ్ చేసి, స్ట్రెయినర్‌తో పళ్లెంలోకి వడకట్టాలి. ఇప్పుడు పసుపురంగు క్యాప్సికం, వంకాయలు, టొమాటోలు, కీరదోసకాయలను స్లయిసులుగా చేసుకోవాలి. వీటిని సాస్ పళ్లెంలో చేతిగాజులను వరుసగా పేర్చినట్టు అందంగా అమర్చాలి. పైన కాస్త మిరియాలపొడి, కొద్దిగా ఉప్పు చల్లితే చాలు.. కలర్‌ఫుల్ టేస్టీ రాటటూయి రెడీ! చూశారా ఫ్రెంచి వంటకాన్ని మనింట్లోనే ఎంత సింపుల్‌గా చేసేయొచ్చో! ఇదెంతో ఆరోగ్యకరం కూడా.

పొరుగు రుచి




చిత్రంగా

చెట్టొకటి.. పండొకటి..









జామ, సపోటా, మామిడి.. ఇలా ఏ చెట్టుకు ఆ పండు కాయడం మామూలు. కానీ ఒక చెట్టుకు రకరకాల పండ్లు కాస్తే.. తినుబండారాలు కూడా కోసుకోవడానికి వీలుగా చెట్లకు ఉంటే.. వావ్ అనిపించే ఆ ఊహను వాస్తవం చేస్తే.. ఇదిగో ఇలా ఉన్నాయి. మనం కూడా ట్రై చేద్దామా మరి!









వసుంధర

vasundhara@eenadu.in

గోళ్లు... ఎందుకిలా?

నా పాదాల గోళ్లు చాలా మందంగా ఉంటాయి. దీనికితోడు ఊరికే నల్లబడుతుంటాయి. అలాగని లోపల ఇన్ఫెక్షన్, నొప్పి లాంటివేమీ లేవు. అయినా ఎందుకిలా అవుతున్నాయి? – ఓ సోదరి



డియర్... వసుంధర
డా. శైలజ సూరపనేని
సౌందర్య నిపుణులు

సోరియాసిస్, కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు, అనారోగ్యాల బారినపడ్డా ఇలా జరుగుతుంటాయి. కొందరు పదేపదే నెయిల్‌పాలిష్‌లు వేయడం, తుడవడం చేస్తుంటారు. నాసిరకం రకాలు వాడటం వల్లా ఈ సమస్య తలెత్తుతుంది. పుండు ఏర్పడటం, నొప్పి ప్రారంభంలో ఉండవు కానీ... దీర్ఘకాలంలో కనిపిస్తాయి. గోళ్లు పగలడం, వేలు దగ్గర చర్మం చిట్లడంతో క్రిములు లోపలికి చేరి, నెమ్మదిగా ఇన్ఫెక్షన్‌కి దారితీస్తాయి. నొప్పి, దుర్వాసన వంటివీ మొదలవుతాయి. తడిలో ఎక్కువ సమయం గడిపేవారు, షూ తరచూ వేసుకునే వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. వయసు పెరుగుదలా కారణమే. సమస్య దూరమవ్వాలంటే గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకుంటూ శుభ్రంగానూ ఉంచుకోవాలి. గోరు చుట్టూ పగుళ్లు, కట్‌లూ ఉంటే మాయిశ్చరైజర్ లేదా యాంటీ సెప్టిక్ క్రీమ్ రాయాలి. నీటిలోకి వెళ్లేప్పుడు రబ్బర్ షూ వాడాలి. నెయిల్ కట్టర్‌ని మీకంటూ ప్రత్యేకంగా ఉంచుకుంటే ఇన్‌ఫెక్షన్ల సమస్యలుండవు. ఇంట్లో ఉన్నా సాక్సులు వేసుకుంటే మంచిది. నాణ్యమైన నెయిల్ పాలిష్‌లు, ఆల్కహాల్ లేని నెయిల్ పాలిష్ రిమూవర్లను వాడండి. వాడినా అత్యవసరం అయితేనే! ఒకసారి వేసుకుంటే తీసేశాక కనీసం వారంపాటైనా మామూలుగా వదిలేయాలి. నెయిల్ ఆర్ట్, ఆర్టిఫిషియల్ నెయిల్స్‌ని పెట్టుకుంటోంటే ఆపేయండి. అలాగే, ఆరోగ్యకరమైన ఆహారం, తగినంత నీరు తీసుకుంటున్నారా అన్నదీ గమనించుకోండి. ఫుట్‌క్రీమ్‌లు వాడండి... వాటిని పాదాల గోళ్లకీ పట్టించాలి. దుర్వాసన వస్తున్నా, గోరు లేచినట్లుగా ఉన్నా...ఫంగల్ ఇన్‌ఫెక్షన్ అయ్యుండొచ్చు. కాబట్టి వైద్యుల సలహాతో క్రీములు వాడాలి. ఈ జాగ్రత్తలతో సమస్య తగ్గుముఖం పడుతుంది.

బంగారం వెండి



19న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం (24క్యా)	80,120	79,910	77,300	77,500
ఆర్నమెంట్	73,600	73,200	72,800	72,400
వెండి (కిలో)	97,570	96,020	99,300	94,800

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం (24క్యా)	79,500	79,400	80,600	79,600
ఆర్నమెంట్	73,620	73,520	74,150	73,230
వెండి (కిలో)	96,500	93,400	95,000	94,000

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం (24క్యా)	79,130	78,700	------	------
ఆర్నమెంట్	72,800	72,400	7,280	7,240 గ్రా
వెండి (కిలో)	99,000	95,000	107.00	105.00 గ్రా

రీల్స్ నుంచి రీల్‌కి

సినిమాల్లో అవకాశం రావాలంటే బోలెడు అదృష్టం కావాలి. ఒక్క ఛాన్స్ కోసం ఆల్బమ్ చేతపట్టుకుని చెప్పులరిగేలా స్టుడియోల చుట్టూ తిరగాలి... ఒకప్పుడు వినిపించే మాటలివి! ఇప్పుడు టాలెంట్ ఉంటే చాలు... అవకాశాలే ముంగిట వాలతాయి. నమ్మబుద్ధి కావడం లేదా? వీళ్లే ఉదాహరణలు. రీల్స్, వీడియోలతో ఫాలోవర్లనే కాదు... డైరెక్టర్ల దృష్టినీ ఆకర్షించేశారు. సినిమా అవకాశాలు పట్టేశారు...



డబ్‌స్మాష్ కలిసొచ్చింది మృణాళిని రవి

‘గద్దలకొండ గణేష్’లో బుజ్జమ్మగా తెలుగునాట పేరు తెచ్చుకుంది మృణాళిని రవి. కానీ తన తొలిచిత్రం మాత్రం సూపర్ డీలక్స్. అయితే ఊసుపోక చేసిన వీడియోలు ఈమెకు సినిమా అవకాశాలు తెచ్చాయని తెలుసా? పుట్టింది పుదుచ్చేరి. మధ్యతరగతి అమ్మాయి. బెంగళూరులో ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఐబీఎంలో కొలువూ సాధించింది. చదువు పూర్తయ్యాక ఉద్యోగంలో చేరడానికి ముందు కాస్త సమయం దొరికింది. దీంతో ఏమీతోచక డబ్‌స్మాష్, టిక్‌టాక్ వీడియోలు చేసింది. ఆమె క్యూట్ స్మైల్‌కీ, నటనకీ త్వరగానే ఫాలోవర్లు వచ్చారు. కొన్ని వీడియోలు వైరల్ కూడా అయ్యాయి. ‘ఫేవరెట్ డబ్‌స్మాషర్ అవార్డునీ అందుకుంది. ఇంకేం సినిమా అవకాశాలు వరుసకట్టాయి. కానీ ఇంట్లోవాళ్లు మొదట ఒప్పుకోలేదు. నటనపై తన ఆసక్తిని పదే పదే చెప్పాక సరేనన్నారట. మొదట ఉద్యోగం చేస్తూనే నటించింది. తరవాత రెండింటి సమన్వయం కుదరక ఉద్యోగాన్ని వదిలేసింది. ప్రస్తుతం తెలుగు, తమిళ సినిమాలు చేస్తూ దూసుకెళుతోంది. తాజాగా ‘లవ్‌గురు’ చిత్రంలో విజయ్ ఆంటోనీ జోడీగా మెరిసింది. ఇన్‌స్టాలో తనని 20 లక్షలమంది అనుసరిస్తున్నారు.



లాక్‌డౌన్ వ్యాపకం... సాక్షి వైద్య

కరోనా సమయంలో ఎక్కువమంది వ్యాపకం ఫోనే అయ్యింది. తోచక ఇన్‌ఫ్లుయెన్సర్లు అయినవారూ బోలెడుమంది. అలాంటివారిలో సాక్షి ఒకరు. ఈమెది మహారాష్ట్రలోని థానే. ఫిజియోథెరపీలో పీజీ చేసింది. తనకి చిన్నప్పట్నుంచీ మోడల్ కావాలని కోరిక. ఎలాగూ సమయం దొరికింది కదా అని ఇన్‌స్టాలో రీల్స్ ప్రారంభించింది. వాటికి స్పందన బాగా రావడమే కాదు... సంస్థల నుంచి మోడలింగ్ అవకాశాలూ వచ్చాయి. టీవీ యాడ్‌ల్లోనూ నటించింది. అక్కడ్నుంచీ మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలొచ్చాయి. తొలి సినిమా అవకాశం హీరో అఖిల్ ‘ఏజెంట్’ రూపంలో వచ్చింది. నిజానికి నటి కావాలన్న కోరిక తనకెప్పుడూ లేదు. కానీ వచ్చిన అవకాశాన్ని అందుకుని ప్రశంసలు తెచ్చుకుంది. దీంతో సినిమాలు వరుసకట్టాయి. ప్రస్తుతం పవన్‌కల్యాణ్ ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రంలో నటిస్తోంది. సాక్షిని ఇన్‌స్టాలో దాదాపు 9 లక్షలమంది అనుసరిస్తున్నారు.



డ్యాన్స్‌తో ఫిదా చేసింది ఇమాన్వి

ప్రభాస్ కొత్త సినిమా అనగానే అభిమానుల్లో ఆసక్తి మామూలేగా! పైగా పాన్ ఇండియా స్టార్‌గా దూసుకుపోతున్నారు. హీరోయిన్ ఎవరా అని ఎదురుచూస్తోంటే ‘ఇమాన్వి’ అన్న పేరు బయటికొచ్చింది. ఇంకేం గూగుల్‌లో వెతికారు. అప్పటిదాకా వేరే ఇండస్ట్రీ హీరోయిన్ అనుకున్నారంతా. కానీ కొత్తమ్మాయి. అయితేనేం... ఆమెకున్న పాపులారిటీని చూసి మాత్రం షాకయ్యారు. ఇమాన్ ఇస్మాయిల్... ఇమాన్వి అసలు పేరు. పుట్టింది దిల్లీ కానీ పెరిగిందంతా లాస్‌ఏంజెలెస్. ఎంబీఏ పూర్తిచేసింది. చిన్నప్పటి నుంచీ డ్యాన్స్ అంటే ఇష్టం. అమ్మ... రేఖ, మాధురి దీక్షిత్ వంటి స్టార్ల నృత్యాల వీడియోలను చూపించి మరీ ప్రోత్సహించేదట. అలా ప్రేమను పెంచుకుంది. క్లాసికల్, వెస్టర్న్ వేటితోనైనా మరిపించగలదు ఇమాన్వి. ఆ వీడియోలను యూట్యూబ్, ఇన్‌స్టాలో పంచుకునేది. ‘రమ్తా జోగీ’, ‘టమ్ టమ్’ పాటలు వైరల్ అయ్యాయి. కొరియోగ్రాఫర్ కూడా. తనకు యూట్యూబ్‌లో 18లక్షలు, ఇన్‌స్టాలో 9లక్షలకుపైగా ఫాలోవర్లున్నారు. దీంతో సంస్థలనూ ఆకర్షించింది. వాటికి మోడల్‌గా పనిచేసింది. ‘బీయింగ్ సా-రా’ అనే షార్ట్‌ఫిల్మ్‌తోనూ మెప్పించింది. తన డ్యాన్స్ వీడియోలకు లక్షల్లో వ్యూస్ ఉంటాయి. అలా సినిమా అవకాశాన్నీ అందుకుంది ఇమాన్వి.

> వీళ్లేకాదు... ‘బేబి’ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తెలుగమ్మాయి వైష్ణవి చైతన్య మొదట మెరిసిందీ యూట్యూబ్‌లోనే! తన హాస్యంతో సెలెబ్రిటీలనే ఆకర్షించింది నిహారిక ఎన్‌ఎం. అంతేనా సినిమా ప్రమోషన్ల కోసం స్టార్లతోనూ పనిచేసిన తను తాజాగా ‘గీతా ఆర్ట్స్’లో సినిమా అవకాశం దక్కించుకుంది. కృష్ణ వ్రింద విహారితో తెలుగునాట అడుగుపెట్టిన షర్లీ సేతియా తొలుత తన గాత్రంతోనే సోషల్‌మీడియాను ఆకట్టుకుంది.

ఆమె నిర్ణయాన్ని గౌరవించారు!

వైరల్



అత్తతో ఇషు

ఇషు యోగా శిక్షకురాలు, ప్రపంచ రికార్డు సాధకురాలు. కవల పిల్లలకు తల్లి. అయితే ఇప్పుడెందుకు ఈమె వార్తల్లోకెక్కారంటే... ‘తన భర్త మరణానంతరం అత్తామామలతో కలిసి ఉండటం’ అనే నిర్ణయంపై వివరణ ఇస్తూ ఇన్‌స్టాలో ఆమె పోస్టు చేసిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది.

ఇన్‌స్టాలో పోస్టు చేసిన వీడియోలో ఇషు, తన పిల్లలు, అత్తామామలతో గడిపే రోజువారీ జీవితం ఉంది. అందులో తన భావోద్వేగ ప్రయాణాన్ని, తానెందుకు అత్తామామలతో కలిసి ఉండాలనుకుంటున్నాను అనేదానికి కారణాలను వీడియో రూపంలో పంచుకుంది. తన ఇద్దరు పిల్లలతో అత్తామామలు ఆప్యాయంగా కలిసి ఆడటం, సమయాన్ని వెచ్చించడంతోపాటు పిల్లలు వాళ్ల నానమ్మ, తాతయ్యలతో సంతోషంగా గడపడం, అలాగే ఆ పెద్దవాళ్లు పిల్లలనెలా సంరక్షిస్తున్నారు, తనతో ప్రేమగా, గౌరవంగా ఎలా ఉంటున్నారు... వంటివన్నీ ఆ వీడియోలో ఉన్నాయి. ఎలాంటి మాటలూ లేకుండా అత్తామామలతో తనకు, పిల్లలకు ఉన్న అనుబంధాన్ని వీడియోద్వారా వివరించిన విధానానికి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అంతేకాదు, ‘నా భర్త మరణం గురించి తెలిసినప్పుడు వెంటనే చాలామంది నన్ను ఇప్పుడెక్కడ ఉంటావని ప్రశ్నించారు. దానికి సమాధానంగా ‘అత్తామామలతో’ అని చెప్పినప్పుడు ఆశ్చర్యపోయారు. భర్త ఉన్నంతవరకే అత్తవారిల్లు అనుకుంటారు. అతని మరణానంతరం అక్కడ మనకి చోటు లేదు అంటారు. నా విషయంలో ఇది నిజం కాదు’ అంటూ ఇషు తన అభిప్రాయాన్ని వివరించిన ఈ వీడియోను 8,38,000 మంది వీక్షించారు.



ఆమె అభిప్రాయాన్ని గౌరవిస్తూ అభినందనలతో ముంచెత్తారు. పెద్దవాళ్లతో కలిసి ఉంటే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. వారి ఎదుగుదల మెరుగ్గా ఉంటుందంటూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

శరీరం మాట వింటున్నారా?

చాలాసార్లు మనసు మాట విన్నట్టుగా, మనం శరీరం మాట వినం కదా! అందుకే, లేనిపోని అనారోగ్యాలు... పుట్టినరోజు, పెళ్లిరోజుల్లాంటి వేడుకలప్పుడు చికెన్, మటన్, తింటుంటారు చాలామంది. ఇక కేకులు, చిప్స్, చాక్లెట్ల వంటివి ఇష్టపడని అమ్మాయిలు ఉండరేమో! అంతేనా, సందర్భంతో పనిలేకుండా ఎప్పుడంటే అప్పుడు వాటిని తినే అలవాటూ ఇప్పుడు పెరిగిపోయింది. ఇదే ఇప్పుడు చాలామందిలో అలర్జీలకు దారితీస్తుంది. ఈ పదార్థాలలో ఉండే ‘హిస్టామిన్’ అనే రసాయనం... ఆకలి మందగించడం, తల తిరగడం, మూడ్ స్వింగ్స్... లాంటి వాటికి కారణమవుతోంది. అంతేకాదు, హిస్టామిన్ పాళ్లు అధికంగా ఉన్న ఆహారం తినడం వల్ల దోమలు ఎక్కువగా కుట్టడం, నిద్రలేమి, భావోద్వేగాల్లో మార్పులూ వస్తాయట. నెలసరిలో అధిక రక్తస్రావానికీ, పిల్లల్లో పొత్తికడుపు నొప్పి, విపరీతమైన జలుబు, దగ్గులకూ ఇది కారణమవుతుందట. ఒక్కోసారి హృద్రోగాలు వచ్చే ముప్పు ఉంటుందట. శుద్ధి చేసిన మాంసం, చాకొలెట్స్, నూనెలో వేయించిన పదార్థాల వల్లే కాదు, ఆల్కహాల్, ఎక్కువ రోజులు నిల్వ ఉన్న చీజ్, వంకాయ, కొన్ని రకాల పుల్లని పండ్లు, డ్రైఫ్రూట్స్, పప్పులు.... లాంటివీ అలర్జీ కలిగించవచ్చు. అందుకే, ఏయే ఆహారపదార్థాలు తింటే పడడం లేదో గమనించుకోవాలి. శరీరం ఇచ్చే సూచనలను అర్థం చేసుకోవాలి అంటున్నారు నిపుణులు.



ఎలా తినాలంటే...

- కేకులు, బిస్కెట్లు లాంటి బేకింగ్ పదార్థాల తయారీలో తాజా గుడ్లను మాత్రమే వాడాలి. సాధ్యమైనంత వరకూ బేకింగ్ పౌడర్, నిల్వ కారకాలు ఉండే పదార్థాలను వాడకూడదు. రెడీమేడ్ ప్యాకెట్లు బదులుగా తాజావి వాడడం మంచిది. ప్యాకింగ్ చేసిన బంగాళదుంప చిప్స్‌లాంటివి తినొద్దు.
- దీర్ఘకాలంపాటు పులియబెట్టే పదార్థాలైన చీజ్, సోయాసాస్... వంటివాటిల్లో హిస్టామిన్ శాతం ఎక్కువ. కాబట్టి, వాటికి వీలైనంత దూరంగా ఉండాలి. అలాగే మాంసాన్ని గ్రిల్ చేయడం కన్నా ఉడికించుకుని తింటే మేలు.
- అవకాడో, డ్రైఫ్రూట్స్... లాంటివి పడనప్పుడు మిల్లెట్స్, బియ్యం, క్వినోవా, సాల్మన్ చేప లాంటివి తినొచ్చని సూచిస్తున్నారు పోషకాహార నిపుణులు.

సీటింగ్ సూట్‌కేస్‌లొచ్చేశాయ్!

చిన్నారులతో దూరప్రయాణాలు చేయాలంటే జాగ్రత్తలెన్నో తీసుకోవాలి. పసిపిల్లల్ని ఎత్తుకుని లగేజ్‌తో నడవడం ఎవరికైనా కష్టమే. ఈ పరిస్థితి మీకూ ఎదురైందా? అయితే, ఇకమీదట ఆ చింత అక్కర్లేదు. మీకు భారం లేకుండా, పిల్లలకు అసౌకర్యం కలిగించకుండా సీటింగ్స్‌తో సూట్‌కేసులు వచ్చాయిప్పుడు. ఇవి మనతో ఉంటే చాలు. బుజ్జాయిలతోనూ పర్యటక ప్రాంతాలు సరదాగా చుట్టేయొచ్చు.



దూరాభారం లేకుండా...

ట్రావెల్ సూట్‌కేసుకు రెండోవైపు చిన్న కుర్చీని అటాచ్ చేసుకునే ఏర్పాటు ఉంటుంది. 18 నెలల వయసు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు సరిపోయే ఈ కుర్చీకి ముందువైపు మాత్రమే ఫోల్డింగ్ రాడ్స్ ఉంటాయి. దీన్ని ఫిట్ చేసిన తర్వాత సూట్‌కేసును లాక్కెళ్లొచ్చు. అదే సమయంలో దీనికి అటాచ్డ్‌గా ఉన్న ట్రావెల్ ఛెయిర్ చిన్నారులకు సౌకర్యంగానూ ఉంటుంది. దీంతోపాటు సూట్‌కేస్ హ్యాండిల్‌వైపు చక్రాలతో ఉన్న రెండు రాడ్స్ పిల్లల బరువును బ్యాలెన్స్ చేస్తాయి. అలాగే పసిపిల్లల కోసం ప్రత్యేకంగా బెల్ట్ అటాచ్డ్‌తో కాటన్ బేబీ క్యారియర్‌తోనూ సూట్‌కేసులు లభ్యమవుతున్నాయి.





అవసరానికి తగ్గట్లుగా...

రెండేళ్లలోపు చిన్నారులుంటే మన ప్రయాణంలో ఈ సూట్‌కేస్ తప్పనిసరిగా ఉండాలి. లోపలివైపు అటాచ్డ్ స్ట్రోలర్ ఉండే ఈ సూట్‌కేసును పిల్లలను నిద్రపుచ్చాలనుకున్నప్పుడు ఓపెన్ చేస్తే చాలు. చిన్నారులు స్ట్రోలర్‌లో సౌకర్యంగా నిద్రపోతున్న సమయంలోనూ సూట్‌కేసును లాక్కెళ్లొచ్చు. మరింకెందుకాలస్యం. మీ బుజ్జాయిల కోసం మీరూ ఈ సీటింగ్ సూట్‌కేసులను వెతికేస్తారు కదూ..!

కిడ్స్ కార్నర్





ఆకలి బాధల్ని దాటి... ఆంత్రప్రెన్యూర్‌గా మారి!



‘కష్టాలను చూస్తూ కన్నీళ్లు పెట్టుకుంటే... తగ్గిపోవు. స్థైర్యం తెచ్చుకుని పరిష్కారాలను ప్రయత్నించాలి’ అంటారు అర్చనా మానె. సీరియల్ ఆంత్రప్రెన్యూర్‌గా తన వ్యాపార సంస్థలను లాభాల బాటలో నడిపించడమే కాదు, ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీ డైరెక్టర్‌గా వేలమంది మహిళలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నారు. ఈ కృషే... తాజాగా ‘ఫోర్డ్ ఫౌండేషన్- మార్పుకోసం ప్రయత్నించిన మహిళా నాయకురాళ్లు’లో ఒకరిగా ఆమెను నిలిపింది.

అర్చనది మహారాష్ట్ర ఉస్మానాబాద్ జిల్లాలోని అన్సుర్దా గ్రామం. నిరుపేద కుటుంబం. రోజుకి రెండు పూటలైనా కడుపు నిండని దైన్యం. కట్టుకునేందుకు సరైన దుస్తులు కూడాలేని దుస్థితి. ఆ ఇంటి బిడ్డలకు చదువు అందని ద్రాక్షగానే ఉండేది. కానీ, చిన్నారి అర్చన మాత్రం బడికెళ్లాలని పట్టుబట్టారు. కాదంటున్నారని కుటుంబ సభ్యులకు తెలియకుండా బడికెళ్లి పేరు నమోదు చేయించుకున్నారు. స్నేహితుల దగ్గర నుంచి తెచ్చుకున్న అరువు పుస్తకాలనే ఒంటపట్టించుకున్నారు. టీచర్ల సాయం చేయడంతో ఎలాగోలా పదో తరగతి పూర్తి చేశారు. ఎదిగొచ్చిన ఆడపిల్ల బాధ్యత పూర్తిచేయాలని... ఆమెకు ఓ రిక్షా కార్మికుడితో పెళ్లి చేశారు. అత్తింట్లో అడుగుపెట్టినా పరిస్థితులు మారలేదు. చాలీచాలని సంపాదనతోనే జీవితాన్ని నెట్టుకొచ్చేవారా దంపతులు. ఓసారైతే జబ్బుపడిన కొడుక్కి వైద్యం చేయించడానికి కనీసం 150 రూపాయలు కూడా లేక ఎన్ని ఇళ్ల మెట్లు ఎక్కి దిగారో! ఖర్చులూ, వాటితోపాటే అప్పులూ పెరిగిపోవడం అర్చనను కలచివేశాయి. ఈ పరిస్థితికి ముగింపు పలకాలని ధైర్యాన్ని కూడగట్టుకున్నారు. తన తలరాతను తానే మార్చుకుంటానంటూ ముందడుగు వేశారు. ఓ పాత కుట్టుమిషన్ కొనుక్కొని బట్టలు కుట్టడం ఆరంభించారు. ఆ సంపాదన క్రమంగా అప్పుల్నీ తీర్చగలిగేలా చేసింది. దీంతో తిరిగి చదువుపై దృష్టిపెట్టి డిగ్రీ పూర్తి చేశారు.

కరవుని ఎదుర్కొని...

క్రమంగా ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కడంతో... స్వయం ఉపాధి దిశగా తోటి మహిళలనూ ప్రోత్సహిస్తూ కమ్యూనిటీ లీడర్‌గా ఎదిగారు అర్చన. మరో పక్క దుస్తుల వ్యాపారమూ ప్రారంభించారు. అయితే, అప్పుడే మహారాష్ట్రలో కరవు విజృంభించింది. నాలుగేళ్లపాటు ఎన్నో ఇబ్బందులకు గురి చేసింది. ఆ సమయంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆహార భద్రత సాధించేందుకు స్థానికులకు శిక్షణ ఇవ్వాలనుకున్నాయి. అప్పటికే అందరి తలలో నాలుకలా మెలిగే అర్చనను ఇందుకు ఎంపిక చేసుకున్నారు. అవన్నీ తాను నేర్చుకోవడమే కాదు... గ్రామస్థులకు అర్థమయ్యేలా వివరించారామె. తక్కువ నీటి అవసరం ఉండే కూరగాయలు, పప్పుధాన్యాలను సాగు చేసి చూపించారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టారు. ఇవన్నీ ఫలితం ఇచ్చాయి. దాంతో పంటల్ని మార్కెటింగ్ చేసేందుకు 2011లో 13 మంది మహిళలతో కలిసి ‘మంజరి సఖి విమెన్ లెడ్ ఫార్మింగ్ గ్రూప్’ని ఏర్పాటు చేసుకున్నారు. నూనె గింజలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి, మార్కెటింగ్... వంటివాటితో ఆమె తోటివారూ ఆర్థికంగా బలోపేతమయ్యేలా చేశారు. అర్చన సాధించిన విజయం మరెంతోమందికి స్ఫూర్తినిచ్చింది. ఒకరికొకరు తోడుగా నిలబడతామని బృందాలుగా వచ్చే స్త్రీలకు ఆమె శిక్షణ ఇవ్వడం ఆరంభించారు. ఇలా మహారాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70వేలమంది జీవితాలను అర్చన ప్రభావితం చేశారు. మరోవైపు దుస్తులు, నగల దుకాణాలతో మరికొన్ని వ్యాపారాలూ చేస్తున్నారు. ఈ కృషికి గుర్తింపుగానే జాతీయస్థాయి అవార్డులెన్నో ఆమెను వరించాయి. మహిళాసాధికారతకు కృషి చేసిన శక్తిమంతమైన స్త్రీలలో ఒకరిగా ఫోర్డ్ ఫౌండేషన్ ఎంపిక చేసింది.



పాలసీదార్లకు పెద్ద ఊరట!

- టర్మ్ పాలసీ ప్రీమియంపై జీఎస్టీ మినహాయింపు
- పెద్దల ఆరోగ్య బీమా పాలసీలపైనా
- రూ.5 లక్షల లోపు పాలసీలకూ
- సమర్థించిన మంత్రుల బృందం
- తుది నిర్ణయం జీఎస్టీ మండలి సమావేశంలో

దిల్లీ: ఆరోగ్య బీమా, టర్మ్ జీవిత బీమా పాలసీలపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ని మినహాయించాలని కోరుతున్న పాలసీదారుల ఆశలు నెరవేరేలా కనిపిస్తున్నాయి. రాబోయే జీఎస్టీ మండలి సమావేశంలో దీనిపై ఒక తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. శనివారం జరిగిన మంత్రుల బృందం(జీఓఎం) సమావేశంలో దీని గురించి చర్చించినట్లు, ఈ పాలసీలపై జీఎస్టీని తొలగించేందుకు నిర్ణయించినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక ఉన్నతాధికారి తెలిపారు. టర్మ్ పాలసీలకూ, పెద్దలు తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీని రద్దు చేయడం ద్వారా సామాన్య ప్రజలకు మేలు చేకూర్చాలనే అంశాన్ని జీఓఎంలోని మెజార్టీ సభ్యులు సమర్థించినట్లు వెల్లడించారు.

- సాధారణ వ్యక్తులు తీసుకునే రూ.5 లక్షల లోపు ఆరోగ్య బీమా పాలసీలపైనా జీఎస్టీని మినహాయించాలని నిర్ణయించారు. రూ.5 లక్షలు దాటిన ఆరోగ్య బీమా పాలసీలకు ప్రస్తుత 18 శాతం జీఎస్టీని కొనసాగించాలని నిర్ణయించింది.



ఇతర ప్రతిపాదనలు..

- రూ.10,000 ధర లోపు సైకిళ్లపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలి.
- నోటు పుస్తకాలపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తీసుకురావాలి.
- 20 లీటర్లకు మించి ఉన్న ప్యాకేజ్డ్ తాగు నీటిపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ ఉండగా, దీన్ని 5 శాతానికి తగ్గించాలి.
- రూ.15,000 మించి ధర ఉన్న షూస్, రూ.25,000 కన్నా అధిక ధర ఉన్న చేతి గడియారాలపై పన్నును 18 శాతం నుంచి 28 శాతానికి చేర్చాలి.

రూ.22,000 కోట్ల అదనపు రాబడి

జీఎస్టీ హేతుబద్ధీకరణ వల్ల కేంద్రం, రాష్ట్రాలకు రూ.22,000 కోట్ల అదనపు రాబడి అందుతుందని, బీమా ప్రీమియంపై జీఎస్టీని తగ్గించిన నష్టాన్ని ఇది భర్తీ చేస్తుందని సంబంధిత అధికారి వెల్లడించారు. ఈ ప్రతిపాదనలన్నీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహించే జీఎస్టీ మండలి ఆమోదించాల్సి ఉంటుంది. అప్పుడే ఇవి అమల్లోకి వస్తాయి.

ప్రజలపై భారం తగ్గించేందుకే..

'సామాన్య ప్రజలపై పన్ను భారం తగ్గించాలని జీఓఎం నిర్ణయించింది. ముఖ్యంగా పెద్దలపై ఆర్థిక భారం లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. అందుకే, టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని ప్రతిపాదించాం. దీనిపై సమగ్ర నివేదికను జీఎస్టీ మండలికి సమర్పిస్తాం' అని జీఓఎం జీవిత, ఆరోగ్య బీమా కన్వీనర్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి వెల్లడించారు. బీమా ప్రీమియంపై జీఎస్టీ హేతుబద్ధీకరణకు సంబంధించి 13 మంది మంత్రులతో జీఓఎంను కేంద్రం గత నెలలో ఏర్పాటు చేసింది.

ఈనాడు బిజినెస్ వారాంతం

5 శాతానికి తగ్గించాలి



మంత్రుల బృందంలో సభ్యులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రూ.5 లక్షలకు మించి ఉన్న ఆరోగ్య బీమా పాలసీలపైన జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని సూచించారు. అందరికీ బీమా లక్ష్యం నెరవేరేందుకు ఇది ఉపకరిస్తుందని తెలిపారు. దీనివల్ల రాష్ట్రాలు పెద్ద స్థాయిలో ఆదాయం కోల్పోయినా, విస్తృతమైన ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోని ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

భారత్‌లోకి ఈఎల్ అండ్ ఎన్ లండన్ అడుగు

రిలయన్స్ బ్రాండ్స్‌తో కలిసి తొలి స్టోర్ ప్రారంభం



దిల్లీ: అంతర్జాతీయంగా పేరొందిన లైఫ్‌స్టైల్ అండ్ కేఫ్ బ్రాండ్ ఈఎల్ అండ్ ఎన్ లండన్ మన దేశంలోకి అడుగుపెట్టింది. రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్ (ఆర్‌బీఎల్)తో కలిసి తొలి విక్రయ కేంద్రాన్ని ముంబయిలోని జియో వరల్డ్ ప్లాజాలో ప్రారంభించింది. 'కుటుంబాలకు అందులోనూ మరీ ముఖ్యంగా కాఫీ ప్రేమికులకు సరైన గమ్యస్థానంగా మా స్టోర్లు ఉంటాయి. అందమైన సెట్టింగ్‌తో మరచిపోలేని డైనింగ్ అనుభూతిని అందించగలం. ముంబయి కేఫ్‌లో ఈఎల్ అండ్ ఎన్ సిగ్నేచర్ మెనూ ఉంటుంది. ఇందులో అంతర్జాతీయ రుచులకు తోడు ప్రత్యేకమైన స్థానిక రుచులను కూడా అందిస్తామ'ని ఈఎల్ అండ్ ఎన్ లండన్ వ్యవస్థాపకులు అలెగ్జాండర్ మిల్లర్ తెలిపారు. 'ఎఫ్ అండ్ బీ (ఆహారం, పానీయాలు) పోర్ట్‌ఫోలియోలో రిలయన్స్ బ్రాండ్స్ మాతృ సంస్థ రిలయన్స్ రిటైల్ బలోపేతం అవుతోంది. ఇటాలియన్ ఫైన్ డైనింగ్ కాన్సెప్ట్ అయిన అర్మానీ కేఫ్‌ను కూడా ముంబయి జియో వరల్డ్ ప్లాజాలో పరిచయం చేస్తున్నాం. అలాగే యూకేకు చెందిన ఆహార, ఆర్గానిక్ కాఫీ చైన్ ప్రెట్ ఎ మ్యాంగర్ 18 స్టోర్లను రిలయన్స్ రిటైల్ నిర్వహిస్తోంద'ని రిలయన్స్ బ్రాండ్స్ ప్రతినిధి వెల్లడించారు.

24% తగ్గిన ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం

ముంబయి: 2024-25 ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో ఆర్‌బీఎల్ బ్యాంక్ రూ.223 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.294 కోట్లతో పోలిస్తే ఇది 24% తక్కువ. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆర్జించిన రూ.372 కోట్లతో పోలిస్తే మరీ తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు 0.25 శాతం తగ్గి 2.88 శాతానికి చేరాయి. రుణాల వృద్ధి 15 శాతం ఉన్నా, నికర వడ్డీ ఆదాయం 9 శాతం మాత్రమే పెరిగి రూ.1,615 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ 5.54 శాతం నుంచి 5.04 శాతానికి తగ్గింది. తాజా మొండి బకాయిలు రెట్టింపై రూ.1,026 కోట్లకు చేరాయి. ఇందులో 70 శాతం క్రెడిట్ కార్డ్ విభాగం నుంచే ఉన్నాయి.



కోడి గుడ్లు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	510
గోదావరి	510
విశాఖపట్నం	505
చిత్తూరు	538

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.17,826 కోట్లు



ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై- సెప్టెంబరు త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.17,825.91 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభంతో పోలిస్తే ఇది 6% ఎక్కువ. స్టాండలోన్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం రూ.15,976.11 కోట్ల నుంచి 16,820.97 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 10 శాతం పెరిగి రూ.30,010 కోట్లకు చేరింది. రుణాల్లో 7 శాతం వృద్ధి కనిపించింది. డిపాజిట్లు 15 శాతం పెరిగాయి. మార్జిన్లు 3.46 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి.

- వచ్చే నాలుగేళ్లలో బ్యాంక్ పరిమాణాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, అందుకు అనుగుణంగానే ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని బ్యాంక్ సీఎఫ్ఓ ఎస్.వైద్యనాథన్ వెల్లడించారు.
- సమీక్షా త్రైమాసికంలో బ్యాంక్ మరో 241 శాఖలు తెరవడం ద్వారా మొత్తం శాఖలు 9,092కు చేరాయి.
- స్థూల నిరర్థక ఆస్తులు స్థిరంగా 1.36% వద్ద ఉన్నాయి. బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి 19.8 శాతంగా ఉంది.
- 2024 సెప్టెంబరు 30 నాటికి 9,000 మంది ఉద్యోగులను కొత్తగా చేర్చుకోవడం ద్వారా మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,06,758కు చేరింది.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓకు బోర్డు ఆమోదం

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.12,500 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో రూ.10,000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,500 కోట్ల నిధుల్ని సమీకరించనుంది. ఐపీఓ ధర, ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించే అవకాశం ఉంది. ప్రతిపాదిత ఐపీఓ తర్వాత కూడా హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ సంస్థగానే కొనసాగనుంది. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు 94.64 శాతం వాటా ఉంది. జూన్ త్రైమాసికం ఆఖరుకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర విలువ సుమారు రూ.13,300 కోట్లుగా ఉంది.

వేదాంతా రూ.1.15 లక్షల కోట్ల పెట్టుబడులు

దిల్లీ: జింక్, చమురు-గ్యాస్ వంటి వివిధ వ్యాపార విభాగాలపై రాజస్థాన్‌లో రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టబోతున్నట్లు వేదాంతా వెల్లడించింది. వేదాంతా గ్రూప్ సంస్థ హిందుస్థాన్ జింక్ రూ.30,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. మరో అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ రోజుకు 3 లక్షల బ్యారెళ్ల సామర్థ్యాన్ని చేరుకునేందుకు రూ.35,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. వేదాంతా గ్రూప్ మరో సంస్థ సెరెంటికా రెన్యువబుల్స్ రూ.50,000 కోట్ల పెట్టుబడితో 10,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యంతో ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు సిద్ధమవుతోంది.

పీఎం ఇంటర్న్‌షిప్ పథకంలో 1.25 లక్షల అవకాశాలు

దిల్లీ: పీఎం ఇంటర్న్‌షిప్ పథకం కింద ఇప్పటి వరకు 1.25 లక్షల మంది అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ పథకం కోసం తీసుకొచ్చిన పోర్టల్‌ను అభ్యర్థుల నమోదు కోసం అక్టోబరు 12 సాయంత్రం 5 గంటల నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటి వరకు అగ్రగామి 250 కంపెనీలు ఈ పథకంలో నమోదు చేసుకున్నాయి. ఈ పథకం కింద 1.25 లక్షల ఇంటర్న్‌షిప్ ఆఫర్లు అందించేందుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఈ పథకంలో ఇంటర్న్‌షిప్‌లు డిసెంబరు 2 నుంచి ప్రారంభమవుతాయి.

50% పెరిగిన యూకో బ్యాంకు లాభం

రూ.4.73 లక్షల కోట్లకు చేరిన వ్యాపారం

ఈనాడు, హైదరాబాద్: యూకో బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలు నమోదు చేసింది. త్రైమాసిక నికరలాభం 50% అధికంగా రూ.603 కోట్లకు చేరడం విశేషం. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికరలాభం రూ.402 కోట్లు మాత్రమే. ఆపరేటింగ్ లాభం 45.82 శాతం వృద్ధితో రూ.1,432 కోట్లుగా ఉంది. రెండో త్రైమాసికం చివరి నాటికి బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.4.73 లక్షల కోట్లకు చేరుకుంది. డిపాజిట్లు 10.57 శాతం, రుణాలు 18 శాతం పెరిగాయి. స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 3.18 శాతానికి, నికర నిరర్థక ఆస్తులు (ఎన్ఎన్‌పీఏ) 0.73 శాతానికి తగ్గినట్లు యూకో బ్యాంకు వెల్లడించింది. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 95.92 శాతం ఉన్నట్లు పేర్కొంది. బ్యాంకుకు దేశవ్యాప్తంగా 3,247 శాఖలు ఉన్నాయి. ఇందులో దాదాపు 2,000 శాఖలు గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి.

టెక్ మహీంద్రా లాభం రూ.1,250 కోట్లు



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో టెక్ మహీంద్రా నికర లాభం ఏకీకృత పద్ధతిలో రూ.1,250 కోట్లుగా నమోదైంది. కిందటేడాది ఇదే సమయంలో ఆర్జించిన రూ.493.90 కోట్లతో పోలిస్తే లాభం రెండు రెట్లకు పైగా పెరగడం గమనార్హం. ఆస్తుల విక్రయం ద్వారా ఆదాయం సమకూరడం లాభంలో వృద్ధికి దోహదం చేసింది. ఆదాయం రూ.12,863.90 కోట్ల నుంచి 3.49 శాతం పెరిగి రూ.13,313.20 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్‌తో పోలిస్తే జులై- సెప్టెంబరులో కంపెనీ లాభం 46.81 శాతం, ఆదాయం 2.36 శాతం చొప్పున పెరిగాయి. ఖాళీ స్థలం, భవనాలు, ఫర్నిచర్ కలిపి ఒక స్థిరాస్తి విక్రయం ద్వారా రూ.450.20 కోట్ల మేర ఇతర ఆదాయం వచ్చినట్లు కంపెనీ తెలిపింది. 'ఐటీ సేవల విభాగం స్తబ్దుగా ఉన్నప్పటికీ.. మేం వ్యూహాత్మకంగా చేపడుతున్న ప్రయత్నాల వల్ల మెరుగైన పనితీరును కొనసాగించగలిగాం. క్లయింట్లతో మా సంబంధాలను బలోపేతం చేసుకోవడం పైనా దృష్టి పెట్టాం. ప్రాజెక్టు ఫార్టియస్ అండతో వరుసగా మూడో త్రైమాసికంలోనూ మార్జిన్లను పెంచుకున్నామ'ని టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి తెలిపారు. 15 శాతం నిర్వహణ మార్జిన్లను సాధించేందుకు మూడేళ్ల ప్రణాళిక కింద ప్రాజెక్టు ఫార్టియస్‌ను ఏప్రిల్‌లో జోషి ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. సమీక్షిస్తున్న త్రైమాసికంలో నికరంగా 603 మిలియన్ డాలర్ల కొత్త ఆర్డర్లను దక్కించుకుంది.

- తాజా ఉత్తీర్ణుల నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు పెట్టుబడులను కొనసాగిస్తున్నట్లు జోషి తెలిపారు. జులై- సెప్టెంబరులో టెక్ మహీంద్రా 6,653 ఉద్యోగులను చేర్చుకుంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,54,273కు చేరింది.

కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభం రూ.3,344 కోట్లు



దిల్లీ: జులై- సెప్టెంబరు త్రైమాసికంలో కోటక్ మహీంద్రా బ్యాంక్ నికర లాభం స్టాండలోన్ పద్ధతిలో స్వల్పంగా 5 శాతం పెరిగి రూ.3,344 కోట్లకు చేరింది. కిందటేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.3,191 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.13,507 కోట్ల నుంచి రూ.15,900 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం రూ.6,297 కోట్ల నుంచి పెరిగి రూ.7,020 కోట్లకు చేరింది. అయితే నికర వడ్డీ మార్జిన్ 5.22 శాతం నుంచి 4.91 శాతానికి తగ్గింది. స్థూల నిరర్థక ఆస్తులు 1.72 శాతం నుంచి 1.49 శాతానికి తగ్గగా.. నికర నిరర్థక ఆస్తులు 0.37 శాతం నుంచి 0.43 శాతానికి పెరిగాయి. ఏకీకృత ప్రాతిపదికన కోటక్ మహీంద్రా నికర లాభం రూ.4,461 కోట్ల నుంచి 13 శాతం పెరిగి రూ.5,044 కోట్లకు చేరింది.

పబ్లిక్ ఇష్యూకు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ సంస్థ

దిల్లీ: షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన మౌలిక ఇంజినీరింగ్, నిర్మాణ కంపెనీ ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఏఐఎల్) రూ.5,430 కోట్ల పబ్లిక్ ఇష్యూను ప్రకటించింది. ఈ ఐపీఓ అక్టోబరు 25న మొదలై 29న ముగుస్తుంది. 24న యాంకర్ ఇన్వెస్టర్లు దరఖాస్తు చేసుకోవచ్చు. త్వరలోనే ధరల శ్రేణిని కంపెనీ ప్రకటించనుంది. ఈ ఇష్యూలో రూ.1,250 కోట్ల తాజా షేర్ల జారీ, రూ.4,180 కోట్ల వరకు ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) ఉంటుంది. మార్చిలో దాఖలు చేసిన పత్రాల ప్రకారం రూ.7,000 కోట్ల ఐపీఓకు రావాల్సి ఉన్నా.. ఐపీఓకు ముందు నిధుల సమీకరణ కారణంగా పబ్లిక్ ఇష్యూ పరిమాణాన్ని తగ్గించింది.

సెబీకి దరఖాస్తు చేసిన ఎస్ఎమ్‌పీపీ: రూ.4,000 కోట్ల నిధులను సమీకరించేందు కోసం రక్షణ రంగ సామగ్రి తయారీ కంపెనీ ఎస్ఎమ్‌పీపీ లిమిటెడ్ సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. ఇందులో రూ.580 కోట్లు తాజా షేర్ల జారీ ద్వారా; రూ.3420 కోట్లు ఓఎఫ్ఎస్ ద్వారా సమీకరించనుంది.

18 శాతం పెరిగిన రాన్సమ్‌వేర్ దాడులు

లక్షిత దేశాల్లో రెండో స్థానంలో భారత్

అంతర్జాతీయంగా రాన్సమ్‌వేర్ దాడులు 18 శాతం మేరకు పెరిగాయి. ఇందులో భారత్ రెండో స్థానంలో ఉండటం గమనార్హం. దేశంలో ముఖ్యంగా తయారీ, టెలికమ్యూనికేషన్, టెక్నాలజీ రంగంలోని సంస్థలపై అధికంగా ఈ దాడులు జరుగుతున్నాయి. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్, జపాన్‌లకు ఇవి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ మధ్య కాలంలో రాన్సమ్‌వేర్ దాడులపై జీస్కేలర్ థ్రెట్‌ల్యాబ్జ్ విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడయ్యింది. సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్‌ను పంపడం ద్వారా సంస్థలు తమ నెట్‌వర్క్, ఫైల్స్‌ను వినియోగించకుండా చేసి, భారీ మొత్తాన్ని డిమాండ్ చేస్తుంటారు. దీన్నే రాన్సమ్‌వేర్‌గా పేర్కొంటారు. ఫిషింగ్, రిమోట్ డెస్క్‌టాప్ ప్రోటోకాల్ (ఆర్‌డీపీ)ల ద్వారా ఈ మాల్‌వేర్ దాడులకు పాల్పడుతుంటారు. డార్క్ ఏంజెల్స్ రాన్సమ్‌వేర్ గ్రూపులు ఏడాది కాలంలో దాదాపు రూ.630 కోట్లు (75 మిలియన్ డాలర్ల) మేరకు వసూలు చేశాయని నివేదిక పేర్కొంది. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) సాంకేతికతల వినియోగం పెరగడంతో సైబర్ నేరగాళ్లకు భారత్ ప్రధాన లక్ష్యంగా మారిందని వెల్లడించింది. దాడులు పెరిగినప్పటికీ డబ్బులు ఇచ్చినవి చాలా తక్కువే ఉన్నాయని పేర్కొంది. 29 శాతం సైబర్‌దాడులు తయారీ రంగంపై ఉండగా, ఆరోగ్య సంరక్షణ సంస్థలపై 8.89 శాతం, ఆర్థిక సేవల సంస్థలపై 8.89 శాతం దాడులు జరిగాయి. ఫార్మా, టెక్నాలజీ సంస్థలపైనా అధికంగా రాన్సమ్‌వేర్ దాడులకు పాల్పడుతున్నారు.

ఏసీల పరిశ్రమలో 20–25% వృద్ధి

2024–25 ఆర్థిక సంవత్సరంపై ఇక్రా అంచనా



దిల్లీ: దేశీయ రూమ్ ఎయిర్ కండీషనర్ (ఆర్ఏసీ) పరిశ్రమ ఊహించిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో వృద్ధి సాధించే అవకాశం ఉందని ఇక్రా అధ్యయన నివేదిక వెల్లడించింది. 2024-25లో 1.2-1.25 కోట్ల రూమ్ ఏసీలు విక్రయమయ్యే అవకాశం ఉందని గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 20-25 శాతం అధికమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 10-12 శాతం వృద్ధి సాధించే అవకాశం ఉందని ఇక్రా తెలిపింది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఒక్కో కుటుంబంలో బహుళ ఆర్ఏసీ యూనిట్లకు గిరాకీ పెరుగుతుండటం, పట్టణీకరణ, చేతిలో నగదు పెరగడం, వినియోగదారు ఫైనాన్సింగ్ ఆప్షన్లు అనుకూలంగా ఉండటంతో వచ్చే కొన్నేళ్లలో రూమ్ ఏసీల పరిశ్రమ వృద్ధి పథంలో కొనసాగుతుందని ఇక్రా నివేదికలో వివరించింది.

ల్యాప్‌టాప్ దిగుమతులపై పరిమితి?

- గట్టిగా పరిశీలిస్తున్న ప్రభుత్వం
- అదే జరిగితే దేశీయ తయారీకి ఊతం



దిల్లీ: ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, వ్యక్తిగత కంప్యూటర్ల దిగుమతిపై 2025 జనవరి తర్వాత పరిమితి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అంశంతో నేరుగా సంబంధమున్న ఇద్దరు వ్యక్తులను ఉటంకిస్తూ ఒక ఆంగ్ల వార్తా సంస్థ ఈ విషయాన్ని పేర్కొంది. దిగుమతులపై పరిమితి పెడితే, యాపిల్ వంటి అగ్రగామి కంపెనీలు భారత్‌లో సత్వరం తయారీ పెంచుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభావం ఎంత?

ఒక వేళ కంప్యూటర్ల దిగుమతులపై ప్రభుత్వం పరిమితి పెడితే, 10 బిలియన్ డాలర్ల (సుమారు 84,000 కోట్ల) మేరకు ఈ పరిశ్రమపై ప్రభావం పడుతుందని అంచనా. ఇప్పటివరకు దిగుమతులపై భారీగా ఆధారపడిన ఐటీ హార్డ్‌వేర్ మార్కెట్ ధోరణి మారిపోవచ్చు. దిగుమతులపై ఆంక్షలు విధించాలన్న ప్రతిపాదన ఇంతకుముందే వచ్చినా, అమెరికా కంపెనీల నుంచి బలమైన ఒత్తిడి రావడంతో వెనకడుగు పడింది. దేశీయంగా తయారీ ప్రారంభించేందుకు కంపెనీలకు తగిన సమయం ఇచ్చినట్లు ప్రభుత్వం భావిస్తోందని సంబంధిత వ్యక్తులు తెలిపారు.

త్వరలోనే చర్చలు!

ల్యాప్‌టాప్‌ల దిగుమతులను పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన వ్యవస్థకు ఈ ఏడాదితో గడువు తీరనుంది. వచ్చే ఏడాది చేసుకునే దిగుమతులకు మళ్లీ అనుమతులు తీసుకోవాలని కంపెనీలను కేంద్రం కోరనుంది. 'కొత్త దిగుమతి అధీకృత వ్యవస్థ' కింద కంపెనీలు తమ దిగుమతులకు ముందస్తు అనుమతులు పొందాల్సి రావొచ్చని చెబుతున్నారు. త్వరలో ఈ విషయమై అన్ని వర్గాలతో చర్చలు మొదలయ్యే అవకాశం ఉంది.

- దేశీయ ఐటీ హార్డ్‌వేర్ విపణి : 20 బి. డాలర్లు
- ఇందులో దేశీయ తయారీ: 5 బిలియన్ డాలర్లు

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ప్రస్తుతం కంపెనీలు ఆటోమేటెడ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే, ఎన్ని పరికరాలనైనా దిగుమతి చేసుకునే వీలుంది. హెచ్‌పీ, డెల్, యాపిల్, లెనోవో, శాంసంగ్ ఆధిపత్యం ఉన్న ఈ పరిశ్రమలో మూడింట రెండొంతుల దేశీయ గిరాకీ దిగుమతుల ద్వారానే తీరుతోంది. ఇందులోనూ ఎక్కువ పరికరాలు చైనా నుంచే వస్తున్నాయి.

ఎవరికి ప్రయోజనం..

దిగుమతులపై పరిమితులు పెడితే మాత్రం, దేశీయంగా ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ల తయారీ కోసం అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న డిక్సన్ టెక్నాలజీస్ వంటి కంపెనీలకు ప్రయోజనం కలుగుతుంది. దేశీయ గిరాకీలో 15 శాతానికి సేవలందించాలని డిక్సన్ లక్ష్యంగా పెట్టుకుంది. మరో పక్క, దేశీయ తయారీని పెంచడం కోసం ఐటీ హార్డ్‌వేర్‌కు ప్రకటించిన పీఎల్ఐ పథకం కింద ఏసర్, డెల్, హెచ్‌పీ, లెనోవో వంటి అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ తయారీ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాయి.

ఏం చేస్తారంటే..

'కంపల్సరీ రిజిస్ట్రేషన్ ఆర్డర్ కింద కనీస నాణ్యతా ప్రమాణాలుండే ల్యాప్‌ట్యాప్‌లు, నోట్‌బుక్‌లు, ట్యాబ్లెట్ పీసీలకు మాత్రమే అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. తద్వారా నాణ్యత లేని పరికరాలు దేశంలోకి రాకుండా చూడొచ్చు. టారిఫ్ విధించాలంటే, అంతర్జాతీయ ఒప్పందాలు అందుకు ఒప్పుకోకపోవచ్చు. కాబట్టి దిగుమతులపై పరిమితులకు తక్కువ అవకాశాలే తమ వద్ద ఉండొచ్చని ఒక అధికారి తెలిపారు.

ఉద్యోగాల సృష్టికి ఎగుమతులే కీలకం

యూఎస్ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముకేశ్

దిల్లీ: దేశం 5 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.415 లక్షల కోట్ల) ఆర్థిక వ్యవస్థగా మారే తరుణంలో ఎగుమతులు ప్రధాన ఉద్యోగ సృష్టికర్తగా మారబోతున్నాయని యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ (యూఎస్ఐఎస్‌పీఎఫ్) అధ్యక్షుడు, సీఈఓ ముకేశ్ ఆఘి వెల్లడించారు. యూఎస్ఐఎస్‌పీఎఫ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'భారత్, అమెరికాలు తమ ఆర్థిక వ్యవహారాలను బలోపేతం చేసుకోవడం కొనసాగించాలని, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.41.50 లక్షల కోట్ల)కు పెంచుకోవాల'ని సూచించారు. యువతలో సామాజిక అశాంతి లేకుండా చూసేందుకు ఉద్యోగాల కల్పన ప్రాముఖ్యతను ప్రస్తావించారు. నెలకు సుమారు 12 లక్షల ఉద్యోగాలను సృష్టించడం ఒక సవాలుగా మారుతోందన్నారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ 4 నుంచి 5 ట్రిలియన్ డాలర్లకు చేరుతున్నందున, అతి పెద్ద ఉద్యోగ సృష్టికర్తల్లో ఎగుమతులు కీలకంగా మారనున్నాయని వివరించారు. 50 లక్షల మంది భారతీయ అమెరికన్లు ప్రస్తుతం యూఎస్‌లో నివసిస్తున్నారని, అక్కడి జనాభాలో వీరు 1.5 శాతం ఉన్నారని తెలిపారు. దేశ జీడీపీకి వారు 6 శాతం వాటా అందిస్తున్నారని పేర్కొన్నారు.



- 2023-24లో భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 118.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.9.82 లక్షల కోట్లు)గా నమోదైంది. దీన్ని 500 బి. డాలర్లకు చేర్చాల్సిన అవసరం ఉందని యూఎస్ఐఎస్‌పీఎఫ్ సీఈఓ తెలిపారు. 2021-22, 2022-23లో భారత్‌తో అమెరికానే అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా నిలిచిందని వెల్లడించారు. 2023-24లో మాత్రం చైనా 118.4 బి.డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యంతో అతి పెద్ద భాగస్వామిగా మారింది.

డీలిస్టింగ్ ప్రక్రియ వ్యవహారంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌పై దర్యాప్తు!


దిల్లీ: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేర్ల డీలిస్టింగ్ ప్రక్రియకు సంబంధించి, ఆ కంపెనీ సమర్పించిన వివరాలను సెబీ పునఃపరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తు ప్రారంభించిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్లు ఓ ఆంగ్ల వెబ్‌సైట్ వెల్లడించింది. ప్రతిపాదిత డీలిస్టింగ్ ప్రక్రియపై మరిన్ని వివరాల కోసం ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అధికారులకు సమన్లను సెబీ జారీ చేసిందని ఆ వర్గాలు తెలిపాయి. రిజర్వ్ బుక్ బిల్డింగ్‌లో మినహాయింపు పొందే విషయంలో కంపెనీ సరైన సమాచారం ఇచ్చిందా? షేర్ల విలువ మదింపులో సరైన విధానాన్నే అవలంబించిందా? అనే అంశాలను సెబీ పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ దర్యాప్తు ప్రక్రియ డీలిస్టింగ్ ప్రక్రియపై ప్రభావం చూపించకపోవచ్చు. మైనార్టీ వాటాదార్ల నుంచి అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ఈ డీలిస్టింగ్ ప్రతిపాదనకు ఇప్పటికే నేషనల్ కంపెనీస్ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), మెజార్టీ వాటాదార్ల అనుమతి లభించడమే ఇందుకు కారణం. ఈ ప్రక్రియలో ఏమైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు సెబీ గుర్తిస్తే కంపెనీ, సంబంధిత అధికారులపై జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

దాల్మియా భారత్ లాభంలో 60% క్షీణత

దిల్లీ: సిమెంటు తయారీ కంపెనీ దాల్మియా భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంలో రూ.49 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే సమయంలోని లాభం రూ.123 కోట్లతో పోలిస్తే ఇది 60.16% తక్కువ. కంపెనీ మొత్తం ఆదాయం 2.28% తగ్గి రూ.3,160 కోట్లకు పరిమితమైంది. విక్రయ పరిమాణం 14.1% పెరిగి 6.7 మిలియన్ టన్నులకు చేరుకోవడం గమనార్హం. మొత్తం వ్యయాలు కాస్త పెరిగి రూ.3087 కోట్లకు చేరాయి

ద్విచక్ర వాహనాలు @ కోటి విక్రయాలు

- ఏప్రిల్–సెప్టెంబరులో రికార్డు
- ఆరేళ్ల తర్వాత తిరిగి ఆ స్థాయికి




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం(ఏప్రిల్-సెప్టెంబరు)లో భారత ద్విచక్ర వాహన పరిశ్రమ రాణించింది. మోటార్‌సైకిళ్లు, స్కూటర్లు, మోపెడ్లు కలిసి టోకున కోటికి పైగా(1,01,64,980 యూనిట్లు) అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే సమయంలో విక్రయమైన 87,39,406 వాహనాలతో పోలిస్తే ఇవి 16% అధికం. అంతే కాదు 2023-24 ఏడాది మొత్తం మీద అమ్ముడుపోయిన 1,79,74,365లో 64 శాతానికి, 2018-19లోని రికార్డు విక్రయాలైన 2.1 కోట్లలో 48 శాతానికి ఇవి సమానం కావడం విశేషం. కాగా, చివరిసారిగా భారత ద్విచక్ర వాహన పరిశ్రమ కోటి టోకు విక్రయాలను 2018-19 ప్రథమార్ధం(1,15,68,498)లో సాధించింది. అంటే ఆరేళ్ల అనంతరం ఈ రికార్డు నమోదు చేసింది. మూడు విభాగాలు రెండంకెల వృద్ధిని చేరడంతో ఇది సాధ్యమైంది. మోటార్‌సైకిళ్లు 16.31%, స్కూటర్లు 22%, మోపెడ్లు 16.55% చొప్పున అధికంగా విక్రయమయ్యాయి.

పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌కు తగ్గిన మొండి బకాయిలు

దిల్లీ: జులై- సెప్టెంబరు త్రైమాసికంలో పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ నికర లాభం 26 శాతం పెరిగి రూ.240 కోట్లకు చేరింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.189 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.2,674 కోట్ల నుంచి రూ.3,098 కోట్లకు పెరిగింది. వడ్డీ ఆదాయం కూడా రూ.2,406 కోట్ల నుంచి పెరిగి రూ.2,739 కోట్లుగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు 6.23 శాతం నుంచి 4.21 శాతానికి; నికర నిరర్థక ఆస్తులు 1.88 శాతం నుంచి 1.46 శాతానికి తగ్గాయి.

ఈనాడు సినిమా



సన్నీ దేవోల్.. జాట్


బాలీవుడ్ స్టార్ సన్నీ దేవోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రణదీప్ హుడా, సయామీ ఖేర్, రెజీనా తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'జాట్' అనే పేరును ఖరారు చేశారు. శనివారం సన్నీ దేవోల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందులో సన్నీ పెద్ద ఫ్యాన్‌ను చేత్తో పట్టుకుని యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా కనిపించారు. ఈ సినిమాని లార్జర్ దేన్ లైఫ్ యాక్షన్ డ్రామాగా భారీ హంగులతో ముస్తాబు చేస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. దీని చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: రిషి పంజాబీ.

క్రిస్మస్ బరిలో బరోజ్?



వైవిధ్యమైన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'బరోజ్'. 3డీ ఫాంటసీ, ఎపిక్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. 'బరోజ్ : ది గార్డియన్ ఆఫ్ ది గామాస్ ట్రెజర్' అనే నవల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆశీర్వాద్ సినిమాస్ పతాకం పై ఆంటోని పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాను అక్టోబరులో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. కానీ ఇప్పుడీ సినిమా రాకకు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు, త్వరలో ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు మోహన్‌లాల్ సన్నిహిత వర్గాలు చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం ఈయన 'కన్నప్ప', 'ఎల్2: ఎంపురాన్' చిత్రాలతో బిజీగా ఉన్నారు.

బజరంగ్‌బలితో బాజీరావ్ సింగమ్



ఇతిహాసాల్లో గొప్పగా భావించే రామాయణానికి హీరోల యాక్షన్ తోడైతే ఎలా ఉంటుందో చూపించడానికి వస్తోంది 'సింగమ్ అగైన్'. బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న చిత్రమిది. రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దీపికా పదుకొణె కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'సింగమ్' ఫ్రాంచైజీలో రూపొందుతున్న ఈ చిత్రంలో మరోసారి బాజీరావ్ సింగమ్‌గా సందడి చేయనున్నారు అజయ్. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పోస్టర్లు సినిమాపై అంచనాల్ని పెంచాయి. తాజాగా ఇందులోని మొదటి పాటను విడుదల చేసింది చిత్రబృందం. 'జై బజరంగ్‌బలి..' అంటూ సాగుతున్న ఈ గీతంలో రాముడిలా అజయ్, హనుమంతుడిలా రణ్‌వీర్ పాత్రల్ని, వారి మధ్య ఉన్న అనుబంధాన్ని చూపించారు. హనుమాన్ చాలీసా నుంచి ప్రేరణ పొందిన ఈ ట్రాక్‌ను తమన్ కంపోజ్ చేశారు. శ్రీకృష్ణ, కరీముల్లా, అరుణ్ కౌండిన్య తదితరులు ఆలపించారు. ఈ కాప్ యూనివర్స్ చిత్రం వచ్చే నెల 1న విడుదల కానుంది.





కథానాయకుల నుంచి కొత్త కబురు వినిపించిందంటే చాలు.. ఆ తర్వాత సినీప్రియుల్లో మెదిలే తొలి ప్రశ్న 'మా హీరోతో జోడీ కట్టే సొగసరి ఎవర'న్నదే. దీనికి చిత్ర బృందాల నుంచి స్పష్టత వచ్చే లోపే బోలెడన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చి ప్రేక్షకుల్ని ఊరించే ప్రయత్నం చేస్తుంటాయి. కొన్నిసార్లు అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. మరికొన్నిసార్లు ఆఖరి నిమిషంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటాయి. అప్పటి వరకు ప్రచారంలో వినిపించని కథానాయిక తెరపై కనిపించడం తరచూ చూస్తేనే ఉంటాం. ప్రస్తుతం ఇలాగే కొందరు హీరోల కొత్త చిత్రాలకు సంబంధించి పలువురు నాయికల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ప్రచారంలోకి వచ్చిన జంటలన్నీ తెరపై మురిపించాలని నియమం లేదు.

ప్రచార ఊరింపేనా.. జంటగా మురిపించేనా!





కథానాయకుడు ఎన్టీఆర్ వరుస విజయాలతో జోరు మీదున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'వార్ 2'తో పాటు ప్రశాంత్ నీల్ సినిమా ఒకటుంది. ఇప్పటికే లాంఛనంగా మొదలైన ఈ 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్) చిత్రం వచ్చే నెల నుంచి రెగ్యులర్ చిత్రీకరణకు సిద్ధమవుతోంది. దీని కోసం తారక్ జనవరి నుంచి సెట్లోకి అడుగు పెట్టనున్నారు. అయితే ఇప్పటికీ చిత్ర బృందం ఇందులో కథానాయిక ఎవరన్నది స్పష్టత ఇవ్వలేదు. ఈ ప్రాజెక్ట్ కోసం మొదట్లో రష్మిక పేరు ప్రచారం వినిపించినప్పటికీ ఇప్పుడు రుక్మిణీ వసంత్‌ను పరిశీలనలో ఉంచినట్లు వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. త్వరలోనే దీనిపై చిత్ర బృందం నుంచి స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'దసరా' విజయం తర్వాత వీళ్ల కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. పాన్ ఇండియా స్థాయిలో ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం ఆ స్థాయి నాయికనే వెతికి పట్టుకునే పనిలో పడింది చిత్ర బృందం. ఈ క్రమంలోనే ఇప్పుడీ పాత్ర కోసం బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. మరి దీనిపై ఆమె సానుకూలంగా స్పందించిందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. యువ హీరో విష్వక్ సేన్ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఇప్పుడాయన చేయనున్న కొత్త సినిమాల్లో 'జాతిరత్నాలు' ఫేమ్ కేవీ అనుదీప్ చిత్రమొకటి ఉంది. ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్ త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడిందులో నాయికగా కృతిశెట్టిని సంప్రదించినట్లు సమాచారం. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని.. కృతి సానుకూలంగా స్పందించిందని తెలిసింది. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశమున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

కాంబో కుదిరిందా?

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటున్న ఈ సినిమా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది. కానీ, దీని తర్వాత ఆయన చేయనున్న కొత్త చిత్రమేదన్నది ఇంకా తేలలేదు. అయితే త్వరలోనే దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. 'అర్జున్ సురవరం'తో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన టి.ఎన్.సంతోశ్ ఇప్పుడు వెంకీతో ఓ సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. దీనికోసం విభిన్నమైన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథను సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. కథానాయిక కీర్తి సురేశ్ ఇందులో కీలక పాత్ర పోషించనున్నట్లు వార్తలు ఊపందుకున్నాయి. ఇది ప్రస్తుతం చర్చల దశలో ఉందని.. ప్రధాన తారాగణం నుంచి స్పష్టత రాగానే దీన్ని ప్రకటించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను నితిన్ సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ఠ్ మూవీస్ నిర్మించే అవకాశమున్నట్లు ప్రచారం సాగుతోంది.

మున్నాభాయ్ 3 సన్నాహాలు


'మున్నాభాయ్ 2'

'మున్నాభాయ్ ఎంబీబీఎస్'.. ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతూ మరోవైపు భావోద్వేగ సన్నివేశాలతో మెప్పించిన చిత్రమిది. బాలీవుడ్ సీనియర్ కథానాయకుడు సంజయ్ దత్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ హిరాణీ తెరకెక్కించిన ఈ సినిమా పలు భాషల్లో రీమేక్ అయ్యి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు భాగాలుగా రూపొంది మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న ఈ ఫ్రాంచైజీలో 'మున్నాభాయ్ 3' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు సినీప్రియులు. ఇప్పుడీ మూడో భాగాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఓ తీపి కబురు వినిపించారు దర్శకుడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాజ్‌కుమార్ హిరాణీ మాట్లాడుతూ.. "మున్నాభాయ్ 3'ను తీర్చిదిద్దడమే ఇప్పుడు నా ప్రధాన కర్తవ్యం. ఇప్పటికే దీని కోసం ఐదు స్క్రిప్ట్‌లను సగం పూర్తి చేశాను. ఇప్పుడు రాబోయే సినిమా గత చిత్రాల కంటే మెరుగ్గా ఉండాలనేది నా లక్ష్యం. అందుకే కథపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా. మరో ముఖ్య విషయం.. సంజు ఇంటికి వచ్చి దీన్ని పూర్తి చేయమని నన్ను బెదిరించే అవకాశం కూడా ఉంది (నవ్వుతూ). త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటిస్తాం" అని అన్నారు.

సైన్స్‌కు అతీంద్రియ శక్తులు కలిస్తే?


ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ తన రాబోయే సినిమా కోసం సైంటిస్ట్ అవతారమెత్తారు. తాజాగా ఆయన ప్రధాన పాత్రలో 'శంబాల' అనే చిత్రంలో నటిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ నేపథ్యంలో యుగంధర్ ముని దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆనంది కథానాయిక. శనివారం ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "అతీంద్రియ శక్తులకు సైన్స్ కలిస్తే.. ఆ నిజం కల్పితాల కంటే భయంకరంగా ఉంటుంది" అని వ్యాఖ్యల్ని జోడించింది. మునుపెన్నడూ చూడని కథాంశంతో సూపర్ నాచురల్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో ఆది.. జియో సైంటిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. దీన్ని షైనింగ్ పిక్చర్స్ పతాకంపై రాజశేఖర్, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బతుకే నటన


సింధు, సుధీర్‌బాబు, విశ్వప్రసాద్, రిషికేశ్వర్, శివ

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో రిషికేశ్వర్ యోగి తెరకెక్కించిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, సింధు రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుకను నిర్వహించారు. హీరో సుధీర్‌బాబు, దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య తదితరులు అతిథులుగా హాజరయ్యారు. "శివ, నితిన్ లాంటి నటులు లేకపోయి ఉంటే ఈ సినిమా ఇంత బాగా వచ్చేది కాదు. దీన్ని అందరూ చూసి, ఆశీర్వదించాలని కోరుతున్నా" అన్నారు దర్శకుడు రిషికేశ్వర్. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. 'నేను ప్రారంభంలో కొన్ని చిత్రాల్ని నిర్మించి.. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించాను. కానీ, థియేట్రికల్ రిలీజ్ చేయలేకపోయాను. ఈ చిత్ర బృందాన్ని చూసినప్పుడు నాకు పాత రోజులు గుర్తొచ్చాయి. అందుకే వారికి సాయం చేయాలని ముందుకొచ్చా" అన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, నితిన్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అందరినీ మెప్పించే దుర్గమ్మ


ప్రతాని రామకృష్ణ గౌడ్, వి.సముద్ర

చిన్న, మధు ప్రియ ప్రధాన పాత్రల్లో సుభాని తెరకెక్కిస్తున్న చిత్రం 'జై జై దుర్గమ్మ'. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను నిర్మాతలు సాయి వెంకట్, ప్రతాని రామకృష్ణ గౌడ్ విడుదల చేశారు. దర్శకుడు వి.సముద్ర చిత్ర లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణ మాట్లాడుతూ.. 'ట్రైలర్ చూస్తుంటే 'దేవి', 'అరుంధతి' చిత్రాలు గుర్తొస్తున్నాయి. కుటుంబంతో కలిసి చూసే మంచి చిత్రమిది. కచ్చితంగా అందరినీ మెప్పించి విజయాన్ని అందుకుంటుంది" అని అన్నారు. ఎం.అనిత నిర్మాత.

ఓ యువకుడి జీవితం స్ఫూర్తితో!



రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా నిర్మించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి తెరకెక్కించారు. అనన్య కృష్ణన్ కథానాయిక. తనికెళ్ల భరణి, ధనరాజ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్ విడుదల చేశారు. నటి అనసూయ, దర్శకుడు సాయి రాజేశ్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ.. "మంచి కథతో నిజాయతీగా తీసిన చిత్రమిది. దర్శకుడు అంజి దీన్ని ఎంతో చక్కగా తెరకెక్కించారు. చరణ్ అర్జున్ అద్భుతమైన సంగీతమందించారు. ఈ సినిమాని మూడు చిత్రోత్సవాల్లో ప్రదర్శించాలన్నది నా కోరిక" అన్నారు. "బంజారా వర్గానికి చెందిన ఓ యువకుడి నిజ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను తెరకెక్కించాం. ఇంత మంచి కథను రాసి.. నా దగ్గరకు తీసుకొచ్చిన రాకేశ్‌కు కృతజ్ఞతలు" అన్నారు దర్శకుడు అంజి. ఈ కార్యక్రమంలో శివబాలాజీ, శివా రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మంచి సినిమాని బతికించండి


అంజన్ రామచంద్ర, శ్రావణి

అంజన్ రామచంద్ర, శ్రావణి రెడ్డి జంటగా స్మరణ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'లవ్ రెడ్డి'. గీతాన్ ప్రొడక్షన్స్, సెహెరి స్టూడియో, ఎమ్జీఆర్ ఫిలిమ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో అంజన్ రామచంద్ర మాట్లాడుతూ.. "మా 'లవ్ రెడ్డి' థియేటర్‌లో గెలిచాడు. చూసిన వాళ్లంతా బాగుందని అంటున్నారు. కొందరు తమ జీవితాల్లో జరిగిన లవ్ ఫెయిల్యూర్స్ గురించి ఉద్వేగంగా చెబుతున్నారు" అన్నారు. దర్శకుడు స్మరణ్ రెడ్డి మాట్లాడుతూ.. "కొన్ని వాస్తవ సంఘటనలకు ఫిక్షన్ జోడించి ఈ చిత్రాన్ని రూపొందించాం. దీన్ని అందరూ థియేటర్లలోనే చూసి.. మంచి సినిమాని బతికించమని కోరుతున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో మదన్ గోపాల్ రెడ్డితో పాటు చిత్ర బృందం పాల్గొంది.

ప్రతినాయకుడిగా.. సహాయనటుడిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటుడు అజయ్. ఇప్పుడాయన ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'పొట్టేల్'. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని సాహిత్ మోత్కూరి తెరకెక్కించారు. ఇది ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు అజయ్.

టిట్ల తర్వాత పటేల్ పాత్రతో ఆ మ్యాజిక్



◆ "ఇది భిన్న కోణాలున్న కథ. పూర్తిగా 1980ల నాటి తెలంగాణ నేపథ్యంలో సాగుతుంది. ఓ చిన్న పాప చదువు కోసం చేసే పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. అలాగే మూఢనమ్మకాలు.. వాటిని అడ్డుపెట్టుకుని బతికే మనుషులు.. మొండితనం.. గ్రామదేవతలు.. ఇలా చాలా కోణాల్ని ఈ కథలో స్పృశించారు దర్శకుడు సాహిత్. నిజానికి ఇలాంటి కథలు చెప్పేటప్పుడు కొన్నిసార్లు సందేశం ఎక్కువైపోయే ప్రమాదముంది. కమర్షియల్‌గా తీసుకురావడం చాలా కష్టం. కానీ, సాహిత్ దీన్ని అన్ని రకాల వాణిజ్య హంగులతో మంచి సినిమాటిక్ అనుభూతిని అందించేలా గొప్పగా తీర్చిదిద్దాడు. ఇందులో విజిల్స్ పడే మాస్ సీన్స్ చాలా ఉన్నాయి".

◆ "ఏ నటుడికైనా ప్రతి సినిమా ఓ కొత్త ఆవిష్కరణలాగే ఉంటుంది. అనుభవం సాధించే కొద్దీ నటుడిగా లోలోపల ఉన్న భయాలు తగ్గి దేన్నైనా తేలికగా అర్థం చేసుకుని చేయగలిగే నేర్పు వస్తుంది. ఈ చిత్ర విషయంలో నాకు సవాల్‌గా అనిపించింది ఈ కథలోని సంస్కృతిని సహజంగా తెరపైకి తీసుకురావడమే. దీంట్లో నేను పటేల్‌గా ప్రతినాయక ఛాయ లున్న పాత్రలో కనిపిస్తా. కొన్ని సీన్స్‌లో చీరకట్టులో కనిపిస్తా. తెలంగాణలో సిగం (దేవుడు పూనడం) అని ఉంటుంది. అది వచ్చినప్పుడు ఆ వ్యక్తులు మాట్లాడే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. ఈ పాత్ర చేసేటప్పుడు దాని మీద కొంత హోంవర్క్ చేశా. నేను చేసిన సినిమాల్లో 'విక్రమార్కుడు'లోని టిట్ల పాత్ర నాకెంతో పేరు తెచ్చి పెట్టింది. ఆ తర్వాత అలాంటి పాత్రలు కొన్ని ప్రయత్నించినా ఆ మ్యాజిక్ మళ్లీ కుదర్లేదు. కానీ, ఈ సినిమా ఆ లోటు తీరుస్తుందనిపిస్తోంది. టిట్ల తర్వాత నాకు చాలా నచ్చినది ఇందులోని పటేల్ పాత్రే. నటుడిగా నాకెంతో ఆనందాన్నిచ్చిన పాత్రిది. నాదే కాదు.. ఇందులోని యువ, అనన్య తదితరుల పాత్రలన్నీ కూడా చాలా బాగా కుదిరాయి".

◆ "ఈ చిత్రసీమలో 25 ఏళ్లుగా నటుడిగా ఉండగలగడం మామూలు విషయం కాదు. ఇన్నేళ్లు ఇక్కడ నిలకడగా కొనసాగడమే నా వరకు పెద్ద గిఫ్ట్. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా 250 సినిమాలు చేసే పరిస్థితి ఇప్పుడు లేదు. సినిమాల సంఖ్య తగ్గిపోతోంది. ఈ ఏడాది నాకు 'దేవర', 'మత్తువదలరా 2' లాంటి రెండు పెద్ద విజయాలు దక్కాయి. నా పాత్రల్లో కొన్ని మీమ్స్ వైరల్ అయ్యాయి. అవి చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా ఉంది. నాకు బలమైన భావోద్వేగాలు నిండిన పాత్రలు చేయాలని ఉంది. ఇటీవలే నేను 'సింగం అగైన్' చేశాను. 'పుష్ప 2', 'గరుడన్' తెలుగు రీమేక్ తదితర చిత్రాలు చేస్తున్నా".

అయస్కాంతత్వం

పదార్థంలోని ప్రతి పరమాణువు ఒక అయస్కాంతమే. దాని ఆర్బిటాల్, స్పిన్ చలనాల వల్ల పరమాణువుకు రెండు రకాల అయస్కాంత ద్విధ్రువ భ్రామకాలు ఏర్పడతాయి. అన్ని పరమాణువుల అయస్కాంత భ్రామకాల సదిశల ఫలితం ఆ పదార్థం అయస్కాంతమా? కాదా? అనేది నిర్ణయిస్తుంది.

భూ అయస్కాంత ధ్రువాల్లో దిక్సూచీ పనితీరు శూన్యం

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఫిజిక్స్

అయస్కాంత పదార్థాలు

అయస్కాంతత్వం పరంగా పదార్థాలు ముఖ్యంగా మూడు రకాలు. అవి:

1. డయా అయస్కాంత పదార్థాలు
2. పారా అయస్కాంత పదార్థాలు
3. ఫెర్రో అయస్కాంత పదార్థాలు

డయా అయస్కాంతత్వం


ఈ తరహా పదార్థాలను బాహ్య అయస్కాంత క్షేత్రంలో ఉంచితే అవి బలమైన క్షేత్ర ప్రదేశం నుంచి బలహీన ప్రదేశం వైపు కదులుతాయి.

✦ డయా అయస్కాంత పదార్థంలోని అన్ని పరమాణువుల ఫలిత అయస్కాంత ద్విధ్రువ భ్రామకం సున్నా.


✦ బాహ్య అయస్కాంత క్షేత్రంలో ఉన్నప్పుడు వీటిలోని పరమాణు అయస్కాంతాలు క్షేత్రానికి వ్యతిరేక దిశలో అయస్కాంతీకరణం చెందుతాయి. కాబట్టి బాహ్య క్షేత్రాన్ని డయా అయస్కాంత పదార్థాలు వికర్షిస్తాయి.

డయా అయస్కాంత పదార్థాలకు ఉదాహరణలు: బిస్మత్, రాగి, సీసం (లెడ్), సిలికాన్, నీరు, నైట్రోజన్, బంగారం, పాదరసం, వజ్రం మొదలైనవి.

✦ డయా అయస్కాంతాలకు సాపేక్ష ప్రవేశ్యశీలత (μ_r) విలువ ఒకటి కంటే చాలా తక్కువ. కాబట్టి అయస్కాంత బలరేఖలు ప్రసరించే ప్రదేశంలో డయా అయస్కాంత పదార్థాన్ని ఉంచితే అవి దాని ద్వారా ప్రయాణించేందుకు ఇష్టపడవు.




గాలిలో బలరేఖలు



డయా అయస్కాంతంలో బలరేఖలు

✦ ద్రవరూప డయా అయస్కాంతాన్ని U ఆకార గొట్టంలో తీసుకొని గొట్టం ఒక భుజానికి అయస్కాంత క్షేత్రాన్ని ప్రయోగిస్తే ద్రవం వికర్షణ వల్ల రెండో గొట్టంలోకి ప్రయాణిస్తుంది.



✦ డయా అయస్కాంతంతో చేసిన కడ్డీని ఏకరీతి అయస్కాంత క్షేత్రంలో వేలాడదీస్తే అది క్షేత్ర దిశకు లంబదిశలో నిశ్చల స్థితికి వస్తుంది.

✦ డయా అయస్కాంత పదార్థాల ధర్మాలు ఉష్ణోగ్రతపై ఆధారపడవు.

✦ డయా అయస్కాంతాలను MRI స్కానింగ్‌లో, మాగ్నెటిక్ లెవిటేషన్‌లో మెటీరియల్ సైన్స్ రిసెర్చ్‌లో ఉపయోగిస్తారు.

✦ డయా అయస్కాంతాలకు ససెప్టబిలిటీ (χ) రుణాత్మకం.

$$\chi = \frac{M}{H} = \frac{\text{అయస్కాంతీకరణ}}{\text{అయస్కాంత తీవ్రత}}$$

$$\therefore \frac{M}{H} = -1 \Rightarrow \vec{H} = -\vec{M}.$$

అంటే డయా అయస్కాంతం బాహ్యక్షేత్రానికి వ్యతిరేకంగా అయస్కాంతీకరణం చెందుతుంది.

✦ స్ప్రింగ్‌లా చుట్టిన రాగి తీగను నిలువుగా ఉంచి దానిలో DC విద్యుత్తును ప్రసారం చేస్తే అది దండాయస్కాంతం (విద్యుదయస్కాంతం)గా ప్రవర్తిస్తుంది. దీని ఉత్తర ధ్రువం (అపసరణం చెందే అయస్కాంత క్షేత్రం) వద్ద ఒక చిన్న కప్పను వదిలితే అది కిందపడకుండా అక్కడే గాలిలో తేలుతుంది. దీన్నే మాగ్నటిక్ లెవిటేషన్ అంటారు. కప్పలోని ప్రతి పరమాణువు డయా అయస్కాంతత్వం వల్ల బలహీన క్షేత్రం వైపు వెళ్లే ప్రయత్నంలో పైకి కదులుతుంది. అయస్కాంత వికర్షణ బలం, దాని బరువుకు సమానం అయినప్పుడు అది గాల్లో తేలుతుంది.

బలమైన సోలినాయిడ్‌ని నిర్మించగలిగితే వ్యక్తిని కూడా లెవిటేట్ చేయవచ్చు.

పారా అయస్కాంతత్వం

పారా అయస్కాంత పదార్థంలోని ఎలక్ట్రాన్ల స్పిన్, ఆర్బిటాల్ అయస్కాంత ద్విధ్రువ భ్రామకాలు సదిశీయంగా కలిసి కొంత శాశ్వత ద్విధ్రువ భ్రామకాన్ని ఏర్పరుస్తాయి.


▮ బాహ్య క్షేత్రం లేనప్పుడు పరమాణు ద్విధ్రువాలన్నీ చిందరవందరగా ఉండటం వల్ల ఫలిత అయస్కాంత ద్విధ్రువ భ్రామకం శూన్యం అవుతుంది.

▮ పారా అయస్కాంత పదార్థాన్ని బాహ్య అయస్కాంత క్షేత్రంలో ఉంచితే అన్ని ద్విధ్రువాలు క్షేత్ర దిశలోకి భ్రమణం చెంది కొంత ఫలిత ద్విధ్రువ భ్రామకాన్ని ఏర్పరుస్తాయి. కాబట్టి ఇవి బాహ్య అయస్కాంతంతో బలహీనంగా ఆకర్షితం అవుతాయి.

పారా అయస్కాంతాలకు ఉదాహరణలు: అల్యూమినియం, సోడియం, కాల్షియం, ప్లాటినం, క్రోమియం, ఆక్సిజన్ (STP వద్ద), మాంగనీస్.

▮ పారా అయస్కాంత పదార్థాలకు సాపేక్ష ప్రవేశ్యశీలత ఒకటి కంటే కొంచెం ఎక్కువ. అయస్కాంత వశ్యత ధనాత్మకం కానీ స్వల్పం.

▮ పారా అయస్కాంతం ఉష్ణోగ్రతను పెంచితే దాని అయస్కాంత ప్రభావం తగ్గిపోతుంది.



ఫెర్రో అయస్కాంతత్వం


ఇనుము, కోబాల్ట్, నికెల్, అల్నికో ($Al + Ni + Co$) లాంటి పదార్థాలు ఫెర్రో అయస్కాంత పదార్థాలు.

❖ వీటిని బాహ్య అయస్కాంత క్షేత్రం బలంగా ఆకర్షిస్తుంది. వీటిని శాశ్వత అయస్కాంతాలుగా మార్చవచ్చు.


❖ ఫెర్రో అయస్కాంతత్వాన్ని 'డొమైన్'ల ఆధారంగా వివరించవచ్చు. వీటిలోని పరమాణు అయస్కాంతాలన్నీ ఒక జట్టుగా ఒకే దిశలో అమరి ఉండి, బలమైన ఫలిత అయస్కాంత ద్విధ్రువ భ్రామకాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటి పరమాణు సమూహ ప్రాంతాన్ని 'డొమైన్' అంటారు.

❖ సాధారణ పరిస్థితుల్లో డొమైన్లన్నీ అస్తవ్యస్తంగా అమరి ఉండటం వల్ల వీటి ఫలిత అయస్కాంత భ్రామకం శూన్యం అవుతుంది.

❖ బాహ్య అయస్కాంత క్షేత్రం సమక్షంలో డొమైన్లన్నీ క్షేత్ర దిశలోకి భ్రమణం చెంది అయస్కాంతాలుగా మారతాయి.



$B_{బాహ్య} = 0$




$B_{బాహ్య} \neq 0$

❖ ఫెర్రో అయస్కాంత పదార్థాలకు సాపేక్ష ప్రవేశ్య శీలత (μ_r) విలువ ఒకటి కంటే చాలా ఎక్కువ. అంటే గాలి లేదా శూన్యంలో ప్రయాణించే బలరేఖల కంటే ఫెర్రో అయస్కాంతం ద్వారా ప్రయాణించే బలరేఖల సంఖ్య చాలా ఎక్కువ. ($\mu_r > 1000$)



గాలి/శూన్యంలో బలరేఖలు



ఫెర్రో అయస్కాంతంలో బలరేఖల ప్రసారం

❖ ఫెర్రో అయస్కాంత పదార్థాలకు వశ్యత (χ) ధనాత్మకం, అధికం.

❖ ఫెర్రో అయస్కాంతాలను వేడిచేస్తే అవి క్రమంగా తమ అయస్కాంతత్వాన్ని కోల్పోతాయి. ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత వద్ద అవి అయస్కాంతాలుగా మారతాయి. ఈ ఉష్ణోగ్రతను క్యూరీ ఉష్ణోగ్రత అంటారు.

❖ ఇనుముకు క్యూరీ ఉష్ణోగ్రత విలువ $770^\circ C$.

❖ ఆకాశం నుంచి వచ్చే పిడుగులు భూమిపై పడినప్పుడు అధిక విద్యుత్తు భూమి పొరల్లో చాలా దూరం ప్రయాణిస్తుంది. ఈ విద్యుత్తు కలుగజేసే తీవ్ర అయస్కాంత క్షేత్రం రాళ్లలోని ఫెర్రో అయస్కాంతాలను అయస్కాంతీకరిస్తుంది.

❖ వివిధ కారణాలతో శైథిల్యం చెందిన రాళ్లు కాలక్రమంలో సూదంటు రాయి లేదా లోడ్‌స్టోన్‌గా మారతాయి.

భూ అయస్కాంతత్వం

దిక్సూచీ ఎల్లప్పుడు ఉత్తర దక్షిణ దిశలనే సూచిస్తుంది.

◆ భూ అయస్కాంత క్షేత్రం ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి మారుతూ ఉంటుంది. దీని విలువ 10^{-5} టెస్లా క్రమంలో (Order) ఉంటుంది.

◆ భూమి కేంద్రం (Core)లోని వెలుపలి పొరల్లో ఇనుము, నికెల్ లాంటి లోహాలు వేడి వల్ల ద్రవ స్థితిలో ఉంటాయి. భూమితో పాటు లోహ ద్రవాలు చలించడం వల్ల స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు విద్యుత్ ప్రవాహాలను ఏర్పరుస్తున్నాయి. విద్యుత్ ప్రవాహాలు భూమికి అయస్కాంత క్షేత్రాన్ని కలగజేస్తాయి. దీన్నే 'డైనమో ప్రభావం' అంటారు.

◆ భూ అయస్కాంత ఉత్తర ధృవం భౌగోళిక దక్షిణార్ధ భాగంలో ఉంటే భూ అయస్కాంత దక్షిణ ధృవం భౌగోళిక ఉత్తరార్ధ గోళంలో ఉంటుంది.

◆ భౌగోళిక ధ్రువాలు, అయస్కాంత ధ్రువాలను కలిపే రేఖల మధ్య సుమారు 11° కోణీయ విస్థాపనం ఉంటుంది.

◆ ఒక ప్రదేశంలో అయస్కాంత, భౌగోళిక ధ్రువాలను కలిపే ఊహాత్మక రేఖల మధ్య కొలిచిన కోణాన్ని దిక్పాతం అంటారు.

◆ ఒక ప్రదేశంలో స్వేచ్ఛగా వేలాడదీసిన దండాయస్కాంతం భూమి మొత్తం అయస్కాంత క్షేత్రం చేసే కోణాన్ని అవపాతం అంటారు. భూ అయస్కాంత భూమధ్య రేఖ వద్ద దీని విలువ 0° కాగా, అయస్కాంత ధ్రువాల వద్ద $\pm 90^\circ$.

◆ భూ అయస్కాంత ధ్రువాలు సుమారు ప్రతి 7000 సంవత్సరాలకొకసారి తారుమారవుతాయి. అంటే భూ అయస్కాంత ధ్రువాలు ఒకేచోట స్థిరంగా ఉండవు.

◆ భూ అయస్కాంత ధ్రువాల వద్ద దిక్సూచీ లేదా కంపాస్ ఏ దిశను సూచించదు. (పని చేయదు)

◆ భూ అయస్కాంత భూమధ్య రేఖ కేరళలోని తుంబా మీదుగా ప్రయాణిస్తుంది.

◆ భారతదేశ భూ అయస్కాంత అధ్యయన సంస్థ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నెటిజమ్' (IIG). ఇది ముంబయిలో ఉంది.

◆ కమ్యూనికేషన్, నావిగేషన్ తదితరాల కోసం ONGC, ISRO, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీలు IIG సేవలను ఉపయోగించుకుంటున్నాయి.



రచయిత
దురిశెట్టి అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

445 Word of the Day

Transgressor

Telugu meaning: అతిక్రమణదారుడు, నేరగాడు

English meaning: The word transgressor is a noun that describes a person who violates a law, moral code or boundary.

Synonyms: Offender, Lawbreaker

Antonyms: Conformist, Law-abider

Usage: **1.** The transgressor was caught by the authorities shortly after the crime was committed.

2. In ancient times, transgressor of sacred laws were often harshly punished.

నోటిఫికేషన్స్

ఫార్మా, హెల్త్ కేర్ కోర్సులు

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైదరాబాద్‌లోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఫార్మా, హెల్త్ కేర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ 29 అక్టోబరు 2024.

డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్ట్ పోస్టులు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అర్బన్ క్లినిక్‌లు/ యూపీహెచ్‌సీల్లో ఒప్పంద/ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 40 పోస్టుల భర్తీకి జిల్లా వైద్యారోగ్య శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆఫ్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 30 అక్టోబరు 2024.

యూజీ, పీజీ ప్రోగ్రామ్స్

హైదరాబాద్‌లోని డా.బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024-25 విద్యా సంవత్సరానికి దూరవిద్యా విధానంలో యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అర్హులైన అభ్యర్థులు 2024, అక్టోబరు 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలు, ప్రవేశాలకు నేడే (అక్టోబరు 20) ఆఖరు తేదీ

☛ ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ స్టేషన్ (ఈసీహెచ్‌ఎస్) - సికింద్రాబాద్‌లో 102 మెడికల్ పోస్టులు.

☛ రైల్వేలో 8,113 ఎన్‌టీపీసీ గ్రాడ్యుయేట్ పోస్టులు. బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ ఐబీఎంలో ప్రాసెస్ అసోసియేట్ పోస్టులు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

☛ యాక్సెంచర్‌లో బిజినెస్ అడ్వైజరీ న్యూ అసోసియేట్ పోస్టులు. ఏదైనా గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



తెలంగాణ ప్రాంతం 1956 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉంది. ఆ సమయంలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థను మొత్తం మూడు దశలుగా విభజించారు. ఈ ప్రాంతంలో వనరులు ఉన్నప్పటికీ ఆ మేరకు అభివృద్ధి చెందలేదనేది నిపుణుల భావన.

☛ ఈ వీడియోలో మూడు దశల్లో వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల్లో వృద్ధి - వాటాలు ఏ విధంగా ఉన్నాయి, ప్రాంతాలవారీగా జరిగిన ప్రణాళికా వ్యయం వివరాలు మొదలైన అంశాలను విశ్లేషించారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మేమందించే వీడియోలు ఎప్పటికప్పుడు మిస్ కాకుండా చూసేందుకు ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

Current Affairs



Indian batter Virat Kohli became the fourth Indian batsman to score nine thousand Test runs. He achieved this feat during the first match between India and New Zealand at the M. Chinnaswamy Stadium in Bengaluru on 18 October 2024. This is Kohli's 197th innings.

● Indian batters who have scored more than 9000 Test runs are: Sachin Tendulkar - 15,921 (200 Tests), Rahul Dravid - 13,625 (163 Tests), Sunil Gavaskar - 10,122 (125 Tests), Virat Kohli - 9017 (197 Tests).

Union Minister of State for Science and Technology (Independent Charge) Dr. Jitendra Singh unveiled Pavana Chitra, India's first Airport based self-powered indoor air quality monitoring facility at Thiruvananthapuram International Airport on 17 October 2024. The off-grid air quality monitor is powered by indigenous indoor solar cells developed by CSIR-NIIST, crafted from locally available materials.

Deendayal Antyodaya Yojana-National Rural Livelihood Mission (DAY NRLM) under Ministry of Rural Development signed Memorandum of Understanding with nine Public Sector Banks and one Private Bank on 18 October 2024. These Banks are: Bank of Baroda, Bank of India, Bank of Maharashtra, Canara Bank, Central Bank of India, Indian Bank, Indian Overseas Bank, Punjab National Bank, UCO Bank and IDBI Bank Limited.

World Food Day is celebrated every year on 16 October to commemorate Food and Agriculture Organization of the United Nations (FAO) founding on that day in 1945. ☛ **2024 theme:** "Right to food for a better life and a better future."

For more Current Affairs: Scan QR code

SSC Exams
Reasoning
Dictionary Order

Directions (Qs. 1 - 18): Arrange the given words in the sequence in which they occur in the dictionary.

1. 1. Cadets 2. Cadged 3. Cachet 4. Cacaos 5. Cables
A) 54321 B) 12345 C) 32415 D) 14325

2. 1. Earner 2. Earing 3. Earbud 4. Easing 5. Eaters
A) 43215 B) 32145 C) 12345 D) 54321

3. 1. Racer 2. Racial 3. Racist 4. Racket 5. Rarely
A) 21534 B) 43215 C) 54321 D) 12345

4. 1. Badges 2. Badder 3. Bacnes 4. Badged 5. Backer
A) 53241 B) 32415 C) 14325 D) 23415

5. 1. Earthy 2. Earlap 3. Earful 4. Earner 5. Easier
A) 54321 B) 32415 C) 14325 D) 23451

6. 1. Iddhis 2. Ickier 3. Icings 4. Ideata 5. Idioms
A) 43215 B) 54321 C) 32145 D) 12345

7. 1. Alkene 2. Alkine 3. Alkyds 4. Alkyne 5. Anklet
A) 43215 B) 54321 C) 32145 D) 12345

8. 1. Labour 2. Labrid 3. Lacers 4. Lacing 5. Lacked
A) 12345 B) 54321 C) 32415 D) 23415

9. 1. Maggot 2. Madman 3. Madden 4. Madras 5. Mahout
A) 54321 B) 12345 C) 32415 D) 43215

10. 1. Kalpis 2. Kanone 3. Kanban 4. Kapoks 5. Kaonic
A) 13254 B) 12345 C) 54321 D) 43215



11. 1. Calculation 2. Calligraphy 3. Canopy 4. Carriage 5. Convocation
A) 54321 B) 12345 C) 43215 D) 14325

12. 1. Monotony 2. Malignant 3. Malicious 4. Monogram 5. Marriage
A) 32415 B) 54321 C) 32541 D) 12345

13. 1. Nastology 2. Neighbour 3. Nightmare 4. Nuclear 5. Numerous
A) 54321 B) 12345 C) 43215 D) 34521

14. 1. Adjurors 2. Adjudged 3. Adjacent 4. Adjoints 5. Adjutant
A) 23415 B) 34215 C) 12345 D) 54321

15. 1. Factory 2. Faction 3. Faconne 4. Facebow 5. Fabular
A) 43215 B) 32415 C) 54321 D) 12345

16. 1. Vacates 2. Vacuity 3. Vacuous 4. Vagrant 5. Valiant
A) 23415 B) 54321 C) 32415 D) 12345

17. 1. Nested 2. Nation 3. Nippon 4. Niger 5. Nabes
A) 52143 B) 12345 C) 32145 D) 13245

18. 1. Panel 2. Panic 3. Paint 4. Paper 5. Parade
A) 31254 B) 31245 C) 12354 D) 42153

Scan the QR code for Key

These model questions were prepared by subject experts of ***QnA Academy,*** *Hyderabad*

ఈనాడు ప్రతిభ
ఆదివారం, అక్టోబరు 20, 2024
21
pratibha.eenadu.net/eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

■ 24/7 గంటలు పనిచేసే ధాన్యం ఏటీఎమ్‌ను దేశంలోనే తొలిసారిగా 2024, ఆగస్టు 8న ఏ రాష్ట్రంలో ప్రారంభించారు? (జాతీయ ఆహార భద్రతా కార్యక్రమం కింద ఈ ఏటీఎమ్‌ను ప్రారంభించారు.) జ: ఒడిశా

■ 2024, ఆగస్టు 2 నుంచి 7 వరకు అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల సదస్సును ఏ నగరంలో నిర్వహించారు? (వ్యవసాయ ఆర్థికవేత్తల అంతర్జాతీయ సంఘం ప్రతి మూడేళ్లకోసారి ఈ సదస్సును నిర్వహిస్తోంది. 1958లో చివరిసారిగా ఈ సదస్సుకు ఈ నగరం ఆతిథ్యం ఇచ్చింది.) జ: న్యూదిల్లీ

మాదిరి ప్రశ్నలు

■ ఇటీవల భారతదేశం ఏ దేశానికి సుమారు 1400 కిలోల క్యాన్సర్ నివారణ మందులను పంపి వార్తల్లో నిలిచింది? (ఈ దేశ ప్రథమ మహిళ అస్మా అసద్ కూడా లుకేమియా బారినపడ్డారు.) జ: సిరియా

■ శాస్త్రవేత్తలు తాజాగా ఏ గ్రహం పై నీటి రిజర్వాయర్‌ను కనుక్కున్నారు. (కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధనను నిర్వహించింది. 'లిక్విడ్ వాటర్ ఇన్ ద మార్టియన్ మిడ్-క్రస్ట్' పేరుతో ఈ అధ్యయన ఫలితాలను ప్రచురించారు.) జ: అంగారకుడు

■ 'వరల్డ్ వాటర్ వీక్ 2024' ను 2024, ఆగస్టు 25 నుంచి 29 వరకు ఏ థీమ్ తో నిర్వహించారు?

జ: 'బ్రిడ్జింగ్ బోర్డర్స్: వాటర్ ఫర్ ఎ పీస్‌ఫుల్ అండ్ సస్టైనబుల్ ఫ్యూచర్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

పరీక్షలు ఎప్పుడూ ఒకే రకంగా ఉండవు. జాగ్రత్తగా పరిశీలిస్తే ప్రశ్నల స్థాయిలో, అడిగే విధానంలో, వెయిటేజిలో మార్పులు వస్తుంటాయి. వాటిని గమనిస్తూ ప్రిపరేషన్ విధానాన్ని రూపొందించుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.

డీఎస్సీ-2024

బయాలజీ



Above the level of biological community

2 Marks

Ecology and Environment

1) Distinguish the terms phototaxis and Photo kinesis.

A: **Phototaxis:** Oriented locomotor movement of an organism towards/ away from the direction of light.
e.g.: Cockroach

Photokinesis: is the influence of light on non-directional movement of organisms as seen in the larval of pinnotheres maculates the mussel crab. Intensity of light influences the velocity of the movement of organism.

Q&A

2) What is an ecosystem?

A: Ecosystem is the next level of organization above the level of biological community. An ecosystem is a functional unit of the biosphere in which members of the community interact among themselves and with surrounding environment.

3) Define mutualism. Give one example.

A: This type of interaction benefits both the interacting species.
e.g.: Lichens represent an intimate mutualistic relationship between a fungus and photosynthetic algae.

4) Why are incinerators used in hospitals?

A: Hospitals generate hazardous wastes that contain disinfectants, harmful chemicals and also pathogenic micro-organisms. Such wastes also require careful treatment and disposal. The use of incinerators (to burn wastes) is essential for disposal of hospital waste.

Some More Imp Questions

1) What is camouflage? Give its significance.
2) Define commensalism. Give an example.
3) What is biological magnification?
4) What are the advantages of UV rays?

2 Marks
For answers


- G. Venkat Reddy

భూకంపాలు

భూకంపం అంటే భూమి ఉపరితలంగా పిలిచే భూపటలం/ప్రావారంలో ఆకస్మికంగా వచ్చే కంపనం లేదా ప్రకంపన చలనం. భూపటలం లేదా ప్రావారంలో మొదలై, నాభి నుంచి జనించే ప్రకంపన తరంగాల పరంపరలనే భూకంపంగా పేర్కొనవచ్చు. శిలలు అంతర్జనిత బలాల వల్ల ఆకస్మిక స్థానభ్రంశం చెందినప్పుడు శక్తి వెలువడుతుంది. అది తరంగాల రూపంలో నలుదిశలా వ్యాపిస్తూ ప్రకంపనలు సృష్టిస్తుంది. భూకంపాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'సిస్మోలజీ' అంటారు.

భూకంపాలకు కారణాలు:

1) ఉపరితల కారణాలు: ఇవి భూమి ఉపరితలంపై ఏర్పడతాయి. పెద్ద పెద్ద కొండల పార్శ్వాలు జారడం, హిమానీనదాలు ప్రవహించే చోట హిమపాతాలు సంభవించడం, గనులున్న ప్రదేశాల్లో సొరంగాల పైకప్పు కూలడం, పర్వత ప్రాంతాల్లో భూపాతం లాంటి కారణాలతో భూకంపాలు ఏర్పడతాయి. భూ అంతర్భూజలం ప్రభావంతో గృహాల పైకప్పులు కూలిపోవడం వల్ల కూడా భూకంపాలు సంభవిస్తాయి. భూగర్భంలో అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించడం, పెద్ద పెద్ద కృత్రిమ జలాశయాల వల్ల, భూమిలోని ఖనిజాల కోసం తవ్విన సొరంగాల పైకప్పులు కూలడం వల్ల భూకంపాలు రావచ్చు. ఈ విధంగా ఉపరితల కారణాలతో ఏర్పడేవి తీవ్రమైనవి కావు. అతి తక్కువ నష్టాన్ని కలిగిస్తాయి. ఇవి ఏర్పడటంలో మానవ ప్రమేయం ఎక్కువగా ఉంటుంది. భూపటలానికి దిగువన ఏర్పడే శక్తులు లేదా బలాలు ఈ రకమైన భూకంపాలకు కారణమవుతాయి.



2) అగ్నిపర్వత సంబంధిత కారణాలు: అగ్నిపర్వతాలు పేలడం వల్ల భూకంపాలు సంభవిస్తాయి. అగ్నిపర్వత ప్రదేశాల్లో భూ అంతర్భాగంలోని శిలాద్రవం కదలడం వల్ల అగ్నిపర్వతాల నుంచి శిలాద్రవం పైకి వచ్చినప్పుడు భూగర్భంలో శూన్య ప్రదేశాలు ఏర్పడతాయి. ఈ శూన్యప్రదేశాల మీద ఉండే శిలల బరువుకు భూమి కిందకు కుంగి భూకంపాలు వస్తాయి.

3) స్థితిస్థాపక నిరోధక సిద్ధాంతం: హెచ్.ఎఫ్.రీడ్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. పలకలు సాపేక్ష చలనాలు కలిగి ఉన్నప్పుడు శిలలు తట్టుకోలేనంతగా వికృతి బలం వృద్ధి చెందుతుంది. ఈ బలం శిలల ప్రతిఘటన శక్తిని మించినప్పుడు శిలలు విచ్ఛేదనం చెంది అల్ప వికృతి బలం స్థానానికి చేరుకుంటుంది. ఈ సిద్ధాంతానికి 'స్థితిస్థాపక నిరోధక సిద్ధాంతం' అని పేరు.

4) పాతాళ సంబంధమైన కారణాలు: వీటి వల్ల భూకంపాలు చాలా అరుదుగా వస్తాయి. భూ అంతర్భాగంలో కలిగే రేడియోధార్మిక విచ్ఛిత్తి, రసాయనిక చర్యలతో జరిగే మార్పులు దీనికి కారణాలు. ఇవి భూఉపరితలానికి 24 కి.మీ. నుంచి 640కి.మీ. లోతు వరకు సంభవిస్తాయి.

5) పలక విరూప కారకాల సిద్ధాంతం: ప్రపంచంలోని శక్తిమంతమైన భూకంపాలు విరూప కారక బలాల వల్లే వస్తున్నాయి. విరూప కారక బలాల్లో తన్యత, సంపీడన బలాలు భూపటలంపై పనిచేస్తాయి. భూపటలంలోని రాతిపొరల్లో చాలాకాలంగా ఉన్న బలాల వ్యత్యాసాల వల్ల కొన్ని ప్రదేశాల్లో భ్రంశాలు ఏర్పడి శిలాపొరల్లోని శక్తి వ్యత్యాసాలు సర్దుకుని ప్రతిబలం సడలి భూకంపం వస్తుంది. తర్వాత భూమి స్థిరత్వాన్ని పొందుతుంది. ఈ సిద్ధాంతం ప్రకారం పలకలు చలనంలో ఉండే భూప్రావారంపై కదులుతూ ఉష్ణసంవహన ప్రవాహాలుగా భావించే కొన్ని అనిర్ధారిత యంత్రాంగాల వల్ల ప్రభావితమవుతుంటాయి. ఈ పలకలు ఒకదానికొకటి తాకినప్పుడు భూపటంలో ఒత్తిడి కలుగుతుంది. ఈ ఒత్తిళ్లను పలకల హద్దుల వెంట జరిగే చలనాల ఆధారంగా వర్గీకరించవచ్చు. ఎ) ఒకదానికొకటి దూరంగా జరగడం బి) ఒకదానికొకటి ఎదురెదురుగా నెట్టుకోవడం సి) ఒకదాని అంచుపై మరొక దాని అంచు జారడం.

పలకల హద్దుల వద్ద జారడం లేదా పగుళ్ల ద్వారా సంచితశక్తిని విడుదల చేసే ప్రతిబల ప్రాంతాలను 'భ్రంశాలు' అంటారు.

6) స్థితిస్థాపకత సిద్ధాంతం: దీని ప్రకారం విరూప కారక పలకల చలనం నిరంతరం భూపటలంపై ప్రతిబలం లేదా ఒత్తిడి కలగజేస్తూనే ఉంటుంది. అది యాదృచ్ఛికంగా గరిష్ఠ అవలంబన వికృత బిందువుకు చేరుతుంది. అప్పుడు భ్రంశం వెంట పగులు ఏర్పడి, వికృత బలం నుంచి విడుదలయ్యే వరకు శిల తన సొంత స్థితిస్థాపక బలాల కింద ఎగిసిపడుతుంది. భ్రంశ పగుళ్ల ఉత్పత్తి చేసే కంపనాలను భూకంప తరంగాలు అంటారు. ఇవి భూకంప నాభి నుంచి అన్ని దిశలకు ప్రసరిస్తాయి.

అకస్మాత్తుగా సంభవించే విపత్తుల్లో ప్రధానమైంది, అత్యంత ప్రభావం చూపగలిగేది భూకంపం. భూనిర్మితిలో వచ్చే సహజ మార్పుల వల్ల పుట్టే శక్తి తరంగాలతో ఉపరితలం కంపించి బీటలు వారుతుంది. నిమిషం కంటే తక్కువ వ్యవధిలో ఏర్పడే ఆ కంపనాలే పెనువిధ్వంసాన్ని సృష్టిస్తాయి. విపత్తు నిర్వహణ పరిజ్ఞానంలో భాగంగా భూకంపాలకు దారితీసే కారణాలు, వాటిని వివరించే శాస్త్రీయ సిద్ధాంతాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. భూకంపాల రకాలు, వాటి లక్షణాలు, భూపటల నిర్మాణ స్వభావం, భూపలకల కదలికలు, భూకంప తీవ్రతను నిర్ణయించే అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.



ఆకస్మిక చలనాల పరంపరలు!

విపత్తు నిర్వహణ

భూ చలనాలు: భూకంపాల వల్ల వచ్చే భూచలనాలు పలురకాల విధ్వంసక ప్రభావాలను కలిగి ఉంటాయి. అందులో కొన్ని-

1) భూ కదలిక: నేల ద్వారా ప్రకంపన తరంగాలు ప్రయాణించడం వల్ల నేల ముందుకు, వెనుకకు చలిస్తుంది. **2) మృత్తికా భంగాలు:** భూ కదలిక వల్ల నేల ద్రవీకరించడంతో భూపాతాలు లాంటివి ఏర్పడతాయి. **3) ఉపరితల భ్రంశ పగుళ్లు:** పగుళ్లు, నిలువు చీలికలు మొదలైనవి. **4) వేలా తరంగాలు:** జలాశయ ఉపరితలంపై వచ్చే అతిపెద్ద తరంగాలు. ఇవి తీర ప్రాంతాల్లో భారీ నష్టం కలిగిస్తాయి.

భూకంప లక్షణాలు: భూకంపాలు సహజంగా సంభవిస్తాయి. ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఆకస్మికంగా ఎప్పుడైనా వస్తాయి. ★ వరదలు, చక్రవాతాలు, ఇతర ప్రధాన ఆకస్మిక విపత్తులకు దారితీసే వైపరీత్యాలకు హెచ్చరిక వ్యవధి ఉంటుంది. అందువల్ల వాటిని ఎదుర్కోవడానికి, ముందస్తు చర్యలు తీసుకోవడానికి, వాటి బారి నుంచి ప్రజలను రక్షించడానికి కొంతమేరకు అవకాశం ఉంటుంది. భూకంపాలు ముందుగా ఊహించడానికి లేదా నివారించడానికి అవకాశం లేదు. అయినప్పటికీ భూకంప విధ్వంసాన్ని తగ్గించవచ్చు. అత్యధిక శాతం విధ్వంసం భూకంపాల వల్ల కాకుండా కాంక్రీటు నిర్మాణాలు కూలడం వల్ల జరుగుతుంది. భూకంపాల వల్ల సంభవించే మరణాల్లో 95% భవనాలు కూలిపోవడం వల్లే జరుగుతున్నాయి. ★ భూకంప ప్రకంపనలు విభిన్న పౌనఃపున్యాలు, వేగాల్లో సంభవిస్తాయి. భూకంపం వాస్తవ పగుళ్ల ప్రక్రియ కొద్ది సెకన్ల పాటే ఉంటుంది. భారీ భూకంపానికి అయితే ఒక నిమిషం పాటు ఉంటుంది.

★ అత్యధిక శాతం భూకంపాలు స్వల్ప కంపనాలు మాత్రమే. అయితే భారీ భూకంపాలు స్వల్ప కంపనలతో మొదలై వేగంగా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విధ్వంసకర అఘాతాల రూపం దాల్చి, క్రమంగా తగ్గిపోయే ప్రకంపనలుగా ముగుస్తాయి.

★ వరదలు లాంటి కొన్ని సహజ వైపరీత్యాలు భూగోళం మొత్తం విస్తరించి ఉన్నప్పటికీ, కొన్ని వైపరీత్యాలు నిర్దిష్ట భౌగోళిక ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతాయి. అలాంటి వాటికి భూకంపాలు ఉదాహరణగా చెప్పవచ్చు. భూకంపాలు సాధారణంగా భూపటలంలోని రెండువిభాగాలు కలిసే భౌగోళిక భ్రంశం వెంట సంభవిస్తాయి.

భూకంపాలు రకాలు

నాభి లోతు ఆధారంగా భూకంపాలను మూడు రకాలుగా విభజించవచ్చు.

ఎ) గాధ భూకంపాలు: ఇవి ఉపరితలం నుంచి 0-60 కి.మీ. వరకు వ్యాపించి ఉంటాయి. ఈ తరహా భూకంపాలు తరచూ సంభవిస్తాయి. భూకంపనాభి భూఉపరితలానికి సమీపంలో ఉండటంతో తీవ్ర విధ్వంసం సృష్టిస్తాయి.

బి) మాధ్యమిక భూకంపాలు: ఇవి 60 కి.మీ. నుంచి 300 కి.మీ లోతు వరకు వ్యాపించి ఉంటాయి.

సి) అగాధ భూకంపాలు: ఇవి 300 కి.మీ. నుంచి 700 కి.మీ. లోతు వరకు వ్యాపించి ఉంటాయి.

ఉదాహరణకు సబ్‌డక్షన్ మండలాలు. 1933-34, 1943ల్లో ఇండొనేసియాలో అగాధ భూకంపాలు నమోదయ్యాయి. అగాధ నాభి భూకంప తరంగాలు భూఉపరితలానికి చేరేసరికి వాటి ప్రభావం తగ్గిపోతుంది. ఇవి చాలా అరుదుగా మాత్రమే విధ్వంసకరంగా మారతాయి.




రచయిత: ఇ. వేణుగోపాల్

Messages with a personal touch

LETTER WRITING

Letter writing holds significant value in the English language as it teaches essential communication skills, such as clarity, organization, and expression of thoughts. It helps convey messages with a personal touch, allowing writers to connect with recipients in a thoughtful and deliberate way. Additionally, it fosters proper grammar, vocabulary, and style, making it a valuable tool for developing writing proficiency and emotional intelligence.



DSC-2024 English (Content)

1. A letter written to a friend or a relative comes in the category of……
1) Formal letter 2) Informal letter
3) Semi-official letter
4) Ceremonial letter

2. The heading in a letter consists of
1) Subscription
2) Salutation
3) Address of the receiver and date
4) Address of the writer and date

3. What is the appropriate closing for a formal letter?
1) Best regards 2) Yours sincerely
3) Truly 4) Yours love

4. What is the purpose of a subject line in formal letter?
1) To give additional information
2) To showcase the senders name
3) To summarise the letters content
4) To add important line

5. Which type of letter is usually more casual and used for personal communication?
1) Business letter 2) Cover letter
3) Informal letter 4) Official letter

6. What is the purpose of using a closing in a letter?
1) To signify the end of the letter
2) To replace the signature
3) To add a decorative element
4) To show courtesy and respect to the recipient

7. What should be included in the body of a letter?
1) Greeting and salutation
2) Recipients name and date
3) Main message or purpose of the letter
4) Senders address and contact details

8. Where is the senders address placed in a formal letter?
1) Rigidly at the top right corner
2) After the salutation
3) At the bottom right corner
4) Either at the left corner or the right corner

9. The subscription in official letters generally is
1) Yours obediently 2) Yours sincerely
3) Your lovingly 4) Yours faithfully

10. Salutation for commercial letters will be
1) Dear sir 2) My dear sir
3) Sir 4) Dear sirs

11. Formal language is used in
1) Official letters
2) Letters to friends
3) Letters to relatives
4) Letters to newspapers

12. For official letters, the correct form of subscription will be
1) Yours sincere
2) Yours faithfully
3) Yours ever
4) Yours subordinately

13. Which of the following subscriptions is correctly written?
1) Your sincerely 2) Yours loving son
3) Your truly 4) Yours sincerely

14. 'Dear sirs' is a salutation for...
1) An official letter 2) A business letter
3) A leave letter 4) A personal letter

15. How would you address a police inspector in a complaint letter?
1) Sir 2) Dear sir
3) Respected sir 4) Dear inspector

16. When you write an official letter to a high public official, your complimentary close will be
1) Your sincere
2) Yours affectionately
3) Respectfully yours
4) Yours obediently

17. The subscription ends with ....
1) A full stop 2) A comma
3) A semicolon 4) None of these

18. .... language is used in an informal letter.
1) Colloquial 2) Formal
3) Slang 4) Informal

19. .... is needed after date.
1) Full stop 2) Comma
3) Colon 4) None of these

20. Leave letter is ....
1) An official letter
2) A business letter
3) A personal letter
4) None of these

21. Which part of the letter is crucial?
1) Salutation 2) Subscription
3) Street number 4) Body of the letter

22. Familiar and intimate style of writing is seen in
1) Formal letters 2) Informal letters
3) Business letters 4) Official letters

23. Complete the sentence choosing the right option: A letter to an unknown person should end with
1) Yours faithfully
2) Yours sincerely
3) Yours affectionately
4) Yours lovingly

24. This is to be written on the top right side of a letter
1) Place and Date
2) Receivers address
3) Salutation 4) Signature

25. Choose the part the letter written at the right side bottom of the page
1) The body 2) Subscription
3) Heading 4) Salutation

26. Choose the example of a formal letter:
1) Letter to sister asking about studies
2) Letter to the manager of a company applying for a job
3) Letter to a friend about his life
4) Letter to uncle asking him to send watch

27. What would you say in the opening part of formal letter?
1) Ask how good the weather is in the recipient's city
2) Inform the recipient why you writing the letter
3) Discuss the recipient if he is hale and hearty
4) Discuss the how good the weather in city

28. What is the purpose of the complimentary close in a formal letter?
1) To introduce the letter's main topic.
2) To invite the recipient to respond.
3) To signal the letter's conclusion and convey respect.
4) To highlight the urgency of the letter's content.

29. In a formal letter, how should you mention attachments?
1) By writing 'attachments' at the top of the letter.
2) Through in-text references only
3) By attaching them without mention in the letter.
4) By listing them at the end of the letter with the heading 'Attachments'.

30. Any kind of letter generally ends with-
1) subscription 2) salutation
3) signature 4) heading

31. Which of the following is/are the correct statement/s regarding letter writing?
1) 'Yours Faithfully' is used for ending a formal letter.
2) The heading should be placed at the top right-hand side corner.
3) 'To address' is also known as superscription.
4) Above all

32. The most common form of closing in an informal letter is...
1) Yours affectionately 2) yours truly
3) Yours sincerely 4) Ever yours

33. When we want to share our feelings with our friends, we choose to write............
1) a diary 2) a message
3) a letter 4) a profile

34. The phrase 'Yours faithfully' is the .... of a letter.
1) heading 2) salutation
3) superscription 4) subscription

35. If you don't know the recipient's name, how would you address the person and close the letter.
1) Hello, Your lovingly
2) Dear Sir, Yours sincerely
3) Dear Mr./Mrs. Yours affectionately
4) My dear, With love

36. The heading in a letter consists of ....
1) The writer's address and the date
2) The writer's name and the date
3) The writer's signature with date
4) The writer's intention and attitude

37. A formal letter should be.............
1) short and brief 2) personal
3) Lengthy 4) None

38. Colloquial language is used in.............
1) Newspapers
2) Letters of applications for jobs
3) Official letters
4) Letters to friends



Writer: Putnam Ravi Kumar

Answers

1-2; 2-4; 3-2; 4-3; 5-3; 6-4; 7-3; 8-4; 9-4; 10-4; 11-1; 12-2; 13-4; 14-2; 15-1; 16-4; 17-2; 18-1; 19-1; 20-1; 21-4; 22-2; 23-2; 24-1; 25-2; 26-2; 27-2; 28-3; 29-4; 30-3; 31-4; 32-1; 33-4; 34-4; 35-2; 36-1; 37-1; 38-4.